శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి

శతజయన్తి సంచిక

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి అధిష్ఠానమందిరము

శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారి శతజయన్త్యుత్సవ సంఘము

2013 సం॥ మూడు వేల ప్రతులు

వెల : రూ. 200/-

ప్రతులకు : కార్యదర్శి

శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి శతజయన్త్యుత్సవ సంఘము

శ్రీవిద్యాప్రకాశానందనగర్,

శ్రీశుకబ్రహ్మాశ్రమం(పోస్ట్),

శ్రీకాళహస్తి - 517 640

ఫోన్- 08578-222239

అక్షరాల కూర్పు : శ్రీవారి గ్రాఫిక్స్, తిరుపతి.

సెల్ నెం. 99484 34277

ముద్రణ : వెట్రి ఆఫ్‌సెట్ ప్రింటర్స్,

రాయపురం, చెన్నై.

ॐ

యో వేదాదౌ స్వరః ప్రోక్తో

వేదాన్తే చ ప్రతిష్ఠితః ।

తస్య ప్రకృతిలీనస్య

యః పరస్స మహేశ్వరః ॥

(మహానారాయణోపనిషత్తు - 10-8)

వేదముయొక్క ఆదియందు ఏది పరబ్రహ్మవాచకమైన ప్రణవముగా చెప్పబడినదో, వేదముయొక్క అంతమునందును ఏది ప్రతిష్ఠితమై యున్నదో, అట్టి పరబ్రహ్మముయొక్క ప్రకృతిలో లీనమైయున్న ఓంకారమునకు పరుడైనవాడే మహేశ్వరుడు.

అట్టి పరమాత్మకు వందనములు

ॐ

గురుపరమ్పరాస్తోత్రమ్

ఓమ్ సదాశివ సమారమ్భాం శంకరాచార్యమధ్యమామ్ ।
అస్మదాచార్యపర్యన్తాం వందే గురుపరమ్పరామ్ ॥

ఓమ్ గురవే సర్వలోకానాం భిషజే భవరోగిణామ్ ।
నిధయే సర్వవిద్యానాం దక్షిణామూర్తయే నమః ॥

ఓమ్ నారాయణం పద్మభువం వసిష్ఠం శక్తితాపసమ్ ।
పరాశరఞ్చ తత్పుత్రం వ్యాసం వేదాబ్జభాస్కరమ్ ॥

ఓమ్ విరక్తం శ్రీశుకం దేవం జ్ఞానవైరాగ్యరూపిణమ్ ।
గౌడపాదం చ గోవిన్దం యోగీన్ద్రం జ్ఞానినాం వరమ్ ॥

ఓమ్ తచ్ఛిష్యం శంకరాచార్య మద్వైతస్థాపకం గురుమ్ ।
నమామి భగవదత్పాదం శంకరం లోకశంకరమ్ ॥

ఓమ్ సచ్చిదానందరూపాయ జ్ఞానవైరాగ్యదాయినే ।
అసంగానందేవాయ తస్మై శ్రీ గురవే నమః ॥

ఓమ్ విద్యాప్రకాశనామానం వేదవేదాన్తకోవిదమ్ ।
గీతాతత్త్వప్రబోద్ధారం సద్గురుం ప్రణమామ్యహమ్ ॥

ఓమ్ అసంగానంద గుర్వాద్యాం విద్యాప్రకాశమధ్యమామ్ ।
అస్మదాచార్యపర్యన్తాం వందే గురుపరమ్పరామ్ ॥

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి
తిరుమల


జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యులవారు


మహర్షి సద్గురు శ్రీ మలయాళస్వాములవారు

ఓం

దైవప్రార్థన

కరుణామూర్తియగు దేవా!

మా చిత్తము సర్వకాల సర్వావస్థలయందును నీ పాదారవిందములందు లగ్నమై అచంచలమైన భక్తితో కూడియుండునట్లు అనుగ్రహింపుము.

పరమ దయానిధీ!

ప్రాతఃకాలమున నిద్రలేచినది మొదలు మరల పరుండువఱకును మనో వాక్కాయములచే మావలన ఎవరికిని అపకారము కలుగకుండునట్లును, ఇతర ప్రాణికోట్లకు ఉపకారము చేయులాగునను సద్బుద్ధిని దయచేయుము.

సచ్చిదానందమూర్తీ!

మా యంతఃకరణమునందు ఎన్నడును ఏ విధమైన దుష్టసంకల్పము గాని, విషయవాసన గాని, అజ్ఞానవృత్తి గాని జొరబడకుండునట్లు దయతో అనుగ్రహింపుము.

వేదాన్తవేద్యా! అభయస్వరూపా!

మాయందు భక్తిజ్ఞానవైరాగ్య బీజములంకురించి శీఘ్రముగా ప్రవృద్ధములగునట్లు ఆశీర్వదింపుము. మఱియు ఈ జన్మమునందే కడతేరి నీసాన్నిధ్యమున కేతెంచుటకు కావలసిన శక్తి సామర్థ్యములను కరుణతో నొసంగుము.

దేవా!

నీవు భక్తవత్సలుడవు. దీనులపాలిటి కల్పవృక్షస్వరూపుడవు. నీవు తప్ప మాకింకెవరు దిక్కు? నిన్ను ఆశ్రయించితిమి. అసత్తునుండి సత్తునకుగొని పొమ్ము. తమస్సు నుండి జ్యోతిలోనికి తీసుకొనిపొమ్ము. మృత్యువు నుండి అమృతత్వమును పొందింప జేయుము. ఇదే మా వినతి. అనుగ్రహించుము. నీ దరిజేర్చుకొనుము.

పాహి మాం, పాహి మాం పాహి మాం పాహి.

పరమహంస పరివ్రాజకాచార్య పూజ్యశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ధన్యవాదములు

ఈ పవిత్ర శతజయన్త్యుత్సవాలలో స్మారికను సర్వాంగ సుందరంగా ప్రకటించిన సంపాదకవర్గానికి, తమ భూరి విరాళాల ద్వారా శతజయన్తి ఉత్సవాలను సుసంపన్నం చేసిన దాతలకు, తమ ప్రకటనల ద్వారా స్మారికకు పుష్టిని కలుగజేసిన ప్రకటనకర్తలకు పరమేశ్వరుడు, మహర్షులు, గురుపరంపర పరమానందమును ప్రసాదింతురుగాక! ఈ శతజయన్తికి సుదూరములనుండి విచ్చేసి తమసాన్నిధ్యంతో ఒక పవిత్రతను కలుగజేసి, తమ దివ్యోపదేశాలతో, శోభను కలుగజేసిన మహాత్ములకు, జగద్గురువులకు, మండలేశ్వరులకు, మఠాధీశ్వరులకు మా ధన్యవాదములు. కృతజ్ఞతాంజలులు.

ఈ పవిత్ర కార్యక్రమానికి పెద్దగా సహకరించిన సౌజన్యమూర్తులు తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారికి, దేవస్థానం ట్రస్టు బోర్డుకు ధన్యవాదములు. ఈ శతజయన్త్యుత్సవములకు వచ్చిన విశిష్ట అతిథులైన మహాత్ములకు ఆతిథ్యసేవలందించ ముందుకు వచ్చిన శ్రీకాళీవనాశ్రమ(నంబూరు)ము వారికి కృతజ్ఞతాభివందనములు.

ఈ శతజయన్తికి వచ్చిన భక్తులకు తమ కళ్యాణమండపాలను, పాఠశాలలను వసతికై ఇచ్చిన పుణ్యాత్ములకు, ఆశ్రమ సభాప్రాంగణానికి తమ స్థలాన్నిచ్చిన పుణ్యాత్మునికి, ధనరూపేణ, వస్తురూపేణ సహాయమందించిన దాతలకు ఈ శతజయన్తిని ఆనందప్రదంగా నిర్వహించడానికి పాటుపడిన కార్యకర్తలందరికి, ఆహ్వానసంఘం వారికి, శ్రీకాళహస్తి మునిసిపాలిటీ వారికి హార్దిక ధన్యవాదాలు. మరియు అనేకవిధముల సహకరించిన అందరికి కృతజ్ఞతలు.

ఈ స్మారికకు వ్యాసాలు, సందేశాలు పంపిన మహాత్ములకు, విద్వాంసులకు, దీనిని శ్రద్ధతో టైపుచేసి సకాలంలో అందించిన శ్రీవారిగ్రాఫిక్స్ తిరుపతి వారికి, సుందరంగా ముద్రించిన వెట్రి ఆఫ్ సెట్, చెన్నై వారికి ధన్యవాదములు.

ఇట్లు

శతజయన్త్యుత్సవ సంఘము

ఓమ్

నివేదన

మహామహోపాధ్యాయ
డా।। సముద్రాల లక్ష్మణయ్య
తిరుపతి.

యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్ ॥

అని గీతాచార్యుడు చెప్పినట్లు అసాధారణమైన కీర్తి, ప్రతిభ, ఐశ్వర్యం- ఇత్యాది గుణాలు గల్గిన వారందరూ భగవంతుని తేజోఽంశమునుండి జనించినవారే. అందుకే భగవానుని లీలావతారాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయని భాగవతం పేర్కొనింది.

అట్టి ప్రభావసంపన్నులు ఒక కాలానికో, ఒక్క దేశానికో పరిమితమై వుండరు.

"శూరుల జన్మంబు సురల జన్మంబు
ఏరుల జన్మంబు నెరుగంగ నగునె?"

అన్నట్లు ఆ మహితాత్ములు ఎప్పుడైనా, ఎక్కడైనా జన్మించవచ్చు.

కేరళదేశంలో పుట్టి భారతదేశమంతా పాదచారిగా పర్యటించి తుదకు తిరుమల గోగర్భగుహలో తపస్సిద్ధి పొందిన మహనీయులు మహర్షి-సద్గురు శ్రీమలయాళస్వాములవారు. వీరు తాము భవసాగరం తరించి "ఇతరులను తరింపజేయడానికి ఎన్ని జన్మలైనా స్వీకరిస్తాను, నాకు మోక్ష మక్కరలేదు" అన్న పుణ్యచరిత్రులు.

శ్రీరాము డవతరించినప్పుడు ధర్మరక్షణ కార్యములో ఆయనకు సాయపడడానికి వానరు లనేకు లవతరించినారని రామాయణం చదివిన వారికి విదితమే. అట్లే శ్రీమలయాళ యతీంద్రులవతరించినప్పుడు వారి బ్రహ్మవిద్యా ప్రచారకార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పలువురు నివృత్తిమార్గానుయాయులు ఆంధ్రావనిలో జన్మించారు. అట్టివారిలో శ్రీశుకబ్రహ్మాశ్రమస్థాపకులు. 'గీతామకరందకర్త' గా లోకవిఖ్యాతులు, అష్టోత్తరశతగీతాజ్ఞాన యజ్ఞనిర్వాహకులు పూజ్యశ్రీ విద్యాప్రకాశానందస్వాములవారు అగ్రగణ్యులు.

పూర్వాశ్రమంలో ఉన్నప్పుడే తండ్రిగారిచే దత్తపుత్రులుగా శ్రీమలయాళసద్గురుదేవులకు సమర్పింపబడిన వీరు బాల్యంనుండీ అసాధారణమైన మేధాసంపదతో విలసిల్లారు. జపధ్యానాది సాధనలను

నిర్విరామంగా అనుష్ఠించారు. అపక్వాహారనియమంతో సద్గురుసన్నిధిలో ద్వాదశ సంవత్సరాలు కఠిన తపశ్చర్య గావించారు.

'విద్యాతపోభ్యాం పూతాత్మా' అన్న వాక్యానికి ప్రథమోదాహరణంగా విరాజిల్లిన ఈ మహనీయులు సంస్కృత వాఙ్మయంలోని ఉపనిషత్తులను, గీతను, యోగవాసిష్ఠాదులనూ, ఆంగ్లంలో శ్రీవివేకానందాదులు ప్రవచించిన ప్రబోధాలనూ సమగ్రంగా ఆకళించుకొన్నారు. 'గీతామకరందం' అన్న పేరుతో అతివిశిష్టమైన, అపూర్వమైన ఒక గీతావ్యాఖ్యానాన్ని రచించి 'గీతామకరందం స్వామి' అన్న ప్రశస్తికి పాత్రులయ్యారు.

వీరి వక్తృత్వశక్తి పూర్వజన్మఫలమో, గుర్వనుగ్రహప్రదత్తమో, భగవత్ప్రసాదమో చెప్పజాలము. వేలకొలది లౌకికులైన జనులను గీతాతత్త్వప్రవచనంతో మంత్రముగ్ధులను గావించిన మహామహులు వీరు. గీతావ్యాఖ్యాన గ్రంథమే కాక పంచరత్నాకరాలు, పరమార్థకథలు, సాధనరహస్యం మున్నగు వీరి రచనలు ప్రజాదరణకు ఎంతగానో పాత్రమయ్యాయి.

1914లో జన్మించిన వీరు 1998లో భౌతికంగా కనుమరుగయ్యారు. అయినా వారు స్థాపించిన ఆశ్రమం, రచించిన గ్రంథాలు, ఆడియోలు, వీడియోలుగా రూపొందిన వారి గీతోపన్యాసాలు, నేటికీ ప్రజలను జడత్వం నుండి దూరంచేసి చైతన్యవంతులను చేస్తున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం వారు గూడా శ్రీస్వామివారి ఉపన్యాసాలను భావితరాలకు ఉపయోగపడునట్లు రికార్డు చేసి తమవంతు బాధ్యతను చక్కగా నిర్వర్తించారు.

సమాజసేవలో అంతర్భాగంగా శ్రీస్వాములవారు 'భక్తకన్నప్ప' పేరుతో ఆశ్రమంలో స్థాపించిన నేత్రవైద్యాలయం వేలకొలది నేత్రరోగులకు సముచితమైన చికిత్స అందిస్తున్నది.

2013తో శ్రీస్వామివారికి శతసంవత్సరాలు నిండాయి. లోకోద్ధారకులైన మహాపురుషులు నిర్వర్తించిన ఘనకార్యాలను స్మరించడం, ప్రజానీకానికి వివరించడం, లోకంలో వారి దివ్యస్మృతి బహుకాలం ఉండేటట్లు చేయడం వారి అనుయాయుల కర్తవ్యం.

ఈ కర్తవ్యాన్ని నెరవేర్చడానికే ప్రస్తుత శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు మఱియు శ్రీసంపూర్ణానందగిరిస్వాములవారు శ్రీస్వాములవారి శతజయన్త్యుత్సవాలను ఘనంగా నిర్వహించాలని సంకల్పించారు. అనుకొన్నదే తడవుగా వారి శుద్ధసంకల్పం సిద్ధసంకల్ప మయింది.

28-4-2013 నుండి 2-5-2013 వరకు పంచాహ్నికంగా శతజయన్త్యుత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. 1992లో ప్రథమంగా ముద్రితమైన శ్రీస్వామి జీవితచరిత్రలో చేర్చదగిన అంశాలను చేర్చి పరివర్ధిత సంస్కరణంగా ద్వితీయముద్రణ కావింపజేశారు. శ్రీస్వామివారి స్థాయికి తగినవిధంగా ఒక స్మారకసంచికను వెలువరించాలని నిర్ణయించారు.

ఆశ్రమ నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు మండలేశ్వరులు, పీఠాధిపతులు, రాజకీయ ప్రముఖులు, పండితులు, భక్తులు- మున్నగువారు శ్రీవిద్యాప్రకాశానందస్వామివారి వైభవాన్నీ, వారితో తమకున్న అనుబంధాన్నీ వివరిస్తూ సందేశాలు, వ్యాసాలు, లేఖలు- వ్రాసి పంపారు. వీటినంతా క్రోడీకరించి గత స్మృతులకు అద్దం పట్టే ఛాయాచిత్రాలను గూడా జోడించి పాఠకుల కరకమలాల నలంకరిస్తున్న ఈ సంచికనిలా రూపొందించడమయింది.

సుప్రతిష్ఠిత చరిత్రుల శతజయన్త్యుత్సవాలను నిర్వహించడం ఎంతో శ్రమసాధ్యమైన పని. ఇందుకు లక్షలు వ్యయమౌతాయి. ఉత్సవాలకు దేశం నలుమూలల నుండీ వచ్చే మహనీయులకు, భక్తులకు తగిన సౌకర్యాలు కలుగజేయవలసి వుంటుంది.

ఆశ్రమ నిర్వాహకుల విజ్ఞప్తిని - సఫలం చేస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఈ ఉత్సవాలకు తగినంత సహకార మందించారు. అట్లే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలలో ఉన్న భక్తులు ఆర్థికంగా తోడ్పడ్డారు. శ్రీకాళహస్తి క్షేత్రంలోని హొటల్ యజమానులు, సత్రాలు, విద్యాసంస్థలవారు, తదితరులూ ఉత్సవాలకు రానున్న భక్తులకు వసతి మున్నగు సౌకర్యాలు కల్గించడానికి ముందుకు వచ్చారు. శ్రీకాళహస్తి పురపాలకసంఘం వారు, స్థానిక శాసనసభ్యులు శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డిగారు, పురప్రముఖులు తమవంతు సాయం అందించడానికి సిద్ధమయ్యారు.

ఈ సంచిక సంపాదక వర్గానికీ, డి.టి.పి. చేసిన శ్రీవారిగ్రాఫిక్స్, తిరుపతి వారిరీ, ముద్రించిన వెట్రి ఆఫ్‌సెట్, చెన్నై వారికీ సందేశాలు, వ్యాసాలు పంపిన మహనీయులకూ మాకృతజ్ఞతాభివందనాలు. ఆర్థికంగా సాయపడిన భక్తలోకానికి మా ధన్యవాదాలు.

'యాన్యనవద్యాని కర్మాణి తాని సేవితవ్యాని' అని వేదానుశాసనం. ఒక మహాపురుషుని శతజయంత్యుత్సవాలు సభక్తికంగా జరపడానికంటే ఒక ఆధ్యాత్మిక సంస్థకు మరొక మంచి పని యేముంటుంది?

భగవత్కృపవల్లా, గుర్వనుగ్రహంవల్లా ఈ పవిత్రకార్యక్రమం నిర్విఘ్నంగా నెరవేరు గాక!

'జయంతీనామ సా ప్రోక్తా జయత్యశుభమిత్యసౌ'

అన్నట్లు ఈ జయన్త్యుత్సవ నిర్వహణ లోకానికి అశుభాలు తొలగించి శుభాలు కల్గించుగాక!

విషయసూచిక

సందేశములు

పుష్పాంజలి

నివేదన

ధన్యవాదములు

గీతాస్వరూపులు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు - శ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు 1

అష్టోత్తర శతక్రతు సోమయాజి శ్రీ విద్యాప్రకాశానందస్వామి - శ్రీ రామకృష్ణానంద స్వాములవారు 5

నేను బ్రహ్మచారిగా ఉండుటకు వీరి సందర్శనమే కారణము - శ్రీ వేణ్వానందగిరి స్వాములవారు 8

తారణోపాయము - శ్రీమాతా త్యాగీశానందపురివారు 10

త్రాగండి త్రాగండి గీతామకరందం - శ్రీ బ్రహ్మానందతీర్థ స్వాములవారు 12

పూజ్యశ్రీస్వామివారితో నాకు గల పరిచయము - శ్రీస్వామి హంసానంద 14

స్వామీజీ నవ్వు ఒక పసివాని నవ్వు, ఒక పరమహంస నవ్వు - శ్రీ మాతా శివచైతన్యానంద వారు 17

వందే గురూణాం చరణారవిందమ్ - శ్రీ మాతా జ్యోతిర్మయానందభారతీవారు 21

ఆధ్యాత్మిక ఝంఝూమారుతము - శ్రీ శ్రీహరి తీర్థస్వాములవారు 22

శ్రీగురుమూర్తయేనమః - శ్రీ నిత్యశుద్ధానందగిరి స్వాముల వారు 25

శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి సందర్శనము - శ్రీశంకరానందస్వాములవారు 26

పూజ్యపాద శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందస్వామి గారి శతజయన్యుత్సవాల సందర్భంగా సందేశము.
శ్రీరామకోటి రామకృష్ణానంద స్వాములవారు 28

శతమానోత్సవమ్ - శ్రీ స్వామి శివానందబ్రహ్మచారి గారు 31

స్మరణతప్ప వేరే మార్గము లేదు - శ్రీ గంగాధరానంద స్వాములవారు 33

విద్యాతపోభ్యాం పూతాత్మా - శ్రీ మాతా ప్రతిభానందగిరి వారు 35

అన్వర్థనామధేయులు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామిజీ - శ్రీ మాతా కృష్ణానందగిరి వారు 37

ఆనంద జ్యోతి - శ్రీమాతా బ్రాహ్మీ గాయత్రిగిరి వారు 39

అసమానమూర్తి - శ్రీ ఆచార్య పరిశుద్ధానందగిరి స్వాములవారు 42

గీతామకరంద కృష్ణుడు - శ్రీ ప్రణవానన్దగిరి స్వాములవారు 45

శతజయన్తి కుసుమాంజలులు - పూజ్యశ్రీ సర్వేశ్వరానందగిరి స్వాములవారు 48

ప్రజాకవి-ప్రజాఉపన్యాసకుడు-జనసాహితీవేత్త-ప్రజాసేవకులు -పూజ్య శ్రీవిద్యా ప్రకాశానంద స్వామిజీ
శ్రీప్రణవానందస్వాములవారు(కనేకల్లు) 50

గీతామకరంద మహర్షీ! వందనాలు - కె. ఈశ్వర్ 52

దివ్యాంజలి - బ్రహ్మచారి విజయానంద 55

అమృతహృదయులు మా గురుదేవులు - ఆచార్య జక్కంపూడి మునిరత్నం 60

శ్రీశుకబ్రహ్మాశ్రమంలో ఉచిత యోగశిక్షణ - యోగాచార్య సి. మార్కొండయ్య 62

'ఒక్కదాత' ఔదార్యం, వదాన్యత, అనంతగ్రహీతలకు వరప్రసాదమయ్యింది ! - లగడపాటి భాస్కర్ 66

గీతామకరందం అక్షయపాత్ర - దోమ వేంకటేశ్వర రావు 71

శ్రీస్వాములవారి విరాళంతో స్థాపించిన డిగ్రీకళాశాల పేదవిద్యార్థులకు వరమైంది
- పుణ్యం మురుగేశన్ 72

నా ఆధ్యాత్మిక స్మృతులు - నరసింహరామదాసు 76

జ్ఞానయోగి - శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి - జి.ఎన్.కల్యాణసుందరం, 79

శిష్యరత్నం - జె.యస్. రఘుపతిరావు. 81

శ్రీ స్వామివారి రచనలు చదివిన వారికి జన్మరాహిత్యమే - జానకీబాయి లంకా 83

ఆనంద చరణులకు - ఆచార్య మాలిక - అద్దంకిశ్రీనివాసాచార్యులు 84

శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి -జీవితం, సందేశం - కె.వి.ప్రసాదవర్మ 87

శ్రీమలయాళస్వామి ఆశయసాధనలో శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి - ఆర్. బ్రహ్మానందరెడ్డి 92

నా ఆధ్యాత్మిక గురుదేవులు విద్యాప్రకాశానందులు - గెంబిలి భాగ్యలక్ష్మీ శ్రీరామమూర్తి 94

శ్రీ స్వామివారు పెద్దవారికే గురువులు కాదు పేదవారికి కూడా గురువులు - తాళ్లభూమన్న 96

ప్రశాంతినిలయంలో జరిగిన సాధుసమ్మేళనం- కె.యస్. మూర్తి, 100

శ్రీ శుకబ్రహ్మాశ్రమ గీతాపాఠశాల నా జీవితానికొక సార్థకతను చేకూర్చింది - చిల్కా రాజమ్మ 102

గీతామకరందము విశ్వతత్త్వప్రకాశానందము - లొల్ల విశ్వమోహనరావు 104

గీతాపాఠశాలలో చేరి నా జన్మను ధన్యం చేసుకొన్నాను -కరిపె. లక్ష్మి 110

శాకాహారిగా మార్చిన స్వామివారి దివ్య సందేశాలు - చుక్కల ఎల్లయ్య 112

శ్రీసద్గురు సేవలో శ్రీగురుపదరేణువులు - పద్మమల్లికార్జునగౌడ 114

నిన్ను మరువకుండుట మాదుజన్మ పుణ్యములే -కొణిజేటి సుబ్బారావు 116

శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారికి నేను ఎంతో ఋణపడి యున్నాను - పేరం పురందర్, 117

యోగంతో రోగం మాయం - యన్.ఆర్.జగన్నాథన్ 119

జ్ఞానభాస్కరులు పూజ్య శ్రీవిద్యాప్రకాశానంద స్వాములవారు - ఎ.తారాలక్ష్మి 120

వెన్ను నొప్పిపోయింది - పి.ఆర్. ఇందిరా పవార్ 122

ఆధునిక యుగంలో అపరవ్యాసులు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామివారు - ఏ. సీతారామారావు 123

గురు అనుగ్రహంతో నాకు కదలికలు నిలిచినాయి - తాళంకి నాగేంద్ర గుప్త 125

శ్రీగురుమహిమ అపారము -శ్రీతుమ్మలరాఘవులు 126

నా శ్వాస - నా ధ్యాస శ్రీస్వాములవారే - శాఖా జేజినాయన 128

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు "బ్రహ్మజ్ఞాని" - బొజ్జాసాధుబాబు 129
'భారతరత్నాకరం' ఒక విజ్ఞాన భాండాగారం - ఆచార్య హెచ్.ఎస్. బ్రహ్మానంద 133
శ్రీస్వాములవారి కలము, గళము భక్తుల హృదయాలలో అమరమై నిలిచినవి
- శ్రీప్రమోద చైతన్య స్వాములవారు 143
గీతా ప్రకాశమకరందం - శ్రీమాతా పరావిద్యానందగిరివారు 144
ఆదర్శజ్ఞాని - శ్రీవిష్ణుసేవానందగిరి స్వాములవారు, 149
గీతా సందేశము - శ్రీ స్వస్వరూపానన్దగిరి స్వాములవారు 151
సద్గురు సంస్మరణ-అనుభవము - పుష్పలత 156
గీతామకరంద - విషయసూచికా పరిచయం - ఆచార్య కె. సర్వోత్తమరావు 158
శ్రీశుకబ్రహ్మాశ్రమ ప్రశస్తి - డా॥ మల్లెల గురవయ్య 162
ఉత్తమ గురువు - ఉత్తమ శిష్యుడు - ఆచార్య పి.వి. అరుణాచలం 165
సద్గురు చరితమ్ - శ్రీసద్గురు విద్యాప్రకాశానందగిరిస్వాములవారి జీవిత సంగ్రహము
- శ్రీవిద్యాస్వరూపానందగిరిస్వాములవారు 170
చరాచర సుఖాభిలాషి-శ్రీమలయాళ స్వామి - డా॥ శ్రీసముద్రాల లక్ష్మణయ్య, 184
శ్రీస్వాములవారు ఈశ్వరుని అంశావతారము - శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు 192
విద్యా తపోభ్యాం పూతాత్మా - శ్రీ పరమాత్మానందగిరిస్వాములవారు 195
విజ్ఞానశాస్త్రము మరియు ఆధ్యాత్మికత గీతాజ్ఞానములతో జీవ మరియు జీవరసాయనికశాస్త్రముల సమన్వయము-
శ్రీ ప్రజ్ఞారణ్య స్వాములవారు 197
మహాత్ములకు శతజయంతి - శ్రీకృష్ణానంద మఠము 200
స్వామి విద్యాప్రకాశానంద గీతాప్రచార సంఘం, కర్నూలు - డి.వి.రమణ 202
శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి గీతా సమాజము -ముంబాయి - దూస రాములు 205
శ్రీవిద్యాప్రకాశానంద సత్సంగ సేవాసమాజము, హైదరాబాద్ - బి.కోటయ్య 206
శ్రీ గీతాప్రచారసమితి, విశాఖపట్నం - యెండూరి కృష్ణమూర్తి, 207
శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్కూల్ ఆఫ్ భగవద్గీత - బండి రమేష్ కుమార్ 209
శ్రీ స్వాములవారి పేరుతో నిర్వహింపబడుతున్న - విద్యాసంస్థలు, ఆధ్యాత్మికసంస్థలు
- డా॥ సముద్రాల దశరథ 210
జగద్గురు శంకరుల మఠామ్నాయము - శ్రీ విద్యా స్వరూపానందగిరి స్వాములవారు 213
సన్న్యాస సంప్రదాయము - శ్రీ శంకరానందగిరి స్వాములవారు 215
ఆచార్యోపాసనమ్ - శ్రీ శివదేవానందస్వాములవారు 220
సాధు హృదయము - శ్రీ రామకృష్ణానంద స్వాములవారు 223

కారుణ్యము మరియు సార్థకజీవనము - శ్రీ స్వామి దయానందసరస్వతి 237
భాగవతం భక్తి కథా కుసుమం - ఆచార్య కె.ప్రతాప్ 242
గీతాసందేశము - శ్రీ స్వామి రామదాసు 245
గీతాజ్యోతి - శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వాములవారు 246
భగవద్గీత అంతరార్థం - శ్రీ రంగనాథానంద స్వాములవారు 250
భగవద్గీతా హృదయము - శ్రీ చిదానందస్వాములవారు 259
భగవద్గీత యొక్క ప్రాణశక్తి - శ్రీ కృష్ణానంద స్వాములవారు 261
భగవద్గీత - శ్రీ సచ్చిదానందేంద్రసరస్వతి స్వాములవారు 263
గీతాజ్ఞానము -ఒక పరిశీలన - డా॥ శ్రీ కరిబసవరాజేంద్రమహాస్వాములవారు 267
సాధన - శ్రీ రామకృష్ణపరమహంస 269
రాజయోగం - స్వామి వివేకానంద 274
మోక్షప్రాప్తికై ఉపదేశ చతుష్టయము - శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు 279
గీతలో శ్రీకృష్ణాశయము - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు 289
గీత వ్యవహారమును వేదాంతస్థాయికి కొనిపోవును - శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు 292
భగవద్గీత విశ్వాసానికి చెందినది - పూజ్యశ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీ 295
భక్తి ప్రతిబంధకములు - పూజ్యశ్రీ పరిపూర్ణానందగిరి స్వాములవారు 297
శ్రీ మద్భగవద్గీత - శ్రీ విద్యానంద భారతి స్వాములవారు 299
గీత- సార్వజనీనికత - బాదామి జయరామగుప్త 302
ఉత్తమ జీవనమునకు మార్గదర్శి - ప్రొఫెసర్ సి.రామయ్య 305
శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందస్వాముల పదసన్నిధికి - శ్రీసాయం నారాయణచరణంగారు 309
శతజయంతీ మహోత్సవం - డా॥ సముద్రాల లక్ష్మణయ్య 311
శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు హృదయకుహరమందు జీవించే వున్నారు
- గోటేటి శ్రీరామారావు 313
India's Message to the World -Swami Vivekananda 315
ANA\DASHRAMAM GITA SANDESH-By swami Ramdas 318
THE DIVINE LIFE SOCIETY - Swami Vimalanandasaraswathi 319
THINKERS OF YOGA DOWN THE AGES -Swami Amritananda 320
Compassion and Meaningful Living -Swami Dayananda Saraswati 323
An observation of Geeta Truth - Dr. KARIBASAVARAJENDRA SWAMIJI 328
PUJYASRI VIDYA PRAKASANDA GIRI SWAMY ON THE GITA - Prof. C. Ramaiah 330

श्री श्री जगद्गुरु शङ्कराचार्य महासंस्थानम्,
दक्षिणाम्नाय श्री शारदापीठम्, श्रृङ्गेरी.

Sri Sri Jagadguru Shankaracharya Mahasamstanam
Dakshinamanya Sri Sharada Peetham, Sringeri - 577 139



గుంటూరు,
06-03-2013.

శ్రీకాళహస్తి క్షేత్రమునందు శుకబ్రహ్మాశ్రమమును స్థాపించి ఆంధ్రదేశంలో భగవద్గీతా ప్రచారం విరివిగా గావించిన శ్రీవిద్యాప్రకాశానందగిరిర స్వామివారి శతజయంతి 2013 ఏప్రిల్ 28 నుండి జరుగునున్నదనియూ ఆ సందర్భమున ఒక విశేష సంచిక వెలువడనున్నదనియూ తెలిసికొని దక్షిణామ్నాయ శృంగేరి శారదాపీఠాధీశ్వరులు జగద్గురు శంకరాచార్య శ్రీ భారతీతీర్థ మహాస్వామివారు సంతసించినారు. భగవద్గీతను ఇంత ప్రచారమొనర్చి యాంధ్రుల విశేషమన్ననలందుకొన్న శ్రీస్వామివారి శతమానోత్సవమును జరుపుట వారి శిష్యుల యవశ్య కర్తవ్యమైయున్నది.

శ్రీ శారదా చంద్రమౌళీశ్వరుల కృపవలన ఈ కార్యక్రమములు చక్కగా జరుగుగాక విశేషించి ఆస్తిక జనోపాదేయమగుగాకయని శ్రీచరణులాశీర్వదించినారు.

ఇట్లు

శ్రీ చంద్రమౌళీశ్వరాయ నమః



పరమపూజ్య శ్రీకంచికామకోటి పీఠాధిపతి

జగద్గురు శ్రీశ్రీశ్రీ జయేన్ద్ర సరస్వతి శంకరాచార్య మహాస్వాములవారు

శ్రీమఠం సంస్థానం, కాంచీపురం

సందేశం

ఆంధ్రదేశమంతటా భగవద్గీతా జ్ఞానయజ్ఞములనుపేర నిర్వహించబడిన మహాసభలలో తమ గీతాప్రసంగములతో లక్షలాది ప్రజలను ఉఱ్ఱూతలూగించి పరమఆస్తికులుగా పరివర్తన మొనరించే ఒక మహాధర్మవిప్లవాన్ని తమ జీవితకాలములో అత్యంత సమర్థవంతముగ కొనసాగించిన, శ్రీకాళహస్తి శుకబ్రహ్మాశ్రమ వ్యవస్థాపకులు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారు లబ్ధప్రతిష్ఠులైన శ్రీమలయాళ స్వాములవారి ముఖ్యశిష్యులు. వీరిచే చేయబడిన గీతామకరందమను గీతానువాదము గీతార్థమును అత్యంతసరళమైన తెలుగుభాషలో తేటతెల్లముగా వివరించడం వలన ఆంధ్రదేశములో సుప్రసిద్ధమైనది. పలుభాషలలో అనువదించబడినది.

వీరిచే స్థాపించబడిన శ్రీ శుకబ్రహ్మాశ్రమము గత 62 సంవత్సరములుగ ధర్మప్రచారములోను, బీదసాదలకు విద్యావైద్యసదుపాయములను చేయడంలోను విశేషమైన సేవ చేస్తూ వస్తున్నది. ప్రస్తుతము ఈ సంస్థకు అధిపతులుగ ఉన్న శ్రీ విద్యాస్వరూపానందస్వామివారు స్వామివారి ఆశయసాధనలో అహర్నిశలు పరిశ్రమించడం అందరు ఎఱిగినదే!

ప్రస్తుతము శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వామివారి శతజయంత్యుత్సవములు జరుపుటకు శ్రీసంపూర్ణానందగిరి స్వామివారి అధ్యక్షతన ఒక ఉత్సవ సంఘమేర్పడినదనియు, 2013 ఏప్రిల్ 28 నుండి అయిదురోజులు శ్రీకాళహస్తి ఆశ్రమములో ఉత్సవములు జరుగనున్నవనియూ, ఆ కార్యక్రమములో భాగముగా అనేకమంది పీఠాధిపతులు, మహామండలేశ్వరులు, సాధు సంతుల సమక్షములో గీతాసదస్సు, సాధు సమ్మేళనము వంటివి అఖిలభారత స్థాయిలో జరుగగలవనియూ తెలుసుకొని అమందానంద భరితులమైనాము.

మహాత్రిపురసుందరీచంద్రమౌళీశ్వరుల విశేషానుగ్రహంవలన ఈ ఉత్సవము అత్యంత విజయవంతము, ఆస్తికలోకమునకు ఉపయోగకరము కాగలదని నారాయణస్మృతి పూర్వకముగ ఆశీర్వదించుచున్నాము.

ఇతి నారాయణస్మృతిః

ఓం

శ్రీవిశ్వనాథసన్న్యాసాశ్రమట్రస్టు

బేలారోడ్డు, ఢిల్లీ.

పరమ పూజ్యశ్రీ స్వామి పుణ్యానందగిరి స్వాములవారు
శ్రీ నిరంజనపీఠాధీశ్వరులు
ఆచార్య మహామండలేశ్వరులు

10-11-12

సందేశం

శ్రద్ధేయ శ్రీశ్రీశ్రీ మలయాళస్వామి మహారాజ్‌వారి కీర్తి సమగ్ర దక్షిణాపథంలో వ్యాపించి వుంది. అట్లే ఉత్తరభారత సన్న్యాససమాజంలో కూడ సుప్రతిష్ఠితమై వుంది. ఏది ఆయన సమయంలో వుంటూ వుండెనో ఇప్పటికి కూడ అంతే మహత్త్వ పూర్ణముగా వున్నదో అట్టి ఆ ఆధునికతా సవాళ్లను పరమ్పర ననుసరించి ఎదుర్కోడానికి తపోమయ మార్గాన్ని ప్రశస్తము చేయడం శ్రీమలయాళ స్వామియొక్క విశేషత, విశిష్టత ఉల్లేఖనీయమైన ప్రసాదము - అనుగ్రహము.

అందరికి ప్రేరణ ప్రదమైన వైదిక ధర్మంమీద శ్రద్ధాళువులైన భారతీయ సమాజం ఆధారవిద్యను స్వంతం చేసుకుని కాలక్రమవేగంయొక్క ప్రభావంతో శ్రేయోమార్గం నుండి వంచితులు కాకుండుటకు ఆవశ్యకమైన అనుసంధానము, అనుష్ఠానమును వ్యాసాశ్రమము, శుకబ్రహ్మాశ్రమము మఱియు వానికి సంబంధించిన సంస్థలలో జరుగుతూ వుండడం అందరికి ప్రేరణాప్రదంగా వుంది.

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి మహారాజ్ యొక్క శతజయన్తి (జన్మశతాబ్ది ఉత్సవాన్ని) జరుపతలపెట్టిన శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారి శుభసంకల్పం, వారి (శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి) పవిత్ర ఉపదేశాలకు ఏకకాలంలో విశేషసఫలప్రయాస సిద్ధించుగాక! అని శ్రీదక్షిణామూర్తి భగవంతుని ప్రార్థిస్తున్నాము.

श्री विश्वनाथ संन्यास आश्रम ट्रस्ट

११, बेला रोड, (श्रीराम रोड) सिविल लाईन्स, दिल्ली - ११००५४

१०-११-२०१२

श्रद्धेय श्री श्री श्री मलयाल स्वामीजी महाराज की कीर्ति समग्र दक्षिणापथ में व्याप्त है एवं उत्तर भारत के संन्यासी समाज में भी सुप्रतिष्ठित है। आधुनिकता की चुनौतियों का परम्परानुसार सामना करने का तपोमय मार्ग प्रशस्त करना श्री मलयाल स्वामी जी का विशेष उल्लेख के योग्य प्रसाद है जो अद्यावधि उतना ही महत्वपूर्ण है जितना उनके सामने रहते था। वैदिक धर्म पर श्रद्धालु भारतीय समाज, मूल शिक्षा को आत्मसात् कर कालक्रम के वेग के प्रभाव से श्रेयसे वंचित न हो इसकेलिए आवश्यक अनुसन्धान एवं अनुष्ठान व्यास आश्रम, शुकब्रह्माश्रम और तत्सम्बद्ध संस्थाओं में होता रहा है जो सभी केलिए प्रेरणाप्रद है।

श्री श्री श्रीविद्याप्रकाशानन्द गिरि स्वामी जी महाराज की जन्मशताब्दी मनाने का श्री विद्यास्वरूपानन्द गिरि स्वामी जी महाराज का शुभ संकल्प उनके पावन उपदेशों को समसामयिक बनाये रखने का विशेष सफल प्रयास सिद्ध हो ऐसी भगवान् श्री दक्षिणामूर्ति से प्रार्थना करते हैं।

भगवत्पादीय
स्वामी पुण्यानन्दगिरि
श्री निरंजन पीठाधीश्वर आचार्यमहामण्डलेश्वर

శ్రీమన్నారాయణ రామానుజయతిభ్యోనమః

పరమపూజ్య త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి

జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు, సీతానగరం - 522 501



అనేకమంగళశాసనములు!

ప్రియశ్రీస్వామి విద్యాస్వరూపానందజీ మహారాజ్ !

శ్రీమతే నారాయణాయ నమః !

శ్రీశుకబ్రహ్మాశ్రమ వ్యవస్థాపకులు, కీర్తిమూర్తులు నయిన పూజ్యశ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామివారి శతజయన్తీ మహోత్సవములను 2013 ఏప్రిల్ మాసములో 28,29,30 దినములలో నిర్వహించబోతున్న విషయం తెలిసి మేమెంతో సంతోషిస్తున్నాము.

ప్రజ్ఞాచక్షువులైన శ్రీస్వామి భగవద్గీతాప్రచారంలో, సేవాకార్యక్రమములలోను ఒక విప్లవాత్మకమైనట్టి మలుపు త్రిప్పారు.

గీతాజ్ఞాన యజ్ఞాలలో వారు బోధించే విధానాలు అద్భుతం. ప్రవచనాలు ఆసాంతం కడుపుబ్బ నవ్వించే కథలతోనే సాగేవి. అందమైన ఆంగ్లభాషామయమైన Quotationsఎన్నో చోట్ల ప్రయోగిస్తూ అందరినీ ఆశ్చర్యపరచేవారు. తత్సారంగా వీరందించిన 'గీతామకరందం' ఎన్నో భాషలలో లక్షలాది మందికి కరభూషణమైంది.

వీటితోపాటు సేవాకార్యక్రమాలను బహుముఖంగ శ్రీస్వామి సాగించారు. 'భక్తకన్నప్పనేత్రచికిత్సాలయ' ప్రారంభం శ్రీస్వామి చేయించినపుడు 1994లో మేముకూడా అక్కడ ఉండి పాల్గొన్నాం. వారి ఔదార్యాన్ని కన్నులార చూశాం.

లక్షలాదిమందిని ప్రభావితులను చేసిన పూజ్య శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వామివారి శతజయన్త్యుత్సవాలను వారి అనుయాయులందరూ కలిసి చేయసంకల్పించడం ఆనందావహం.

ఎందరికో ప్రేరణాత్మకంగ ఈ ఉత్సవాలు జరగాలని మనసారా ఆశిస్తున్నాం. నిర్వాహకులందరికీ అనేక మంగళాశాసనాలు చేస్తున్నాము. జయ శ్రీమన్నారాయణ !

(సం) చిన్న రామానుజ జీయరు

11/5/2012.

పరమహంస, పరివ్రాజకాచార్య, జగద్గురు

పరమపూజ్యశ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి

సిద్ధేశ్వరీ పీఠాధిపతి -కుర్తాళం

సందేశం

శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామివారు వేదాంత డిండిమము మ్రోగించి తమ వాగ్వైఖరితో వేలమందిని ప్రభావితులను చేసిన అసామాన్యవ్యక్తి. నిరాడంబరుడు,నిగర్వి, నిష్ఠాయుతుడు, నియమపాలన తత్పరుడు అయిన ఆ మనీషిశేఖరుడు తన రచనల ద్వారా తాత్త్విక చింతన మార్గానికి దారిదివ్వెవలె ప్రకాశించారు. చాలా సంవత్సరాలక్రింద వారితో ఒక సమావేశంలో పాల్గొనటం కూడా గుర్తుకు వస్తున్నది. చతుర చమత్కారచారువచోవిన్యాసంతో జనావళిని మంత్రముగ్ధులను చేయటం వారి సహజరీతి. అంతటి యతివర్యునకు శతజయంతి సంచిక ప్రచురించటం ఎంతో ముదావహమైన అంశం. వారి భక్తులు తమ గురువరునకు సమర్పించే సముచితమైన కానుక యిది. ఈ కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని ఆశీర్వదిస్తున్నాను.

కుర్తాళం, తమిళనాడు

నారాయణస్మరణతో

సిద్ధేశ్వరానంద భారతీస్వామి



OFFICE OOFF SRI SRI RAVI SHANKAR

Art of Living Internatioinal Centre, 21st KM Kanakapura Road,

Udayapura, Bangalore-82, INDIA., P |+91.80.672525 F|+91.8.28432833

Secretiate@Artoofliving.org | www.srisri.org | www.artofliving.org

Message from Gurudev Sri Sri Ravi Shankarji

Sri Vidya Prakasananda Giri Swamiji led an inspiring life spreading the message of Vedanta all over. Everything in his life was done with intensity and serves as an example to everybody today. Apart from making the knowledge of sacred texts like Yoga Vasistha and Bhagvat Gita reach people, there was also an aspect of service to his efforts, thus making him an ideal sannyasi. His life's work continues to show the path of knowledge to thousands of devotees.

I am very happy that his birth centenary is being celebrated and send my blessings for its success.

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామీజీ వేదాంత సందేశాన్ని దేశమంతటా విస్తరింపజేస్తూ స్ఫూర్తిదాయకమైన జీవితం గడిపారు. వారి జీవితంలో ప్రతిపని దీక్షతో నిర్వహింపబడింది. ఈ నాడది ప్రతివ్యక్తికి ఆదర్శప్రాయంగా వున్నది. యోగవాసిష్ఠ, భగవద్గీత మున్నగు గ్రంథాల యొక్క విజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు అందించడమేకాక వారి ప్రయత్నాలలో సేవాభావం కూడా వుండేది. అందువల్ల వారు ఒక ఆదర్శ సన్న్యాసిగా రూపొందారు. వారు జీవితంలో సాధించిన ఘనకార్యం వేలకొలది భక్తులకు జ్ఞానమార్గాన్ని నిర్దేశిస్తున్నది.

వారి శతజయంతి ఉత్సవం జరుగుతున్నందుకు నాకు చాలా ఆనందంగా వున్నది. ఈ ఉత్సవాలు విజయవంతం కావాలని నా ఆశీస్సులు పంపుతున్నాను.

– గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్‌జీ



కె.రోశయ్య

గవర్నర్

తమిళనాడు

రాజభవన్

చెన్నై - 600 022

సందేశం

పూజ్యశ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి శతజయంతి ఉత్సవాలు 2013 ఏప్రిల్‌లో జరుగుతున్నందుకు చాలా సంతోషం.

శ్రీశ్రీశ్రీ స్వాములవారి ప్రవచనములు తెలుగు ప్రజలకు చిరస్మరణీయాలు. శ్రీ స్వాములవారు 1960లో తెనాలిలో 20 రోజులు 3వ గీతాజ్ఞానయజ్ఞం చేశారు. 100వ గీతాజ్ఞాన యజ్ఞం, 108 వ గీతాజ్ఞాన యజ్ఞం హైదరాబాద్‌లో జరిగాయి. ఈ విధంగా వారు 108 గీతా జ్ఞాన ప్రవచనాల ద్వారా దేశం నాలుగు చెరగుల గీతా ప్రబోధం చేసిన మహానుభావుడు.

శ్రీ స్వాములవారు ఎలాంటి అట్టహాసం, ఆర్భాటం లేకుడా వందలకొలది పట్టణాలలో గీతా ప్రబోధం గావించి ప్రజలలో నైతిక, ఆధ్యాత్మిక తత్త్వాన్ని మేల్కొల్పారు.

"మానవ సేవయే మాధవ సేవ" అను ధ్యేయంతో శ్రీకాళహస్తిలో తమ భూరి విరాళంతో డిగ్రీ కాలేజీని, బాలికల జూనియర్ కాలేజీ ఏర్పాటుకు సహకరించారు. అవి వారి పేరుతోనే నడుస్తున్నాయి. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో భక్త కన్నప్ప కంటి అస్పత్రిని ప్రారంభించి ఆ ప్రాంత ప్రజలందరికీ చూపునిచ్చి బహుధా సేవలందించిన మహనీయులు.

హైదరాబాద్‌లో జరిగిన వారి గీతాజ్ఞానయజ్ఞ సభలకు హాజరై ఉత్తేజితులైన వారిలో నేను ఒకణ్ణి కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

వారు జన్మించి నూరేండ్లు కావడం, వారి శత జయంతి ఉత్సవాలు ఇపుడు జరపడం, ఆ ఉత్సవాలలో దేశం అన్ని మూలల నుండి సుప్రసిద్ధ పీఠాధిపతులు, మహాస్వాములు పాల్గొనడం చాలా ప్రశంసనీయము. వారి త్యాగమయ జీవితం సేవాభావం మనకు ఆదర్శంగా కలకాలం ఉండిపోగలవు.

కె. రోశయ్య

(కె. రోశయ్య).

B. Gopala Krishna Reddy
Former Minister,
MLA, SRIKALAHASTHI,
CHITTOOR DIST., A.P.

Tel : 08578-230062
(R) : 040 23558877
Cell : 98490 00567

ఆంధ్రప్రదేశ్‌లో శ్రీ శుకబ్రహ్మాశ్రమానికి మంచిపేరు ప్రఖ్యాతులున్నాయి. ఆశ్రమానికి ప్రతిష్ఠ ఆశ్రమ స్థాపకులైన పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి వలననే వచ్చింది. శ్రీ స్వాములవారి ప్రవచనాలకు వేలకు వేలు ప్రజలు, పండితుల మొదలు పామరుల వకు రావడం అందరికి తెలిసిందే. హైదరాబాద్ వంటి నగరాలలో కూడా శ్రీ స్వాములవారి గీతాజ్ఞానయజ్ఞాలు విశేష జనాకర్షణగా సాగాయి.

శ్రీ స్వాములవారు గ్రామీణ ప్రజలు విద్యావంతులు కావాలనే సదుద్దేశంతో ప్రయివేటు కాలేజీలకు అసలు అవకాశం లేని కాలంలో ఉన్న కళాశాలలు కూడా జిల్లాకంతటికి రెండే రెండున్న సమయంలో భూరి విరాళమిచ్చి ప్రభుత్వ డిగ్రీ కాలేజిని **'స్వామి విద్యాప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల'**ను శ్రీకాళహస్తిలో పెట్టించారు. ఆ తరువాత తమ విరాళంతో **'స్వామి విద్యాప్రకాశానంద బాలికల జూనియర్ కళాశాల'**ను కూడా ప్రారంభించడానికి సహకరించారు.

1994లో పేద ప్రజలకు చూపు తెప్పించడానికి ఆశ్రమంలో భక్తకన్నప్ప కంటి ఆస్పత్రిని కూడ పెట్టి కొన్ని వేల మందికి కంటి పొరల ఆపరేషన్లు చేయించి చూపునిచ్చారు. ఈ విధంగా సమాజ సేవ చేసిన పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి శతజయన్త్యుత్సవాలు ఈ సంవత్సరం ఏప్రిల్ 28 నుండి శ్రీకాళహస్తి పట్టణంలో చాలా ఘనంగా జరుగనుండడం, అందులో దేశం అంతటా అన్ని రాష్ట్రాల నుండి విద్యావంతులైన సాధుమహాత్ములు, పీఠాధిపతులు పాల్గొనడం మన శ్రీకాళహస్తి పట్టణ భాగ్యవిశేషము. స్వామివారు ప్రజాసేవ గురించి మాట్లాడటం అతితక్కువ. స్వామివారికి ప్రజాహిత కార్యక్రమాలపైనే ధ్యాస, దృష్టి. ఈ విధానాన్ని శుకబ్రహ్మాశ్రమం కొనసాగించాలని ఆకాంక్షిస్తూ....

జ్ఞాన ప్రసూనాంబా సమేత శ్రీకాళహస్తీశ్వరుని అనుగ్రహంతో శ్రీస్వామివారి శతజయన్త్యుత్సవాలు వైభవోపేతంగా జరగాలని శ్రీకాళహస్తీశ్వరుని ప్రార్థిస్తున్నాను.

ఇట్లు
బి. గోపాలకృ రెడ్డి
(బొజ్జల గోపాలకృష్ణారెడ్డి)



The Divine Life Society

పూజ్యశ్రీ స్వామి విమలానంద సరస్వతి,
అధ్యక్షులు, దివ్యజీవన సంఘము (ఋషీకేశ్)

ఓం నమో నారాయణాయ

శ్రీ శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులవారి లేఖ తేది 20.4.12ది ప్రకారము పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి శతజయంత్యుత్సవ వేడుకలు తేది 28.4.13ది నుండి తేది 2.5.13ది వరకు జరుపబడుచున్నట్లు సమాచారము తెలిసి మిగుల సంతోషించడమైనది.

ఈ శుభ సందర్భమున శ్రీ శుకబ్రహ్మాశ్రమమువారు శ్రీమద్భగవద్గీతపై జాతీయ సదస్సును నిర్వహింప సంకల్పించినట్లుగను మరియు శతజయంత్యుత్సవ సంచికను విడుదల చేయుటకు నిర్ణయించినట్లుగను తెలియవచ్చినది. ఈ బృహత్ కార్యములను నిర్వహించుటద్వారా–ఆధ్యాత్మిక జ్ఞానమును వ్యాప్తిచేయుటలోనూ, శ్రీమద్భగవద్గీతా సారమును విస్తృతంగా ప్రచారము చేయుటలోనూ ఎనలేని కృషిసల్పిన పూజ్యశ్రీ స్వామీజీవారికి హృదయ పూర్వక కృతజ్ఞతాభివందనములను సమర్పించుటయే అగును.

అశేష ప్రజానీకమునకు సర్వోత్కృష్టమైన గీతాజ్ఞానమును అందజేయుటకు తమ జీవితమును అంకితమొనర్చిన ఋషిపుంగవులు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు. పరమ పావనమగు గీతోపన్యాసములతో సకలజనావళి హృదయములను జాగృతి పరచుటకై అన్ని ప్రాంతములలో 108 జ్ఞానయజ్ఞములను నిర్వహించిన మహనీయులు. ఇట్టి మహానుభావుల అవిశ్రాంత కృషి ఫలితముగ మహోన్నతమైన గీతావాణి దేశ, విదేశములందు బహుళవ్యాప్తి నొందుచున్నది. శ్రీ స్వామివారు పూర్వాశ్రమమందు గాంధీగారి వాలంటీరుగా వుండి శ్రీమహాత్మాగాంధిగారిచే ప్రభావితులై వారి వద్ద వర్తించుటచే, కేవలము శ్రీకృష్ణ భగవానుని దివ్యసందేశములను వ్యాప్తి చేయుటయే కాక జనులలో మాతృదేశాభి మానమును పెంపొందించుటలో కూడా వీరు విశేషమైన కృషిసల్పిరి.

పూజ్యశ్రీస్వాములవారు అనేకమైన విశిష్ట వేదాంత గ్రంథములను రచించిరి. భగవద్గీతయొక్క దివ్య సందేశమును బోధించుట ద్వారా మానవుల ఆధ్యాత్మికజ్ఞానమును పెంపొందించుటయే ధ్యేయముగా జీవితమును కొనసాగించిరి. ప్రతి సామాన్యవ్యక్తీ గీతయొక్క మహత్తరజ్ఞానమును అవగాహన చేసికోనవలెనని ప్రగాఢముగా అభిలషించిరి. శ్రీకృష్ణపరమాత్మ శ్రీమద్భగవద్గీతయందు పేర్కొనిన అత్యంత దురవగాహ్యమైన అంశములను అతిసరళముగ, సులభమైన, వ్యావహారిక శైలిలో తేట తెలుగు మాటలలో సమగ్ర వ్యాఖ్యానమును 'గీతామకరందము' అను పేర ఒక విశిష్ట గ్రంథమును రచించిరి. ఇది ఆంధ్రుల ఆరాధ్యగ్రంథమై అనేక ఇతర భాషలలోనికి కూడా అనువదింపబడినది.

ఇంతటి బృహత్తర కార్యక్రమములను చేపట్టుచున్న శతదినోత్సవ నిర్వాహక బృందమునకు మా హృదయ పూర్వక అభినందనలు తెలియజేయుచు, పరమ పూజ్యశ్రీ స్వాములవారికి మా ఘనమైన నివాళులను సమర్పించుచున్నాము. చారిత్రాత్మకమైన ఇంతటి గొప్ప సమావేశమందు పాల్గొనబోవు సాధుమహాత్ముల పాదపద్మములకు మా శిరఃప్రణామము లర్పించుచున్నాము.

శతజయంత్యుత్సవ వేడుకలు అత్యంత ఘనముగ విజయవంతము కావలెనని కోరుచూ, హృదయపూర్వకశుభాకాంక్షలు అందజేయుచున్నాము. మరియు శ్రీశుకబ్రహ్మాశ్రమమును ఆశీర్వదించవలసినదిగా ఆ సచ్చిదానంద పరబ్రహ్మమును, శ్రీ సద్గురుశివానందస్వామి మహారాజ్‌వారిని, శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిని సవినయముగ ప్రార్థించుచున్నాము. తద్వారా ఆశ్రమము అద్భుతమైన తమ సేవలను నిరంతరము కొనసాగిస్తూ, గీతామకరందమును మరింతగా వ్యాప్తి చేయగలదని భగవంతుని ప్రార్థించుచున్నాము.

అనువాదము

ఎ. తారాలక్ష్మి M.A., M.Ed., M.Phil

ANANDASHRAM

సందేశం

Blessed Atman :

Om Namo Narayanaya!
Om Sri Ram Jai Ram Jai Jai Ram !!

Your loving letter of the 29th of April has been received along with the enclosuers.

Glad to know about the Sathajayanthi Utsav of Gurudev Pujya Sri Sri Sri Vidya Prakasananda Giri Swamiji Maharaja is scheduled to be form the 28th to the 30th of April 2013.

Much as we would like to participate in the same, it may not be possible to do so. Kindly excuse us.

We pray for the Lord's blessings for the successful conduct of the Celebrations and for the programs to be instrumental in giving a boost to the spiritual practices of all.

As requied by you, words of our Master Swami Ramdas on the Bhagawad Gita are enclosed herewith.

Deepest love and pranams.

Ever your Self.
Swami Muktananda

ఆనందాశ్రమం

సందేశం

ఓం నమో నారాయణాయ

ఆత్మస్వరూపా! ఓం శ్రీరాం జైరాం జైజై రాం!!

29 ఏప్రిల్ నాటి మీ ప్రేమపూర్వకమైన లేఖ వివరాలు గల పత్రాలతో సహా అందినది.

2013 ఏప్రిల్ 28 నుండి 30 వరకు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామీజీ మహారాజ్‌వారి శతజయంత్యుత్సవాలు జరుగుతున్నాయని తెలుసుకొని సంతోషించాము.

కార్యక్రమాలలో పాల్గొనాలని ఉన్నా అది సాధ్యంకాకపోవచ్చు. దయతో మన్నించేది.

ఉత్సవాలు విజయవంతంగా జరగాలనీ, కార్యక్రమాలు ఆధ్యాత్మికతను పెంపొందించేవిగా ఉండాలనీ భగవదాశీర్వాదాల కొరకై మేము ప్రార్థిసున్నాము. మీరు కోరినట్లు భగవద్గీతపై స్వామి రామదాసుగారి వచనాలను ఇందు వెంట పంపినాము.

ప్రేమపూర్వక ప్రణామము
మీ ఆత్మ
స్వామి ముక్తానంద



శ్రీ శివయోగీశ్వరాయ నమః

పూజ్యశ్రీ శివానంద భారతి మహాస్వామివారు
శ్రీ శివయోగీశ్వర సాధు సంస్థానమఠము, ఇంచల,

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి శతజయంత్యుత్సవ

సందేశము

శ్లో॥ 'న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః
భవితా న చ మే తస్మాత్ అన్యః ప్రియతరో భువి ॥ (భగవద్గీత - 18-69)

"అధ్యాత్మవిద్యా విద్యానాం" అన్నట్లు

108 శ్రీమద్భగవద్గీతా యజ్ఞములు, 58 గీతాసదస్సులు, పలు సప్తాహములద్వారా భక్తి జ్ఞాన వైరాగ్య తత్త్వములను ప్రచారమొనర్చిన బ్రహ్మలీన శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారి కంటె శ్రీగీతాచార్యులకు ప్రియమైన వారు ఇంకొకరు లేరనుట అతిశయోక్తికాదు. 'జగమెరింగిన బ్రాహ్మణునకు జంధ్యమేల' అన్నట్లు శ్రీస్వాములవారు గీతామకరందము, గీతాయజ్ఞముల ద్వారా అధ్యాత్మలోక ప్రసిద్ధులు. 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం' అని భక్త కన్నప్ప ఉచిత కంటి ఆస్పత్రి స్థాపన ద్వారా మానవసేవయే మాధవసేవయని చాటి చెప్పిన సంఘసేవకులు. శ్రీకాళహస్తిలో రెండు కళాశాలలను స్థాపించి విద్యాప్రకాశన మొనర్చిన సార్థక నామధేయులు.

"యేన కేన ప్రకారేణ, యస్య కస్యాపి దేహినః,సంతోషం జనయేత్ ప్రాజ్ఞః తదేవేశ్వర పూజనమ్" అని నమ్మిన వారు. 'శిష్యస్తు కోవా గురు భక్త ఏవ' అన్నట్లు 'గురువాక్యంతు కర్తవ్యమ్మని' గురు పరంపరాగత బ్రహ్మవిద్యను జీవితాంతం ప్రచారమొనర్చిన శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి శతజయంత్యుత్సవములు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి, శ్రీసంపూర్ణానందగిరిస్వాములవార్ల ఆధ్వర్యమున జరుపబడుచుండుట కడుసంతోషము, ప్రశంసనీయము.

ఇట్టి ఆధ్యాత్మిక కార్యక్రమములు విశేషముగా శ్రీ శుకబ్రహ్మాశ్రమమునందును, ఆంధ్రదేశమునందును ఆశ్రమాధిపతుల ద్వారా జరుపబడును గాక!

ఓం తత్సత్, శుభం భూయాత్. సర్వేషాం స్వస్తిర్భవతు.

ఇత్యాశిషః

శ్రీశివానందభారతిస్వామి



సందేశము

పూజ్యశ్రీ శ్రీ డా॥ కరిబసవ రాజేంద్రమహాస్వామి ఎం.ఏ., పిహెచ్.డి
ఉత్తరాధికారి, గవిమఠసంస్థానం, ఉరవకొండ.

పరమ పూజ్యశ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారి శతజయంత్యుత్సవ వేడుకలను జరుపుట ద్వారా పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు మరియు శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు తమ గురుదేవులపట్ల అత్యంత భక్తి శ్రద్ధలు ప్రదర్శించుచున్నందులకు మిక్కిలి సంతోషము. మరియు అనేకమంది ఇతర శ్రీవారి భక్తులకు తమ యొక్క కృతజ్ఞతాపూర్వక నివాళులు అర్పించుటకు అవకాశము కల్పించుట ముదావహము.

మీ ఆహ్వానంపై శ్రీస్వామివారి స్నేహితులమైన మేము వేడుకలో పాల్గొని మావంతు కర్తవ్యమును హృదయ పూర్వకముగ నిర్వహింపగలమని మనవి.

ఈ సందర్భముగ భగవద్గీతను గూర్చి కొన్ని అంశములను ప్రస్తావించుటకు అవకాశము కల్పించిన మీకు మా ధన్యవాదములు. 'గీతాజ్ఞానము ఒక పరిశీలన' అను అంశమును ఇందువెంట సమర్పించితిమి.

పూజ్యశ్రీస్వాములవారు ఆంధ్రరాష్ట్రమంతట పర్యటించి అద్భుతమైన గీతోపన్యాసములతో అనేక మందిని ప్రభావితము చేసిరి. మా ఆంధ్రదేశ పర్యటనలో – శ్రీస్వాములవారిచే ప్రభావితులైన ఎంతో మంది మాకు తారసపడడము జరిగినదని ఈ సందర్భముగ మేము తెలియజేయుచున్నాము. శతజయన్త్యుత్సవములు పరమేశ్వరుని కృపచే ఉజ్జ్వలముగా జరుగుగాక !

అనువాదము

ఎ. తారాలక్ష్మి M.A., M.Ed., M.Phil



పూజ్యశ్రీ స్వాములవారి శతజయన్తి మహోత్సవాలు దివ్యంగా భవ్యంగా జరిగి లోకకల్యాణకారకములగునుగాక!

– పూజ్యశ్రీ పరిపూర్ణానందగిరిస్వాములవారు

ప్రియాత్మ బంధువులారా!

నిరన్తర పరివర్తనగల ఈ సంసారచక్రమునందు చచ్చినవాడు ఎవడు పుట్టుటలేదు? పుట్టున్నాడు. కానీ ఆ పుట్టుక పుట్టుకకాదు. అయితే ఏ పుట్టుక నిజమైన పుట్టుక అంటే 'యేన జాతేన జాతి సమున్నతిం యాతి'– ఎవని పుట్టుక చేత జాతి, లేక లోకం సమున్నతిని, లేక ఉద్ధరింపబడుతుందో సజాతః – వాడు నిజంగా పుట్టినవాడు. అట్టివారిని లోకం గౌరవిస్తుంది. పూజిస్తుంది, ఆరాధిస్తుంది. నిరన్తరం స్మరిస్తుంది. వారి జయన్త్యుత్సవములను సైతం జరుపుకొంటుంది.

ఇట్టి కోవకు చెందినవారు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు. మన స్వాములవారి జన్మచేత లోకం ఆధ్యాత్మికంగా చైతన్యవంతమై ఆనందిస్తూంది. ప్రస్తుతం వారు మన ముందు లేకపోయినా వారి కృతులు చైతన్యవంతముల్లై ఉత్తేజపరుస్తున్నవి. కాబట్టే ఈనాడు భక్తులు, శిష్యులు పెద్ద ఎత్తున వారి శతజయన్తి మహోత్సవాలను జరుపుతున్నారు. ప్రతిసంవత్సరము వారి ఆరాధనలను, విశేష కార్యక్రమములను శ్రద్ధగా నడుపుచున్నారు.

ఇప్పుడు శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాములవారు శ్రీవ్యాసాశ్రమంలో విద్యనభ్యసించినవారు, కాశీలో వేదాంతాచార్య పట్టమును పొందిన వారు–బ్రహ్మర్షి శ్రీవిద్యానందగిరిస్వాములవారి అనుంగు శిష్యులును అయిన శ్రీసంపూర్ణానందగిరిస్వాములవారిని 2011వ సం॥రం ఆశ్రమ ఉత్తరాధికారిగా నియమించడం జరిగింది. ఇప్పుడు ప్రస్తుత ఆశ్రమ పీఠాధిపతులు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు, ఉత్తరాధికారులు శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు ఆశ్రమ సంస్థాపకులగు పూజ్యశ్రీ స్వాములవారికి 2013 ఏప్రిల్ నాటికి 100 సం॥రములు నిండిన సందర్భముగ శతజయంతి మహోత్సవాలను పెద్ద యెత్తున జరుపుటకు సంకల్పించిరి. దానికి తగిన ఏర్పాట్లు కూడా ఇప్పటినుండియే జరుగుచుండుట మిగుల ముదావహము.

పూజ్యశ్రీ స్వాములవారి శతజయంతి మహోత్సవాలు శ్రీ పరమేశ్వరుని దివ్యానుగ్రహముచేతను, లోకపావన తత్పరులగు మహర్షుల, శ్రీ సద్గురుదేవుల కృపాకటాక్షవీక్షణములచేతను, దివ్యంగా భవ్యంగా జరిగి లోకకల్యాణమునకు కారకములగును గాక!

– శ్రీపరిపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీ వ్యాసాశ్రమ పీఠాధిపతులు, ఏర్పేడు.

ఓం తత్ సత్ ఓమ్

ఓం లోకాస్సమస్తా స్సుఖినోభవస్తు

ఓం శాంతిః శాంతిః శాంతిః

ఓం శ్రీ మాత్రేనమః

పూజ్యశ్రీ దండి స్వాములవారు
శ్రీ అష్టలక్ష్మీ పీఠము

కొత్తపేట, తెనాలి –522 201. గుంటూరు జిల్లా (ఆం.ప్ర)

ఓం శ్రీం

పూజ్యశ్రీ స్వాములవారి శతజయన్త్యుత్సవాలను అతివైభవంగా జరపడం ఆనందదాయకం

మహర్షి సద్గురు శ్రీ మలయాళస్వాములవారి శిష్యులలో అగ్రగణ్యులు పూజ్యపాదులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు. వీరు మంచి అనుష్ఠానపరులు. సదాచారపరులు. సంయమవంతులు. నియమ నిబద్ధమైన జీవితము, మితభాషణము కలవారు. ఎవరితోను ఎక్కువ మాట్లాడేవారు కాదు. భక్తులకు తమ దర్శనము అయినవెంటనే ప్రసాదము ఇప్పించి ఇక మీ పనులు చూచుకొనండి అనిగాని, లేక విశ్రాంతి తీసుకొనండి అనిగాని, లేక ఆశ్రమము అంతా చూడండి అనిగాని చెప్పి పంపేవారు. కాని ఈ ఉపాధితో యెంతయో ప్రేమగా, ఆప్యాయంగా– వారు గురుకులవాసము చేసినపుడు జరిగిన సంఘటనలు, అన్ని విశేషములు చెప్పుచుండెడివారు. మధ్యలో వారి సేవకులు వచ్చి ఇక వెళ్ళుదాము రండి అని నాతో అంటే– శ్రీ స్వాములవారు విసురుగా మీరు వెళ్ళి మీ పనులు చూచుకోండి – అని వారిని పంపి మరల నాతో అవి ఇవి చెప్పుతూ ఒకమాట అన్నారు. అదేమనగా ఈ ఉపాధి శ్రీసద్గురుదేవుల వద్దకు వచ్చినపుడు కట్టుబట్టలతో రావడము జరిగినది. ఈ వైభవము అంతయు శ్రీ సద్గురుదేవుల అనుగ్రహమే – అని గద్గద స్వరముతో కళ్ళ వెంట ఆనందబాష్పములు రాల్చినారు.

శ్రీ స్వాములవారికి గీతాస్వాములవారు అని, శ్రీ గీతామకరందముస్వాములవారు అని కూడా లోకములోనానుడి కలదు. ఇప్పుడు శ్రీస్వాములవారి శతజయంత్యుత్సవములు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు సంకల్పించి అతి వైభవోపేతముగా జరుపుట చాలా ఆనందదాయకము.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ఇట్లు

శ్రీ దండి స్వామి

శ్రీ అష్టలక్ష్మీ పీఠము, తెనాలి

శ్రీస్వాములవారి ఉపన్యాసములలో

స్కూల్ ప్లే గ్రౌండు మొత్తము జనాలతో కిటకిటలాడుతూ వుండేది

పూజ్యశ్రీ మేధానందపురి స్వాములవారు

కోశాధ్యక్షులు, శ్రీకైలాసాశ్రమం, ఋషికేశ్

తెలుగుదేశములో విద్యాప్రకాశానందగిరి స్వాములవారు వ్రాసిన గీతామకరందము ప్రతి ఇంటిలోను కనిపిస్తుంది. సంన్యాసులకు వేదాంతప్రచారము చేయుటయే ముఖ్యకర్తవ్యము. వేదాంతమునకు ప్రమాణమైన ప్రస్థానత్రయములోని భగవద్గీతమీద విద్యాప్రకాశానందగిరి స్వాములవారు ఆంధ్రదేశమంతటా విరివిగా ప్రచారము చేసిరి. దాదాపు 1968లో స్వామివారు "18"రోజులు రాజమండ్రిలో గోదావరిగట్టున ఉన్న స్కూలులో గీతా సందేశమును ఇచ్చిరి. దాదాపు ఉదయం "2గంటలు", సాయంత్రము "2గంటలు" ఒక అధ్యాయము మీద ఉపన్యసించెడివారు. ఆ స్కూలులో ఉన్న "ప్లేగ్రౌండ్" మొత్తము జనాలతో కిటకిటలాడుతూ ఉండేది. వారిలో " నేను" ఒకడిని. ఉదయం సాయంత్రము సైకిలుమీద వెళ్ళి వారి వాక్జ్ఞానామృతమును తనివితీరా ఆస్వాదించెడివాడిని. ఆ సమయములో ఒక రోజున వారు శ్రీవ్యాసాశ్రమగుహాశ్రమంలో తపస్సుచేసిన విషయము చెప్పినారు. ఒక రోజు రాత్రి ధ్యానం చేయుచుండగా పెద్దఎలుగుబంటి ఆవరణలో ప్రవేశించి స్వామి వారి వైపు తదేకంగా చూసి వారిని ఏమీచేయకుండా మెల్లగా బయటికి వెళ్లిపోయింది. గీతలో చెప్పినట్టుగా " యోగక్షేమం వహామ్యహమ్" అన్నదే వారి జీవితంలో ఋజువు అయినది. స్వామి వారు-గీతలో చెప్పినజ్ఞానమును అనుభవించిరి. దానితో తృప్తిపడక దానియందున్న సందేశమును ఉపన్యాసముల ద్వారా అందరికీ పంచిపెట్టిరి. అంతేగాక గీతామకరంద పుస్తకమును వ్రాసి ఉపన్యాసము వినలేని వారి యొక్క జ్ఞాన చక్షువులను భూత భవిష్యత్‌వర్తమాన కాలములలో తెరిపించిరి. నదులు వానికై ప్రవహించవు. చెట్లు వాటికొఱకు ఫలించవు. అటులనే వీరిలాంటి మహాపురుషులు తమ జీవితమును ఇతరులను ముక్తిమార్గములో నడిపించుటకే వినియోగింతురు. వారి శతజయంతి ఉత్సవమునకు ఉత్సాహముతో సేవచేయువారందరికి స్వామివారి అనుగ్రహము తప్పకుండా ఉండి తీరుతుంది. ఎందుకంటే " బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి" అన్న వేదవాక్యము ద్వారా వారు అంతటా అందరిలో ఉన్నారు - అని చెప్పుచు........

భవదీయ

స్వామీ మేధానందపురీ

(శ్రీ స్వామి మేధానందపురీ)

కోశాధ్యక్ష శ్రీ కైలాస ఆశ్రమము

మునికీరేతి, హృషీకేష్.

సందేశం



- స్వామి బ్రహ్మవిద్యానంద సరస్వతి

శ్రీ శుకబ్రహ్మాశ్రమ అధ్యక్షులు పూజ్యశ్రీ స్వామి సంపూర్ణానందగిరి స్వామివారికి....

ఓం నమోనారాయణాయ

సమస్త ప్రాణుల హృదయాంతర్వర్తియగు పరమాత్మకు ప్రణామాలు. స్వామి పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి మహరాజ్ వారి పవిత్రమైన శతజయంత్యుత్సవాలకై మిక్కిలి సంతోషంతో ఈ సందేశం పంపుతున్నాను. 2013 ఏప్రిల్ 28 నుండి మే 2 వరకు శ్రీకాళహస్తిలో శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరుగనున్న శతజయంత్యుత్సవానికి స్మారకంగా శతజయంతి సంచిక వెలువడనుండడం హర్షదాయకం.

వారు సామాన్యపురుషులు, కారు లోకోత్తర పురుషులు; సామాన్య వ్యక్తి కాదు, లోకోత్తర వ్యక్తిత్వం కలవారు; సామాన్య మానవులు కారు, లోకోత్తర మానవులు. తేజోవంతులైన స్వామివారి జ్ఞానాన్ని అవగతం చేసుకోవడానికి వారి ఆధ్యాత్మిక ప్రవచనాలవల్లనే కాక ఆశ్చర్యకరమైన గీతామకరందం వంటి పుస్తకాలవల్ల కూడా సాధకులు ప్రభావితులైనారు. వారి గ్రంథాలు ప్రపంచమంతా ఆధ్యాత్మికజాగృతిని కలిగిస్తున్నాయి. స్వామివారి ప్రబోధాలు అమరమైనవి. అవి ప్రంచమంతటా శాశ్వతంగా ఆధ్యాత్మిక అన్వేషకులను ప్రభావితులను చేసి నడిపించగలవు. దయామయుడైన శివుడు మానవజాతిని ప్రగతిపథంలో నడిపించుటకు బాధితులకు శాంతినీ, ఓదార్పును అందించుటకు; తమస్సులోనున్న వారికి; వెలుగు చూపుటకు సంశయగ్రస్తులలో శ్రద్ధ కలిగించుటకు, బలహీనులకు బలము కలిగించుటకు, దిగులు పడినవారికి విశ్వాసం కలిగించుటకు, దుఃఖితులకు సుఖం కలిగించుటకు - ఈ ప్రేమ సందేశ ధారియైన స్వామీజీని లోకమునకు పంపినాడు. ఈ పూజ్యగురుదేవులు కావించిన గంభీరమైన ప్రబోధాలను ప్రయత్నపూర్వకంగా అనుష్ఠానంలో పెట్టుటకు తగిన ఉత్సాహాన్ని శివుడు మనకు ప్రసాదించుగాక! స్వామీజీ ప్రేరణతోనే నేత్రచికిత్సాలయం మరియు కళాశాలలు స్థాపించబడినాయి. వారి శతజయంతి నిర్వహణ సందర్భంలో సగౌరవంగా ఈ లోకోన్నత వ్యక్తిని, మానవాళి దివ్యసంస్మర్తను మనము స్మరించుకుంటున్నాము.

శివదేవుడు - పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామీజీని చైతన్యరూపంలో ఈ భూలోకంలోనే వుండి వారి భక్తులను, సాధకులను దైవపథంలో నడిపించాలని నేను ఆర్ద్రహృదయంతో ప్రార్థిస్తున్నాను.

శతజయంతి ఉత్సవం విజయవంతమగుగాక!

ఏకాదశి ,సెప్టెంబర్ - 26-2012

గురుదేవుల భావనలో మీ స్వామి

స్వామి బ్రహ్మవిద్యానంద సరస్వతి

డివైన్‌లైఫ్ ట్రస్టు, రాయపూర్(ఛత్తీస్‌గఢ్)

సందేశం

- ఆచార్య శ్రీ శంకరానందగిరిస్వాములవారు
పరమాత్మానందాశ్రమం(పెనమలూరు)
అఖిలాంధ్రసాధుపరిషత్ అధ్యక్షులు

ప్రియాత్మ బంధువులారా!

జీవుణ్ణి కర్మబంధం నుండి జన్మబంధం నుండి విడిపించి మోక్షరూప శాశ్వత సుఖాన్ని, ఆనందాన్ని కలుగజేసే కొరకు అనాది కాలం నుండి ఇప్పటివరకు ఎందరో మహానుభావులు, మహర్షులు మహాత్ములు అవతరించి జీవులను వారి అనుగ్రహం చేత తరింపజేశారు. ఆ కోవకు చెందిన వారే ప్రస్తుత కాలంలో అవతరించిన మహానుభావులు పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు. చిన్నతనం నుండి నియమిత జీవితం గడుపుతూ ఉన్నత సంస్కారాన్ని విద్యా తపస్సులచేత సాధించి ఆంధ్రదేశోద్ధారకులగు పరమ గురువులు పూజ్య శ్రీశ్రీశ్రీ సద్గురు మలయాళ స్వాముల వారిచేత తురీయాశ్రమాన్ని స్వీకరించి, అనంత కృషి చేత శ్రీ కాళహస్తి పుణ్యక్షేత్రంలో శ్రీ శుకబ్రహ్మాశ్రమాన్ని స్థాపించి-అక్కడినుండే ఎన్నో గీతా యజ్ఞాలు సదస్సులు చేసి అజ్ఞ జీవులనుద్ధరించారు. అంతేగాక వేదాంతభేరి మాసపత్రిక ద్వారా ఎనలేని జ్ఞానాన్ని పంచిపెట్టారు. వారి కృషిని మాటలచేత చెప్పేకి మాటలు చాలవు. కన్నప్ప కంటి ఆసుపత్రిని ఏర్పరచి భౌతిక నేత్రాన్నిచ్చి, ఆధ్యాత్మిక బోధతో జ్ఞాననేత్రాలను ప్రసాదించిన మహానుభావులు భౌతికంగా అవతరించి 2013 ఏప్రియల్ నాటికి 100సంవత్సరాలు పూర్తి చేసుకుని శతజయంతి ఉత్సవాన్ని నిర్వహించుకొనుట శిష్యులకు, భక్తులకు. సాధకులకు చాలా ఆనందదాయకం. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు గీతాభవనాదులు వగైరా నిర్వహించడం గూడా భావితరాలకు మార్గదర్శకాలు. పై కార్యక్రమాన్ని సుసంపన్నంగా జరుగునట్లు ఋషులు, మహర్షులు, పరమగురువులు నిండుగా ఆశీర్వదించాలని మనసారా అర్థిస్తూ శతజయంత్యుత్సవ కమిటీ వారికి ధన్యవాదాలు సమర్పిస్తూ.

ఓం.

గురుపాదుకలు మనందరినీ కాపాడుగాక!

- పూజ్యశ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీ
కాళీవనాశ్రమాధిపతులు, నంబూరు.

శ్రీ గీతామకరంద ప్రకాశకులు, భగవద్గీతాప్రచారకులు, సద్గురు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి శతజయన్త్యుత్సవాలని తెలిసి చాలా బ్రహ్మానందముగ ఉన్నది.

ఏ దేశంలో పుట్టినా, ఎక్కడెక్కడ తిరిగినా భక్తుడైనవాడు భగవద్వాణి చెవిన బడినంతనే భగవదున్ముఖుడవుతాడు. భగవంతునిచే ఆకర్షితుడౌతాడు. నిరన్తరం భగవంతుడి స్మరణతోనే ఉంటూ ఆయనతోనే పెనవేసుకుని పోతాడు. చివరికి 'నేను', 'ఆయన' రెండుగా ఉన్నామా అని విరహవేదనను అనుభవిస్తున్న సమయంలో శ్రీ సద్గురుదేవులు 'తత్త్వమసి' నువ్వు అదే అయి వున్నావు- అని మహావాక్యోపదేశం చేస్తారు. పిపీలికాది బ్రహ్మపర్యంతం వున్న ఆ ప్రజ్ఞ తనలోనూ ఉన్నదని తెలిసికొంటాడు. ఆ బ్రహ్మపదార్థం తానే అని 'అహం బ్రహ్మాఽస్మి' మహావాక్యాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడు. తాను బ్రహ్మమని అనుభవపూర్వకంగా తెలుసుకొన్న వారికి 'అయమాత్మాబ్రహ్మ' ఇదంతా బ్రహ్మమే, 'నేహ నానాస్తి కించన' అనే అపరోక్షజ్ఞానం సిద్ధిస్తుంది.

ఇట్టి మహోన్నతస్థితికి మనని తీసుకువెళ్లేవారే సత్యగురుదేవులు. బ్రహ్మీభూత శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారట్టి కోవకు చెందినవారు.

నామరూపక్రియారహితమైన బ్రహ్మపదార్థం నిజసాధకుల ఉపాసన కొఱకు ఒక రూపాన్ని కల్పించుకొని సద్గురువు రూపంలో వస్తుంది. అటువంటి మహాత్ములు తమ సర్వస్వాన్ని త్యాగం చేసి ఏ బ్రహ్మానందామృతంలో తాము నిత్యమూ ఓలలాడుతున్నారో దానిని అందరికి పంచిపెట్టి, అందరూ కూడా అట్టి నిత్యానందాన్ని పొంది సుఖించాలని యిట్టి ఆశ్రమాలను స్థాపన చేసి తమ దివ్యబోధామృతధారలను సర్వులపై వర్షింపజేస్తూ సర్వజనోద్ధరణకై అహర్నిశలు శ్రమిస్తున్నారు. అట్టి సద్గురు దేవులకు రాకడ పోకడలు లేవు. వారు ఏనాడూ భౌతికశరీరానికి కట్టుబడిన వారు కారు. కానీ మనలను ఉద్ధరించడం కోసరం వారొక శరీరధారణచేసి తమ సర్వస్వం మానవ శ్రేయస్సుకే ధారపోస్తున్నారు. అటువంటి సద్గురుదేవుల ఋణం తీర్చుకోవాలంటే వారు నేర్పిన బాటలో నడచుకోవడం మాత్రమే కర్తవ్యం.

శ్రీసద్గురుపాదుకలు సర్వదా మనందరినీ కాపాడుగాక!

శత జయంతి జయప్రదమగుగాక !

పూజ్యశ్రీ ప్రసన్నానందస్వాములవారు
గౌరవ అధ్యక్షులు, అఖిలాంధ్రసాధుపరిషత్తు
ఆనందాశ్రమము, గండిపాళెం

సద్గురు మహర్షి మలయాళస్వాములవారు 12 సం॥ తిరుమల గోగర్భంలో తపస్సు ఆచరించిలోకానికి ఎంతో ఆధ్యాత్మిక క్రాంతిని, శాంతిని ప్రసాదించినారు. వ్యాసాశ్రమాన్ని స్థాపించి సమాజానికి బహువిధసేవలందించారు.

పూజ్య శ్రీ విద్యాప్రకాశానందస్వాములవారు వ్యాసాశ్రమములో 12 సం॥ తపస్సాచరించి శ్రీ కాళహస్తిలో శుక బ్రహ్మాశ్రమాన్ని స్థాపించినారు. సద్గురు దేవుల కీర్తిని ఇనుమడింపజేసిన మహనీయమూర్తి శ్రీవిద్యాప్రకాశానందస్వాములవారు.

స్వామీజీ పూర్వాశ్రమనామధేయము ఆనందమోహన్. మోహాన్ని తొలగించి ఆనందాన్ని అందరికీ పంచాలనే సంకల్పంతో బందరునుండి బయలుదేరినారు శ్రీ స్వాములవారు.

స్వామీజీ వారి ప్రవచనాలు ఆబాలగోపాలం అందరికీ అందుబాటులో వుండేవి. గొప్పవేదాంతాన్ని సులభశైలిలో అందించేవారు. అందువలన స్వామీజీ వారి ప్రవచనాలకు వేలాదిమంది ప్రజలు హాజరయ్యేవారు.

పూజ్యశ్రీ స్వాములవారు అనేకములైన ఆధ్యాత్మికగ్రంథాలు రచించి అందించినారు. విద్యాలయాలు వైద్యాలయాలు స్థాపించి బహుముఖసేవలందించారు.

అట్టి శ్రీస్వాములవారి శతజయంతి ఉత్సవాలు జరుగుట కడుముదావహము.

పూజ్యశ్రీ విద్యాస్వరూపానందస్వాములవారి ఆధ్వర్యంలో మహర్షి మలయాళస్వాముల వారి శతజయంతి ఉత్సవాలు అద్భుతంగా జరిగినవి. శ్రీ విద్యాప్రకాశానందస్వాములవారి శతజయంతి ఉత్సవాలు కూడా శ్రీ స్వాములవారి ఆధ్వర్యంలో జరుగడము కడుముదావహము.

శతజయంతి ఉత్సవాలు జయప్రదంగా, శుభప్రదంగా జరుగునట్లు భగవానుడు అనుగ్రహించుగాక.

ఓమ్ శాంతిః శాంతిః శాంతిః

శ్రీస్వామివారు గీతాజ్ఞానయజ్ఞాలు చేసి లోకోద్ధరణ చేసిన సద్గురువులు.

పూజ్యశ్రీ స్వామి కృష్ణానందపురి, శ్రీవాసవీ శాన్తిధామ క్షేత్ర పీఠాధిపతి,
పెనుకొండ, పశ్చిమగోదావరిజిల్లా.

ఓం శ్రీసద్గురుభ్యో నమః

దైవాత్మీయ అఖండ అద్వితీయ సత్ చిత్ ఆనందమూర్తులు స్వామి సంపూర్ణానందగిరివారికి స్వామీ కృష్ణానందపురీ అనంతకోటి హృదయ పూర్వక ఓం నమోనారాయణ ప్రణామములు!

వివేక విజ్ఞాన స్వరూపులు ఆస్తికమహాశయులకు సద్గురు కృపాకటాక్షములతో భక్తి జ్ఞాన వైరాగ్యములు కలుగవలెనని శుభ ఆశీసులతో స్వామికృష్ణానందపురీ తెలియజేయు భక్తిపుష్పము.

అపర ఆంధ్రా శంకరాచార్యస్వామిగా జగతికి ఆధ్యాత్మికముగా గణనీయమైన శ్రీశ్రీశ్రీ మలయాళస్వామి వారి ముఖ్యాతిముఖ్యశిష్యులైన శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు సార్ధకనామధేయులై -విద్యా- బ్రహ్మవిద్య, ఆత్మ జ్ఞానం -ప్రకాశం -మణివలెస్వయం ప్రకాశం ఆనందం- సత్ చిత్ ఆనందస్వరూపులై గిరి- దశనామసన్యాసులలో ఒకటైన గురుసాంప్రదాయం పరంపరగా విరాజిల్లిరి. వ్యాసాశ్రమ బిడ్డలై శుకబ్రహ్మాశ్రమమును సంస్థాపించిరి.

అజ్ఞానము అనే చీకటిలో, సంసారసాగరంలో ప్రయాణం చేయుచున్నజీవులకు, దిక్సూచి, లైటుహౌస్ ఒడ్డు చేరుటకు ఎలా సహకరించునో, శ్రీశ్రీశ్రీ స్వామివారి ప్రబోధములు, గ్రంథములు పరమార్థము చేరుటకు అలా తోడ్పడినవి. యావత్ జిజ్ఞాసువులకు కర్మ, భక్తి, ధ్యాన, వైరాగ్య, జ్ఞాన అనుభవములు కల్గుటకు సరళశైలిలో గ్రంథములు ప్రచురించి లోకానికి అందించిన మహాత్ములు, జ్ఞానభాస్కరులు వీరు. ఇంత విస్తృతమైన మీడియాలేని ఆ రోజులలో విస్తృతమైన ఆధ్యాత్మికప్రచారములు, శ్రీగీతాజ్ఞానయజ్ఞములచేత లోకోద్దరణ చేసిన సద్గురువులు శ్రీ స్వాములవారు.

భాస్కరుని దర్శించి గ్రహించుటకు, దివిటీ ఎలా అవసరంలేడో అలా శ్రీశ్రీశ్రీ స్వామివారి గురించి తెలుపుట అవసరం లేదు. అప్పటి రోజులలో శ్రీశ్రీశ్రీ స్వామివారితో ప్రత్యక్ష అనుభవం, యిప్పుడు గ్రంథరూపంలో, గ్రహణతో అనుభవం.

"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత, అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం" అని, గీతాచార్య వచనం. "అఖండమండలాకారం వ్యాప్తం యేన చరాచరం, తత్పదం దర్శితం యేన తస్మై శ్రీ గురవే నమః".

ఈ భావార్థంతోనే శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి సద్గురువుల శతజయంతి ఉత్సవములు ఆనందప్రదంగా జరుగుగాక! అని ఆరాధనపూర్వకంగా......

ఓం తత్ సత్

ఆత్మీయ
స్వామికృష్ణానందపురీ

నివాళులర్పించెదముగాక!

-ప్రొఫెసర్ సి.రామయ్య
(రిటైర్డ్ వేదాన్తశాఖ ఆచార్యుడు. యస్.వి.యు)

ఋషీకేశంలో పవిత్ర గంగానదిలో పూలతోను, కుంకుమతోను పూజింపబడిన పవిత్ర భగవద్గీతా గ్రంథము లభించడం ఆనందమోహనులవారిపట్ల భగవంతునకు గల మిక్కుటమైన అనుగ్రహమునకు చక్కటి నిదర్శనం. ఆ గీతాగ్రంథమే దివ్యమైన శ్రీ ఆనందమోహనులవారి భావిజీవిత లక్ష్యమును నిర్ణయించింది. శ్రీఆనందమోహనుల వారు 1936 సం॥లో ఏర్పేడు వ్యాసాశ్రమములో సాధకుడుగా గురుకులప్రవేశం చేసారు. 1947 వ సం॥లో సద్గురు మహర్షి మలయాళస్వాములవారినుండి సంన్యాస దీక్షను స్వీకరించినారు. వీరి సంన్యాసాశ్రమ నామధేయము శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు. పూజ్య స్వాములవారు 1950 వ సం॥లో శ్రీ కాళహస్తిలో శ్రీ శుకబ్రహ్మాశ్రమమును స్థాపించి సదరు ఆశ్రమమునకు తొలి పీఠాధిపతిగ వ్యవహరించిరి. వీరు గీతాజ్ఞానము యొక్క బహుముఖ వ్యాప్తికై జీవితమును అంకితముచేయుటకై జన్మించిన కారణ జన్ములు. ఇందుకు తార్కాణము వీరు రచించిన గీతామకరందము, గీతోపన్యాసములు అను బృహద్గ్రంథములు. మరియు తేది 2-12-56న గుంటూరు జిల్లాలోని నరసారావుపేటలో ప్రారంభించి, తే 25-4-81 న హైదరాబాదులోని ఎగ్జిబిషన్ గ్రౌండులో తిరుమల తిరుపతి దేవస్థానము ఆధ్వర్యములో జరిపిన నూరవ జ్ఞానయజ్ఞము వరకు నిర్వహింపబడిన గీతాయజ్ఞములు. ఆంధ్రప్రదేశ్‌లో గీతా జ్ఞానవ్యాప్తికై పాటుపడిన మహనీయులలో విద్యా ప్రకాశానంద స్వామి వారిని మించిన వారు వేరొకరు లేరు. భగవద్గీతను ప్రాథమిక స్థాయినుండే విద్యాసంస్థలలో ప్రవేశపెట్టవలెనని వీరు ప్రజలను ప్రోత్సహించేవారు. పలుచోట్ల గీతామందిరములను స్థాపించి ఎన్నో ప్రవచనములను ప్రసాదించినారు.

ఇంతటి గొప్ప మహనీయునకు ఇవే మా ప్రణామములు. ప్రస్తుత పీఠాధిపతులు పూజ్యశ్రీ సద్గురు విద్యాస్వరూపానందగిరి స్వాములవారి మార్గదర్శకత్వంలో శ్రీశుకబ్రహ్మాశ్రమ నిర్వాహకులు పూజ్య శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి శతజయంత్యుత్సవ వేడుకలను 2013 ఏప్రియల్ మాసములో జరుపుట కడు ముదావహము.

పూజ్య శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు స్థితప్రజ్ఞుల, జీవన్ముక్తుల కోవకు చెందినవారు. నిష్కామకర్మాచరణను అనుష్ఠించిన మహామనిషి. వారు పేదప్రజలకొరకు ఒక ఉచిత కంటి ఆసుపత్రిని, అనేక విద్యాసంస్థలను స్థాపించిరి. పూజ్యశ్రీ స్వాములవారు నిర్దేశించిన మార్గమును అనుసరించుటద్వారా ఆ మహనీయునకు నివాళులర్పించెదము గాక!

శత జయన్త్యుత్సవాలలో పాల్గొనడం మన పుణ్యవిశేషం

శ్రీ. పి. వెంకటేశ్వర్లు(హైదరాబాదు)
ఆశ్రమ పరిపాలనా సంఘ చైర్మన్

"పురుషులలో పుణ్యపురుషులు వేరయా" అని వేమనకవి చెప్పాడుగదా! అట్టి పుణ్యపురుషులలో మా స్వామి శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి ఒకరు. శ్రీ కృష్ణుడు భగవద్గీతలో భూలోకంలో ధర్మం నశించినపుడు అధర్మం రాజ్యమేలేటప్పుడు తానవతరించి దుర్జనసంహారం గావించి ధర్మప్రతిష్ఠాపన చేస్తానని చెప్పాడు.

భగవంతుడు యుగమునకొక అవతారం ధరిస్తాడు. ఈ మధ్య సాధుజనులకు మార్గనిర్దేశం చేయడానికి మహాపురుషులు, ఋషులు, యోగులు, అవధూతలు, పరివ్రాజకులు, పరమహంసల రూపంలో అవతరిస్తారు. వారు భక్తజనావళికి ధర్మోపదేశాలు చేస్తూ ప్రజలు ధర్మమార్గాన నడవడానికి కృషి చేస్తారు. భగవంతుడు అవతరించేది దుష్టసంహారార్థము. ఋషులు మొదలగువారు జన్మించేది ప్రజలను దుర్మార్గం నుండి సన్మార్గానికి మఱలించడం కోసరం. అట్టి ఉత్తమ పురుషుల్లో శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి ప్రథమ శ్రేణిలో ఉంటారు.

ఆజన్మ బ్రహ్మచారిగా వుండి వేదాంత సంబంధమైన సకల శాస్త్రాలు కరతలామలకం కావించుకొని, ప్రజల ఉపయోగార్థం వారి వారి భాషలలోనికి అనువాదం చేసి ప్రచురించారు. వీటిలో ఉపనిషత్తులు, యోగవాసిష్ఠం, గీతామకరందం ముఖ్యములు. సనాతన ప్రచారానికి ఆవశ్యకమైన గ్రంథాలన్నీ ప్రజోపయోగకరంగా వారు ప్రచురించారు. సామాన్యులకు కూడ అర్థమయ్యేభాషలో చిన్న చిన్న కథల రూపంలో జటిలమైన వేదాంత విషయాలను కూడ సుబోధకం చేశారు. సనాతన ధర్మ ప్రచారంతో తెలుగు వారికి వారు చేసిన సేవ అసమానం. ఈ కృషిలో వేదాంతభేరి పత్రికను గుఱించి ప్రత్యేకంగా పేర్కొనాలి. ఈ పత్రికలో యెన్నో క్లిష్టమైన సంస్కృత శ్లోకాలు సరళమైన తెలుగులోకి అనువదించి అంతగా విద్యావంతులు కాని వారికి గూడ అర్థమయ్యేట్లు ప్రచురిస్తున్నారు.

స్వామి వారు సనాతనధర్మ ప్రచారమేగాక ప్రజలకత్యవసరమైన విద్యావైద్యరంగాలలోకూడ ఎనలేని కృషిచేశారు. వారు నేత్రవైద్యాలయం, బాలికాకళాశాల స్థాపించి విద్యాదానం నేత్రదానం చేశారు. ఈ కార్యక్రమాలన్నీ వారు ఒక్కరే నిర్వహించారంటే వారు కారణ జన్ములనియే భావించాలి.

పుష్పాంజలి

– శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాములవారు
శ్రీశుకబ్రహ్మాశ్రమము

ఏ మహానుభావుడు తన జీవితాన్ని, తన త్రికరణాలను 12 సంవత్సరాలు అకుంఠిత తపస్సు ద్వారా పవిత్రం చేసుకొన్నాడో, ఏ మహానుభావుడు తాను అనుష్ఠాన వేదాన్తియై, తత్త్వవేత్తయై తన అనర్గళ భగవద్గీతా ప్రవచనాల ద్వారా ఆంధ్రప్రదేశ్ అంతటా లక్షాది జనులను ఉఱ్ఱూత లూగించాడో, ఏ తపస్వి తన గీతాజ్ఞాన యజ్ఞాలచే విద్యావంతులు మొదలుకొని సామాన్య కార్మికులు, కర్షకుల వఱకు, పండితులు మొదలు పామరుల వఱకు వేల ప్రజలను ఆకర్షించాడో, ఏ మహాత్ముడు భక్తులు తనకు సమర్పించిన ధనమును తనకొఱకు ఖర్చు పెట్టుకొనక కళాశాలలు పెట్టడానికి ఖర్చు పెట్టాడో, ఏ మహితాత్ముడు భక్తకన్నప్ప కంటిఆస్పత్రిని స్థాపించి వేల కొలది ప్రజలకు చూపును ప్రసాదిస్తున్నాడో, ఏ జ్ఞాని తన రచన గీతామకరందం ద్వారా లక్షలాది దేశవిదేశ ప్రజలకు భగవద్గీతా రుచిని అందజేసి ఆనందింపజేస్తున్నాడో, అట్టి తపస్వి, అనుష్ఠాన వేదాన్తి, పరోపకార పరాయణుడు, జ్ఞానదాత, అనర్గళ ప్రవక్త, అనేక గ్రంథ రచయిత, శ్రీ శుకబ్రహ్మాశ్రమ సంస్థాపకులు, మన పరమపూజ్య గురుదేవులు, త్యాగమూర్తి, తపోతార్తి, పరమహంస పరివ్రాజకాచార్యవర్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి శతజయన్త్యుత్సవాలు మన కండ్లముందు జరగడం మనమహద్భాగ్యము. ఈ శతజయన్త్యుత్సవాలలో భారతదేశమందలి నలువైపుల నుండి సుప్రసిద్ధ తపోమూర్తులు, మహావిద్వాంసులు అగు జగద్గురువులు, పీఠాధీశ్వరులు, మహామండలేశ్వరులు, మఠాధిపతులు పాల్గొని మనకు దర్శనభాగ్యాన్నందించడం మన అహోభాగ్యము. ఈ సందర్భంలో జరుగు భగవద్గీతా జాతీయ సదస్సులలో శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులైన మహాత్ముల దివ్యోపదేశాలను వినేభాగ్యం మనకు కలగడం నిజంగా మన పుణ్యఫలమే. ఈ పవిత్ర శతజయన్తి ఉత్సవాలరూపంలో గురుదేవా నీకిదే మా పుష్పాంజలి.

ఓం

పరమార్థ సందేశము

– పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

(పూజ్యశ్రీ స్వాములవారు శ్రీ శుకబ్రహ్మాశ్రమ మౌక్తికోత్సవ సందర్భంలో ఇచ్చిన సందేశాన్ని ఈ స్వర్ణోత్సవ సందర్భంగా ప్రకటిస్తున్నాము.)

మానవుని లక్ష్యము (ఆత్మసాక్షాత్కారము) చాల గొప్పది. కాని సమయము చాల స్వల్పము. విఘ్నములు మెండు. కావున నాతడిక నేమిచేయవలెను? తన కీశ్వరుడిచ్చిన స్వల్ప ఆయుర్దాయము నందే మహోన్నత యత్నమాచరించవలెను. చక్కటి నియమము లేర్పరచుకొని. ఇంద్రియములను మెల్లమెల్లగ వశీభూత మొనర్చుకొనుచు, చిత్తమునందుగల అసురిక సంస్కారములను క్రమక్రమముగ పారద్రోలుచుండ వలయును. తన స్వరూపము పాంచభౌతికము గాదనియు, సచ్చిదానంద ఘనమనియు మఱల మఱల చింతనజేయ వలెను. ఈ ప్రకారముగ నియమము తప్పక ప్రతిదినము సాధనచేయుచుండినచో అచిర కాలములో నతనికి గొప్ప మనశ్శాంతి, పరమానందానుభూతి తప్పక కలుగగలవు. ఇట్టి పరమసత్యములను జ్ఞాపకము చేసికొనుచు, స్వస్వరూపానుభవమను పరమలక్ష్యమును సాధించుటకై సాధనను, తీవ్రతర ప్రతిజ్ఞలను గావించుకొనవలసిన శుభ సమయమే ఈ మౌక్తికోత్సవ సందర్భము.

పరమ పవిత్రమగు ఈ మౌక్తికోత్సవ శుభసమయమున జనులీ క్రిందివాక్యములను బాగుగ జ్ఞాపకము చేసికొనవలసి యున్నది.

1. తాను ఆత్మయేకాని దేహముకాదు. తనకు ఏకాలమందును వినాశములేదు. నశించునది, వికారము నొందునది, మరణించునది దేహమేకాని దేహియగు తానుకాదు. ''ఓమ్, ఓమ్, ఓమ్ (ఈ ప్రకారముగ తనయొక్క 'సత్' అంశమును మాటిమాటికి మననము చేయుచుండ వలెను).

2. తాను జడమగు ఒకానొక మట్టిబొమ్మకాదు, మృణ్మయుడుకాదు, చిన్మయుడు. ప్రజ్ఞానఘనస్వరూపుడు. సుషుప్తియందును మేలుకొనియుండు చిద్రూపాత్మయే తాను. 'ఓమ్, ఓమ్, ఓమ్' – (ఈ ప్రకారముగ తనయొక్క 'చిత్' అంశమును మఱల మఱల చింతన చేయుచుండవలెను).

3. తాను సంసారదుఃఖములందు పడి మ్రగ్గిపోవు కీటకము కాదు, ఆనందసాగరమున నోలలాడు బ్రహ్మాండాధిపతి. నిప్పును చెదలు అంటజాలనట్లు దుఃఖశోకము లెవ్వియు తన్ను స్పృశింప జాలవు. ఓమ్, ఓమ్, ఓమ్ – (ఈ ప్రకారముగ తనయొక్క 'ఆనంద' అంశమును మాటిమాటికి మననము చేయుచుండవలెను).

ఈ రీతిగ తాను 'సత్, చిత్, ఆనంద' రూపుడగు పరబ్రహ్మమే యను పరమసత్యమును ప్రతిదినము పెక్కుసార్లు జ్ఞాపకము చేసికొన వలయును.

తద్బ్రహ్మనిష్కలమహం న చ భూతసఙ్ఘః

'నిష్కళమగు ఆ పరబ్రహ్మమే తానుగాని పంచభూత సముదాయమగు దేహము కాదు' – అని శ్రీ శంకర భగవత్పాదు లానతిచ్చినట్లు ప్రతిజీవియు తన నిజరూపమును దినమునకు ఎన్నియో పర్యాయములు స్మృతిపథమునకు తెచ్చుకొనుచుండ వలెను. తాను దరిద్రుడుకాదనియు, సమ్రాట్టనియు, మహాచక్రవర్తియనియు విశ్వసామ్రాజ్యాధిపతి యనియు భావించవలెను.

యద్భావం తద్భవతి

తానెట్లు భావించునో అట్లే యగును. కావున ప్రాతఃకాలము నిద్రలేచినది మొదలు మఱల పరుండు వఱకును, వ్యవహారమధ్యమున గూడ యిట్టి మహోన్నత గంభీరభావములను పలుసార్లు జ్ఞప్తికి తెచ్చుకొనుచుండ వలెను. అట్లు జ్ఞాపకము చేసికొనునపుడు 'ఓమ్, ఓమ్, ఓమ్' – అని ప్రణవమును గూడ స్మరించుచుండుట ప్రారంభమున చాల సహాయకారిగ నుండగలదు.

మఱియు, వారివారి సంస్కారము ననుసరించి కర్మమార్గమునుగాని, భక్తిమార్గమునుగాని, ధ్యానమార్గముగాని, జ్ఞానమార్గమునుగాని చేబట్టి, వైరాగ్యమును, సర్వభూతదయను అన్నిమార్గములకు తోడుగ దీసికొని అధ్యాత్మ పథమున అగ్రసరుడై జీవుడు అచిరకాలములో ఆత్మసాక్షాత్కారరూప చరమలక్ష్యమును ఈ జీవితమునందే సాధించివైచి కృతార్థుడు కావలయును.

కరుణామయుడగు సర్వేశ్వరుని పరిపూర్ణానుగ్రహముచే జనులలో ఆధ్యాత్మిక ప్రవృత్తి పెంపొంది లక్ష్యప్రాప్తికై ద్విగుణీకృత ప్రయత్నము సంభవించుగాక!

ఓం తత్ సత్



రమణవాణి

పూజశ్రీ రమణ మహర్షి

(దేశంలో భగవాన్ రమణ మహర్షిని తెలియనివారు లేరు. తమిళనాడులోని తిరువణ్ణామలై క్షేత్రంలో మహర్షివారి శ్రీ రమణాశ్రమం వుంది.)

భక్తుడు:- భక్తులు, కర్మయోగులు సమాధి అనుభవాన్ని పొందవలసిందేనా?

శ్రీరమణులు:- సమాధి అంటే మనస్సు హృదయంలో కలసిపోవటం. ఇది మనస్సును ఏకాగ్రపరచటం చేత, ప్రాణాయామం చేత సాధ్యం. భక్తి యోగులు, కర్మయోగులు అభ్యాసం చేస్తే సమాధిని పొందగలరు. యథార్థానికి విచారణ చేత ముక్తినే పొందవచ్చు. వాస్తవానికి విచారణమార్గం వలన ముక్తిని పొందవచ్చును.

భక్తుడు:- ఇది కాదు; ఇదికాదు - అంటూ అనాత్మను త్రోసివేస్తూ - నేను ఆత్మను, పరబ్రహ్మమును అని భావన చేస్తున్నాను. అయినా, అభివృద్ధి కలగటం లేదు. కారణ మేమిటి?

శ్రీరమణ:- మీరు చేస్తున్న విచారణ అంతా మేధస్సుతో చేస్తున్నారు. 'నేను ' ఇదికాదు 'నేను' ఇది కాదు అన్నప్పుడూ 'నేను' బ్రహ్మమును అని భావిస్తున్నప్పుడు రెండింటిలోను 'నేను'ఉండనే వుంది. ఈ నేనునే అహం ప్రథమ తలంపు అని అంటారు. ఈ నేను పుట్టిన తరువాతే, సమస్త తలంపులు పుడుతున్నాయి. కనుక, ఈ 'నేను'ను కూలత్రోస్తే సమస్తము కుప్పగా కూలిపోతాయి. ఇతర తలంపులు మాని సూటిగా నేను ఎక్కడ పుడుతుందో చూడు. 'నేనెవరు?'' అని ప్రశ్నించుకో.

భక్తుడు:- ఈ 'నేను' ను అహంను గుర్తించే దెలా?

శ్రీరమణ:- మీరు సదా 'నేను' ను అనుభవిస్తూనే వున్నారు. మీవునికిని మీరే నిరాకరిస్తారా? మీరిప్పుడు 'నేను,నేను'' అని అంటూనే వున్నారు కదా ఆ నేను ఎవరు? అని ప్రశ్నించమంటున్నాను.

భక్తుడు:- మిథ్యా 'నేను' ను తోసివేసే దెలా? అదే చేతకావటం లేదు.

శ్రీరమణ:- ''మిథ్యా నేను''ను తోసివేయనక్కర లేదు. కేవలం ''నే నెవరు?'' అని ప్రశ్నించుకో మంటున్నాను. నేను పుట్టిన చోటు వెదకమంటున్నాను. ఇంతవరకే పురుష ప్రయత్నం. అప్పుడు నీలోని ఆత్మే నిన్ను తనలోనికి గుంజి వేస్తుంది. అక్కడ ఏ పురుష యత్నము సమీపించలేదు. నీవు నిస్పహాయుడవవుతావు. ఆత్మ నిన్ను పూర్తిగా లోగొంటుంది.

భక్తుడు:- ఆత్మ జ్ఞానం కలిగింతరువాత ప్రపంచము, దేహము తోస్తాయా?

శ్రీరమణ:- దేహము, ప్రపంచము తనకు ఆత్మగా కనపడతాయి.

భక్తుడు:- అసలు భగవంతుడు నన్ను ఎందుకు సృషించి ఈ నరక యాతన పెడుతూన్నట్టు...?

శ్రీరమణ:- భగవంతుడు వచ్చి నిన్ను సృషించానని చెప్పాడా ఎన్నడైనా? నీవు గదా అంటున్నావు. అదే మిథ్యా నేను. ఈ మిథ్యా 'నేను' అదృశ్యం అయితే ఇక సమస్యలే లేవు.

భక్తుడు:- గురు అనుగ్రహం అంటే ఏమిటి? అది ఎలా పనిచేస్తుంది?

శ్రీరమణ:- ఆత్మే గురువు. భగవంతుడే గురువుగా ఆత్మగా వున్నాడు. ఒకరు ప్రపంచములో దుఃఖంలో వున్నప్పుడు, సుఖం కొర్రకై అన్వేషిస్తూ భగవంతుని ప్రార్థిస్తారు. ఆ ప్రార్థన చివరకు భగవంతుణ్ణి తెల్సుకోవాలి అన్నదాక వెలుతుంది. అప్పుడు భగవంతుని అనుగ్రహం పనిచేయటం ప్రారంభిస్తుంది. భగవంతుడు మానవాకృతి ధరించి వచ్చి బోధల ద్వారాను, తన సాంగత్యం ద్వారాను శిష్యుణ్ణి పవిత్రుణ్ణిచేస్తూ అంతర్ముఖ పరుస్తాడు. అంతర్ముఖమైన మనస్సు దృఢతరమై నిశ్చలత్వమే ఆత్మ. గురువు బాహ్యంగాను, అంతరంగగాను రెండు విధాలుగా వున్నాడు. బాహ్య గురువు శిష్యుని మనస్సుని లోపలికి నెట్టివేస్తాడు. లోపలి గురువు తన లోనికి గుంజివేస్తాడు. ఆత్మకు, గురువుకు భగవంతునకు వ్యత్యాసం లేదు.

భక్తుడు:- ప్రపంచం ఎక్కడ నుండి పుడుతోంది?

శ్రీరమణ:- నీవు ఎక్కడ నుండి పుడుతున్నావో అక్కడనుండి. ముందుగా నీ సంగతి తెల్సుకో.

భక్తుడు:- బాహ్య పరిశీలన ద్వారా ఆత్మను తెలుసుకోలేమా?

శ్రీరమణ:- లోపల, బయట అని రెండు విభాగాలు వున్నాయా? గాఢ నిద్రలో ఈ భేదం స్ఫురిస్తోందా? నేను అను మిథ్యా తలంపు పుట్టిం తరువాతే ఈ భేదం చూస్తున్నాం. మనం జాగ్రత్త అని చెప్పకుంటుందే మాయ. నీవు లోచూపుతో ఆత్మను దర్శిస్తే- సమరసంగోచరిస్తుంది. అప్పుడు సమస్త ప్రపంచమూ పరమాత్మగా అనుభూతమైతుంది. భౌతికశాస్త్రం ముందుకు పోయి పదార్థ మూలాన్ని అన్వేషిస్తే - సూక్ష్మాతి సూక్ష్మమైన శక్తిగా గుర్తిస్తుంది.

ఈ పేజీ స్థలదాతలు - శ్రీ K.V. రంగయ్యగారు, శాలివాహననగర్ - హైదరాబాద్

గీతాస్వరూపులు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు

శ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు
(శ్రీ శుకబ్రహ్మాశ్రమము)

ఆనందనామసంవత్సరచైత్ర బహుళతృతీయ సోమవారం అనూరాధనక్షత్రము అనగా 1914-4-13వ తేదీన పవిత్రమైన సమయంలో భారతదేశములో ఆంధ్రావనిలో అవతరించిన దివ్యాత్మస్వరూపులే శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు.

"శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే"।
"అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్" । అని భగవద్గీత చెప్పినట్లుగా యోగిపుంగవులైన శ్రీరామ స్వామిగారు శ్రీమతి సుశీలాదేవి గార్ల ఆధ్యాత్మిక శిక్షణలో దినదిన ప్రవర్ధమానులై శ్రీస్వాములవారుండిరి.

"వనేఽపి దోషాః ప్రభవన్తి రాగిణాం,
గృహేఽపి పంచేంద్రియ నిగ్రహస్తపః ।
అకుత్సితే కర్మణి యః ప్రవర్తతే,
నివృత్తరాగస్య గృహం తపోవనమ్" ॥

వైరాగ్యము లేనివారు దట్టమైన అడవిలో నివసించినను, అంతఃకరణములో నంటి పెట్టుకున్న వాసనాయుతమైన దోషాలు వెంటాడుతూనే యుంటాయి. తెలుగులో ఒకసామెత వాడెదరు - "రామేశ్వరం వెళ్లినా శనేశ్వరుడు వదలలేదు" అని. విషయాసక్తిలేనివారు ఇంటిలోయున్నా - ఇంద్రియాలను విషయములనుండి మరల్చి తపోనిష్ఠులగుదురు. వేదవిహితమైన పవిత్ర కర్మనాచరిస్తూ జ్ఞానార్జనకై శరీరపోషణకు కావలసిన శబ్దాది విషయాలను స్వీకరిస్తూ విరక్తిగా నుండే గృహస్థుని గృహమే తపోవనము. అటువంటి తపోవనమైన గృహంలో అవతరించి, పితృస్వరూపులైన శ్రీరామస్వామిగారి ముఖారవిందము నుండి వేదాన్తపంచదశి, ఆత్మబోధ, జీవన్ముక్తి ప్రకాశిక మొదలగు ఆధ్యాత్మిక గ్రంథాలను బాల్యకాలములోనే శ్రవణము చేసిన సుధీరులే శ్రీస్వాములవారు. 'గ్రహణధారణపటుర్బాలః' అన్నట్లు వీరు శాస్త్రవిషయాలను చక్కగా ధారణచేసినవారు. న్యాయవాద వృత్తిలో నిపుణులైన తండ్రిగారు గీతాప్రవచనాలు గంటల తరబడి అనేక స్థలాలలో చేస్తుండగా ఆ ప్రవచనాలు శ్రద్ధతో విని ప్రగాఢమైన భగవద్గీత బీజం హృదయంలో నాటుకొన్నది శ్రీస్వాములవారికి. ఆధ్యాత్మిక బీజంతో పాటు లౌకిక విద్యలో బి.ఏ డిగ్రీ వరకు కళాశాలలో చదివిరి. ఆ సమయంలో తిరుమల గోగర్భంలో ద్వాదశసంవత్సరాలు తపస్సు చేసి బ్రహ్మ నిష్ఠాగరిష్ఠులై 1926లో శ్రీవ్యాసాశ్రమమును స్థాపించిన మహర్షిశ్రీమలయాళ స్వాములవారు ప్రవచన పర్యటనలో కృష్ణాజిల్లా మచిలీపట్నం వెళ్లారు. అచ్చటనే పంచాక్షరీ మహామంత్రం శ్రీవిద్యా ప్రకాశానందస్వాముల వారికి ఉపదేశించిరి. (వీరి పూర్వనామధేయము ఆనందమోహన్) తదుపరి వీరు కాశీ క్షేత్రము వెళ్లి హిందీ విద్యాధ్యయనముచేసిరి.

1936వ సంవత్సరములో శ్రీవ్యాసాశ్రమం చేరుకొన్నారు. సద్గురు శ్రీమలయాళస్వాములవారికి ముఖ్యమైన ప్రియశిష్యులైనారు. శ్రీవారి దివ్యకరుణా కటాక్షవీక్షణములు సంపూర్ణముగా వీరియందున్నవి. వీరు వ్యాసాశ్రమము చేరిన కొలది దినములోనే అపక్వాహారమును ప్రారంభించి 12సంవత్సరములు ఆ ఆహారమునే స్వీకరించి తపోనిష్ఠాగరిష్ఠులైరి.

యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।
యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥

అని శ్రీగీతాచార్యులవారు సాధకుని 3 సాధన విషయాలు చెప్పారు. ఆహార విహారాదులయందును, కర్మాచరణముల యందును, జాగ్రత్స్వప్నాదుల యందును మితముగ ప్రవర్తించువారికి దుఃఖనాశకమగు ధ్యానయోగము సిద్ధించును. కావున సాధకులెవరికైన దుఃఖమంతముకానిచో దానికి కారణము వారి సాధనపద్ధతిలో లోపమేయగునుగాని యోగముయొక్క పొరబాటుగాదు. అమితులుగా వ్యవహరించినచో యోగము సత్ఫలితముల నొసంగజాలదు. మంచి ఔషధమైనను సేవించ వలసినపద్ధతిలో సేవించిననే వ్యాధిని నివారింప గల్గునుగాని వేరువిధముగా కాదు. 'అతి సర్వత్ర వర్జయేత్" అను విషయమును సాధకుడు జ్ఞప్తియందుంచుకొనవలెను. జిహ్వోపస్థలు జయించినవానికి లోకములో జయింపరాని వస్తువే లేదు. ఈ రెండును సంపూర్ణముగా సిద్ధించి యున్నవి శ్రీవిద్యాప్రకాశానంద స్వాముల వారికి. సామాన్యమానవులు ఒక ఏకాదశినాడు ఉపవాసముండి పండ్లు తినిగూడ ముఖమువాడినట్లు గలిగియుందురు. ఎందుకు నీరసంగా యున్నారని ఎవరైనా వారిని అడిగితే ఈ దినం భోజనం చేయలేదు. నీరసానికదే కారణమందురు. శ్రీసద్గురు మలయాళస్వాములవారు శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో గోగర్భంలో 12సంవత్సరములు యుక్తాహార విహారాదులతో తపస్సుచేస్తే, శ్రీవ్యాసాశ్రమములో శ్రీగురుదేవుల సాన్నిధ్యములో ఏకాన్తకుటీరములో అనేకమైన పాములు క్రిమికీటకాదులు నివసించే స్థలములో 12సంవత్సరములు అపక్వాహారముతో, పైగీతాశ్లోకంలో చెప్పిన నియమము లన్నియు నద్భుతముగా నాచరించి తపోనిష్ఠాగరిష్ఠులై బ్రహ్మనిష్ఠులైన వారే శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు. 'వారికి వారేసాటి! "ఆహారమేవ మనః" మనము తినే ఆహారములో సూక్ష్మాంశమే మనసుగా మారును. సాత్వికాహారమయితే సాత్త్వికమనస్సు గానయి,'సత్వాత్ సంజాయతే జ్ఞానం' జ్ఞానాభివృద్ధి అయి, అనాత్మభావనా యుతమైన అజ్ఞానము నాశమయి, ఆత్మజ్ఞానమును గలిగించి ముక్తి సౌధమును అలంకరింపజేయును సాత్త్విక మనస్సు. "మన ఏవ మనష్యాణాం కారణం బంధమోక్షయోః" అని అమృత బిందూపనిషత్ చెప్పినది. ఆహారవిహార నియమపాలనవలన విషయాసక్తినుండి విరక్తుడగును. నిర్విషయమగు మనస్సే మోక్షమునకు కారణము. కావున దీర్ఘా లోచనతో ప్రప్రథమ సాధనమగు ఆహార నియమమును శ్రీస్వాములవారు ఆచరించిరి. ఈ విధముగా అపక్వారసేవనము, ధ్యానము, ఆధ్యాత్మిక గ్రంథములను పఠించుట, మితభాషణము గలిగి సద్గురు సేవను త్రికరణశుద్ధిగా జేయుచు, సద్గురు ఆజ్ఞమేరకు యోగవాసిష్ఠమనే ఉద్గ్రంథమునకు తెలుగు అనువాదం కూడా పూర్తిచేసారు. శ్రీ సద్గురుదేవుల సంపూర్ణానుగ్రహమునకు పాత్రులైరి. 1947వ సంవత్సరములో బ్రహ్మనిష్ఠా గరిష్ఠులునగు మహర్షి సద్గురు మలయాళస్వాములవారి దివ్యకరకమలముల ద్వారా సంన్యాసమును స్వీకరించిరి, శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు అనే యోగపట్టాను శ్రీగురుదేవుల ద్వారానే పొందిరి.

దక్షిణకాశియని ప్రసిద్ధికెక్కి పంచభూతములలో ఒకటగు వాయులింగమునకు స్థానమైనట్టి ఈ పరమ పవిత్రమైన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రమున ఉత్తరవాహినిగ ప్రవహించుచున్న సువర్ణముఖీ పావన నదీతీరమున పురాణప్రసిద్ధమై వెలయుచున్న శ్రీశుక తీర్థమునకు సమీపమున శ్రీకాళహస్తీశ్వరుడు వేంచేయు బాటయందు, 1950లో సద్గురు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు శ్రీశుకబ్రహ్మాశ్రమమును స్థాపించిరి. ఈ ఆశ్రమ స్థాపనకు సద్గురు దేవులైన శ్రీమలయాళస్వాములవారిని సవినయంగా నాహ్వానించిరి. శ్రీసద్గురుదేవుల ఆశీర్వాదంతో శ్రీవారి అమృత హస్తాలతో ఈఆశ్రమమును ప్రారంభించిరి. శ్రీవారే, పూజామందిరములో శ్రీశివలింగమును స్థాపించిరి. ఈ పవిత్రప్రదేశములో శుకుడు తపస్సుచేసినట్లు పురాణాలు చెపుతున్నాయి. రోమశుడు, మార్కండేయుడు, అగస్త్యుడు, నారదుడు మొదలగు మహర్షులు ఈ క్షేత్రంలో పూర్వం తపస్సు చేశారు. ఇంత విశేషపుణ్యఫలదాయకమైన, జ్ఞానఫల ప్రదాయకమైనదీ క్షేత్రమని బాగుగా తెలుసుకొని సద్గురు శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు ఇచ్చటనే ఆశ్రమమును స్థాపించిరి. పూర్వము శ్రీస్వాములవారు ఋషీకేశ్–ఒకపర్యాయం ఆశ్రమాలు, పూజ్యమహాత్ముల సందర్శనార్థం వెళ్లారు. ఆ సమయంలో గంగానదిలో పడవపై పోతున్నపుడు చిన్న గడ్డికుప్పలో భగవద్గీతాగ్రంథం తన పడవ సమీపమునకు వచ్చినది. నాగరిలిపిలో నున్న ఆ గ్రంథమును శ్రీవారు స్వీకరించారు. పరమసంతోషమును పొందినారు. నాటినుండి గీతాభావమును సంపూర్ణముగా తెలుసుకొని ఆచరించిన ప్రజ్ఞాశీలురే శ్రీసద్గురు స్వాములవారు. 'స్వయం తీర్ణః పరాంస్తారయతి' అనే సూక్తి ననుసరించి తాను బాగుగా నాచరించి, తరించి, ఇతరులను తరింపజేయుటకు భగవద్గీతా ప్రబోధము అవసరమని నిశ్చయించిరి.

'సమస్త వేదార్థసార సంగ్రహమిదం గీతాశాస్త్రమ్' ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము ఈ నాలుగు వేదములలో యున్న సారభూతమైన విషయమే గీతాశాస్త్రము. భగవద్గీతలో భావమును సమగ్రముగా తెలుసుకొంటే నాలుగు వేదముల భావమును తెలిసికొన్నట్లే యగును. పై సూక్తిని జగద్గురు శంకరభగవత్పాదులవారు గీతాభాష్యములో చెప్పియున్నారు.

"భగవన్ పరమేశాన భక్తిరవ్యభిచారిణీ" ।
ప్రారబ్ధం భుజ్యమానస్య కథం భవతి హే ప్రభో ॥

వరాహపురాణంలో – మానవుడు మోక్షమునకు ముఖ్యహేతువైన అవ్యభిచారిణీ భక్తిని ఏవిధముగా పొందగల్గునని భూదేవి శ్రీమహావిష్ణుని ప్రశ్నించెను.

"ప్రారబ్ధం భుజ్యమానోఽపి గీతాభ్యాసరతస్సదా।
సముక్తస్స సుఖీ లోకే కర్మణా నోపలిప్యతే"॥

పూర్వజన్మార్జిత పుణ్యపాపముల మూలమున మానవుడు ఈజన్మలో సుఖదుఃఖ ఫలభోగముల ననుభవించు చున్నను ఎల్లపుడు గీతాభావమును తెలుసుకొని ఆచరణయందు నిమగ్నుడైన వానికి అవ్యభిచారిణీభక్తి సిద్ధించును. ఇది సిద్ధించినవాడు ముక్తుడగును. ముక్తి నొందినవాడు సుఖశాంతులను పొందును. అవ్యభిచారిణీ భక్తి ద్వారా బ్రహ్మాది దేవతలందరిలో విరాజమానమైన చైతన్యము, మానవులందరిలో యున్న చైతన్యము, పశుపక్ష్యాది జంతుజాలములన్నిటిలోను వెలిగే చైతన్యము, ఒకటేయని తెలిసికొని 'సమస్సర్వేషుభూతేషు మద్భక్తింలభతే పరామ్' అని గీతాచార్యుల వారు చెప్పినట్లు అందరియందు సమమైన భావముంచి పరమప్రీతిగలిగియుండుట, అందరిలోనున్న చైతన్యమే నాలోయున్నదని దృఢభావము గలిగియుండుటే అవ్యభిచారిణీభక్తియనబడును.

18 అధ్యాయములలో కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞానములుగా యున్న రహస్యములను బాగుగా తెలిసికొని, హృదయస్థము చేసుకొని, ఆచరణీయాత్మకముగా లోకములో ఆదర్శరూపులైన వారే శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు.

శ్రీమహర్షిమలయాళస్వాములవారు ప్రతి సంవత్సరము సనాతన వేదాంతజ్ఞాన మహాసభలను ఒక్కొక్క గ్రామములో జరుపుచున్నారు. 1955 సంవత్సరమున కోలారు జిల్లాలో అగరం గ్రామంలో జరిగిన సభకు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామువారిని సబాధ్యక్షులుగా ఉండమని ఆజ్ఞాపించి, ప్రతీసంవత్సరము జరిగే సభలకు మీరేయుండాలని నిర్ణయించారు. శ్రీగురుదేవులయాజ్ఞ మేరకు వారి జీవితాంతము అధ్యక్షులుగా యుండి సభలన్నీ దివ్యంగా భవ్యంగా అద్భుతంగా నడిపించారు.

లోకములో ప్రతిమానవునికీ గీతాజ్ఞానము గలిగించాలని, వారందరూ సుఖశాంతులతో యుండాలని, మానవులు మానవధర్మాన్ని తెలుసుకోవాలని, ఈ జన్మలో జీవన్ముక్తులు గావాలని సంకల్పించి గీతాజ్ఞానయజ్ఞమనే పేరుతో ప్రవచనములు ప్రారంభించారు సద్గురు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు. ప్రథమ గీతాయజ్ఞము 1957 డిశంబరులో గుంటూరుజిల్లా నరసారావుపేటలో 3-12-1957నుండి 20-12-1957 వరకు అత్యద్భుతముగా విశేషప్రజానీకముతో జరిగినది. ఆ విధముగా108గీతా జ్ఞానయజ్ఞాలను జరిపిరి. ఒక్కొక్క జ్ఞానయజ్ఞములో లక్షలాది జనులు వినేవారు, విద్వాంసులు, వివిధ పండితులు, ఉన్నతోద్యోగులు, సామాన్యమానవులు, వ్యాపారస్థులు, వాహనములు నడిపేవారు, రిక్షాలునడిపేవారు, యువకులు, పిల్లలు., వృద్ధులు స్త్రీలు, పురుషులు - ఉపన్యాస ప్రారంభమునకు 15నిముషంలు ముందే వెళ్ళి కూర్చొనేవారు. వారి ప్రవచనలు అందరికి అర్థమయ్యేవి. అర్థముకాని శ్రోతలు లేనేలేరు. పామరజనులకును తెలిసేటట్లు ప్రవచనము గావించిన మేధాసంపన్నులు శ్రీసద్గురు స్వాములవారు. 108వ గీతాజ్ఞానయజ్ఞం సికింద్రాబాద్‌లో 13.5.82 నుండి1.6.82వరకు జరిగినది.

గీతా ప్రవచనాలతో ప్రజలలో జాగృతిని గలిగించి ఆ జాగృతి సదాయుండుటకు గాను, అందరికి అర్థమయిన విధముగా విస్తారముగా 'గీతామకరందము' అనే గ్రంథమును రచించి లోకమునకందజేసిన లోకోద్ధారకులే సద్గురు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు. ఈగ్రంథమును లక్షలాది జనులు చదువుచూ, సుఖశాంతుల నొందుచూ, ఆత్మజ్ఞానమును పొంది జీవన్ముక్తులై విరాజమానులై యున్నారు. అటువంటి దివ్యపురుషుని శతజయన్తి సందర్భంగా వారి దివ్యపాదారవిందములకు ఈ వ్యాసమనే పుష్పమును నమర్పించుకొనుచూ నమస్కారము చేయుచున్నాను.

ఋణస్థుడైనవాడు ఋణమును తీర్చవలయునని తలంపు గలిగియుండిన ఏలాగున క్రొత్తఋణము చేయక పాతఋణమును కొంచము కొంచముగా తీర్చుకొనుచు వచ్చినచో - క్రమముగా ఋణవిమోచనము కల్గునో, ఆలాగున సాధకుడు తన హృదయములో గల పాతవృత్తుల నొక్కక్కటిని రహిత మొనర్చుకొని క్రొత్త తలంపులను రానియ్యక దైవభావములలో సదా నిలుచుకొని వచ్చేలాగున మంచి ప్రయత్నము చేసికొని వచ్చినచో కొలదికాలములో మోక్షమును గలుగజేసికొనవచ్చును.

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

అష్టోత్తర శతక్రతు సోమయాజి శ్రీ విద్యాప్రకాశానందస్వామి

శ్రీ రామకృష్ణానంద స్వాములవారు,
శ్రీ భూమానందాశ్రమము (గండి)

(బ్రహ్మీభూత పూజ్యశ్రీ రామకృష్ణానందస్వాముల వారు జగమెరిగిన స్వామి, వారి జనప్రియ గీతోపన్యాసాలు ముముక్షువుల ఇంటింట వున్నాయి. వీరిని అపర శుకులంటారు అందరు. కడప జిల్లా పులివెందల తాలుకాలోని గండిక్షేత్రంలో వీరి ఆశ్రమం వుంది. భాగవతం వింటే వీరినుండే వినాలి. 108వ గీతా జ్ఞానయజ్ఞసంచికకు 1982 సం॥లో శ్రీవారు పంపిన వ్యాసం ఇది.)

శ్రీ విద్యాప్రకాశానందస్వాములవారొక అసామాన్య విభూతి. శ్రీమంతులు, శుచిమంతులు నైన కుటుంబంలో జన్మించిన యోగపురుషులు, ఆంగ్లభాషలో హిందీలో పట్టభద్రులు, నైష్ఠిక బ్రహ్మచారులు, వ్యాసాశ్రమ సంస్థాపకులగు శ్రీమలయాళస్వాములవారి శిష్యులు. శ్రీకాళహస్తి క్షేత్రంలో సువర్ణముఖీతీరంలో వీరి ఆశ్రమము. పేరు శ్రీ శుకబ్రహ్మాశ్రమం. వీరు కూడ సువర్ణముఖులే.

ఈ మాటలన్నీ అందరికీ తెలిసినవే. అయినా అనుకొంటే ఆనందం, పుణ్యస్మరణ, "ఉత్తమ శ్లోక గుణానుకీర్తనమ్".

అద్భుతమైన తమ వాగ్ధోరణితో వేలాదిజనులను పరవశులను చేస్తుంటారు. వీరి ఉపన్యాసాలలో సరస ఛలోక్తులు ధారాపాతం లాగా జారిజారి వస్తుంటాయి. ఆంధ్రభూమిలోనే గాక ఆంధ్రేతర భూప్రదేశాలలో కూడ వీరు గీతాజ్ఞాన యజ్ఞాలను జరిపినారు. నరుడు నారాయణునికి బోధించిన యోగవాసిష్ఠం పైనా, నారాయణుడు నరునికి బోధించిన గీతాశాస్త్రంపైనా వీరి ప్రసంగాలు జరుగుతుంటాయి. గీతామకరందము, వసిష్ఠగీత అనే బృహద్గ్రంథాలను రచించినారు.

శ్రీ మలయాళస్వాములవారి సన్నిధిలో శ్రీవ్యాసాశ్రమంలో గురుకులవాసం చేస్తూ "ఆనందమోహన్" అనే పేరుతో బ్రహ్మచారిగా వున్నప్పటినుంటి శ్రీవారిని నేనెరుగుదును. వారియెడ నాటినుండి పూజ్యభావం ఉంది. "పెద్దల బొడగన్న భృత్యుని కైవడి" అనే భాగవత భావం నాకు జన్మ సహజ సంస్కారం. అప్పుడప్పుడు వారిని సందర్శించి వారిచ్చిన ప్రసాదాన్ని ఆరగించిన సన్నివేశాలు నేటికీ జ్ఞప్తిలోకి వస్తాయి.

అఖిలాంధ్ర సాధుపరిషత్తుకి నేను అధ్యక్షుడుగా ఉన్నప్పుడు తెనాలిలో సాధుపరిషత్తు కార్యాలయాన్ని నిర్మాణం చేసన్తా సహాయం కొరకు(1976సం॥లో) వారిని అభ్యర్థించినాను. శ్రీవారు వెయ్యి నూట పదార్లు విరాళం పంపించినారు. నా కృతజ్ఞతలు ఈ అవకాశంలో నేను వెల్లడించు కొంటున్నాను. అస్తు.

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు నూటయేడు జ్ఞాన యజ్ఞాలను జరిపి ప్రస్తుతం నూట (1982సం॥)యెనిమిదవ జ్ఞానయజ్ఞం ఆంధ్రరాజధానిలో సికిందరాబాదులో చేస్తున్నారు. హైదరాబాదుకు భాగ్యనగరమనే పేరుంది. ఆ పేరును అక్షరాలా సార్థకం చేసుకొనే సౌభాగ్యం ఆ పట్టణానికి, ఆ పట్టణ ప్రజలకు ఈనాడు ఒదిగివచ్చింది.

"ఇహ చేదవేదీదథ సత్యమస్తి - నచేదిహావేదీ న్మహతీ వినష్టిః" అని కేనోపనిషత్తు పల్కింది. "మానవ జన్మంలో జ్ఞానలాభానికంటె మించిన లాభం లేదు, జ్ఞాననష్టానికి మించిన నష్టంలేదు" అని ఆ ఉపనిషద్వాక్యానికి అర్థం.

"యం లబ్ధ్వాచాపరం లాభం మన్యతే నాధికం తతః" అని గీతలో భగవద్వచనము. ఆత్మజ్ఞానమునకు మించిన లాభము మరొక్కటిలేదు. "నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే" - "జ్ఞానానికి మించిన పవిత్ర వస్తువు మరొక్కటిలేదు. (Only those persons become happy who believe in God) "దేవుని నమ్ముకొన్నవాళ్ళు మాత్రమే సుఖమును బొందుదు" రని పరమనాస్తికుడైన డాక్టరు జోడ్ తన అంతిమసమయంలో సందేశ మొసగినారు.

ఆహార నిద్రాభయమైథునాని సామాన్యమేతత్పశుభిర్నరాణామ్।
జ్ఞానం నరాణామధికం హి లోకే జ్ఞానేన హీనః పశుభిస్సమానః॥

అని నీతిశాస్త్రం చెప్పింది. ఆహార నిద్రా భయమైథునాలు పశువులకు, నరులకు సమానమే. మనుష్యులలోని విశేషము జ్ఞానంతోనే, జ్ఞానం లేకపోతే పశువుతో సమానం. పశువుకంటే నికృష్టమని కూడచెప్పాలి.

మీ వేదాంతం, మీ జ్ఞానం అన్నంపెట్టుందా? అని కొందరడుగుతారు. అన్నం పెట్టడంకాదు, అమృతం పోస్తుంది. సామాన్యమైన ఒక అమ్మను అడిగితే అన్నం పెట్టుంది. త్రాగగలిగే యోగ్యత ఉండాలి కాని వేదాంతం అమృతం పోస్తుంది. అయితే త్రాగేవాడు దేవతగా ఉండాలి. రాక్షసుడైతే త్రాగలేదు. కావుననే మహాభారతం శాంతిపర్వం (తిక్కన రచన) లో క్రింది విధంగా చెప్పబడింది.

తే॥గీ॥ సకలరత్నపూర్ణ సర్వవసుంధరా
చక్రదాన నిధియు సరియనంగ ।
రాదు-సర్వ వేదరాశిసారాధ్యాత్మ
విద్య యొసగుటకు, వివేకధుర్య ॥

అని అధ్యాత్మజ్ఞానదాన మహిమను గురించి శాంతనవుడు(భీష్ముడు) కుంతి పెద్దకొడుకుకు బోధించాడు.

"శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ - జ్ఞానయజ్ఞః" ద్రవ్య యజ్ఞాలకంటె, కర్మ యజ్ఞాలకంటె జ్ఞానయజ్ఞం శ్రేష్ఠమైంది. నదులు సముద్రంలో విలీనమైపోయినట్లు తక్కిన యజ్ఞాలన్నీ జ్ఞానయజ్ఞంలో విలీనమైపోతాయి. జీవజగత్తులను బ్రహ్మాగ్నిలో హెూమం చేయుటే జ్ఞానయజ్ఞం. అగ్నిలో హెూమం చేసినప్పుడు కట్టెలన్ని సమసి బూడిద అయిపోతాయి. జ్ఞానాగ్నిలో ఈ త్రిపుటి నశించి "అన్నం బ్రహ్మ అహం చ బ్రహ్మ భోక్తాచ బ్రహ్మ" అని సమస్తము బ్రహ్మత్వమును పొందిపోతుంది. ''అభేదదర్శనం జ్ఞానం'' కల్పిత నామరూపాలు బాధింపబడి జ్ఞానముతో అధిష్ఠాన బ్రహ్మమాత్రం శేషిస్తుంది.

భారతీయులు జ్ఞానప్రియులు. "భా" అనగా ప్రకాశం. ప్రకాశంలో రమించేవారు కాబట్టి భారతీయులనే పేరు వచ్చింది. అదియే ప్రకాశం? అన్ని ప్రకాశములను ప్రకాశింపజేస్తూ స్వయం ప్రకాశమై వెల్గే జ్ఞానప్రకాశం. "గీత యల్లిటనిదె?" అనే కన్నడ పుస్తకంలో జ్ఞానము యొక్క విలువను ఒక దృష్టిలో గుర్తింపజేస్తూ దృష్టాంతం ఒకటి చెప్పడం జరిగింది.

ఒక నగరం, ఒక పెద్ద ఫ్యాక్టరీ. వేలాదిమంది పనిచేస్తారు. ఉన్నట్టుండి యంత్రం ఆగి పోయింది. ఎవరేమి చేయలేక పోయారు. బొంబాయికి ఫోనుచేసి ఒక నిపుణున్ని పిలిపించారు. అతడు ఫ్యాక్టరీ అంత కలియచూశాడు. తనకు సంశయం కల్గినచోట సుత్తెతో గట్టిగా "ఫెడీమని" దెబ్బ కొట్టాడు. యంత్రం పనిచేయడం ప్రారంభించింది. పని పూర్తి అయింది.

"ఫీజు యెంతని" యజమాని అడిగాడు. "రాను పోను ఖర్చులు కాక వందరూపాయలు యిమ్మన్నాడు."

అన్యాయం. సుత్తెతో ఒక దెబ్బ కొట్టినందుకు మాఊరిలో పదిపైసాలిస్తే చాలు వంద రూపాయలా?

"మా ఊళ్లోనూ అంతే. దెబ్బకొట్టిందానికి పది పైసలే. కాని యెక్కడ కొట్టాలో తెలుసుకొన్న జ్ఞానానికి తొంభై తొమ్మిది రూపాయల తొంభైపైసలు."

పశువు బైట పెరిగితే గొప్ప, మనిషి లోపల పెరిగితే గొప్ప. జ్ఞానం పెరగాలె, వివేకం పెరగాలె. శ్రీ విద్యారణ్య స్వాములు తమ పంచదశిలో "యావద్విజ్ఞాన సామీప్యం తావచ్ఛ్రేష్ఠ్యం మనుష్యతః" - "ఎంతెంత విజ్ఞానం పెరిగితే మానవత్వం అంతంత పెరుగుతుంది" అని అన్నారు.

శ్రీ వ్యాసులవారు భారతసావిత్రిలో ఒకశ్లోకం చెప్పినారు.

శ్లోకస్థాని సహస్రాణి భయస్థాని శతాని చ ।
దివసేదివసే మూఢ మావిశంతి న పండితమ్ ॥

వేలకొలది శ్లోకాలు నూర్లకొలది భయాలు అజ్ఞానిని అడుగడుగునా ఆవరిస్తాయి. జ్ఞాని సమీపానికి పోలేవు. విషపురుగులు చీకటిలో తిరుగుతాయి. ప్రకాశంలో మూతి చూపవు.

భార్య కనపడకుండ పోయింది. ఒకాయన వెతుకుతున్నాడు, అందరిని అడుగుతున్నాడు. ఒక చెట్టుక్రింద ఒక సాధువు కూర్చొని ఉన్నాడు. "సాధువుగారు! నా భార్య అలిగిపోయింది. మీరేమైన చూచారా? అని అడిగాడు. ఆమె పేరు యేమి అని సాధువు అడిగాడు "సంకటం" అన్నాడు. "నీ పేరేమి" అని మళ్ళీ ప్రశ్న. "నా పేరు అజ్ఞాని".

"మహాశయా! వెతకనే పనిలేదు. నీ దగ్గరకే వస్తుంది. భారవి మహాకవి తన కావ్యంలో "అవివేకః పరమాపదాం పదమ్" అని వ్రాశారు. వివేకమే స్వర్గం, అవివేకమే నరకం.

ప్రభుత్వం దేశమును బాగుచేయాలంటుంది. సాధువులు సత్ పురుషులు ప్రజలను బాగుచేయాలంటారు. "సబ్ కో సన్మతి దే భగవాన్" మంచిమతి నిమ్మని మహాత్మాగాంధీ గారు ప్రార్థన చేసేవారు. మనిషిని బాగుచేయక దేశాన్ని యెంత బాగుచేసినా కోతులకు సంతర్పణచేసినట్లు చేసినవానికి శాంతి లేదు, చేయించుకొన్న వానికీ శాంతిలేదు.

"యజ్ఞాద్భవతి పర్జన్యః" అని గీతా సందేశం. "యజ్ఞముతో పర్జన్యుడు" - పర్జన్యుడంటే యిక్కడ కేవలం వాన అని మాత్రం అర్థం కాదు. దేవతా ప్రసాదమని వ్యాపకమైన అర్థం.

శ్రీ స్వాములవారు "శివాయ లోకస్య భవాయ భూతయే" అని భాగవతం చెప్పినట్లు జ్ఞానయజ్ఞ పరంపరలను "బహుజన హితాయ- బహుజన సుఖాయ" ఆచరిస్తున్నారు. ఆచరించబోతూన్నారు. ఇంతవరకు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు అష్టోత్తర శత (108)గీతాజ్ఞాన యజ్ఞములను సమాచరించి భగవత్కృపకు ప్రజాదరణకు పాత్రులైనారు.

జీవుడు నిత్యము (హంస) జప యజ్ఞము 21600 సహజంగా ఆచరిస్తున్నాడు. దానిలో అంశము 108. రాత్రింబగళ్లు జరిగే హంసజపం 21600. రాత్రిని వదలి వేస్తే 10800. దానిలో, దశాంశం 108.ఆ దృష్టితో 108కి ప్రాశస్త్యం వచ్చింది. విస్తరిస్తే యెంతైన అర్థంవుంది.

యజ్ఞానికి, యజ్ఞకర్తకు, యజ్ఞభోక్తకు నా భావ పుష్పాంజలులను సమర్పిస్తూన్నాను. స్వాములవారిజీవితము యజ్ఞమయము. వారు యజ్ఞేశ్వర స్వరూపులు. వారి యజ్ఞ ప్రసాదమును స్వీకరించి ఆరగించి ఆంధ్ర ప్రజలు ధన్యులగుదురు గాక! శ్రీవారిని నా యీ వాక్పుష్పాలతో పూజిస్తూ సెలవు తీసుకొంటున్నాను. "నమో మహద్భ్యః"

(సికింద్రాబాద్‌లో 1982 లో జరిగిన 108వ గీతాజ్ఞాన యజ్ఞానికి శ్రీరామకృష్ణానందస్వాముల వారు పంపిన సందేశం యిది. సం..)



నేను బ్రహ్మచారిగా ఉండుటకు వీరి సందర్శనమే కారణము

- శ్రీ వేణ్వానందగిరి స్వాములవారు

అధ్యక్షులు, శ్రీనివాసాశ్రమం, అగరం, కోలారు జిల్లా.

ఆర్యులారా! అభిన్న ఆత్మస్వరూపులారా! జీవులకు ఎనుబది నాల్గు లక్షల జన్మములలో మానవజన్మ దొరకడం చాల యరుదు. ఒకవేళ మానవుడుగా బుట్టినను మనుష్యత్వం ఉండడం దుర్లభం. "దుర్లభం త్రయమేవైతద్దైవానుగ్రహ హేతుకం, మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుష సంశ్రయః" మనుష్యధర్మము కలిగి యుండుట, మోక్షాపేక్షతోనుండుట, మహాపురుషుల ఆశ్రయము కలిగియుండుట చాల కష్టము. "ఈశ్వరానుగ్రహాదేవ పుంసామద్వైతవాసనా" భగవంతుని కృపలేని జీవులకు అద్వైతవేదాంతముయొక్క సంస్కారము కలుగదు". నా చిన్న తనమునుండి నా చిత్తము పరమాత్మ ప్రాప్తికై పరితపించేది. బాల్యమునందే దారి దెలిసి యుంటిని. పరమపూజ్యులగు మా నాన్నగారు నాపైదయ దలంచి వారే గురువై సోఽహం మంత్రమునుపదేశించిరి. భగవద్గీతను దినదినము కంఠోపాటము చేయించిరి. ముదియునూరు శ్రీసీతారామాశ్రమాధ్యక్షులగు శ్రీశ్రీశ్రీ రామబ్రహ్మేంద్ర స్వాములవారి దివ్యానుగ్రహముతో శ్రీశ్రీ సేగు కృష్ణదాసు గారి దివ్యప్రోత్సాహముతో వ్యాసాశ్రమము చేరితిని. పరమపూజ్యులు శ్రీశ్రీశ్రీ మలయాళ యతీంద్రులవారి సాన్నిధ్యమున గురుకుల లాభమునొందితిని.

అచ్చట పరమపావనముగా పంచవర్షములుండి గీర్వాణ భాషాభ్యాసముతో కాలము గడపుచుంటి. నివురుకప్పిన నిప్పువలె శ్రీవారి సన్నిధిలో బ్రహ్మచారినై స్వాధ్యాయమున నిమగ్నమైతిని. పావనముగా కాల ధర్మములను పవిత్రముగా పరమాత్మకు సమర్పించుచు పరమపూజ్యులు ప్రాతఃస్మరణీయులగు శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానంద యతిపుంగవుల సాహచర్యమున నిమేషముల వలె కాలము గడిపితిని. తదుపరి కళాశాలకు వెళ్ళి తిరుపతి క్షేత్రమున వర్ష చతుష్టయముండి సాహిత్యశిరోమణి పట్టభద్రుడనై ప్రొద్దటూరు శ్రీకృష్ణగీతాశ్రమమున వర్షత్రయముండి, అందలి గీర్వాణ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా నుంటివి. ప్రైవేటుగా ఆంధ్ర విద్వాన్ పరీక్షలలో నుత్తీర్ణతనొంది బెంగుళూరు శివాజినగరు శ్రీగీతా ప్రచారమండలియందుంటూ యచ్చటి కార్పోరేషన్ మహోన్నత హైస్కూల్‌లో ఆంధ్రోపన్యాసకునిగా నుంటిని. ఆపదవి నుండి విశ్రాన్తినొంది స్వేచ్ఛగా వేదాంతోపన్యాసకునిగా నుంటూ చాతుర్మాస్యాలు చేయుచు ధైర్యముగా బదరికాశ్రమం, పుణ్య ఉత్తరకాశి, బృందావనం, చిత్రకూట నైమిశారణ్యాది పుణ్యస్థలములలో చాతుర్మాస్య కార్యక్రమాలను నిర్వహించుచు నాటినుండి నేటి వరకు శాస్త్ర పద్ధతి ప్రకారము సంన్యాస లక్షణములతో కాలము గడపుచుంటిని. కాని 1986 సం॥లో దేహమే నిలచుటలేని పరిస్థితి ఏర్పడెను. ఎటుతిరిగి దేహము రాలుతుందని దెలిసి

సంన్యాసము తీసికోవలెనని తీవ్రకోరికలేర్పడగా శ్రీస్వాములవారు విద్యాప్రకాశానందజీ మహరాజు నాదృష్టికి గోచరించిరి. ఈ పుణ్యమూర్తి అంత వరకెవరికీ సన్న్యాసమిచ్చి యుండలేదు. కాని ప్రయత్నపడిచూడాలని అనిపించినది. నేనే స్వయంగా వెళ్లిప్రార్థించగా అంగీకరించి మహాశివరాత్రి సమయమున బెంగళూరికి వచ్చి సంన్యాస దీక్షను నొసంగిరి. వారికి నేనేమిచ్చినను ఋణము తీరదు. దయామూర్తి నా యభిలాషను పూర్తిజేసిరి.

నేను బ్రహ్మచారిగానే యుండుటకు వ్యాసాశ్రమమున వీరి సందర్శనము కారణము. శుద్ధమూర్తిని సేవించుభాగ్యము నాకబ్బినది. ధన్యోఽస్మి, కృత కృత్యోఽస్మి. నాకన్ని విధములుగా ప్రతిమాసపు వేదాంతభేరిని పంపుచు ప్రోత్సహించిన శ్రీవిద్యాస్వరూపానందగిరి గారికి నేను చిరఋణిని. పూర్వజన్మ కృత పుణ్య విశేషము వలననే ఇట్టి సందర్భమేర్పడుచున్నది.

ఈ పుణ్యమూర్తి(శ్రీవిద్యాప్రకాశానంద) నిత్య సంతోషి, వైరాగ్యము యొక్కపెన్నిధి, నేను కార్య నిర్వహణ భారమున్నందున దూరదూరముగానున్నను వీరి చరణ రేణువులను సంస్మరించుచు మానసికముగా నెడత్రెంపు లేని వాడనే. వ్యాసమహర్షులపై కడుభక్తి ప్రపత్తులు గలిగిన శ్రీ మలయాళ యతీంద్రులవారి ఆశ్రమమునకే వ్యాసాశ్రమ మనిపేరుంచుట శ్రీవారి చరణకమలము నాశ్రయించిన ఆనందమోహనుల వారు శుకబ్రహ్మాశ్రమమని నామకరణముంచుట యెంతయు యోగ్యముగా నున్నది. ఆనాటి వ్యాస శుకాశ్రమములను తిలకించెడి భాగ్యములేకున్నను ఈనాడు ఈ కలియుగమున, ధర్మదేవత ఒంటి కాలితో నిలబడిన కలియుగమున వీరు ధర్మమే నలుపాదములతో సంచరించునటుల ధర్మావతారమూర్తులై విరాజిల్లుట యెంతయు యోగ్యముగానున్నది.

పావనమైన సువర్ణముఖీనదీ తీరమున ప్రసిద్ధమగు కాళహస్తి క్షేత్రమున-బంగారునందు రతనములను పొదిగి నటుల-ఆశ్రమ నిర్మాణ మొనర్చిన పరమపూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందజీ మహారాజువారు మనందరికి ఆరాధ్య దేవతగా నిలబడివారు. ఈ పుణ్యమూర్తి శతజయంతి మహోత్సవ కార్యక్రమాలను నిర్వర్తించుకొను చుండుట ఎంతయో ముదావహము. మానవులు అదృష్టవంతులు, తమతమ కాలమును కడుజాగ్రతగా ఆత్మచింతనచేత సార్థక పరచుకొనవలెను.

'మానవజన్మ దొడ్డదో మాడలుచేడి. హుచ్చుప్పురు' యనుచు పురందరదాసుగారు నుడివినారు. 'ఇహచేదవేదీ దథసత్యమస్తి నహిచేదిహావేదీన్మహతా వినష్టిః' యనుచు శ్రుతి భగవతి నుడువుచున్నది. ప్రపంచమున భగవంతుడు ప్రసాదించిన ఈ మానవత్వమును పరమేశ్వరుని సేవకే వినియోగించిన సార్థకమగును. అట్టి సద్బుద్ధిని పరమేశ్వరుడు అనుగ్రహించును గాక! 'తద్బ్రహ్మానందమద్వంద్వం నిర్గుణం నవ్యచిద్ఘనంవిజిత్వాస్వాత్మనో రూపం న బిభేతి కుతశ్చన' సచ్చిదానంద పరమాత్మనే తన స్వరూపంగా దెలిసినవాడు దేనికిని భయపడడు. అట్టి దృఢాపరోక్షజ్ఞానమును సంపాదించిన పుణ్యపురుషుడు దేనికి భయపడడు **'సేవ్యే స్వపరస్పదాత సురేనారాయణే తిష్ఠతి'** తనను ఆత్మ గమనించిన వానికి తన స్వరూపమే నొసంగునట్టి నారాయణుడుండగ తక్కిన వారిని యాచించదుగదా. ఆ నిజస్వరూపమును దెలిసి సుఖించవలెను

ఓం తత్సత్

తారణోపాయము

– శ్రీమాతా త్యాగీశానందపురి

ఒక్కొక్క దేశానికి ఒక్కొక్క ప్రత్యేకత ఉంటుంది. అదేవిధంగా ఒక్కొక్క వ్యక్తికి ఒక్కొక్క వ్యక్తిత్వం ఉంటుంది. ముఖ్యంగా మన భారతదేశానికి వెన్నెముక వంటిది ఆధ్యాత్మికత. ఆ యాధ్యాత్మికతయే భారతదేశానికి పట్టుగొమ్మ.

ప్రపంచంలో కొన్ని భోగదేశాలు, మరికొన్ని యోగదేశాలు. మనది యోగదేశం. భక్తిజ్ఞాన సమన్వయం సాధించినది మన దేశమే. మత సామరస్యాన్ని ప్రబోధించినది మనదేశమే. మహాత్ములను పుట్టించినది మన దేశమే. మన భారతీయ విజ్ఞాన విశిష్టతను దేశదేశముల ప్రచార మొనర్చుటకు ఆ మహాపురుషులను పంపించినది మన దేశమే. వారు శ్రోత్రియులై, బ్రహ్మనిష్ఠులై, ఆధ్యాత్మికవారధులై, ధీవిశాలులై, ప్రపంచమంతట పర్యటించి నీతి నియమాలను, సాంఘిక కట్టుబాట్లను, ధర్మసూక్ష్మములను, భగవద్విశ్వాస మును, మానవజీవిత రహస్యములను బోధించారు. దానవుని మానవునిగా, మానవుని మహాత్మునిగా చేయుటకు వలయు సాధనా విధానముల నెన్నో అనుగ్రహించారు. అంతియగాక ఏఏ వయస్సులో, ఏఏ సందర్భములలో, ఎప్పుడు, ఎక్కడినుండి ఏఏ సాధనలు ప్రారంభించాలో కూడ సూచించి, మానవాళికి ఆదర్శనీయులై, పూజ్యులై, వందనీయులై ప్రకాశించారనడంలో అతిశయోక్తి లేదు.

కాని యీనాడు మనదేశం ఎటువంటి క్లిష్ట పరిస్థితులలో ఉన్నదో అందరికి తెలుసు. సంక్షోభం ఉపన్యాసాలవలన, సమావేశాల వలన, తీర్మానముల వలన నివారింపబడదు. ఈ బాధ ప్రతివ్యక్తికి సంబంధించినది. అందువలన ప్రతి వ్యక్తి ధర్మాన్ని ప్రాణంగా భావించాలి. అధర్మప్రవర్తననుండి దూరం కావాలి. నీతి నిజాయితీలతో జీవించాలి. భగవంతుని యందు పరిపూర్ణవిశ్వాసం ఉండాలి. ప్రతివ్యక్తి 'ఇది నా బాధ్యత' అని గుర్తించాలి, ఆచరించాలి. అప్పుడు సంఘాన్ని ఎవరూ బాగు చేయవలసిన అవసరం ఉండదు. వ్యక్తులు గదా సంఘం! ప్రతివ్యక్తి బాగుపడినప్పుడు సంఘ సంస్కరణ ఎందుకు? దీనినే మనం గుర్తించి, సంఘబాధకులం కాకుండా ప్రవర్తించటం నేర్చుకోవాలి. ఇది ఎప్పుడో!

మానవ జీవితాధర్మాన్ని ఎన్నడూ మరువరాదు. జీవితాదర్శం భక్తి. గమ్యం ముక్తి. ఆ భక్తిముక్తులకై మనిషి ముముక్షువు కావాలి. అప్పుడు యీ లౌకికజీవిత పరంపరనధిగమించటానికి సాధన ప్రారంభం చేయాలి. సాధన లేకున్న జీవిత పరమావధిని చేరుకోలేదు.

లౌకిక జీవిత పరంపర సామాన్య మానవుడిది. ఆధ్యాత్మిక జీవిత పరంపర మోక్షకాముకునిది.

లౌకిక పరంపర జన్మమరణములకు ఆలవాలమై, సుఖదుఃఖాలకు నిలయమై, పుణ్యపాపముల కాశ్రయమై, కామాద్యరిషడ్వర్గమునకు వశమై, స్వార్థ భూయిష్టమై ఉంటుంది. దీనినుండి బయటపడటానికి ఆచరించవలసినవి వేదమాత కొన్నింటిని తెలియజేసింది. 'మాతృదేవో భవ', పితృదేవో భవ', 'అతిథిదేవో భవ' అను వీటిని నిత్యం

ఆచరించమన్నది. 'మాతృదేవో భవ' అను మాతృభక్తి ద్వారా పవిత్రతను, 'పితృదేవో భవ' అను పితృభక్తిద్వారా మనోవికాసాన్ని , 'అతిథి దేవో భవ' అను అతిథిభక్తి ద్వారా వినయవిధేయతలను సంపాదించుకోవాలి. ఇవి సక్రమంగా ఆచరిస్తే ఆధ్యాత్మిక జీవిత వికాసానికి పునాది వేసినట్లే. కాని నేడు యీ మూడూ లోపించాయి.

తల్లిదండ్రుల అవసరం తీరిన తర్వాత వారి అవసరంలేదని వృద్ధాశ్రమంలో చేరుస్తున్న సంతానానికి మాతృపితృభక్తుల విలువ ఏమి తెలుస్తుంది? అతిథులను అసలు రానివ్వటమే లేదు. ఇక వివేకవైరాగ్యములకు గాని, భక్తిశ్రద్ధలకు గాని, పుస్తకపఠనమునకు గాని, శ్రవణ మననాదులకుగాని తీరిక ఎక్కడిది? ఈ సంసారం నుండి బయటకు రావాలనే తపన ఏది?.

ఆ తపనే ముముక్షుత్వం. ఆ ముముక్షువుకు మాత్రమే 'ఆచార్యదేవో భవ' అను సూక్తి అర్థం అవుతుంది. 'ఆశ్రమీ ధ్యాననిష్ఠశ్చ మంత్ర తంత్రవిశారదః।' నిగ్రహానుగ్రహేశక్తో గురురిత్యభిధీయతే॥ ఆశ్రమియై, ధ్యాననిష్ఠుడై యున్నవాడు, మంత్ర తంత్ర రహస్యముల చక్కగా గ్రహించినవాడు, నిగ్రహానుగ్రహసమర్థుడు అయినవాడే గురువు అని తంత్రసార గ్రంథ ప్రబోధము, మరియు 'అత్రినేత్రః శివస్సాక్షాత్ ద్విబాహుశ్చ హరిస్స్మృతః। అచతుర్వదనో బ్రహ్మ......॥' మూడవ కన్నులేని శివుడు, రెండు హస్తములే గల విష్ణువు, నాలుగు ముఖాలు లేని బ్రహ్మ అని గురువును గురించి గురుగీతా వచనము. 'సర్వం గురుముఖాల్లబ్ధం' సకలము గురుముఖతః లభించునను దృఢవిశ్వాసము చాలా ముఖ్యము. తీవ్రమోక్షకాంక్షతో గురు సన్నిధిని చేరి, బ్రహ్మచారియై, వేదాధ్యయన శీలుడై, నియమపాలకుడై, వైరాగ్యయుతుడై, ఉత్తమ సాధకుడై, సత్ప్రవర్తనతో గుర్వనుగ్రహమును పొందుటకు ప్రయత్నించాలి. గురు కృపాకటాక్ష వీక్షణలకై నిరీక్షించాలి. ఆపై భగవదనుగ్రహం, గురుదేవుని ఆశీర్వాదబలం, స్వయంకృషి అను త్రయముతో పునీతుడై, దివ్యశక్తి సంపన్నుడై, లోకాదర్శ మూర్తియై, విరాజిల్లగలడు. అప్పుడే ఆధ్యాత్మిక గురుపరంపరా వాహినిలో ముత్యమై ప్రకాశిస్తాడు. జగద్వంద్యులు గురువులైతే శిష్యులు రత్నాలుగా రాణిస్తారు.

ప్రతిదినమును ఏలాగున వ్యాపారమందు నిపుణత గలవాడు రాత్రి దుకాణమును మూయునప్పుడు ఆదాయవ్యయములను చూచుచుండునో, అలాగున సాధకుడు ప్రతిదినమును రాత్రి పండుకొనుటకు ముందుగా తనయొక్క దినచర్యము వ్రాయుచు రావలయును. మరల సదా దైవభావములో నిలుచుకొని యే పనియైన చేయుచు దైవభావమును మరచిపోయెడు సమయమును గూడ ప్రతి దినమును కనిపెట్టి అదిన్ని డైరిలీ వ్రాయవలయును. ఇట్లుండు వారు తప్పక త్వరలో దుఃఖములనన్నిటిని తొలగించుకొని మంచి బ్రహ్మనిష్ఠగలవారగుదురు. సాధనలన్నిటిలోను ఇది శ్రేష్ఠమైనది. అయితే యీ దినచర్యలో ఆత్మవంచకమైన పని చేయరాదు, ఆదాయ వ్యయములను లెక్కచూడని వ్యాపారి యేలాగున దివాలైపోవునో అలాగున మనోవృత్తులను పరిశీలింపని సాధకుని కపాయము గల్గవచ్చును.

– శ్రీ సద్గురు మళయాళ స్వాములవారు

ఓం నమో భగవతే శ్రీసత్యానందాయ

త్రాగండి త్రాగండి గీతామకరందం

శ్రీ బ్రహ్మానందతీర్థ స్వాములవారు
శ్రీసత్యానందాశ్రమ వరిష్ఠ పీఠాధిపతులు
శ్రీసత్యానందాశ్రమము, (ఇనమడుగు),

బ్రహ్మీభూతులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి శతజయంతి ఉత్సవ కమిటీవారి కోరిక మేరకు ఈ నాలుగు మాటలు వ్రాసి పంపుచున్నాను.

మీరు ప్రేమతో వ్రాసిన జాబు చేరింది. శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారి శతజయంత్యుత్సవములు జరుపుకొనుట చాల ముదావహము.

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు మన ఆంధ్రదేశములో ఇరవైయవ శతాబ్దపు శ్రీమద్భగవద్గీతా ప్రచారకులలో పేరెన్నికగన్నవారలలో ప్రముఖులు.

భగవంతుడు భగవద్గీత ఆరవ అధ్యాయములో చెప్పినట్లు గొప్ప సాధకులై చివర కొంతసాధన మిగిలిపోయిందేమో! శ్రీవారు ఈ జన్మలో తపస్సు చేసి ఆత్మసిద్ధిని పొంది అఖండ ఆధ్యాత్మిక ప్రచారమును గావించినారు. శుచిమంతులైన, శ్రీ మంతులైన గృహమునందు శ్రీ స్వాములవారు 1914వ సంవత్సరము ఏప్రిల్ 13వ తేది అనురాధా నక్షత్రము ప్రథమ పాదమున ఉదయము 8 గంటలకు జన్మించినారు. వీరి తలిదండ్రులు ఆధ్యాత్మిక సాధనలు చేసికొనుచుండు గొప్ప సాధకులు. అది ఆనందనామ సంవత్సరము కనుక "ఆనందమోహన్" అని నామకరణము చేసిరి. ఆనందమోహన్ చిన్ననాటినుండి బుద్ధికుశలత కలిగిన విద్యార్థి. ప్రతితరగతి యందును ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులగుచు బి.ఎ పట్టభద్రులైనారు. కాశీవిద్యాపీఠములో హిందీ కోవిదలో కూడ ప్రథమశ్రేణి యందు ఉత్తీర్ణులైరి. ఆ పిమ్మట "తమ జీవితము ఎట్లు గడుపవలయు" నను తలంపుతో ఋషీకేశమునందు గంగాతీరమున కూర్చుండి ఆలోచించు చుండగా ఒక భగవద్గీతా గ్రంథము ఆ గంగాప్రవాహమునందు వచ్చి ఆనందమోహన్ గారి చెంత ఆగినది. దానిని తీసికొని కళ్ళ కద్దుకొని తన జీవితము యొక్క లక్ష్యము భగవంతుడు నిర్ణయించినాడని గ్రహించి ఆంధ్ర దేశమునకు వచ్చి సద్గురు మహర్షి శ్రీమలయాళస్వాముల వారిని ఆశ్రయించి వారి సన్నిధిలో తపస్సుగావించి ఒక సంవత్సరము పాటు పూర్తి మౌనమును పాటించినారు. పిమ్మట 3-7-1947 శ్రీమలయాళస్వాములవారి పవిత్ర హస్తములతో యత్యాశ్రమమును స్వీకరించినారు. "విద్యాప్రకాశానందగిరి" అను యోగపట్టాను పొందినారు.

అటుపిమ్మట 1950 సంవత్సరము జనవరి 20వ తేదీన బ్రాహ్మీముహూర్తమున 4-30 గంటలకు శివమహాక్షేత్రమైన శ్రీకాళహస్తిలో సువర్ణముఖీనది తీరమున శ్రీ మలయాళస్వాములవారి పవిత్ర హస్తములచే "శ్రీశుకబ్రహ్మాశ్రమము"నకు ప్రారంభోత్సవం గావించినారు. అప్పటికే-ప్రస్తుత పీఠాధిపతులైన పూజ్య శ్రీవిద్యా

స్వరూపానందగిరి స్వాములవారు-బ్రహ్మచారి గోపాల్‌గా శ్రీస్వాములవారివద్ద ఉండి సేవలు చేయుచుండిరి.

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు తమ జీవితలక్ష్యమైన అఖండ గీతాప్రచారమును గంటూరు జిల్లా నుండి ప్రారంభించిరి. గీతయందు 18 అధ్యాయములు ఉన్నవి కాన ఒక్కొక్క దినము ఒక్కొక్క అధ్యాయము చొప్పున 18 దినములు ప్రవచనములు గావించుచు ప్రతి ప్రముఖనగరమునందు గీతాయజ్ఞములను 108 గావించిరి.

తేటతెలుగులో భగవద్గీతకు అర్థ తాత్పర్యములను తనదైన శైలిలో వ్యాఖ్యానమును వ్రాసి "గీతా మకరందము" అని నామకరణ మిడిరి. అది అచ్చై ప్రజలలోకి వెళ్ళి బహుళ ప్రచారమును పొందినది. లక్షలాది ప్రతులు భక్తుల చేతుల అలంకరించినది. ఈ గ్రంథము తెలుగునందే గాక ఆంగ్లము, కన్నడము, హిందీ, తమిళమునందు కూడా అనువదింపబడి దేశ విదేశములయందు విహరించినది. శ్రీ స్వామివారు మన ఆంధ్రదేశమునందేగాక ఇతర రాష్ట్రములయందు కూడా బహుముఖముల ప్రచారము గావించినారు.

శ్రీ స్వామివారు సామాజిక సేవయందు కూడ ఇతోధికముగా కృషిగావించినారు. మానవసేవయే మాధవసేవయను సూక్తిని ఆచరణయందుంచుచు శరీరమునందలి అవయవములలో ప్రధానమైన నేత్రమునకు చికిత్సానిమిత్తము "భక్త కన్నప్ప నేత్ర చికిత్సాలయము" ను నెలకొల్పినారు. గ్రామగ్రామములలో ఆ చికిత్స గురించి ప్రతినెల క్రమము తప్పక శిబిరాలు జరుపబడుచున్నవి.

శ్రీవారు తమ అంతేవాసిగా ఉన్న శ్రీబ్రహ్మచారి గోపాల్‌గారికి తురీయాశ్రమమును ప్రసాదించి "శ్రీవిద్యాస్వరూపానందగిరి" అను యోగపట్టాను ప్రసాదించి తన తదనంతరము శ్రీశుకబ్రహ్మాశ్రమమునకు పీఠాధిపతిగా నియమించి ఆశీర్వదించిరి. ఆశ్రమము బహుముఖముల అభివృద్ధి చెందుచున్నది. గోమాతలు కూడా పోషింపబడు చున్నవి. శ్రీ స్వాములవారు 1998 ఏప్రిల్ 10వ తేది అనంతపరబ్రహ్మమునందు ఐక్యమైనారు.

శ్లో॥ శ్రీవిద్యాప్రకాశ నామానం వేదవేదాంత కోవిదమ్ ।
గీతా తత్త్వప్రబోద్ధారం సద్గురుం ప్రణతోస్మ్యహమ్ ॥

ఓం శాంతిః శాంతిః శాంతిః హరిః ఓమ్ తత్ సత్.

జీవుడా మేలుకో!!

పరోపకారమే, భగవత్సేవయే జీవుని ఔన్నత్యమునకు కారణములు. సేవ, ఉపకారము, నిష్కామకర్మ, భగవద్భక్తి ఇవి మనుజుని మహాత్మునిగ ఒనర్చుచున్నవి. ప్రకృతినుండి మానవుడు సేవాగుణమును అలవరచుకొనవలెను. నదులు, చెఱువులు జనులకు త్రాగుటకు జలమొసంగుటయే కాక, సస్యపోషణ గావించి ధాన్యము నొసంగుచున్నవి. వృక్షములు ఫలములను, చల్లని నీడను ఒసంగుచు ప్రాణికోటికి మహోపకారమొనర్చుచున్నవి. కనుక జనులు వివేకవంతులై తోటి ప్రాణులకు సహాయము, సేవ చేయుచు ఆత్మోన్నతికి, సమాజశ్రేయస్సుకు పాటు పడవలెను. ఆకలిగొన్నవారికి ఆహారము, దిగంబరులకు, దీనులకు వస్త్రములను, బీదలకు అనాథలకు ధనములు, అజ్ఞానులకు జ్ఞానమును ఒసంగి వారికి సహాయపడుటయే విజ్ఞుని కర్తవ్యము. తన శక్తికొలది పరులకు శ్రేయమొనర్చుచు మానవుడు మహాత్ముడై పరగవలెను.

కాబట్టి ఓ జీవుడా! వ్యామోహనిద్ర నుండి, అజ్ఞాననిద్ర నుండి మేలుకో! నీ కర్తవ్యమేమిటో గుర్తెరుగు. స్వార్థబుద్ధిని వదలిపెట్టు. తోటివారికి సహాయపడు. జడములగు నదులు, చెఱువులు, తటాకములు, వృక్షములు మానవకోటికి ఎంతయో ఉపకారము చేయుచుండగా, చైతన్యస్వరూపుడవగు నీవేల స్తబ్ధముగ, ఉదాసీనముగ ఉన్నావు? భగవత్స్వరూపులే, ఆత్మస్వరూపులే యగు ప్రాణికోట్లకు సేవచేయి. తోటి జనుల ఔన్నత్యమునకు కృషిసలుపు. దైవభక్తిని, సద్గురుభక్తిని, అలవరచుకో. గురూపదేశమార్గమున పయనించు. తత్త్వసారము గ్రహించు. మానవసేవ, మహాత్ములసేవ, దైవధ్యానము సలిపి స్వాత్మదర్శనము నొందు. జన్మను ధనమొనర్చుకో. -- **శ్రీ స్వామి విద్యాప్రకాశానంద.**



పూజ్యశ్రీస్వామివారితో నాకు గల పరిచయము

- శ్రీస్వామి హంసానంద
(శ్రీశివానందాశ్రమము, ఋషీకేశ్)

అవి నేను శ్రీవ్యాసాశ్రమునందంతేవాసిగా నుంటున్న రోజులు. ఆ సమయమునందు బ్రహ్మచారి శ్రీగోపాల్‌గారు (పూజ్య శ్రీవిద్యాస్వరూపానంద స్వాములవారు) శ్రీ శుకబ్రహ్మాశ్రమమునకు సంబంధించిన ఆంతరిక మఱియు బాహ్యకార్య నిర్వహణాధికారిగా నుండిరి. ఒకరోజు పూజ్య శ్రీవిద్యాప్రకాశానందస్వాములవారు ప్రప్రథమముగా గీతాజ్ఞానయజ్ఞమును నిర్వహించుటకు పూర్వము-తన గురుదేవులైన శ్రీ సద్గురు మలయాళ స్వాములవారి ఆశీస్సులను పొందుటకై శ్రీ శుకబ్రహ్మాశ్రమము నుండి శ్రీవ్యాసాశ్రమమునకేతెంచిరి. అప్పుడు శ్రీస్వాముల వారొక కరపత్రమును శ్రీవారి చేతికందించిరి. దానిలో నేను "శ్రీవిద్యాప్రకాశానంద మహారాజ్" అని చదువుచుండగా శ్రీవారు "మహరాజ్" అను పదము సన్న్యాసులకు తగినది కాదని శ్రీస్వాములవారిని హెచ్చరించిరి.

గురుదేవులు తమ శిష్యులనుద్ధరించుటకై ద్వంద్వార్థము నొసంగునట్లు మాట్లాడుచుందురు. ఈ ప్రత్యేక విషయమునందు "మహరాజ్" అనుపదముచే సన్న్యాసులకు గర్వము, అహంకారము పెరుగునని శ్రీవారి భావము. కావున తన శిష్యునికి గర్వాహంకారములు రాకుండుటకై పై విధముగా హెచ్చరించిరి. ఇక రెండవభావ మేమనగా- "మహరాజ్" అనుపదము "సన్న్యాసి" విషయములో మిక్కిలి స్వల్పమైన పదము. కారణమేమనగా- నిజమైన సన్న్యాసి బ్రహ్మవేత్తతో సమానమైయుండును. నిజమైన సన్న్యాసి దేవేంద్రుని కంటెను గొప్పవాడు. "మహరాజ్" అనుపదము లౌకికార్థము నొసంగును. కావున "ఓ విద్యాప్రకాశానంద స్వామి! నీవు బ్రహ్మవేత్తవు. కావున బ్రహ్మవిద్యాప్రకాశమును, లేక ఆత్మవిద్యాప్రకాశమును విస్తరింపచేయుమని" శ్రీవారు తమ శిష్యోత్తముని హెచ్చరించిరి. తదనుగుణముగనే పూజ్యశ్రీవిద్యాప్రకాశానందస్వాములవారు గర్వాహంకార రహితులై 108గీతా జ్ఞానయజ్ఞములను నిర్వహించి బ్రహ్మవిద్యాప్రకాశమును భారతావని యందంతటను శోభాయమానముగా విస్తరింపజేసిరి.

పూవు పుట్టగనే పరిమళించు నన్నట్లు పూజ్యశ్రీ విద్యాప్రకాశానందస్వాము వారు తమ ఉన్నతవిద్య పూర్తికాగానే మహర్షి మలయాళ స్వాములవారి చరణ కమలముల నాశ్రయించి శ్రీవ్యాసాశ్రమమునందు తమ యందంతర్నిహితమై యున్న విద్యను ప్రకాశింపజేసిరి. దీనికి చిహ్నముగా వారు "యోగవాసిష్ఠము"లోని సంస్కృత శ్లోకములను తెలుగు భాషయందనువదించి శ్రీవారి మన్ననల నందుకొనిరి. తదనంతరము"యోగవాసిష్ఠము" 4 వాల్యుములను శ్రీ వ్యాసాశ్రమము ప్రచురించిన విషయము పాఠకులకు సువిదితమే. శ్రీవేదవ్యాసులవారి కుమారుడు శుకయోగి. ఈ స్ఫూర్తి నందగాగొని, పూజ్యశ్రీ విద్యా ప్రకాశానంద స్వాములవారు శ్రీ కాళహస్తికి సమీపమునందు శ్రీ శుకబ్రహ్మాశ్రమమును స్థాపించిరి. ఒకరోజు శ్రీ సద్గురు మలయాళ స్వాములవారు-మరికొందఱు సాధువులతో పాటు సాధు శ్రీహరి (స్వామిహంసానంద) ని శ్రీశుకబ్రహ్మాశ్రమమునకు వార్షికోత్సవ సందర్భముగా పంపించిరి. అప్పుడు పూజ్యశ్రీవిద్యాప్రకాశానందస్వామివారి గీతా ప్రవచనమును ప్రప్రథమముగా శ్రవణము చేయుట సంభవించెను. శ్రీ శుకబ్రహ్మాశ్రమముయొక్క ప్రశాంతవాతావరణము నాకెంతయో హృదయాహ్లాదము నొసంగెను.

నేను 1965లో ఋషీకేశ్‌లోని శ్రీశివానందాశ్రమము నందు చేరుట సంభవించెను. ఆ సమయమునందు బ్రహ్మచారి శ్రీగోపాల్‌గారు (పూజ్యశ్రీవిద్యాస్వరూపానంద స్వాములవారు) శ్రీ శివానందాశ్రమమున కెదురుగానున్న "పరమార్థనికేతన్" లో కొన్ని సంవత్సరములు సంస్కృతములో శ్రుతి స్మృతుల నభ్యసించిన తదనంతరము ఆంధ్రప్రదేశ్‌కు వెళ్ళి-బ్రహ్మవిద్యాస్వరూపులుగను, శ్రీ శుకబ్రహ్మాశ్రమమునకు పీఠాధిపతిగను ప్రస్తుతము ప్రకాశించుచున్నారు. "బహ్మవిద్ బ్రహ్మైవ భవతి" అనునట్లు బ్రహ్మనిష్ఠులైన గురువుల నాశ్రయించినప్పుడు బ్రహ్మవిద్యయే తన జీవితమునకు ఆస్తియగును. "విద్యాతపోభ్యాం పూతాత్మా" యనునది మహర్షి మలయాళ స్వాములవారి ప్రముఖవాక్యము. తదనుగుణముగా విద్యచేతను, తపస్సు చేతను పవిత్రాత్ములై పూజ్య శ్రీవిద్యాప్రకాశానంద స్వాములవారు ప్రకాశించిరి. ప్రస్తుతము వారి స్థానమునందు పూజ్య శ్రీవిద్యాస్వరూపానంద స్వాములవారు ప్రకాశించుచున్నారు.

నేను పూజ్యపాద కృష్ణానంద స్వాముల (దివ్యజీవన సంఘప్రధాన కార్యదర్శి) వారి ఆదేశాను సారముగా 1970 సంవత్సరము నుండి శ్రీ శివానందాశ్రమమునకు సంబంధించిన పోస్టాఫీసులో సేవచేయుచున్నాను. ఒకరోజు పూజ్య శ్రీవిద్యాప్రకాశానందస్వాములవారు తెలుగులో వ్రాసిన "గీతా మకరందము" అనుగ్రంథము ఆంగ్లభాషయందను వదింపబడినదను విషయమును తెలుసుకొని, పూజ్యపాద శ్రీకృష్ణానందస్వాములవారు తమకొక గ్రంథము కావలెనని నాకు చెప్పిరి. నేను శుకబ్రహ్మాశ్రమమునకు వ్రాయగా పూజ్యశ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారు ఉచితముగా ఆగ్రంథము నంపించిరి. దానిని పూజ్యపాద కృష్ణానంద స్వాముల వారికివ్వగా దానిని వారు పఠించి మిక్కిలి ముదమునొందిరి. గీతా మకరంద గ్రంథపఠనము-మధువు (తేనె)ను త్రాగుట వంటిది. "మాండూక్యమేవాలం ముముక్షూణాం విముక్తయే" అన్నట్లు నేటికాలములో "గీతామకరందమేవాలం ముముక్షూణాం విముక్తయే" యని చెప్పవచ్చును. ఇట్టి అత్యుత్తమ గ్రంథరచన గావించిన పూజ్య శ్రీ స్వామివారికి జోహార్లు.

ఇక విద్యాగంధములేని పామరజనుల నుద్ధరించుట కూడా అత్యావశ్యకమని పూజ్యశ్రీవిద్యాప్రకాశానంద స్వామివారికి తోచెను. ఈ కారణముచే నిరక్షరకుక్షుల కొరకు "జీవుడా! మేలుకో" వంటి పాటలను పాడి ప్రజలకు వినిపించిరి. ఇటువంటి పాటలకు శ్రీస్వామివారు "తత్త్వసారము" అనునామము నొసంగిరి. ఈ తత్త్వసారమును తెలిసికొనుటకై సద్గురునిచెంత వసింప వలయునని హెచ్చరించిరి. అప్పుడే ఈ జగత్తు యొక్క సారమైన సత్యవస్తువు తెలియబడునని తెలిపిరి. దీనిని తెలిసికొనుటచే లాభము కలుగునని మందలించిరి. ఈ లాభము ప్రాపంచిక లాభము కాదు, కాని ఇది పారమార్థిక లాభము. ఐతే ప్రాపంచిక లాభముచే పారమార్థిక లాభము పొందబడదు.

కాని పారమార్థిక లాభముచే పరమార్థముతో పాటు ప్రాపంచిక లాభము కూడా పొందబడును. దీనికి కారణము పూర్తి ప్రపంచము పరమాత్మయందున్నది. కాని పూర్తి పరమాత్మ ప్రపంచమునందులేదు. ఈ ప్రపంచము కేవలము పరమాత్మయొక్క నీడమాత్రమే!

పూజ్య శ్రీ విద్యాప్రకాశానందస్వాముల వారు "వేదాంత భేరి" మాసపత్రిక ద్వారాను, 108 గీతాజ్ఞాన యజ్ఞముల ద్వారాను, 58 గీతా సదస్సుల ద్వారాను నిజంగానే వేదాంత భేరిని మ్రోగించిరి. ఆ భేరీనినాదము ఆధ్యాత్మిక సాధకులకు, భక్తులకు, జిజ్ఞాసువులకు, ముముక్షువులకు తప్పక వినబడును. శ్రీవారు గీతామకరందవే కాకుండా "మోక్షసాధన రహస్యము"ను విరచించి, ముముక్షువులకు మోక్షమార్గమును నిర్దేశించిరి. "భారత రత్నాకరము" ద్వారా మహాభారతములోని ఆచరాణాత్మకములగు అంశములను మన కందించిరి. "భాగవత రత్నాకరము" ద్వారా భాగవతములోని భక్తుల గుణగానములను మన శ్రోత్రముల కందించిరి. ఇక "ఉపనిషద్రత్నాకరము" ద్వారా జీవితలక్ష్యమగు జ్ఞానసారమును మనకందించిరి. "భక్త కన్నప్ప త్రినేత్ర ఉచితవైద్యశాల"ను స్థాపించుట ద్వారా శ్రీస్వాములవారు ప్రజలకు జ్ఞాననేత్ర ప్రకాశంతోబాటు భౌతిక నేత్రప్రకాశమును కూడా ప్రసాదించిరి.

2013 సంవత్సరం ఏప్రిల్ నెలలో మనము శ్రీస్వామివారి శతజయంత్యుత్సవములను జరుపుకొనుచున్నాము. ఈ ఉత్సవము కేవలము ఆ సంవత్సరమునకే స్థగితమై యుండరాదు. ఈ యుత్సవము ఆధ్యాత్మిక సాధకులకు సంపూర్ణజ్ఞానార్జనకై తోడ్పడునట్టిదై యుండవలయును. దేనిని తెలిసికొన్నచో, మరియొకటి తెలిసికొనుటకు మిగిలియుండదో, అదియే సంపూర్ణజ్ఞానమని చెప్పబడును. "యం లబ్ధ్వాచాపరం లాభం మన్యతే నాధికం తతః" అనెడి గీతావాక్యానుసారముగా ఆధ్యాత్మిక లాభమునకు మించిన మరొక లాభము లేదని తెలిసికొనవలయును. ఏ సత్యమునకు మించిన మరొక సత్యములేదో అట్టి పరమసత్యమును, పరమలాభమును, పరమజ్ఞానమును పొందుటకు జీవితమంతయు కృషియొనర్చుట మన పరమ కర్తవ్యమైయున్నది. "గీతామకరందము"నకు వలెనే శ్రీస్వామి వారి ఇతర గ్రంథములు కూడా నేటి అంతర్జాతీయ భాషయగు ఆంగ్ల భాషయందనువదింపబడ వలయుననియు, ఒకవేళ అది సాధ్యము కాకున్నచో ఆంగ్లీకరింపబడిన అంశములను ఆధునిక కాలానుగుణ్యముగా ఇంటర్‌నెట్ (Internet) నందు ప్రవేశ పెట్టబడవలయుననియు నా ఆకాంక్ష.

అప్పుడు భారతీయ సత్యసంస్కృతి ప్రపంచమంతయు ప్రాకుటకు మరింత దోహదమొసంగును. పూజ్య శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి ఆశీస్సులు మనందఱిపై ఎల్లప్పుడు ప్రసరింపబడుచుండును గాక!

ఓం తత్సత్

ఓం శాంతి : శాంతిః శాంతిః

వైరాగ్యనిష్ఠుడు తపాల తీసుకొనిపోయెడు రన్నరు రీతిగా నుండును. ఇతడు నిలువక పరుగెత్తుచుండునే గాని ఇతరులతో మాట్లాడుచు కూర్చుండుచు, లోకవార్తల చెప్పుచు కాలము వ్యర్థపుచ్చుకొనడు గదా! ఇదే నిజమైన వైరాగ్యము గలవాని గురుతుగా నుండును. వీరు త్వరలో దైవత్వమును బొందుదురు. ఇట్లు కానివారు ఏదో కారణాంతరముచే సాధువులైనవారే గాని, నిజముగా గాదు. వీరికి ముక్తి గూడ చాలా దూరము –**శ్రీ సద్గురు మలయాళ స్వాములవారు**

స్వామీజీ నువ్వు ఒక పసివాని నవ్వు, ఒక పరమహంస నవ్వు

శ్రీ మాతా శివచైతన్యానంద వారు

సంస్థాపకులు : శివచైతన్య తపోవనం (తాడేపల్లి)

ఓం

శతజయంతి మహోత్సవ అధిష్ఠాన దైవమైన ప.ప.పరమపూజ్యులు శ్రీ శ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరి మహాస్వామి వారి శ్రీచరణారవిందములకు భక్తి శ్రద్ధాపూర్వక ప్రణామములు.

Never form Never died mahatman

స్వామివారు ఎన్నడూ జనించలేదు, మరణించలేదు. ఏప్రిల్ 13-1914 నుండి ఏప్రిల్ 10-1998 వరకూ విశ్వాన్ని వీక్షించ నేతెంచారంతే.

న జాయతే న మ్రియతే న వర్ధతే
న క్షీయతే న వికరోతి నిత్యః ।
విలీయమానేఽపి వపుష్యముష్మిన్ న
లీయతే కుంభ ఇవాంబరం స్వయమ్ ॥

ఆత్మ పుట్టదు, గిట్టదు, పెరుగదు, తరుగదు, ఎట్టి వికారమును పొందదు. నిత్యమైనది. శరీరము లయమొందినను కుండ పగిలిన పిమ్మట తద్గత ఆకాశమువలె సత్యమై శాశ్వతమై ఉండును.

జిజ్ఞాసువులకు సందర్శన, సంసేవన, సంభాషణాదులతో జ్ఞానం కలిగించుటకు మాత్రమే ఒకనాడు వేంచేసి, కొంతకాలం మనలో ఒకరిగా, మనవారిగా ఉంటూ,మనలను తనంత వారిగా చేసి, మహనీయులు తిరిగి ఒకనాడు వెళతారు. అందుకే వారు మహాత్ములు, అది తెలియుటే మహత్తు.

శాంతా మహాంతో నివసన్తి సన్తః
వసంతవల్లోకహితం చరన్తః ।
తీర్ణాః స్వయం భీమ భవార్ణవం జవాన్
అహేతునాన్యానపి తారయన్తః ।

భయంకరమైన సంసార సముద్రమును స్వయముగా తరించినవారై. ఏకారణమూ లేకుండగనే ఇతరులను కూడ తరింపజేయుచున్నవారై శాంతులు, మహాపురుషులునైన సాధుజనులు ఎందరో ఋతురాజైన వసంతునివలె లోక కళ్యాణమునకై చరిస్తుంటారు.

సామాన్యునికి ఏవి జనన మరణములో, మహాత్మునికి అవి గమనాగమనములు. స్వామివారు పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో శ్రీ శుకబ్రహ్మాశ్రమం స్థాపించి, ఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్రాలలో ఎన్నో గీతా యజ్ఞాలు నిర్వహించి, లక్షలాది జనులకు సులక్షణాలను కలిగించిన కరుణామూర్తి.

నిజానికి ఒక మహాత్ముని మాహాత్మ్యం సామాన్యులకు అర్థం కాదు. ఒకవేళ చెప్పాలన్నా, వ్రాయాలన్నా చేసే ప్రయత్నం అఖండ గంగాజలాన్ని ఒక టీ కప్పులోనో, టిన్నులోనో, నింపి తెచ్చుకొనుట వంటిది. అయినప్పటికీ 'గంగా జలలవకణికా పీతా' గంగాజలాన్ని కొదిగా పానం

చేసినా, 'క్రియతే తస్య యమేన న చర్చా' వానికి యమునితో చర్చ వాదన ఉండదు. అనగా అతడు మృతినొందదని గదా శ్రీ శంకర భగవత్పాదులవారి శ్రీసూక్తి! అట్లే విద్యను, జ్ఞానాన్ని, ప్రకాశింప తెలియజేసినవారిని గూర్చి ఇంత వ్రాస్తే ఎంతో జ్ఞానం అనుభూత మౌతుందని మనందరితో ఈ సత్ప్రయత్నం జేయిస్తున్న పరమపూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వామివారికి కృతజ్ఞతా పూర్వక ప్రణామములు. బ్రోచరు అనే టిన్నుతో కొద్ది విద్యాగంగను కూడా పంపారు.

భూమిలో పడిన, భూమిలో జల్లిన విత్తనాలు మొలకెత్తడానికి వర్షఋతువు ఎంతో అనువైన కాలం. అట్లే మహాత్ముల సన్నిధి-సాధకులలో దాగి ఉన్న జ్ఞాన బీజాలను జాగృతి చేయడానికి, అహంకారాది కలుపు మొక్కలు పీకడానికి, బ్రహ్మ జ్ఞాన బీజాలు వెదజల్లి నాటడానికి అనువైన కాలము.

చాతుర్మాస్య వ్రతాలతో చతుర్విధ పురుషార్థాలను సంప్రాప్తింపజేసే సాధుసంతులసత్తా-సమాజం గుర్తించినా గుర్తించకపోయినా, వర్షఋతువు వంటి మహాత్ములు జ్ఞానాన్ని వర్షింపజేస్తూనే ఉంటారు. అది వారికి స్వభావము, స్వరూపము కూడా. శ్రీ స్వామివారు ఎన్నో ప్రాంతాలలో గీతా జ్ఞానయజ్ఞాలు నిర్వహించి, ఆ ప్రాంతాలను, ఆ కార్యకర్తలను, శ్రోతలను, ఎందరిని పవిత్రులు చేసి ఉన్నారో! వారంతా చాలా ధన్యులు.

కొందరి విద్య రాజసికంగా సూర్యప్రకాశంలో వేడిగా తీక్షణంగా ఉంటుంది. మరికొందరి విద్య సాత్త్వికంగా చంద్రప్రకాశంలో చల్లగా హాయిగా ఉంటుంది. మనస్వామివారి ఆత్మవిద్య-బ్రహ్మవిద్య Air - Condition వలె వారి వారి స్థాయికి తగినట్లు, వారి అభిరుచికి సరిపడేట్లు ఉండేది. అందుకే కాబోలు వీరి గురుదేవులు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ అనంగానందగిరి స్వామివారు వీరికి "విద్యాప్రకాశానందగిరి" అని నామధేయముంచారు. సద్గురువులు సర్వజ్ఞులు, సమర్థులు గదా!

స్వామివారు ప్రవచనంలో మధ్యే మధ్యే సులభ సౌందర్య సభ్యతాయుత సమన్వయ ఉపమానాలు, English Proverbs చెబుతూ శ్రోతలను మైమరపించేవారు. హైద్రాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన స్వామివారి గీతాజ్ఞాన యజ్ఞమునకు నేను కూడా 3 రోజులు వెళ్ళాను. చాలా మంది కళ్లూ నోరూ తెఱచి, శ్వాస పీల్చడం మర్చిపోయారేమో అన్నంతగా, ఒళ్లంతా చెవులు చేసుకొని వినేవారు.

మాయకు లొంగేవాడు మనిషికాడు, దాటేవాడు మేన్.

M = MAYA - to remove
A = ATMAN to See
N = NIRVAN to atin

"మాయను తొలగించి, ఆత్మను సందర్శించి నిర్వాణరూపమగు మోక్షము నొందు" మని మానవ శబ్దము ప్రేరేపించుచున్నదని ప్రవచించేవారు.

Arise ! Awake ! stop not till the goal is reached. ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్నిబోధత! లెండు, మేల్కొనుడు, లక్ష్యమగు పరమాత్మను జేరువరకు వెనుకంజ వేయకుడు!

సోమరుల గురించి, మూర్ఖుల గురించి, లోభుల గురించి పరిహసిస్తూ హాస్య ఉపమానాలు చెబుతుండేవారు. తాము నవ్వుచూ అందరినీ నవ్వించేవారు.

Lazy fellow has not right to live on this Earth. You should burn him.. "ఈ భూమిపై సోమరికి బ్రతికే హక్కులేదు వాణ్ణి తగలెయ్యండి' "కొందరు ఒకణ్ణి



మోసుకొని పోతున్నారు. దారిలో దించారు. అప్పుడే మంచిరైతు అటుగా పోతూ వాణ్ని చూసి. అయ్యో! బ్రతికున్న వాణ్ని తీసుకుపోతున్నారేంటి? అని అడుగగా వీడు వట్టి సోమరిపోతు, ఎందుకూ పనికి రాడు, భూమికి భారమని, ఈ సోమరితనం సమాజంలో ఎవరికీ అంటకూడదని, మంటబెట్టేద్దామనీ అన్నారు. అయ్యో! అలానా! ఒరే నాయనా! మా ఇంట్లో వేరుశనక్కాయల నిల్వగదిలో నిన్నుంచుతాము, అవి తింటూ ఉంటావా? అని ఆరైతు అడిగితే, ఆ సోమరి -ఆ కాయలు వలిచి నా నోట్లో వేసేవారున్నారాండీ అన్నాడు. ఆ రైతు ఆశ్చర్యపోయి ఇంత సోమరా వీడు! వీణ్ణి తీసుకెళ్ళి తగలబెట్టండన్నాడు.

సభాసదులందరూ హాయిగా నవ్వేవారు. ఇంట్లో ఇలా నవ్వలేరు. ఈనాడంటే T.V Channels ఎన్నో బ్రహ్మానందంగారి Jokes పెట్టి నవ్విస్తూ Tensions re-leasing అంటూన్నా, స్వామివారి dialogues direct హృదయాన్ని స్పృశించేవి. **స్వామిజీ నవ్వు ఒక పసివాని నవ్వు, ఒక పరమహంస నవ్వు,** ఒక పరివ్రాట్ నవ్వు. నిష్కల్మషమై, నిర్మలమై, నువ్వులేవు నేను అనే నవ్వు. ఆ నవ్వే ఎన్నటికీ వాడని పువ్వై నా మదిలో స్థిరంగా నిలిచింది.

శ్రీవారి సన్నిధి నా కొక మధురానుభూతి. శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో స్వామివారికి నమస్కరించి ప్రక్కన నిలిచాను. శ్రీమాన్ ఈశ్వర్‌గారు మమ్ము పరిచయం చేసారు. ఏమ్మా! మీ గురించి బాగా వింటున్నాము. జ్ఞానయజ్ఞాలు బాగా జరుగుచున్నవా? అని స్వామివారు అడిగారు. అవునండి? బాగా జరుగుచున్నవి, తమరు చెప్పినవాటిని కాపీ కొట్టేసి చెబుతున్నాం. అందుకే బాగుంటున్నవి. ఆ Credit తమదే - అని అంటున్నంతలో సంతోషంగా, సగర్వంగా, చాలసేపు నవ్వారు. ఆపై మంచిదమ్మా, మంచిపని చేస్తున్నారు. మహాత్ముల మాటను, బాటను బాగా కాపీ కొట్టాలమ్మా, మీరే కాదు, మేమంతా కూడా కాపీ కొట్టాం. 'వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వం' శ్రీవ్యాస వాల్మీకాదుల వాఙ్మయమే మనం చెప్పాల్సింది, కాపీ కొట్టాల్సింది. ఆనాడే అది ప్రామాణిక మౌతుంది. అప్పుడే వక్తా శ్రోతా సార్థక మయ్యేదని స్వామివారు చాల వాత్సల్యంగా మాట్లాడారు.

"త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః। కామః క్రోధస్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్" కామ క్రోధ లోభములను ఈ మూడును నరకద్వారములు. జీవుని నశింపజేసే మూడింటిని విడిచిపెట్టాలి. లోభం కూడా సామాన్యమైనది కాదు. లోభి తాను తినడు, పరులను తిననివ్వడు అంటూ...ఇద్దరు లోభులు ఒక కిలో నెయ్యికొని తెచ్చుకొన్నారు. నెల తరువాత ఇద్దరూ కలిసినప్పుడు. ఏమోయ్! నీ నెయ్యి అయిపోయిందా? అని మొదటివాడు రెండవవాణ్ని అడిగాడు. లేదండీ, మీ నెయ్యి అయిపోయిందా? లేదండీ ఉంది అన్నాడు, రెండవవాడు మీరెలా వాడతారు? మీ ఇంట్లో ఎందరున్నారు? మరలా అడిగాడు. మా ఇంట్లో ముప్పైమంది ఉంటాము. ఒక్క చీపురు పుల్ల మాత్రమే దానిలో ఉంచి వేసుకుంటాము. గాన ఇంకా వుంది. అయితే మీ గురించి చెప్పండనగా మా ఇంట్లో ఏభైమంది ఉన్నాము. భోజనం చేసేటపుడు మూత తీసి ముక్కు దగ్గఱ పెట్టుకొని బాగా వాసన చూస్తూ శ్వాస పీల్చి, ప్రక్కవాడికిస్తాము. గాన మానెయ్యి యథా తథంగా ఉంది అన్నాడు తానెంతో గొప్పపని చేసినట్లు. వీడ్ని అభినందించి రెండవవాడు రేపటినుంచి నేనూ అదేపని చేస్తానన్నాడు. మనమా పని చేయొద్దు, వాళ్ళిద్దరూ లోభులు గాబట్టి అలాచేసారు అంటూ స్వామివారు, ఈశ్వర ప్రసాదంగా ఇతరులకు పెట్టి, తామూ కొంత తిని ఆనందించాలి. అదేదైనా ప్రసాదమే. "దాచేస్తే దోచేస్తా,

కుండలో పెట్టి ఉట్టిలో పెడితే, పట్టుబట్టి పగలగొట్టేస్తా" నని చేసి చూపిన బాల కృష్ణని లీల మనం ప్రతి సంవత్సరం కృష్ణాష్టమి వేడుకగా చేసుకొంటున్నాము! అనేవారు.

స్వామివారి ప్రవచనం Ever green his Powerfull words or Lectures in this world. మేము గత సం॥రం America వెళ్ళినప్పుడు 3 states లో భక్తుల ఇంట్లో ఉంటే నేను కూడా స్వామివారి గీతోపన్యాసములు విన్నాను. ఇక గీతామకరందం గ్రంథం లేని ఇల్లు ఉండదేమో బహుశా. వారి మాటయే మంత్రముగా, మాటలే రత్నాల మూటలుగా, మాటలే రకరకాల పూదోటగా, మాటయే మంచి బాటగా, బాసటగా అనుసరించే భక్తజనాలు ఎంతటి అదృష్టవంతులో!

స్వామివారి వైభవాన్ని చెబుతూన్నా వింటూన్నా ఆనందించే స్వభావిని అయిన నన్ను కూడా స్వామివారి శిష్యులు, భక్తులు చాల ఆదరభావనలతో చూస్తారు. అది శ్రీవారి అనుగ్రహం.

"విద్యయాஉమృతమశ్నుతే" అను ఈశా-వాస్యోపనిషన్మంత్ర ప్రకారముగా పూజ్యశ్రీ స్వామివారు విద్యా అవిద్యపు జ్ఞాన కర్మముల రెంటిని వారు తెలుసుకొని, ఎందరికో ఆ రహస్యాన్ని వివరించారు. సంన్యాసానికి పూర్వమే కర్మాచరణ చేసి-మల, విక్షేప, ఆవరణ దోష రహితులై, శుద్ధాంతఃకరణులై, బ్రహ్మజ్ఞానముచే అమృతత్వమును పొందారు. అందుకే ఎందరికో గీతామృతాన్ని పోస్తూ తాము త్రావి, అమృతస్వరూపులై వెలుగొందుచున్నారు. అట్టివారి కివే మా నమస్కారములు.

అట్టి స్వామివారిని స్మరింపజేసి వారి విద్యాప్రకాశాన్ని మేము కూడా కొంతపొంది ఆనందానుభూతిని పొందేట్లుగా చేసిన పూజ్యపాదులు శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానంద గిరిస్వామివారికి శతధా ప్రణామములు సమర్పిస్తూ, ఉత్తరాధికారి పూజ్యశ్రీశ్రీశ్రీ సంపూర్ణానందగిరి స్వామివారికి కూడా మా నమస్కారములు,

పునః ప్రణామాః భవదీయా
మాతా శివచైతన్యానంద

యతిగీతము

- స్వామి వివేకానంద

Let darkness go; the will-o-wisp that leads,
With blinking light to pile more
gloom on gloom
This thirst for life, ever quench; it drags,
From birth to death and death to birth, the soul,
He conquers all who conquers self.
Know this and never yield, sannyasin
bold! Say-
"Om tat, sat, Om!"

'Who sows must reap', they say,
'and cause must bring
The sure effect; good, good; bad, bad,
And none escapes the law. But who ever
wears a form
Must wear the chain'.Too true,but far beyond
Both name and forms is Atman, ever free,
Know thou are That, Sannyasin bold! Say -

Om tat, sat, Om!"

వందే గురూణాం చరణారవిందమ్

శ్రీ మాతా జ్యోతిర్మయానందభారతీవారు
పరబ్రహ్మ షణ్ముఖానందాశ్రమము (పాలకొల్లు)

దివ్యాత్మ స్వరూపులారా! ధరణి నుండి గిరి, గిరి నుండి తరువు, తరువునుండి ఫలము ఉద్భవించి లోకానికి సేవచేసేటట్లు శ్రీ శంకరాచార్యులు దగ్గరనుండి శ్రీఅసంగానందుల పర్యంతము మహనీయుల దివ్య ప్రబోధలతో లోకములో నున్న చరాచర జీవరాసులకు ఆధ్యాత్మిక ఆధిదైవిక ఆధిభౌతిక తాపములను తొలగించి ఆత్యంతిక దుఃఖనివృత్తి, పరమానంద ప్రాప్తిపొందించిరి. అదే మార్గాన్ని అనుసరిస్తూ వచ్చిన మహనీయులు మన శ్రీవిద్యాప్రకాశానంద స్వాములవారు.

"జగమెరిగిన బ్రాహ్మణునకు జంధ్యముతో పనియేల?' అనే సూక్తి విధానముగ మనస్వాములవారిని గూర్చి మేము ఏమి వ్రాయగలము?

"ఛల్ తే సాధు బహతే గంగ" అనే రీతిగా గంగానది ప్రవాహిస్తు వుంటే లోకంలో జీవులకు ఆధార భూతమౌతుంది. అదే రీతిగా మహాత్ములు సంచారము చేస్తూ వుంటేనే లోకములో ఆర్తులకు, అజ్ఞానగ్రస్త హృదయులకు జ్ఞాన ప్రబోధ చేసి వారిని సచ్చిదానంద మార్గమునకు ప్రయాణం చేయించగలరు. మన శ్రీ స్వాములవారు చిరుత ప్రాయమునుండే సద్గురు దేవుల పాదముల నాశ్రయించి, గురుదేవుల ఆదేశప్రకారము కఠోరనియమములతో తపస్స్వాధ్యయనములనుచేసి గంగామాత ఒడిలో లభించిన భగవద్గీతను ఆధారముగా తీసికొని, ఆరాధించి, ఆచరించి, అనుభవించి, అందరిచేత మకరంద మాధుర్యమును అనుభవింప చేసినారు. శ్రీ మలయాళ సద్గురు పద సన్నిధిలో స్వాతి ముత్యమువలె సమస్త విషయములను ఆపోశన పట్టి నీటిలో ముంచిన దూది వేరొకరి దాహాన్ని తీర్చినట్లు-శ్రీవ్యాసాశ్రమము నుండి సమస్త వేదాంత సారాన్ని నిండిన హృదయముతో-శ్రీకాళహస్తిలో శ్రీ శుకబ్రహ్మాశ్రమాన్ని నిర్మించి, స్వాములవారి పదసన్నిధిలో ముంచబడిన వేదాంతసారాన్ని స్వానుభవముతో రంగరించి గీతామకరంద రూపంలో భక్తులకు అందించిన మహనీయులు మన శ్రీవిద్యాప్రకాశానంద స్వాములవారు.

అటువంటి మహనీయులకు శతజయంతులు మా పరమ పూజ్యులు మాతృహృదయులు శ్రీ శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాముల వారి పవిత్ర కరకమలముల మీదుగా వారి పరంపరలో వస్తూ యున్న ఉత్తరపీఠాధిపతులు పూజ్యశ్రీసంపూర్ణానంద స్వాముల సంపూర్ణ పర్యవేక్షణలో జరగడము చాలా ఆనంద దాయకము.

ఈ కార్యక్రమములో ఈ చిన్నపుష్పాన్ని స్వాముల వారి పాదాలకు అర్పణచేస్తూ ...

ఓం నమో భగవతే శ్రీసత్యానందాయ

ఆధ్యాత్మిక జంఝామారుతము

శ్రీ శ్రీహరి తీర్థస్వాములవారు

శ్రీసత్యానందాశ్రమ పీఠాధిపతులు

శ్రీ సత్యానందాశ్రమము (ఇనమడుగు)



పూజ్య శ్రీ సంపూర్ణానంద స్వామీజీ!

సాదర ఓం నమో నారాయణాయ!

తమరు సాదరంగా పంపిన శ్రీవిద్యాప్రకాశానంద స్వాములవారి సంగ్రహ జీవితము, జాబు చేరినవి.

పూజ్యపాదులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి శతజయంత్యుత్సవములు వచ్చే 2013 ఏప్రిల్‌లో జరుప తలపెట్టినందులకు చాలా అమందానందము కలిగినది.

శ్రీ స్వాములవారి గురించి సందేశమును పంపమని వ్రాసినారు. "జగమెరిగిన బ్రాహ్మడికి జంధ్యము ఎందు" కన్నట్లు శ్రీ స్వాములవారి గురించి నేను వ్రాయడం సూర్యునిముందు దివిటీలానే ఉంటుంది.

అయినప్పటికి శ్రీస్వాములవారి చరణారవిందముల యందు నా వాక్పుష్పములను సమర్పించుచున్నాను.

గీతామకరందము :- శ్రీస్వాములవారు ఆధ్యాత్మిక ఢంకా మ్రోగించి మన భారతదేశమునందే కాక విదేశములయందు కూడ తమ గీతామకరందమును పంచిన పుణ్యమూర్తి. మకరంద మంటే మకరందమే. అది ఎక్కడ పట్టుకున్నా తీపే. తేనెలొలుకు మాటలతో మానవుని మస్తిష్కమును శుద్ధము చేసి ఇప్పుడే ఈ క్షణముననే ఆత్మసాక్షాత్కారమును పొందవలయునను తీవ్ర ముముక్షుత్వమునకు పురికొల్పుచున్నది. వేలాది మందికి గీతామాధుర్యమును రుచి చూపినది. శ్రీస్వాములవారి ప్రచారకాలములో ఒక ఆధ్యాత్మిక జంఝామారుతమునే ప్రవహింప జేసినది. ఇప్పటికిని దాని మాధుర్యము తగ్గలేదు. మరి ఎప్పటిని తగ్గదు. మకరందము రుచి, మాధుర్యము రుచి ఎప్పుడైనా మారుతుందా? మారితే మకరంద మెట్లౌతుంది? ఎంత జుర్రుకొన్నా ఇంకా జుర్రుకోవాలనే వుంటుంది. ఇది తుమ్మెదలవంటి ఆధ్యాత్మిక పిపాస కలవారి నైజము కూడ.

శ్రీవారి ప్రవచనములు :- శ్రీవారి ప్రవచనములు బహుళ జనుల హృదయములలో చెరగని ఆధ్యాత్మిక ముద్రను వేసినవి. ఒకసారి విన్నవారు మరి వదలని స్థితిని పొందినారంటే అతిశయోక్తి కాదు. ప్రతి సాధకునికి సులభమైన రీతిలో ఆధ్యాత్మిక విషయములు అర్థమయ్యే భాషలో ప్రబోధించినారు. ప్రతిపట్టణమునందు 18దినములు ఏకధాటిగ శ్రీవారి ప్రవచనములు సాగేవి. ఆ సమయములో ఆ పట్టణములో ఉంటే సినిమా థియేటర్లు మూతపడేవి. అంతటి జనాకర్షణ శ్రీవారి ప్రవచనములయందు ఉండేది. శ్రీవారు ఏది చెప్పినను నీతిమంతముగ, రోచకముగ, హృదయమునకు హత్తుకొనేటట్లు చెప్పెడివారు. శ్రీవారి ప్రవచనములయందు వినోదమూ ఉండేది. అంతకు మించి విజ్ఞానము కూడ ఉండేది. ఈ ప్రకారముగ 108 పట్టణములయందు 108 గీతాయజ్ఞములను నిర్వహించి ప్రజలలో ఆధ్యాత్మిక ప్రభంజనమును సృష్టించినారు.

శ్రీవారి రచనలు - శ్రీవారి రచనలు అనేకములు కలవు. ''శ్రీరామాయణ రత్నాకరము'' శ్రీవాల్మీకి రామాయణములోని ముఖ్యమైన ఆధ్యాత్మిక సంబంధములైన శ్లోకములను ఏరి కూర్చి తాత్పర్యమును వ్రాసి ప్రకటించినారు. అట్లే "శ్రీభాగవతరత్నాకరము", "భారతరత్నాకరము", "శ్రీవసిష్ఠగీత", "బ్రహ్మచర్యము", "గీతోపన్యాసములు," "పరమార్థకథలు", భగవాన్ శ్రీ రమణమహర్షులవారి ఉపదేశసారము లాగే ''తత్త్వసారము'' మొదలగు గ్రంథములను రచించుటయేగాక ''వేదాంతభేరి'' మాసపత్రికను కూడ నెలకొల్పిరి.

విద్యా దదాతి వినయం వినయా ద్యాతి పాత్రతామ్।
పాత్రత్వాత్ ధన మాప్నోతి ధనాత్ ధర్మం తతః సుఖమ్ ॥

అన్నట్లుగా శ్రీవారు విద్యాలయములను కళాశాలలను సంస్థాపింపజేసి వేలాది విద్యార్థులను విద్యా వినయసంపన్నులను గావించి తద్వారా ధనమును సంపాదింపజేసి, తద్వారా ధర్మమును ఆచరింపజేసిరి. దానమువలన సుఖము నిత్యసిద్ధముగదా! కావున విద్యార్థులందరికి సుఖమును సంప్రాప్తింపజేసిరి. ఇట్టి కార్యములు మహాత్ములైన పుణ్యపురుషులకే చెల్లుతాయి.

సేవా కార్యములు : - దృష్టి లోపముకలిగిన వేలాది స్త్రీ పురుషులకొరకు "భక్తకన్నప్ప త్రినేత్రవైద్యాలయము"ను ప్రారంభించి వేలాది మందికి ఆధ్యాత్మిక దృష్టిని కలిగించడమే కాక భౌతిక దృష్టిని కూడ కలిగింపజేసి వారు సుఖముగా జీవించుటకు శాయశక్తుల కృషిగావించిరి. దానిని ఇప్పటి పీఠాధిపతులు పూజ్యపాదులు శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానంద గిరి స్వాములవారు ఇంకను అభివృద్ధిని పరచి సర్వాంగ సుందరముగ అన్ని ఏర్పాట్లు గల గొప్పభవనమును కట్టించి సకల సౌకర్యములను ఏర్పరచిరి.

వాత్సల్యము : - చిన్న పిల్లలన్నా బ్రహ్మచారులన్నా స్వాములవారికి అత్యంత ప్రీతి. నేను ఒకసారి శ్రీస్వాముల వారు ఉన్నప్పుడు శ్రీ శుకబ్రహ్మాశ్రమ వార్షికోత్సవములలో పాల్గొనడము జరిగింది. అప్పుడు వారము దినములు కార్యక్రమములు చేసినారు. నాకు వయస్సు సుమారు 15 సంవత్సరములు. స్వాములవారికి నమస్కారము చేసిన తరువాత కూర్చోమంటే కూర్చున్నాను. వెంటనే ఒక ఫలమును ప్రసాదంగా ఇచ్చినారు. తీసుకున్నాను. సభ ప్రారంభమైంది. ఆ సభలో (భగవద్గీత పదవ అధ్యాయము ఒకటవ శ్లోకమునుండి 10వ శ్లోకమువరకు అర్థ తాత్పర్యములతో ఎవరైతే 10 నుండి 16 సంవత్సరముల వయస్సుగల పిల్లలు) వ్రాతపరీక్షలో విజేతలైనవారికి బహుమానము ఇవ్వబడునని ప్రకటింపబడినది. వెంటనే నేను నా పేరును నమోదు చేయించుకొంటిని. ఇంకను సభలోనివారు కొందరు కూడ వ్రాయించుకొనిరి. న్యాయనిర్ణేతగా శ్రీవేదగిరి ఆశ్రమము, నరసింహకొండ పూజ్యశ్రీ మహేశానంద తీర్థస్వాములవారిని నిర్ణయించిరి. రెండు దినములలో పరీక్షను వ్రాయించిరి. నేను అందులో ఒకటంటే ఒక్క అక్షరము తప్పిపోవుటవలన రెండవ స్థానములో వచ్చితిని. పూజ్య శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి పవిత్ర హస్తములతో మొదటి బహుమానము గీతామకరందము ఇవ్వబడినది. రెండవ బహుమానము "గీతోపన్యాసములు" అను గ్రంథము నాకు ఇవ్వబడినది. ఈ గ్రంథము ఇంతకుముందే నాదగ్గర ఉండెను. దీనిని మార్చుట ఎట్లు? నాకు కావలసినది పరమార్థకథలు. స్వామివారి వద్దకు వెళ్ళినచో ఏమైనా అనగలరేమో? అని నాలో నేనే తర్జన భర్జన పడుచుండగా శ్రీ స్వాములవారు గమనించి నన్ను దగ్గరకు పిలిచి ప్రేమతో "నీలో ఏదో ఆందోళన కనిపించుచున్నది. ఏమిటి చెప్పుమా" యని అడిగిరి. అప్పుడు కొంత ధైర్యమును కూడగట్టుకొని గీతోపన్యాసములకు బదులు పరమార్థ కథలు కావలయునని చెప్పితిని. శ్రీ వారు వెంటనే ఈశ్వర్‌గారిని పిలిపించి పరమార్థకథలను ఇప్పించిరి.

పరిచయము :- 1980వ సంవత్సరములో ఒకనాడు శ్రీ సత్యానందవిశ్వవిహార్ విశాఖపట్టణమునందు నేను, భగవాన్ శ్రీ సత్యానందమహర్షులవారు శ్రీసత్యానందాశ్రమము నుండి వెలువడు "శ్రీవిశ్వమీమాంస" పాతపత్రికలను సర్దుచుంటిమి. అప్పుడు 1964వ సంవత్సరము ఒక పత్రికలో శ్రీసత్యానందమహర్షులవారు మరియు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు కలిసి తీయబడి ఉన్న ఛాయాచిత్రము ముద్రింపబడి కనిపించినది. దానిని శ్రీసత్యానందమహర్షులవారికి చూపించి ఈ స్వామీజీ ఎవరు? ఎచట ఉంటారు? అని ప్రశ్నింపగా శ్రీమహర్షుల వారు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి గురించి సవివరముగ చెప్పిరి. శ్రీస్వాముల వారు శ్రీకాళహస్తిలో "శ్రీశుకబ్రహ్మాశ్రమము" స్థాపించిరని, గీతామకరందమును రచించిరనియు, గీతాజ్ఞానయజ్ఞము పేరుతో గీతోపన్యాసములను అనేకచోట్ల గావించుచున్నారనియు, వేదాంతభేరి మాసపత్రికను సంస్థాపించి బహుళముగ ఆధ్యాత్మిక ప్రచారము చేయుచున్నారనియు ఇంకను వారి తపస్సుగురించి, వారి నియమ నిష్ఠలను గురించి, వారికి భగవద్గీత దొరికిన విధానమును గురించి చెప్పిరి. శ్రీసత్యానందమహర్షులవారు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి గురించి ఆరోజు చెప్పిన విషయములు అద్భుతములు. ఆ విషయములే నా హృదయములో ఈనాటికిని నాటుకొనియున్నవి.

ప్రస్తుత పీఠాధిపతులు :- పూజ్యపాదులు శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు ప్రేమమూర్తులు. నేనంటే అమితమైన వాత్సల్యమును కార్యరూపములో వ్యక్తపరుస్తూ వుంటారు. 2009లో శ్రీసత్యానందాశ్రమమునకు నన్ను పీఠాధిపతిగా పూజ్య శ్రీబ్రహ్మానందతీర్థస్వాములవారు అభిషేకించినప్పుడు పూజ్యపాదులు శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాములవారు దగ్గర ఉండి అన్ని కార్యక్రమములను చక్కగ జరుగునట్లు పర్యవేక్షించినారు. వారి వాత్సల్యమునకు అదియే నిదర్శనము. ఎప్పుడు ఎక్కడ శ్రీస్వామివారి దర్శనము లభించినను నమస్కరించిన పిమ్మట క్రింద కూర్చొనుటకు యత్నించినంతనే నా చేతులను పట్టుకొని లాగి తన ప్రక్కన కూర్చోబెట్టుకొందురు. వీపు నిమురుదురు. ఆ ప్రేమ అప్పుడు ప్రత్యక్షముగ అనుభవించిన నాకు దానికి సాటి ఈప్రపంచమున మరియొకటి లేదు అనే భావన కలుగుతుంది. శ్రీశుకబ్రహ్మాశ్రమమును చక్కగ నడిపే సామర్థ్యము, ఆశ్రమమును అభివృద్ధి పరిచే దక్షత అనన్యసామాన్యములు. శ్రీస్వాములవారి ఆశీస్సులను కోరుతూ ప్రణామములను సమర్పిస్తున్నాను.

ప్రస్తుత ఉత్తర పీఠాధిపతులు :- పూజ్యపాదులు శ్రీశ్రీశ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు ఆప్తమిత్రులు. వారు కాశీలో శ్రీదక్షిణామూర్తి మఠమునందు విద్యాభ్యాసము చేయుచుండిన కాలమునుండి నాకు పరిచితులే. అప్పుడప్పుడు కాశీకి వెళ్ళిన సందర్భరములలో కలుసుకొను చుండెడివారము. వారి నవ్వు ముల్లోకములను మరపింపచేస్తుంది. వారి సౌజన్యము వారి వాక్చాతుర్యము వారికి పెట్టని కోటలు. శ్రీ సంపూర్ణానందస్వాముల వారిని శ్రీశుకబ్రహ్మాశ్రమమునకు ఉత్తరపీఠాధిపతులుగా చేయడం భక్తులకు అయాచితముగ లభించిన ధనము. శ్రీశుకబ్రహ్మాశ్రమమునకు ఉత్తర పీఠాధిపతులుగా నియమింప బడినప్పుడు పూజ్య శ్రీ బ్రహ్మానందతీర్థ స్వాములవారు, నేనూ ఆ కార్యక్రమములో పాల్గొనడం జరిగింది.

శ్రీ సత్యానందాశ్రమమునకు శ్రీశుకబ్రహ్మాశ్రమముతో మరియు అచటి పీఠాధిపతులలో ఉండే అనుబంధము అవిస్మరణీయము. పూజ్యపాదులు ప్రాతఃస్మరణీయులు శ్రీవిద్యాప్రకాశానంద గిరిస్వాములవారి శతజయంతి సందర్భముగ వాని నన్నింటిని నెమరువేసుకునే సావకాశము కలిగించిన శతజయంతి కమిటీవారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ సెలవు తీసికొనుచున్నాను.

లోకాః సమస్తాః సుఖినో భవంతు.

స్వస్తి.



శ్రీగురుమూర్తయేనమః

శ్రీశ్రీశ్రీ నిత్యశుద్ధానందగిరి స్వామి వారు.

శ్రీలక్ష్మీ నారాయణ ఆశ్రమము (గంగాపురం)

శ్రీశ్రీశ్రీ. విద్యా ప్రకాశానందగిరి స్వాములవారి శతజయంత్యుత్సవాలు 2013 ఏప్రిల్ 28వ తేదినుండి జరుగుతున్నట్లుగా పూజ్యశ్రీశ్రీశ్రీ విద్యా స్వరూపానందగిరి స్వామి వారిప్రోత్సాహముతో శ్రీ గోవిందానందగిరి స్వామి వారి ద్వారా ఆశ్రమమునకు లెటర్ అంది చాలా సంతోషించి నాము. విద్యాప్రకాశానందస్వామివారి విషయము వర్ణించు టకు వేయితలలుగల ఆదిశేషుడు శ్రీ విష్ణుమూర్తిని వర్ణించ లేనట్లుగా యీదాసుడు శ్రీ వారిని వర్ణించుటకు అశక్తుడు.

పూజ్యస్వామీజీగారు ఈ దాసుని ద్వారా జరిపించే రామకోటి జపయజ్ఞములకు ప్రతి పునర్వసు నక్షత్రమునకు కోరగనే శ్రమ అనుకోకుండా తప్పకుండా వేంచేసేవారు. వారు ఇంత పారితోషికము ఇవ్వవలెను అని కోరేవారుకారు. వారు విమానములో వచ్చిపోయినగానీ దానికి అయ్యే ఖర్చుమాత్రమే తీసుకొని తృప్తిపడేవారు కానీ ఏలాటిది అత్యధికముగా కోరేవారు కారు. వారు1991వ సం॥రమున అక్టోబర్ మాసములో జరిగిన 108వ శ్రీరామకోటి జప యజ్ఞసంచికలో వారు వ్రాసిపంపిన వ్యాసము తల్లితండ్రుల యందు ప్రేమ, అన్నదమ్ముల సోదర భావము, గురుదేవుల యందు విశ్వాసము భగవంతుని యందు భక్తిగల విషయముల గురించి మహాభారతములోని విషయములన్ని వ్యాసము వ్రాసిపంపించినారు. ఆ వ్యాసమును ఎన్ని సార్లు చదివినాగానీ మళ్ళీ మళ్ళీ చదువ వలెనని మనసు కోరుచుండును.

శ్రీవారు ఈ దాసునితో స్వయముగా చెప్పిన మాటలు–"నేను కొన్ని సం॥రములకు పూర్వము వ్యాసాశ్రమములో తపస్సు చేసుకునే రోజులలో రోజూ తీసుకునే ఆహారమునకు గాను ఒకకొబ్బరిముక్క కొన్ని ఇలాటి పలుకులు మాత్రమే పంపించే వారు. వాటినే ఆహారముగా తీసుకొని యోగవాసిష్ఠము అనే గ్రంథమును వ్రాసినాను". (తాత్పర్యము) అని నా దగ్గర చెప్పినారు. నాకు ఎప్పుడుగానీ ఈ మాటలు జ్ఞాపకము వచ్చినా చాలా ఆనందపడుచు వుంటాను. వారు ఏ సభలో ప్రవచనము చేయుటకు ప్రారంభించినాగానీ శ్రోతలు నిశ్చలంగా మౌనంగా వినయంగా వింటూ సంతోషపడేవారు వేలాదివేల జనులు.

ఒకసారి మహబూబ్‌నగర్ జిల్లాలో సిరిసనగండ్ల అనే క్షేత్రము దగ్గర శ్రీ రామకోటి 60వ యజ్ఞం (షష్టిపూర్త్యుత్సవము) చాలా పెద్ద ఎత్తున జరుపు సమయంలో బ్రహ్మాండ మైన వర్షము పెద్ద పెద్ద వడగండ్లతోపడి భక్తజనులనందరిని చాలా భయభ్రాంతులనుచేసే సమయములో శ్రీ స్వామివారు భక్తులందరిని "ఏమీ భయపడకండి ఏమీకాదు, భగవంతుడు. కాపాడుతాడు" అని ఎంతో ధైర్యము నొసంగినారు. అదే తీరుగ యజ్ఞము జరిగినది. చాలా సంతోషమైనది. ఎప్పుడు ఎక్కడ ఏ కార్యమునకైనా వారు వస్తున్నారు అనే మాటవినగానే భక్తులు పెద్ద సంఖ్యలో తండోపతండాలుగా వచ్చి వారి సంభాషణ విని ఆనందపడేవారు. శ్రీవారు అంతటి మహాను భావులు కావటంచేతనే శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వామివారిని పీఠాధిపతిగా చేసి–ఆశ్రమమును వారు ఉండి నప్పటి కంటే ఇతోధికముగా నడిచే విధముగాచేసినారు. వారి శతజయంత్యుత్సవమేకాదు సహస్రశత జయంత్యుత్సవం జరుపుకొని విరాజిల్లుదురు గాక అని భగవంతుని కోరుకొనుచున్నాను. ఓంతత్సత్



శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి సందర్శనము

- శ్రీశంకరానందస్వాములవారు
దత్తాత్రేయాశ్రమము
(మహేశ్వరం రోడ్డు)

పరమహంస పరివ్రాజకాచార్యులు, సార్ధకనామ ధేయులు, గీతకు మకరందాన్ని అందించి ఆబాలగోపాలం వరకు ఆస్వాదించేటట్లు చేసినవారు, తన సహజమైన శైలిలో పండితపామరజనరంజకంగాను తన ఉపన్యాసములచే ఆనందింపచేసి అందరికి ఆచరణీయమైన గీతతత్త్వాన్ని ప్రబోధించి ఆచంద్రార్కము తమ యశశ్చందికలు దిగంతాలలో వ్యాపింప చేసిన పరమ పావన పుణ్యమూర్తి యగు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందుల శతజయన్తి ఉత్సవములు జరుపుకొనడం ఎంతో సంతోషదాయకము.

శ్రీస్వాములవారిని గూర్చి నా అనుభవము రెండుమాటలు - నేను 1972లో శ్రీశాయిరెడ్డి గూడెంలో జరిగిన సనాతన వేదాంతజ్ఞాన మహాసభలో శ్రీస్వాముల వారిని ప్రప్రథమంగా దర్శించుకున్నాను. వారి గంభీరమైన మధురవాణిని పాటద్వారా విని మైమరచి ఎంతో ఆనందాన్ని పొందాను. ఆనాటిపాట "మురళీ మనోహర హే గోపాల్, రాధామాధవహే గోపాల్" అనే పాట. ఆదృశ్యాన్ని ఒకసారి స్మరించగానే ఆపాట ఇప్పటికీ నాచెవులల్లో గింగురు మంటూనే ఉన్నది. అది ఒక మరువరాని అనుభూతి. వారి ఉపన్యాసం విన్న తర్వాత నాలో ఎంతో మార్పువచ్చింది. నా వైరాగ్యంలో ఎంతో మార్పువచ్చింది. దాని ఫలితంగా 1972లో శ్రీవ్యాసాశ్రమము చేరుకోగలిగాను.

మరియు 1973లో శ్రీశుకబ్రహ్మాశ్రమాన్ని మొదటిసారిగా దర్శించుకున్నాను. ఆ ప్రశాంతవిశాలాశ్రమమును చూచి అందులో గోడలకు వ్రాసిన ఆణిముత్యాల లాంటి సూక్తి అమృత బిందువులను చదివి ఎంతో ఆనందించాను. వాటిన్నింటిని నా డైరీలో వ్రాసుకున్నాను. ఇప్పటికి ఆ డైరీ నాకెంతో ఉపయోగపడుతూంది.

శ్రీ స్వాములవారు ఎక్కడ ఏ సభలలో ప్రవేశించినా చిరునవ్వులతో హాస్యాలతో ఛలోక్తులతో ప్రారంభించేవారు. జనాన్ని ఆకట్టుకొనే అనేకమైన చిత్రకథలతోను, నీతి కథలతోను, సూక్తులతోను శ్రవణానందగా వారి ప్రవచనాప్రవాహం గంగానదిలాగా అనర్గళంగ సాగేది. శ్రోతలు ఒళ్ళుమైమరిచి ఆనందాబ్ధిలోమునిగేవారు.

1974లో గూడవల్లి మైత్రేయాశ్రమములో జరిగిన శ్రీసనాతనవేదాంతజ్ఞాన సభసందర్భంలో బ్రహ్మీభూత సద్గురుశ్రీవిద్యానందస్వాములవారి వెంట నేను వెళ్ళినాను. ఆ సందర్భములో ఒకసన్నివేశము జరిగినది.

ఆనాటి విడిది శ్రీవిద్యానందస్వాములవారికి శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారికి ప్రక్క ప్రక్కనే ఏర్పాటు చేసినారు.అవి పశువులు కట్టేసే కొట్టాలు, శాలలు. వాటినే కుటీరాలుగా మార్చి శ్రీస్వాములవార్లకు వుండేదానికి ఏర్పాటుచేసినారు. వాటిలో గింజలు అలాగే వున్నాయి. అవి గుర్తు. ఒకరోజు ఉదయం జపధ్యానాలు అయిన తరువాత శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారిని కలుసుకునే దానికి గాను శ్రీవిద్యానందస్వాములవారు వీరికుటీరమునకు వచ్చినారు. శ్రీవిద్యాప్రకాశానందస్వాములవారి కుటీరము

లోను ఆ పశువులకట్టే గుంజలు కనబడినవి. వెంటనే శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు "మీ కుటీరములోను పశువులకట్టే గుంజలే వున్నాయా? దానికర్థమేమిటి? అయ్యా ఓ స్వాముల్లారా! మీ మనస్సును ఇంద్రియాలనే గుఱ్ఱములను ఈ గుంజలకు కట్టి వేయండి అని మనకే వారు వేదాంతం బోధిసున్నారు. ఇలాంటి వారికి మనం ఏం బోధిస్తాము, వీరి బోధలే మనం వినాలి" అన్నారు. ఈ మాటలు వినగానే "శ్రీవిద్యానంద స్వాములవారు" "ఔనౌను" అంటు ఫక్కున నవ్వినారు. మేమందరము నవ్వినాము.

మరోసారి 1976 సం॥రంలో కారంచేడు గ్రామములో నామసప్తాహము శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వాములవారి ఆధ్యర్యములో శ్రవణానందముగ సాగుచున్నది. అందరు తన్మయతతో నాట్యము చేస్తూ నామసంకీర్తన చేస్తున్నారు. ఆ సమయములో ఎంతోమంది మహాత్ములు విచ్చేసివున్నారు. సంకీర్తన అనంతరము మహాత్ములు ప్రవచనాలు చివరిలో పెట్టినారు. ఆ సభకి శ్రీవిద్యా ప్రకాశానందగిరి స్వాములవారే అధ్యక్షులు. అధ్యక్షోపన్యాసము ప్రారంభిస్తూ ఇలా అన్నారు. "అయ్యా నామసంకీర్తన సప్తాహకార్యక్రమము సానందంగ సాగిపోతూంది. ఎంతో మంది భక్తులు నామామృత రసంలో మునిగితేలుతున్నారు. వేలమంది వచ్చారు. చాలా సంతోషము. కాని ఇక్కడ నాకు ఒకపెద్ద పొరపాటు కనబడుతున్నది. అది ఏంటి అంటారా! అసలు నామప్రచారుకుడైన విలేకరినే పిలువలేదు. (నారదుని పిలువలేదు) ఆయనగారి అడ్రసును నే చెబుతాను. వెంటనే వుత్తరం వ్రాయండి వస్తాడు. అడ్రసు శ్రీసంగీతనారదమహర్షి గారు, వైకుంఠం పోస్టు, సత్యలోకం తాలూక, వయాకైలాసం, బ్రహాండం జిల్లా" అన్నారు. అందరూ నవ్వసాగినారు. మరోసారి తమిళనాడులో జరిగిన సభలో అధ్యక్షోపన్యాసం చేస్తూ. "ఈ సనాతన వేదాంత జ్ఞానసభలు మార్చిలో జరగడం ఒకవిశేషమున్నది. సంవత్సరాది పాటునా వ్యాపారులుగాని, సంస్థలుగాని పాత లెక్కలు ముగించి కొత్త జమాఖర్చులు పుస్తకాలు మారుస్తారు. అదేవిధంగా ఫాల్గుణమాసంతో పాతసంవత్సరంపోయి కొత్తసంవత్సరము ప్రారంభ మవుతుంది. అదేవిధంగా ఈ సభలతో మనజీవితాలు గూడ మారాలి. కొత్త జీవితంరావాలి. మార్చుకోవాలి" అంటూ, ఇక్కడ దోమలు చాలావున్నవి ఏమిటియ్యా అంటే-ఒకాయన "స్వామీ! మార్చిలో అన్ని మారుతాయి గదా! ఈ దోమలుగూడా స్వాముల దర్శనభాగ్యము వలన ఏగ్రేడ్ దోమలుగా మారిన వంతే! - అని తమత్కారముగ అన్నాడు.

ఒకసారి శ్రీస్వాములవారు చివరి దశలో ఉన్నారు. శరీరం చాలా కృంగిపోయినది, కంటిచూపు తగ్గినది. ఆ సమయములో శ్రీకాళహస్తీశ్వర సన్నిధానంలో వరదరాజ ఆలయములో దేవస్థానంవారు ఉపన్యాసాలు ఏర్పాటు చేసినారు. ఆ సమయంలో మేము దర్శనానికి వెళ్ళినాము. "స్వామీ మీపరిస్థితి బాగులేదు. ఉపన్యాసాలకు వెళ్ళకపోతే ఏమీ?" అని అన్నాము. స్వామివారు వెంటనే "నేను బాగానే యున్నాను. శరీరం మాత్రము చెడిపోయింది". అందులోను గొంతు బాగానే యుంది. ఉపన్యాసం చేప్పాలనే ఉత్సాహం గూడా బాగానే యుంది. ఈ శరీరాన్ని తీసుకపోయి స్టేజీపైన పెట్టిండి ఉపన్యాసం అదే సాగిపోతుంది" అన్నారు. శ్రీస్వాములవారు ఆ రోజు సుమారు గంటకుపైన ఉపన్యాసాన్ని సాగించారు. వేలమంది ఆనందాన్ని పొందినారు. అగాధమైన వేదాంత విషయాలను సరళగంభీర భావముతోను ప్రవచించినారు. అది విన్న వారందరు మా జన్మధన్యమను కున్నారు. శ్రీ స్వాములవారు పంచరత్నాకరములతో పాటు అనేక గ్రంథములను రచించి లోకాని కెంతో మరువరాని ఉపకారం చేసినారు. కళాశాలలు వైద్యశాలలు నిర్మించి లక్షలమందికి సేవలందిస్తూన్నారు. శ్రీస్వాములవారి యొక్క శతజయన్తి జరుపుకోవటం మన పుణ్యఫలంగా భావిస్తూన్నాను.

ఓం

పూజ్యపాద శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందస్వామి గారి శతజయన్త్యుత్సవాల సందర్భంగా సందేశము.

శ్రీరామకోటి రామకృష్ణానంద స్వాములవారు
శ్రీపురక్షేత్రం, (ఈదులబళ్లాపురం)

వ్యాసుని రచనలలో చివరిరచన భాగవతం. భాగవతం రచించిన వ్యాసుడు సంపూర్ణ శాంతిని బొందాడు. దాని ప్రచారనిమిత్తము తన పుత్రుడైన శ్రీశుకయోగీంద్రులను నియమించి రానున్న కలియుగప్రజానీకానికి మహోపకారం గావించాడు.

అలాగే ఆంధ్రవేదాంతపితగా ప్రఖ్యాతిగాంచిన శ్రీసద్గురు మలయాళస్వాములవారు ఆంధ్ర ప్రజానీకానికి శ్రీమద్భగవద్గీతను గుర్తింపజేసి ప్రతిమనిషి స్త్రీపురుష భేదము లేకుండా అందరు పఠించి సద్గతి గాంచవచ్చునని దండోరా మ్రోగించి మరి చాటి చెప్పారు. "శూద్రులు వేదము పఠించరాదు. స్త్రీ భగవద్గీత పఠించరాదు"- అన్న మూఢ నమ్మకాన్ని బద్దలుచేసి ప్రతివారికి (మానవమాత్రులందరికి) వేదాధ్యయన హక్కువుందని నిరూపించారు.

శ్రీసద్గురు మలయాళస్వాములవారు భగవద్గీతకు భాష్యమైతే, శ్రీశ్రీశ్రీవిద్యాప్రకాశానందస్వాములవారు గీత బహుళ ప్రచారానికి కారకులయ్యారు. ఎంతో క్లిష్టతరంగా వున్న గీతాగ్రంథాన్ని ఆబాలగోపాలానికి, పండితులు నుండి పామరుల వరకు అర్థమయ్యేలా "గీతామకరందమ"ను బృహత్తరటీకా తాత్పర్య ప్రతిపదార్థం, విశేషార్థ, వ్యాఖ్యానాలతో గొప్ప గ్రంథరాజమును లోకానికి అందించిన మహానుభావుడు, మహనీయమూర్తి శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానంద స్వామిజీగారు.

ఈనాడు అంతటి బృహత్తరగీతామకరందములు లక్షలాది ప్రతులు ఒక్కతెలుగుభాషలోనే గాక, ఇంగ్లీషు, కన్నడ భాషలలో ప్రింటుగావించబడి యావత్ భారతావనిలో పల్లెలలో, పట్టణాలలోనే గాక ఇతర దేశాలలో సైతం ప్రచారమయ్యాయి అంటే శ్రీస్వామిజీగారి కృషి వారి రచనానైపుణ్యం, వారి భావమాధుర్యము ఎంత గొప్పదో మన ఊహకుసైతము అందనంతటిదని చెప్పక తప్పదు.

శ్రీస్వామిజీగారు శ్రీమద్భగవద్గీత విశిష్టత ఎంత మహూన్నతమైనదోచాటి చెప్పుటకు మహాభారతము నుండి గీతాప్రాశస్త్యము 9 శ్లోకములూ, స్కాందపురాణం నుండి గీతా ప్రభావం గురించి 13 శ్లోకములను, గీతకు గల18 పేర్లు 3 శ్లోకాలలోను, వైష్ణవ, తంత్రసారమునుండి గీతా మహిమను గురించి దాదాపు 84 శ్లోకములతోను పేర్కొంటూ, గీత ఉపనిషత్తుల సారమని, గీతాఉపనిషత్తుల మంత్రాలను కొన్నిటిని సమన్వయిస్తూ వుదహరించిచూపారు. అంతేకాదు గీతలోని సాక్షాత్ ఉపనిషద్వాక్యములు యథాతథంగా కొన్ని మంత్రాలను ఎత్తిచూపించారు. అలాగే గీతాభక్తులకు ఉపాసనా సౌలభ్యమునకై గీతామాత యొక్కస్వరూపాన్ని

గురించి రెండు శ్లోకములలో సమగ్రస్వరూపాన్ని చిత్రించి చూపారు.

భక్తులకు నిత్యపూజలు గావించుకొనుటకై శ్రీగీతామాత అష్టోత్తరశతనామాలను కూడా మకరందములో భద్రపరచి భక్తులకు ఆహ్లాదాన్ని గల్గించారు. అలాగే శ్రీకృష్ణ అష్టోత్తరశతనామాలు కూడ ప్రకటించి భక్తులను అనుగ్రహించారు.

యమ, నియమ, ఆసన, ప్రత్యాహార, ప్రాణాయామ, ధారణా, ధ్యాన, సమాధులను అష్టాంగ యోగాన్ని భగవద్గీతలో అంతర్లీనంగా వున్నవని కొన్ని కొన్ని గీతా శ్లోకాలను ఉదహరిస్తు ప్రకటించిచూపారు.

అలాగే గీతలోగల 18 అధ్యాయాలను ఒక్కొక్క అధ్యాయాన్ని నిత్యంపఠిస్తే కలిగే లాభమేమిటో సోదాహరణంగా చిన్నచిన్న కథల ద్వారా తెలిపి గీతపై భక్తులకు భక్తిని విశ్వాసాన్ని గల్గించారు.

గీతాస్తోత్రకదంబము అని 12 శ్లోకాలతో గీత యొక్క మహత్తర బోధనుగురించి, గీతగొప్పతమును గురించి గీతామకరందములో చాటిచూపించాడు.

జీవితములో జిజ్ఞాసియైన వాడు నిత్యం పఠించి స్మరించదగు కొన్నివాక్యాలను గీతనుండి దాదాపు 43 (మంత్రాలను) భద్రపరచి చూపారు (గీతామకరందములో 82 పుటనుండి 84 పుటలలో చూడవచ్చు)

గీత అనగా?

శ్రీకృష్ణభగవానుని దూత, శ్రీవ్యాసమునీంద్రుని వ్రాత, అహంకారాదులకు కోత, దివ్యజ్ఞానమునకు దాత, అసురస్వభావమునకగు వాత, దైవీసంపదకు నేత, పరమార్థదృష్టికి మాత, రాగద్వేషములకు మూత, కైవల్యపదమునకు బాట, ప్రణవనాదమునకుగాత, భవసాగరమునకు ఈత, ముముక్షుజనులకు ఊత, ప్రకృతిసామ్రాజ్యమునకు జేత, ధర్మామృతమునకు పోత. అలాగీతకు అనేకరూపములను గావించిన దివ్యమూర్తి శ్రీస్వామిజీగారు,

భగవద్గీత మొత్తము 18 అధ్యాయములలో 701శ్లోకాలను వడగట్టి సంక్షిప్తగీతా సంగ్రహం 18 శ్లోకాలలో ఇమడ్చగల్గిన ప్రజ్ఞాదురంధరులు శ్రీస్వామిజీగారు. అంతేకాదు గీతసప్త శ్లోకినిగా, ఏకశ్లోకినిగా భావగంభీరమైన శ్లోకాలను వెలికితీసి జిజ్ఞాసులోకానికి అందించిన మేధాసంపన్నుడు శ్రీస్వామిజీగారు.

శ్రీస్వామిజీగారు వారి జీవితకాలములో ఒక్క క్షణం కూడా వృధాచేయక అహర్నిశలు గ్రంథరచనలతోను ఆధ్యాత్మిక సభాకార్యక్రమాలతోను, జపధ్యానాదులతోను, కాలానికే ఒకక్రొత్తదనాన్ని ఇచ్చిరూపురేఖలు గల్పించిన పుణ్యమూర్తి. శ్రీస్వామిజీగారి జీవితవిధానమే లోకానికి ఆదర్శాన్ని అందించినది.

వారురచించిన గ్రంథాలలో వ్యాఖ్యానంగావించిన గ్రంథాలు అటుపండితులుకు ఇటు పామరజనాలకు కూడానూ తన అధ్యాత్మిక భావపుష్టిని ప్రసాదించాయనటంలో అతిశయోక్తి ఏమాత్రము లేదనే చెప్పవచ్చు. జిజ్ఞాసు లోకానికి నేటికాలములో స్వామీజీలుగా చెలామణి అవుతున్న మహాత్ములకు మనస్వామిజీగారి జీవనచరిత్ర జీవన సాగరములో ఒక చక్కటి దిక్సూచి యంత్రంలాగా పనిచేయగలదు.

శ్రీస్వామిజీగారు ఆంధ్రావనిలో నూట ఎనిమిది గీతా జ్ఞాన యజ్ఞములు నిర్వహించి శతక్రతుడుగా కీర్తింపబడ్డాడు.

శ్రీస్వామిజీగారు గీతాజ్ఞాన యజ్ఞాలలో ఉపన్యసించినవాటిని ఎప్పటికప్పుడు చిత్తుప్రతులు వ్రాసి వాటన్నిటిని వారి అంతేవాసులైన బ్రహ్మచారి గోపాలుగారు, ''గీతోపన్యాసములు'' అనుగ్రంథాన్ని ప్రచురించి శ్రీస్వామిజీగారు నేటి సమాజమానవులకు ఎనలేని వెలుగుబాటను చూపించారు. వారే నేటి ఆశ్రమాధిపతి "శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వామి" శ్రీశుకబ్రహ్మాశ్రమానికి పీఠాధిపతులయ్యారు.

శ్రీస్వామిజీగారు రచించిన గ్రంథాలు అనేకం అయినా వాటిలో, మోక్షసాధినిన రహస్యం, ఆత్మబోధ, వశిష్ఠగీత, యోగవాసిష్ఠము వాసిష్ఠరామాయణం ఇలాంటి బృహత్తర గ్రంథాలేగాక, పామర గ్రామీణప్రజలకు కూడా వేదాంతాన్ని చిన్న చిన్న గ్రంథాలు తత్త్వసారము, మానసబోధ, ఆధ్యాత్మిజడ్జిమెంటు లాంటివాటిద్వారా అందించారు.

ఆంధ్రావనిలో భగవద్గీతను ప్రతివారికి అందుబాటులోనికి తెచ్చినది శ్రీశ్రీశ్రీ సద్గురు మలయాళస్వాములవారు, శ్రీశ్రీశ్రీవిద్యాప్రకాశానంద స్వాములవారు అనకతప్పదు.

శ్రీసద్గురు మలయాళస్వాముల వారు ఈ కాలానికి వ్యాసావతారమని, శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారు శుకావతారమని చెప్పవచ్చు. యేర్పేడులోనిది వ్యాసాశ్రమముగా, కాళహస్తిలోనిది శుకబ్రహ్మాశ్రమంగా వెలిశాయంటే వీటి అంతరార్థము అదే అనే భావనగల్గుతుంది, కల్గితీరుతుంది.

గీతాసారసంగ్రహము –

శ్రీకృష్ణుండు ప్రపంచమానవులకున్
శ్రేయంబు సంధింపగా
లోకోద్ధారణజేసి పాండవులకున్
లోజూపుగల్గించి, యీ
లోకాలన్నియు తానటంచు తెలుపన్
రూఢిన్ ప్రబోధించె, గీ
తన్ కారుణ్యసుధా పయోధియయి సం
స్థాపింప సద్ధర్మమున్"

"మత్తః పరతరం నాన్యత్
కించిదస్తి ధనంజయ" 7.ఆ.7శ్లో

ఓంతత్‌సత్

"త్యజ దుర్జన సంసర్గం"

మన సంకల్పము లెలాంటివో మన దేహంలో అలాంటి 'వైబ్రేషన్' నిండియుంటుంది. కనుక, దుష్టసంకల్పములతో కూడినవాని దగ్గరకూడా మనం పోకూడదు. ఎందుకంటే, దుష్టులతో సహవాసం చేస్తే వారిలో ఉన్న దుష్టసంకల్పముల 'వైబ్రేషన్' మనలోకూడా ప్రవేశిస్తుంది. కనుకనే, **"త్యజ దుర్జన సంసర్గం, భజ సాధు సమాగమం, కురు పుణ్య మహోరాత్రం, స్మర నిత్యమనిత్యతాం"** మనం మంచివారమైనప్పుడు మన దేహమంతా మంచి 'వైబ్రేషన్' నిండియుంటుంది. అది 'డివైన్ వైబ్రేషన్'గా రూపొందుతుంది. కాని, మన భావాలు చెడ్డగా ఉంటే అంతా చెడ్డగానే కనిపిస్తుంది. మీరు చూసేది ప్రతి ఒక్కటీ మీ అంతర్భావం యొక్క ప్రతిబింబమే. మీరు ఎవరినో చూసి 'వీడు చెడ్డవాడు' అంటారు. కాని, అతను నిజంగా చెడ్డవాడు కాదు. మీ చెడ్డతనమే అతనియందు ప్రతిబింబిస్తున్నది. మంచిచెడ్డలు బయట లేవు, మీలోనే ఉన్నాయి. మీలో మంచి భావములున్నప్పుడు అంతా మంచి 'వైబ్రేషన్' వస్తుంది. కాని, ఈనాటి విద్యార్థులకు ఈ సత్యమును గుర్తించుటకు తగిన శక్తిసామర్థ్యములు లేవు. వారికి కేవలం గ్రంథపరిచయం మాత్రమే ఉన్నదిగాని, హృదయ పరిచయం ఏమాత్రం లేదు. పుస్తకాల్లో ఉన్నది కంఠస్థం చేసి దానిని పరీక్షలో ఏమి వ్రాశారో బయటికి వచ్చిన తరువాత వారికే జ్ఞాపకముండదు. ఇటువంటి చదువులవలన ప్రయోజనమేమిటి? జేనెడు పొట్ట నింపుకోవడంకోసం చదివే చదువులే ఇవన్నీ. పొట్టకూటికోసం చదివే చదువు చదువు కాదు. అది మీలో దివ్యత్వాన్ని పోషించదు, మీకు ఆనందమును అందించదు. హృదయానికి సంబంధించిన చదువు చదవాలి.

– భగవాన్ సత్యసాయి

శతమానోత్సవమ్

శ్రీ స్వామి శివానందబ్రహ్మచారి
(విశ్రాన్త ప్రిన్సిపాల్, సంస్కృతకళాశాల, వారాణసి)

శ్రీకాళహస్తి మహాక్షేత్రమున నెలకొల్పబడిన శ్రీశుకబ్రహ్మాశ్రమ సంస్థాపకులు పూజ్య శ్రీవిద్యాప్రకాశానంద గిరి స్వాములవారి శతమానపు సంవత్సరమున ప్రవేశింపనున్న సందర్భమును పురస్కరించుకొని అభూతపూర్వమైన ఉత్సాహముతో శతజయన్త్యుత్సవ వేడుకలను వైభవోపేతంగా నిర్వహించుకోవాలని ఆశ్రమ పాలకవర్గము నిర్ణయించుకొన్నదని ఆ మహోత్సవములో పాల్గొనడానికై అనేక మంది జగద్గురువులు, మండలేశ్వరులు, మహంతులు, ప్రవక్తలు, పండితులు రానున్నారని ఈ మహోత్సవములో వారు తమ తమ ఆశయాలను అభిప్రాయాలను, సందేశాలను వినిపింపనున్నారని వేదాంతభేరి మూలకంగా తెలుసుకొని సంతసించదగినది.

ఇరువదవ శతాబ్దంలో వైదేశికుల ప్రచురప్రచారాల వలన సంస్కృతాన్ని ఉపాసించెడివారు, సంస్కృతిని రక్షించెడివారు కృష్ణపక్షములోని చంద్రునివలె నానాటికి తరిగిపోతున్నారు. శుభోదయ సూచకమైన సంకేతాలు నశించిపోతున్నాయి. వాటి పరిరక్షణకై అవసరమైన సన్నాహాల విషయమై నిస్పృహతను వహించినందువలన వాటి రక్షణకై కంకణ బద్ధులు కానందువలన భారతీయ సంస్కృతికి మూలమైన సంస్కృతము పరిరక్షణలేని అనాథవలె అధోగతిపాలగుచున్నది. సంస్కృత పరిరక్షణకై పరితపించెడు కొంతమంది వేదవిద్యాలయాలను స్థాపించి వైదిక కర్మకాండనుద్ధరించుటకై ప్రయత్నిస్తున్నారు. వారి ఆ ప్రయత్నము అగతిక గతికమై అపర్యాప్తమై వున్నను విధిలేని పరిస్థితులలో ఆ మాత్రమైన చేస్తున్నారని సంతసించవలసియే యుండును. వర్గభేదాలను విడనాడి వేదాంగాల పరివ్యాప్తికై ఉపక్రమించాలని అనుకొన్నను శాసకుల దృష్టిని కోల్పోయిన ఈ సంస్కృతము ఆర్థిక సమున్నతికి హేతువు గానందువలన విద్యార్థివర్గాలు సంస్కృతాధ్యయన విషయమై తమ అభిరుచిని కనబరచడములేదు.

ప్రవృత్తి నివృత్తి మార్గాల సర్వాంగీణతకు సమర్పితమైన వైదిక వాఙ్మయము ఉభయపక్షాల పరిపోషణకై కర్మకాండనుపాసించెడి వారి నుద్దేశించి "దేవహిత కార్యాభ్యాం న ప్రమదితవ్యమ్" అని, నివృత్తి మార్గాన్నను సరించెడివారిని దృష్టిలోనిడుకొని "స్వాధ్యాయ ప్రవచనాభ్యాం న ప్రమదితవ్యమ్" అని నిర్దేశించింది. సంస్కృత పరిరక్షణకై పరిపోషణకై సాధ్యమైనంత సన్నాహాలు అవసరమనియే చెప్పనగును.

పరివర్తన శీలమైన ఈ ప్రపంచంలో పరివర్తనలు సహజంగా జరిగిపోతుంటాయి. అయినను సనాతన సంస్కృతిని మరియు సంప్రదాయాన్ని వికృత పరచే పరివర్తనల విషయమై నిస్పృహత వహించినచో అనాది కాలంగా విశ్వాన్నాకర్షించిన మనరీతినీతులు తుదిముట్టగల ప్రమాదాలు లేకపోలేదు. ఈ విషయమై విజ్ఞపురుషుల సంకేతాలను తూలనాడుట శ్రేయస్కరము గాదనియే

వహించగలరేని కొంత కాలానికి మన సనాతన సంస్కృతి పునరుజ్జీవితమై కోల్పోయిన తన వైభవమును మరల విశ్వరంగమున ప్రదర్శించి విశ్వమన్ననల నందుకోగలదు. అనెడి విశ్వాసంతో ప్రయత్నించాలి.

చెప్పనగును. ఏ కొంతమందో ఈ విషయమై చింతించినంత మాత్రాన అనుకొన్నంత పురోవృద్ధిని సాధించవీలుగాదు. గాన ప్రతివ్యక్తి ఈ సంస్కృతాధ్యయన విషయంలో తన శక్తి సామర్థ్యాల వంచనకు పోకుండా సహకరించగల మనస్తత్వాన్ని అలవరచుకొన్నచో అనుకొన్న దానికంటే అధికముగ సంస్కృత పరివ్యాప్తికై అనువగు అవకాశాలు దొరకగల సంభావన లున్నాయి. అకుంఠిత దీక్షసాధించ లేనిది ఏమున్నది?

ఇరువదవ శతాబ్దమున శ్రీవ్యాసాశ్రమ సంస్థాపకులగు శ్రీమహర్షిమలయాళ స్వాములవారు సంస్కృత అధ్యయనానికై అనేకులను ప్రేరేపించారు. ఒక అపూర్వమైన క్రాంతికి అంకురార్పణము జేశారు. సంస్కృతి రక్షణకై సభలను సత్సంగాలను సమావేశాలనేర్పరచి సమాజోన్నతికై సర్వవిధముల సహకరించారు. వారి పరికల్పనలు వారున్నవంత వరకే కాకుండా కాశీలో సంస్కృతాన్ని శీలించిన పీఠాధిపతుల ప్రోత్సాహంతో వ్యాసాశ్రమానికి సంబంధించిన అనేక మంది బ్రహ్మచారులు కాశీలో నివసిస్తూ సంస్కృతాన్ని శీలించారు. శతాబ్దంతో పాటు ఈ పరిపాటి గూడా పరిసమాప్తిని చెందింది. సంస్కృతాధ్యయ నాపేక్ష సన్నిగిల్లింది. అర్థోపార్జనాసక్తి అభివృద్ధిని చెందింది. నియమనిష్ఠలతో తపః స్వాధ్యాయాలకై పరితపించెడివారి సంఖ్య నానాటికి తరిగిపోతున్నది. జాతీయతను రక్షించగల సంస్కారాలు నశించిపోతున్నాయి. ఆదర్శాన్నికోల్పోయిన అభిభావకులు తన అనుయాయులకు ఏ ఆదర్శాన్ని బోధించగలరు? ఆశాకేంద్రము అనుయాయులేగాన వారిలో నిక్షిప్తమై వున్న సంస్కారాలను గుర్తింపజేసి వారిని ఉత్తమ పౌరులుగా రూపొందించగల మహానుభావుల అవసరమెంతేని గలదు. ఆశ్రమాలు, ఆశ్రమాధిపతులు ఈ విషయమై జాగరూకతను

ఈ ఆశ్రమ సంస్థాపకులగు శ్రీవిద్యాప్రకాశానంద స్వాములవారు సమాజాన్ని సంస్కరించిన శ్రీవ్యాసాశ్రమంలో (తిరుపతి తిరుమల కొండలలో శ్రీమలయాళ స్వాములవారు అనేక సంవత్సరాలు ఘోరతపస్సాధనలు చేసినట్లే) అపక్వాహారియై అనేక సంవత్సరాలు తపఃసాధనలను చేశారు. ఈ విషయము ఆశ్రమవాసులకు అందరికి సర్వవిదితమే. ఇంతియేగాకుండా శ్రీశుకబ్రహ్మాశ్రమమును స్థాపించిన తర్వాత గూడ అనేక సంవత్సరాలు అపక్వాహారియై ఆశ్రమ అభివృద్ధికై పరితపించారని శ్రీకాళహస్తీశ్వర ఆలయము నుండి ప్రసాదింపబడిన ప్రసాదంతో పరితృప్తిని జెందారని, అకుంఠిత దీక్షతో ఆధ్యాత్మిక ప్రవచనాలతో అపర వివేకానందుల విఖ్యాతి నార్జించారనెడి విషయం-వారి అనుయాయులందరికి సువిదితమై యుండినదని చెప్పనవసరమేమున్నది? నేడు శ్రీవారి అనుయాయులు, శిష్యులు అయిన శ్రీ విద్యాస్వరూపానంద స్వాములవారి సారథ్యంలో శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారి శతమానోత్సవము జరిపించుకొనుటకు సన్నద్ధమైయున్నది. ఆశ్రమ సంస్థాపకుల తపస్సు ఆశ్రమ అభివృద్ధికి హేతువైయున్నందు వలన నిరంతరాయముగ ఆశ్రమము పురోవృద్ధిని జెందగల అవకాశాలున్నాయి. శ్రీకాళహస్తీశ్వర జ్ఞానప్రసునాంబలు ఆశ్రమ అభివృద్ధికై అవసరమైన సహకారాల నందజేస్తూ ఆశ్రమమును సర్వాధికముగ వికసింపజేయుదురు గాక!



స్మరణతప్ప మార్గము లేదు

శ్రీ గంగాధరానంద స్వాములవారు,
శ్రీకృష్ణగీతాశ్రమం (ప్రొద్దుటూరు)

"ఓం నమో బ్రహ్మాదిభ్యో బ్రహ్మవిద్యా సంప్రదాయకర్తృభ్యో
వంశఋషిభ్యో, మహద్భ్యో నమో గురుభ్యః ॥

"యోన్తః ప్రవిశ్యమమవాచమిమాం ప్రసుప్తాం,
సంజీవయత్యఖిలశక్తి ధరః స్వధామ్నా ।
అన్యాంశ్చ హస్త చరణ శ్రవణ త్వగాదీన్
ప్రాణాన్నమో భగవతే పురుషాయ తుభ్యమ్ ॥"

ఆహా! ఏమి సుదినము! లోకోత్తర పురుషులు, ప్రాతఃస్మరణీయులు, పూజ్యపాదులు బ్రహ్మీభూత శ్రీశ్రీశ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారిని గూర్చి ప్రస్తుతకాలములో తెలియని యువతరానికి కూడ తెలియజేసి, అందఱిని పవిత్రులుగా జేయుటకు నుద్దేశించి, 2013 ఏప్రిల్‌కు "100" సం॥లు గనుక శజజయంత్యుత్సవాలు జరుపవలెనని నిశ్చయించి-ఒక సంచిక వెలువరించడము చాలా ఆనందదాయకము. ఇట్టి లోకోత్తర మహనీయుని గురించి ఏమని స్తుతించవలెను? వీరిని స్మరించినంత మాత్రాన, ఆనందము, ఆహా యనిడి ఆశ్చర్యము, స్తబ్ధత ముప్పిరి గొన్నచో శబ్దములు స్తుతించుటకెచ్చట దొఱకును.

తల్లిదండ్రులు గొప్పభక్తులగుటచే వీరికి చిన్నప్పటి నుండియే దైవభక్తి, దయ, పరోపకారము, ప్రేమతత్త్వము మొదలగు సుగుణములుండుట చేతనే "డిగ్రీ" పూర్తి కావడముతోడనే మహత్తరమగు శ్రీ "శివపంచాక్షరీ" మంత్రమును 1932వ సం॥లో సద్గురు శ్రీశ్రీశ్రీ పూజ్య మహర్షి మలయాళస్వాములవారుపదేశించిరి. ఆ మంత్ర అనుష్ఠానము (జపము) చేయుచూ. హిందీలో కూడ దక్షిణ భారతహిందీ సభవారు నడుపు "రాష్ట్ర, విశారద" పరీక్షలందు ఉత్తీర్ణులై 1935వ సంవత్సరములో కాశీపట్టణమునకేగి అచట "కాశీవిద్యాపీఠమందు" చేరి హిందీపాండిత్యము గూడ గడించిరి. వీరి పూర్వనామధేయము "ఆనందమోహను". ప్రపంచమందలి పామరజనుల మోహము తొలగించి జ్ఞాన జ్యోతివెలిగించి ఆనందము నొందించుట కేతించిన మహా పురుషులు గనుక ప్రాపంచిక విద్యలు చక్కగ నెఱింగి "తద్విజ్ఞానార్థం సగురుమేవాభిగచ్ఛేత్, సమిత్పాణిః శ్రోత్రియమ్ బ్రహ్మనిష్ఠమ్" అన్న ఉపనిషత్సారవాక్యాను సారము తగిన సంప్రదాయబద్ధముగా 1936వ సం॥ పూజ్యశ్రీశ్రీశ్రీ అసంగానందగిరి స్వాములవారు అనిపేరు గల శ్రీమలయాళస్వాములవారి దగ్గఱ గురుకులవాసము, తపస్సు చేసిరి.

వీరు మొదటి నుండియు శ్రద్ధాభక్తులు కలిగి శ్రీ"శివాపంచాక్షరీ" మహామంత్రజపమును చక్కగా నునుష్ఠించుటచే మల, విక్షేప దోషములు తొలగిపోయినవని గ్రహించిన శ్రీ సద్గురు దేవులు వీరికి ఆవరణదోషము తొలగి ఆత్మసాక్షాత్కారము నొందుటకు మహావాక్య చతుష్టయము నొకశుభముహూర్తమున అనగా 1936 మే నెల 17వ తేది ఏకాదశినాడుపదేశించిరి.

"తం దుర్దర్శం గూఢ మనుప్రవిష్టం
గుహాహితం గహ్వరేష్ఠం పురాణమ్ ।
అధ్యాత్మయోగాధిగమేనదేవం
మత్వా ధీరో హర్షశోకౌ జహాతి ॥

"ఆత్మని అధికృత్య తిష్ఠతి ఇత్యధ్యాత్మ" ఈ అధ్యాత్మ విచారణ ద్వారా అనగా శరీర త్రయవిచారణచే "అయమాత్మా బ్రహ్మ" అను సాక్షాత్కారవాక్యము, అవస్థాత్రయ విచారణచే "ప్రజ్ఞానం బ్రహ్మ" అను లక్షణవాక్యార్థము గోచరించును. వీటి విచారణ జరుగునపుడు గురువుగారు "తత్త్వమసి" అను బోధవాక్యమును, "తత్‌ఆబ్రహ్మము" అనగా లక్షణవాక్యముచే సిద్ధించిన అర్థము, సాక్షాత్కారవాక్యముచే సిద్ధించిన అర్థము, త్వం అసి (నీవైయున్నావు.) అట్లు బోధించగానే ఇదివరకు గోచరించిన వాక్యముల యొక్క అర్థమును అంతర్గతముగా, ఆశ్చర్యముతో గూడిన ఆనందపరవశుడై "అహం బ్రహ్మాస్మి" అను అనుభవ వాక్యమును న్మరించుకొనెను. గురుకులవాసములో, గురు సాన్నిధ్యమున, ఏకాంతముగా అపక్వాహార, నియమముతో ఘోరతపము నాచరించి, (ద్వాదశవర్షములు) 1947వ సం॥ము ఆషాఢశుద్ధఏకాదశి నుండి శుద్ధ పౌర్ణమివరకు కఠినదీక్షతో హోమాదులు నిర్వహించి ఆషాఢశుద్ధ పౌర్ణమినాడు సన్న్యాస దీక్షనుగ్రహించిరి. తదుపరి లోకోపకారమునకై 1950వ సంత్సరములో ఆశ్రమస్థాపన గావించి పూజ్యగురుదేవులైన శ్రీశ్రీశ్రీ మలయాళస్వాముల వారిచే ప్రారంభోత్సవము గావించిరి. "స్వయం తీర్ణాః పరాంస్తారయతి" అను శాస్త్ర వాక్యమును సార్థకము గావించిరి. "భగవద్గీతను ముఖ్యముగా గ్రహించి, దానికి "గీతామకరందము"అను వ్యాఖ్యను చాల విపులముగా వ్రాసి, మన ఆంధ్రదేశమునందేగాక దేశములోని ముఖ్యపట్టణము లందంతటను బహుజనాకర్షముగా బోధించి ప్రచారము గావించిరి. ఇట్టి మహనీయుని గూర్చి ఎంత చెప్పినను పూర్తికాదు. ఇట్టి మహనీయులు భౌతికముగా 1998లో కనుమఱుగైరి. స్మరణతప్ప మార్గము లేదు.

"ఓం తత్సత్"

ధ్యానము - అత్యావశ్యకము

పరమార్థమార్గమున పురోగమించు సాధకునకు ధ్యానము అత్యావశ్యకమైయున్నది. ఒక వస్తువును గూర్చి తదేకనిష్ఠతో ధ్యానించునపుడు ధ్యాతయొక్క చిత్తమంతయు ధ్యేయాకారముగ పరిణమించిపోవును. ఇది ప్రకృతిలోగల నియమము. కీటకము (పురుగు) భ్రమరమును (తుమ్మెదను) నిరంతరం చింతన జేయుటవలన భ్రమరాకారముగ మారుచుండునని లోకప్రతీతి. దీనినే "భ్రమరకీట న్యాయము" అని అందురు. చిత్తము ఒక అద్దము వంటిది. అద్దము తన ముందు (పురోభాగమున) ఏది వుండునో దానిని తనయందు ప్రతిబింబింపజేసికొని తద్రూపమును బొందుచుండును. అట్లే చిత్తమున్ను. అసురసంపత్తి, దయ్యపు స్వభావమును దాని ముందుంచిన చిత్తము ఆ అసుర రూపముచే పొందును. దైవసంపత్తి, సత్త్వగుణములను దాని ముందుంచిన చిత్తము ఆ సత్త్వగుణరూపమునే, దైవ సంపద్రూపమునే పొందును. కావున పారమార్థిక శ్రేయమును కోరువారు నిత్యశుద్ధ బుద్ధముక్తమగు హృదయమందున్న పరమాత్మను ధ్యానించుచు చిత్తమును దానియందే ప్రతిష్ఠితము చేయవలెను. **మనస్సును బాహ్యం నుండి అంతర్ముఖమొనర్చి ఆత్మయందు స్థాపించి పరమాత్మను ధ్యానించాలి. ఆత్మేతరమగు దేనినీ చింతించరాదు.**

- స్వామి విద్యాప్రకాశానంద

విద్యాతపోభ్యాం పూతాత్మా

- శ్రీ మాతా ప్రతిభానందగిరి
శ్రీభూమానందాశ్రమం, గండిక్షేత్రం

పరమపూజ్యశ్రీస్వాములవారి శతజయంతికి శతసహస్ర ప్రణామములు మానసికంగా అందిస్తూ శ్రీస్వాములవారి స్మరణ యీ వ్యాసరూపంగా లభించినందుకు పరమానందం చెందుతూ యీ అవకాశం అందించిన పూజ్యశ్రీ మాతృస్వరూపులు గురుతుల్యులు శ్రీవిద్యా స్వరూపానంద స్వాములవారికి కృతజ్ఞతా పూర్వక వందనాలు సమర్పిస్తూన్నాను.

దైవాంశసంభూతులు పూజ్యశ్రీవిద్యాప్రకాశానంద గిరి స్వాములవారి గీతాప్రచారం పల్లెలు పట్టణాలలో ఆబాలగోపాలం-మానవత్వం నుండి మాధవత్వం పొందింపజేయు విధంగా సాగినది. వారి గీతామకరందం అందరికి ఆనందాలను చవిచూపింది. వారి బోధ, రచన అందరి హృదయాలను ఆకర్షించిందంటే వారి ఆచరణాత్మక జీవనవిధానంయొక్క గొప్పదనం. ఆచరణలేని వారిమాటలు గాలిలో కొట్టుకొని పోతాయి. ఆచరణ కల్గి ఆదర్శమూర్తులుగా వున్న మహాత్ముల సదుపదేశాలు యుగ యుగాలకు స్మరణ పూర్వకంగా నిలబడి పోతాయి.

పూజ్యశ్రీస్వాములవారు విద్య తపస్సులు రెండు కల్గి విద్యతో జ్ఞానం, తపస్సుతో అనుభవం పొందిన మహనీయులు. ఒక విద్యతోనే జీవితం పునీతం కాదు. తపస్సు కూడా అత్యంత ప్రధానం. విద్య ఒక్కటే ప్రధానమైతే అహంకారం నిర్మూలనం కాదు. తపస్సు వున్నచో విద్యకు రాణింపు. అహంకారరహితునిగా చేసి రాణింపజేయును. అప్పుడే పరిపూర్ణత. అందుకే శ్రీపెద్దస్వాములవారు (మహర్షిసద్గురు శ్రీమలయాళ స్వాములవారు) "విద్యాతపోభ్యాం పూతాత్మా" అని బహుపర్యాయములు వారి ప్రవచనాల్లో ప్రకటించేవారట

సద్గురువులను అనుసరించిన వారిలో శ్రీస్వాముల వారు మరుపురాని మహనీయులు. విద్యతోపాటు తపస్సు ఆచరించినవారు. 12సంవత్సరాలు సద్గురు సన్నిధిలో తపస్సు 1సంవత్సరం మౌనం ఆచరించిన ఆదర్శ మహనీయులు శ్రీస్వాములవారు. మా సద్గురు దేవులకు వారికి చాలా అవినాభావ సంబంధముండినది. ఆచరణ లోనూ, రచనల్లోనూ ప్రవచనాలల్లోనూ శ్రీస్వాముల వారికి, మా గురుదేవులకు అనేక పోలికలు గోచరిస్తాయి.

వారిద్దరూ కలసినప్పుడు వారి సంభాషణ వినే భాగ్యం నాకు కలిగినది. వారి సంభాషణలో ఆనందం వర్ణనాతీతం. ఒకేకోవకు చెందినవారు కలిస్తే యే రంగంలోనైనా ఒక గొప్ప అనుభూతి కల్గుతుంది. జ్ఞానానుభవంలో వున్నవారు కలిస్తే ఆ అనుభూతి బ్రహ్మానందమే. మహనీయులను స్మరించు కొంటే మనకు పుణ్యం కల్గుంది. ఒక పుణ్యమే మానవునికి సరిపోదు, వారు

ఆచరించి పొందిన జ్ఞాన బోధను మనమూ ఆచరిస్తే మనకు జ్ఞానప్రాప్తి.

దుఃఖనివృత్తి ఆనందప్రాప్తి కలగాలనుకొంటే వారి ఆచరణను అనుసరించాలె. భగవంతుడు అందుకే వివేకం ప్రసాదించాడు మానవునికి. అజ్ఞానమనే అంధకారం పోవాలంటే జ్ఞానమనే అనుభవం పొందాలె. జ్ఞాన మనే అనుభవం గ్రంథాలనుండి శ్రవణాదుల వలనే వస్తుందనే అంధవిశ్వాసం వదలి ఆచరణ అనే సూత్రం పట్టుకొని తీరాలి. మహనీయులందరూ ఆచరించి చూపించి ఆదర్శనీయులై శతజయంతులు నడుపుకొంటున్నారు. పైవారికి శత జయంతులే కాదు స్మరణలో సహస్రజయంతులు నడుస్తాయి.

శ్రీస్వాములవారి రచనలు అనేకం వున్నాయి. జనులు వారి వారి స్థాయికి తగినట్లు వారి గ్రంథాలు పఠించి పవిత్రత పొందే అవకాశము శ్రీస్వాములవారు కల్పించారు. పరంపర నడిపే విధానము కూడ చేకూర్చిన ఆదర్శ మూర్తులు స్వాములవారు. పూజ్యశ్రీ విద్యా స్వరూపానందగిరి స్వాములవారిని పీఠాధిపతిని చేసి వారి కీర్తిని మరింతా స్థిర స్థాయిగా నిలుపుకొన్నారు. పూజ్యశ్రీవిద్యాస్వరూపానంద స్వాములవారు గురుకార్యంలో తను మన ధనములు అర్పించి కర్మ-భక్తి -జ్ఞానం మూడింటిలో ఆదర్శమూర్తులుగా మన అందరి హృదయాల్లో మాతృమూర్తిగా నిలబడినవారు. వారితోనే ఆశ్రమాదర్శం సంపూర్ణమైనది. అందుకే వారు ఉత్తరాధికారిగా శ్రీసంపూర్ణానందస్వాములవారిని నియమించారు. ఇక ఆశ్రమానికీ శతజయంతులు ఘనంగా జరుగుతాయి. ఆ విధంగా ఆశ్రమానికి ఆశ్రమమూర్తి శతజయంతికి యీ పుష్పాంజలి సమర్పిస్తూ శెలవు తీసుకొంటున్నాను.

ఓం తత్సత్ ఓం

With Best Compliments From :

OM NAMAH SIVAYA

ON THE OCCASION OF CENTENARY CELEBRATIONS OF HIS HOLINESS VIDYA PRAKASANANDA GIRI SWAMIJI, FOUN DER, SRI SUKA BRAHMA ASHRAM, SRI KALA HASTI

WITH PRANAMS

M/S. G.V.ENTERPRISES

SHOP NO.5, SRI RAMA SHOPPING COMPLEX
(SRI RAMA LODGE),
MUTHU MAISTRY STREET,
CHITTOOR (AP)
CELL #. 9866113691

ఓంనమో భగవతే శ్రీమలయాళతీన్ద్రాయ

అన్వర్థనామధేయులు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామిజీ

- శ్రీ మాతా కృష్ణానందగిరి
మైత్రేయ్యాశ్రమము (గూడవల్లి)

దుర్లభం త్రయమేవైతద్దైవానుగ్రహహేతుకమ్ ।
మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయః ॥

అని భగవత్పాదులు శ్రీశంకరాచార్యులు వివేక చూడామణియందు నుడివినట్లు దైవానుగ్రహహేతుక మగు మనుష్యత్వ ముముక్షుత్వ, మహాపురుష సంశ్రయము లనెడి మూడు లక్షణములు మూర్తీ భవించిన తేజోమూర్తులు పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు. సామాన్యులుగా జన్మించి మాన్యతను సాధించిన మహనీయులు మహర్షి సద్గురు శ్రీమలయాళ స్వాములవారి ప్రథమశిష్యులు. శ్రీగురుదేవుల ఆశయాలను తు.చ. తప్పక పాటించిన శిష్యవరేణ్యులు. సంఘశ్రేయస్సునకే తమ జీవితము నంకితము చేసిన ధన్యజీవులు.

శ్రీస్వాములవారు శ్రీకాళహస్తిలో శుకబ్రహ్మాశ్రమమును స్థాపించి శ్రీగురుదేవులచే ప్రారంభోత్సవము చేయించిరి. శ్రీగురుదేవులు శిష్యుని సామర్థ్యమును గుర్తించినవారై తాము స్థాపించిన సనాతన వేదాంతజ్ఞాన సభలకు స్వాముల వారి నధ్యక్షులుగా నియమించిరి. శ్రీవారు సభాధ్యక్షులై అనేక సభలను క్రమశిక్షణతో సమర్థవంతముగా నిర్వహించిరి. చతుర్విధ శుశ్రూషలను చక్కగా ననుష్ఠించి, సద్గురుదేవులను ప్రత్యక్షముగా సంతృప్తిపరచిన మహనీయులు వీరు.

శ్రీస్వాములవారితో ప్రత్యక్షపరిచయము చాల తక్కువైనప్పటికిని వారియెడల నాకు ప్రత్యేకాదరముండెడిది. తెనాలిలో జరిగిన శ్రీస్వాములవారి ఉపన్యాసములకు తప్పక హాజరయ్యెడి దానను. ఒక్కసారి మాత్రము కొడాలి కృష్ణ కుమారితో కలిసి స్వాములవారి మకామునకు వెళ్లు అవకాశము లభించినది. శ్రీస్వాములవారి పవిత్రహస్తములతో మాకు అమృతబిందువులు అనుపుస్తకమును, భగవద్గీత (కర్మయోగము) కాసెట్‌ను ఇప్పించిరి. వారి గ్రంథములు చదివినప్పుడెల్ల ఇప్పటికిని నా మనస్సులో ఆ దృశ్యము మెదలుచునే ఉండును.

శ్రీస్వాములవారి పేరు వినగానే మొదట స్ఫురించునది వారి గీతామకరందము. టీక, తాత్పర్యము, వ్యాఖ్య, ప్రశ్నోత్తరరూపముతో విరాజిల్లుచు పరిశోధనా గ్రంథముగా తరతరాలుగా ఉపయోగపడునట్లు రచించిరి. వసిష్ఠగీత, మోక్షసాధనరహస్యము మున్నగు గ్రంథములు ప్రతి జిజ్ఞాసువు తప్పక చదువదగినవి. విద్యావిహీనులకు సైత మర్థమగునటుల తత్త్వ సారము, మానసబోధ మున్నగునవి గేయరూపముగా రచించిరి. శ్రీస్వామివారి ఉపన్యాసాలను టి.టి.డి వారు కాసెట్స్‌గా ప్రచారములోనికి తెచ్చుట మిక్కిలి ముదావహం. నాదృష్టిలో మానవ జీవితమును సార్థకము చేసికొనుటకు వారు రచించిన 'అమృతబిందువులు' ఒక్కటిచాలు.

పూజ్యశ్రీవిద్యాస్వరూపానంద స్వాములవారు 1985లో మహర్షి సద్గురుమలయాళ స్వాములవారి శతజయంత్యుత్సవములను మిక్కిలి వైభవముగా జరిపించిరి. ఇప్పుడు శ్రీశుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులై అంత వైభవముగాను శ్రీస్వాములవారి శతజయంత్యుత్సవములను జరుపబూను కొనుట మిక్కిలి హర్షదాయకము. శ్రీస్వాములవారి రచనలను బాగుగా ప్రచారము చేసి వారి కీర్తిని శ్రీవ్యాసాశ్రమ సంప్రదాయమును దశదిశలు చాటు శక్తిని, అనుష్ఠానశక్తిని శ్రీసద్గురుదేవులు భక్తులందరికీ ప్రసాదించుగాక.

సమాజమునుండి మనము మేలు పొందినంత కాలము తప్పక మనము సమాజాభివృద్ధికి మనవంతు కృషి యొనర్చవలసిన ఆవశ్యకత ఎంతేని గలదు. ఈవిషయమును చక్కగా గుర్తించిన శ్రీస్వాములవారు శ్రీకాళహస్తిలో శ్రీశుకబ్రహ్మాశ్రమము, కళాశాల, సంచారవైద్యవిభాగము, నేత్రచికిత్సాలయముల ద్వారా అనేక ప్రజోపయోగకర కార్యము లొనర్చిరి.

అనుష్ఠానముతో అత్యున్నత స్థానమును అందుకొనవచ్చునని నిరూపించిన మహాత్యాగి, ఆదర్శయతీశ్వరులు శ్రీస్వాముల వారు.

With Best Compliments From :

OM NAMAH SIVAYA

ON THE OCCASION OF CENTENARY CELEBRATIONS OF HIS HOLINESS VIDYA PRAKASANANDA GIRI SWAMIJI, FOUN DER, SRI SUKA BRAHMA ASHRAM, SRI KALA HASTI

WITH PRANAMS

SRI. BUSI REDDY SIVARAMI REDDY
SMT.BUSI REDDY PARVATHAMMA
SRI.BUSI REDDY PRATHAP REDDY (SON)
SMT.BUSI REDDY YAMUNA (DAUGHTER IN LAW)
CHI.BUSI REDDY GNANA ASWARTHA REDDY (GRAND SON)

SRI SRI SRI YELLAMMA THALLI CHARITIES
YUREKHA WATERS

NAGAVARAM
CHITVEL MANDAL, KADAPA DIST (AP)
PHONE #. 08566 248232

ఆనంద జ్యోతి

శ్రీమాతా బ్రాహ్మీ గాయత్రిగిరి.
శ్రీ రామకృష్ణాశ్రమం (ఈదులబళ్లాపురం)

ఆత్మబంధువులారా! పరమ పవిత్రులు, బ్రహ్మనిష్ఠులు అయిన శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారి శతజయంతి సందర్భంగా వారి దివ్యచరణములకు నాశిరస్సు వంచి నమస్కరిస్తూ, వారి గురించి భక్తితో నాలుగు వాక్యములను మీ ముందుంచుతూన్నాను.

"ఆనందమే బ్రహ్మానందం" అన్నారు. అదే బ్రహ్మస్వరూపమని కూడా అన్నారు. ఉత్కృష్టమైన మానవ జీవితాన్ని బ్రహ్మానందమయం చేసుకుని, సకల సద్గుణాలను కలిగి, సమ్యక్ దృష్టికలిగి, సత్యవ్రతులై జీవించారు మన విద్యాప్రకాశానందగిరి స్వాములవారు. పరమపదంలో పరమానంద భరితుడై నిత్యుడై నిరంతరం ప్రకాశిస్తున్న జ్ఞానదీపంవారు. తల్లిదండ్రులువారికి పెట్టిన పేరు "అనందమోహన్". ఆ పేరును సార్థకం చేసుకున్నారు నిత్యానందుడైన మన గురువుగారు. వారు నిజంగానే పవిత్రులు. 'కాలం దైవస్వరూపం' అంటూ వారు జీవించినంత కాలం, సమయాన్ని వృథా పరచకుండా, నిత్యం, నిరంతరం ఆధ్యాత్మిక చింతనలోనే ఆచరణాత్మకంగా గడిపారు. సత్యవ్రతమును ఆచరిస్తూ, అహింసను పాటిస్తూ, సర్వులను ప్రేమగా పలకరిస్తూ, సత్సాంగత్యంలోనే గడుపుతూ, సత్యస్వరూపులైనారు. "పహలే కరో, పీచే కహెూ" (నడి, నుడి) అన్న సిద్ధాంతాన్ని తూచా తప్పక పాటించారు. ఎందుకంటే! వారు మలయాళస్వాములవారి సన్నిధిలో మెలిగినవారు కదా మరి! అందుకే దీర్ఘకృషితో పాటు, ధర్మతత్పరతతో వారు ముందుకు నడిచి, మనలను నడిపింప ప్రయత్నంచేసి, ఆదర్శమూర్తులయ్యారు. నిజమేమరి!

ధర్మబద్ధమైన కోరికలు కలిగివుండి, పరిశుద్ధమైన ప్రవర్తనతో మనం జీవనాన్ని సాగిస్తున్నట్టయితే, మనలోని "ఆత్మశక్తి" సాక్షాత్కారం మనకు కలుగుతుంది. అంతటి ఆత్మవిశ్వాసం మనం పొందాలి కదా! శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వాములవారు ఆధ్యాత్మిక ప్రచారనిమిత్తమై 1963 జనవరిలో వేదాంతభేరి మాసపత్రికను జనులందరి కోసం ప్రారంభించారు. స్వామివారు ఈ మాసపత్రికద్వారా మంచి, మంచి విషయాలను ఎంతో ఆధ్యాత్మిక సంపదను మనకు అందించారు. వారియొక్క అనుభవ వేదాంతాన్ని, హితోక్తుల రూపకంగా, వ్యాసాలు, వ్యాఖ్యల రూపకంగా, గానరూపకంగా, కథలరూపకంగా మనకు అందించిన మహానుభావులు మన స్వామివారు.

1969 జూన్‌లో వచ్చిన "వేదాంతభేరి"మాసపత్రిలో మన విద్యాప్రకాశానందగిరి స్వాములవారు "మోక్ష ద్వారపాలకులు"లో రెండవద్వారా పాలకుడు "విచారణ" అని మనకు తెలియజేశారు. ఈ "విచారణ" ద్వారపాలకుని మంచి చేసుకొనిన, అతడు మోక్షసాధకవాటమును ఉద్ఘాట మొనర్చివేసి, పరమాత్మయను ప్రభువును సందర్శింపజేస్తాడని మనకు తెలిపారు. సంసార దుఃఖమును తరింపదలంచు వారికి తత్త్వవిచారణ అత్యంతావశ్యక మన్నారు. భ్రాంతిలోపడి తల్లడిల్లుతున్న వారికి విచారణ తప్ప వేరే శరణ్యమేదీ



లేదన్నారు. అవును మరి! "విచారణ" చేస్తే తప్ప 'విచారం' తొలగదు. అందుకే ఈ 'విచారణ'ను బుద్ధియోగమని, వివేకమని కూడా అంటారు. అలా బుద్ధిలో విచారిస్తే తప్ప, రెండు వస్తువులమంచి చెడ్డలు మనకు తెలియవు. అందుకే మన గురువుగారు ఈ విధంగా తెలిపారు.

గుజ్జునుండి తొక్కను తీసివేసినట్టుగా, బియ్యం నుండి రాళ్ళువేరు చేసినట్లుగా, హంస పాలనుండి నీళ్లను వేరు చేసినట్లుగా వివేకవంతులు సత్యాసత్యములు, క్షేత్రక్షేత్రజ్ఞులు, దృగ్దృశ్యములు కలిసివున్న ఈ ప్రపంచమును తత్త్వవిచారణచే చక్కగా వివరించి, విభజించి, దృశ్యముపై ఆసక్తి వీడి, దృగ్రూపమైన పరమాత్మనే స్వీకరించి, తదేక పరాయణులై వర్తించెదరు.

ఏది ఏమైనా, ఆధ్యాత్మిక విషయములను జనులందరికి అందించటంలో వారికి వారేసాటి. ఆ వేదాంత భేరి-మాసపత్రికలో గురువుగారు వల్లించిన హితోక్తిని మరొకటి చెప్పుకుందాం. "ఈ అనంతమైన ఆకాశంలో సూర్యుడెంత? సూర్యుని దగ్గర నలుసుగా కన్పించే భూమి ఎంత? భూగోళంలో ఆసియాఖండమెంత? అందులో ఆంధ్రప్రదేశ మెంత? నాజిల్లా ఎంత? నా జిల్లాలో నా ఊరెంత? నాఊరిలో నా ఇల్లెంత? నా ఇంటిలో నేనెంత? ఈ ప్రకారంగా ఆలోచిస్తే ఇక గర్వానికి, అహంకారానికి చోటేవుండదు". గురువుగారు ఎంతబాగా ఆలోచించారు చూడండి! వీరి సహజత్వం ఇందులోనే తెలుస్తుంది, నామరూపాలుగా కల్పించే ఈజగత్తంతా కనుమరుగై పోవలసిందే. కానీ శాశ్వతమైన శక్తి 'ఆత్మశక్తి'. "యద్దృశ్యం తన్నశ్యం" -కంటికి కనిపించేదంతా కాలగర్భంలో కలిసిపోవలసిందే. చివరకు శరీరం కూడా, అలాంటప్పుడు గర్వమెందుకు? అహంకారమెందుకు?

పుటముచే మట్టము బంగారుం మేలిమి బంగారంగా మారునట్లు సామాన్యుడగు జీవుడు ఆత్మపరిశోధన చేతను, వైరాగ్యం చేతను సాక్షాత్ శివుడుగామారి పోగలడని-స్వాములవారు మనకు సెలవిచ్చారు. అభ్యాస ప్రాబల్యముచే మనుజుడు సమ్యక్ దృష్టి గలిగి చక్కగా వ్యవహరించాలంటూ సందేశ మిచ్చారు. భోగలాలసతను పరిత్యజించి విషయముల యెడ, విరక్తి గలిగి ఆత్మోన్ముఖుడు కావాలని చాటి చెప్పారు. "తత్త్వసారంలో కూడా ఇలా తెలుపుతున్నారు.

కామదాసుడు కాకుమోరన్నా- కామంబు శత్రువని
గీత శాస్త్రము పలుకుచున్నదిరా-కామదాసై చెడుటకంటె
రామదాసై యుంటమేలు -రామభక్తిని కలిగి రయమున
ముక్తి ధామము చేరు నరుడా ॥ తత్త్వసారము॥

అరిషడ్వర్గాల్లో ఆదిశత్రువు 'కామము' అంటే కోరిక. అది ఏదైన కావచ్చును. ఆ కోరిక తీరకపోతే క్రోధం, తరువాత 'మోహం' ఇలా వెంట, వెంటనే కలుగుతాయి. కాబట్టి మొదటిదైన "కామము' అనే శత్రువును జయిస్తే, మిగతా శత్రువులు అవంతకవే పలాయనం చిత్తగిస్తాయి. మనసు ప్రశాంతత చెందుతుంది. ఏ కోరికలు లేని మనసు, శుద్ధమై, పరిశుద్ధమై, పరమాత్మను కోరుకుంటుంది. అందుకే మన గురువుగారై నటువంటి విద్యాప్రకాశానందగిరి స్వాములవారు సులభంగా సరళంగా బోధ జేశారు. ఇలా మనలో అంతర్గతంగా నిద్రాణములైన అద్భుత శక్తులను తత్త్వాల రూపకంగా జాగృతంచేస్తూ పరిపూర్ణ బోధలను మనకు అందించారు. "మానసబోధ"లో కూడా ఇలా చెబుతున్నారు.

స్వస్వరూపాత్మను లెస్సగా ఎరుగుటే
నరజన్మ లక్ష్యము మనసా-తన్నుతా నెరుగక
ఏమి పొందిన కూడ శాంతి కలుగదు ఓయిమనసా!

ఔను. అంతేమరి! "తనను తాను తెలుసుకుంటే తానే దైవం" అన్నారు యోగినారాయణ స్వామి. అలానే మన గురువుగారు కూడా మన ఆత్మశక్తిని తెలుసుకోమంటున్నారు. తద్వారా దివ్యశక్తిని పొంది జీవిత లక్ష్యాన్ని సాధించ మంటున్నారు. ఇలాగ మన విద్యాప్రకాశానందగిరి స్వాములవారు పామరజనులకు, పసిపిల్లలకు సైతం అర్థమయ్యే విధంగా తత్త్వాల రూపకం గానే, వేదాంతసారాన్ని అంతా వడగట్టి, అందించి, అందరిలోనూ భక్తిభావం నింపి, మోక్షమార్గంవైపు నడిపించారు. వారు రచించిన "గీతామకరందం" అమోఘం. అద్భుతం" వారి వ్యాఖ్యలు కూడా మధురాతి మధురంగా వున్నాయి. అందుకే అది 'మకరందం' అయింది. 'గీతామకరంద' మయింది. తేనె కన్నామరీ తియ్యదైన దయింది. నిజంగా కృష్ణభగవానుడే మన గురువుగారిలో ఆవాహనై వ్రాయబడిందేమో గానీ, నేను గీత గురించి ఎన్నో రకరకాల పుస్తకాలను, వ్యాసాలను, వ్యాఖ్యలను, పరిశీలన చేశాను. కానీ మన గురువుగారు రచించిన "గీతామకరందం" మాత్రం నా మనసులో అలానే స్థిరమైంది. ఎందుకోమరి! నాకు అంత మధురమనిపించింది. "ఈ గీతామకరందం" దేశవ్యాప్తంగానే కాకుండా విదేశాల్లో కూడా మంచి ప్రశంసలను అందుకుంది. మరి అంతటి మహానుభావులు మన విద్యాప్రకాశానందగిరి స్వాముల వారు. మరి మనం అలాంటి మహానుభావుణ్ణి మరువగలమా! మరువలేము.

మరివారి ప్రతిభకు, వారి, పరిపూర్ణజ్ఞానమునకు, వారి పవిత్రమైన సాధుత్వానికి, వారి బ్రహ్మనిష్ఠకు, మరి వారి పరమపావనమైన పాదారవిందములకు, శిరసా, మనసా, వాచా, ప్రణమిల్లుతూ, శతకోటి దండ ప్రమాణములను అర్పించుకుంటున్న గురు పాదరేణువు.

గురుపుష్పమాలిక

పల్లవి॥ వందనం వందనం గురుదేవా వందనం
శ్రీవిద్యాప్రకాశానంద నీకు వందనం ॥వంద॥

చ॥ అందమె ఆనందం గీతా మకరందం
అది అందరి హృదయాలలో విరిసిన సుమగంధం
అపరకృష్ణుడై వెలసి అందించిన ఈ మకరందం
జ్ఞానార్థుల పాలిట అది అమృత భాండాగారం
॥వంద॥

చ2 ॥ తనువు మరచి నిద్రించు తరుణమందు తట్టిలేపి
తత్త్వసారమందించి తత్వజ్ఞానము పెంచి
తనువులను మరిపించి - తాదాత్మ్యం పొందించి
పావన జనులను సైతం పావన మొందించావు.
॥వంద॥

చ3 ॥ మానస బోధనుచేసి -మనసుల రంజింపజేసి
మాయ తెరను తొలగించి -మనసు మల్లెగ మార్చి
మా అందరిహృదయాలలో -భక్తి భావము నింపిన
మా తండ్రి గురుదేవా -మరువలేము మీసేవ.
॥వంద॥

చ4 ॥ వేదంబులందుండు -వేదార్థము నీవు
సకల విద్యలలోన మోక్ష విద్యవు నీవు
సాటిలేరు నీకు సద్గురు దేవా శరణు శరణు
కాళహస్తి శుకబ్రహ్మాశ్రమ నివాస శరణు శరణు
॥వంద॥

ఓంతత్సత్

అసమానమూర్తి



శ్రీ ఆచార్య పరిశుద్ధానందగిరి స్వాములవారు
శ్రీ విశ్వనాథ క్షేత్రం, శ్రీపరాశ్రమము,
హైదరాబాదు.

శ్లో॥ నమో బ్రహ్మాదిభ్యో బ్రహ్మవిద్యా సంప్రదాయకర్తృభ్యో
వంశఋషిభ్యో మహద్భ్యో నమో గురుభ్యః
శ్రీ నారాయణ గుర్వాద్యామసంగానంద మధ్యమామ్ ।
విద్యాప్రకాశపర్యంతాం వందే గురుపరంపరామ్ ॥

పూజ్య శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు మన ఆంధ్రదేశం చేసుకున్న పుణ్యం వల్ల అవతరించారు. బాల్యం నుండి అనవరతం ఆధ్యాత్మిక సాధనలో మునిగితేలిన మహానుభావులు. ఆధ్యాత్మిక సంపన్నత కలిగిన సుపరి వారంలో జన్మించి శ్రీ సద్గురు మలయాళస్వాములవారి చరణసన్నిధి చేరి పన్నెండు సంపత్సరములు వారి నీడన తపమాచరించిన తపోధనుడు. గురు సన్నిధానమున తపమాచరించి సిద్ధిపొందినవారి చరిత్రలు చాలా అరుదు. సకల భోజన సౌకర్యములున్నా అపక్వాహారియై తప మాచరించుట వారి తీవ్రనిష్ఠకు తార్కాణము. తపః కాలమునే అశేష ఆధ్యాత్మిక గ్రంథములు అధ్యయనము చేసి వడపోసి వంటబట్టించుకున్న మహానుభావుడు. నిరాడంబరమైన జీవితము, నిరంతర ఆధ్యాత్మిక ప్రవచనము, అనేక గ్రంథ రచనలు, ప్రచురణలు వారి దివ్య సంపదలు

శ్లో॥ మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥

అని గీతయందు చెప్పబడినట్లుగా దైవతత్త్వాన్ని ఎరిగిన సిద్ధపురుషుడు. ఆంధ్రదేశమున ఆధ్యాత్మిక సంపద విస్తరింపజేసిన వారిలో సాటిలేని గురుమూర్తులు శ్రీ మహర్షి సద్గురు మలయాళస్వాములవారు. ఆంధ్రదేశమున శ్రీమద్భగవద్గీతను సువిస్తారముగా ప్రచారము చేసిన వారిలో సాటిలేని గురుమూర్తి పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు.

వారి పూర్వజన్మ పురాకృత పుణ్య వైభవం వల్లనే వారి ఆధ్యాత్మిక సంపద వికసించింది. ప్రపంచంలో అన్నింటికన్నా గొప్పయైనవాడు గురువు. "సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం" శ్రుతినెరిగినవాడు బ్రహ్మనిష్ఠుడును నైన వారినే గురువుగా ఉపనిషత్తునందు చెప్పబడినారు. ఈ రెండు సంపూర్ణముగా నిండియున్న మూర్తి శ్రీ సద్గురు మహర్షి మలయాళస్వాములవారు. అట్టివారు గురువుగా దొరకడం వారు చేసుకున్న మహోత్తమ పుణ్యానికి నిదర్శనం. 19 వశతాబ్దం ఆంధ్రదేశం ఈ గురుశిష్యులను కనడం మనందరి మహత్తర పుణ్యవిశేషము. శ్రీ స్వాములవారి గీతోపన్యాసములు సీడీలరూపములో ఆంధ్రదేశమంతటా విస్తరించి నేటికిన్నీ వారు సజీవముగానే యున్నారనే భ్రమను కలిగించుచున్నది. వారు రచించిన "శ్రీ గీతామకరందం"

వాడని పుష్పముగా విశ్వవ్యాప్తముగా వికసించియున్నది. వారి తపస్సు వారి నిరంతర కృషి ఈ గ్రంథమునందు ధారపోసిరి. అనుభవము, యథార్థము, సరళత, సర్వజనోపకారమైన ఇట్టి గ్రంథము ఇంకొకటి ఉద్భవించుట అసంభవముగానే చెప్పుకొన వచ్చును. ఆచరణ లేని వాచావేదాంతులు వ్రాసిన గ్రంథములెన్నివున్నా దీనితో ఎన్నటికినీ సరిపోవు.

పూజ్యశ్రీ స్వాములవారి గీతోపన్యాసములు ఆబాల గోపాలమును ఆకర్షించెడివి. గీతయందలి సారతత్త్వములతో పాటు అవి అర్థమగుటకు కావలసిన లౌకికసూక్తులు, సమాజమందలి ఉదాహరణలు, పగలబడి నవ్వించే ఛలోక్తులు జడివాన కురిపించినట్లుగా విన్నవారిని ముగ్ధమనోహరముగా చేసెడివి. ఆంగ్లభాషయందు వారికి సమమైన పట్టు వుండెడిది. శిష్యులను, గురువులను కూడా గాడియందు పెట్టునవిగా వుండెడివి.

ఒకసారి పుట్టపర్తి పట్టణములో శ్రీ సత్యసాయివారి సన్నిధానమున మహాసభలు జరిగినవి. ఆ సభయందు వారిచ్చిన ఉపన్యాసము అట వచ్చిన శ్రోతలకేగాక శ్రీసాయిబాబానుకూడా కదిలించివేసినది. ముఖ్యముగా వారిచ్చిన ఉదాహరణలలో ఒకటి శ్రీ సాయిని కదిలించివేసినది. వారిచ్చిన ఉదాహరణము -

"ఈ ప్రపంచము అనంతమైనది. ఈ అనంతమైన ఈ విశ్వప్రపంచములో లెక్కకు మించి కోటానుకోట్ల గ్రహములు, ఉపగ్రహములు వ్యాపించియున్నవి. ఇట్టి గ్రహముల మధ్యలో భూమిగ్రహము ఒక ఆవగింజతో సమానమైనది. ఈ ఆవగింజతో సమానమైన ఈ భూమి యందు మూడువంతుల నీళ్ళు విస్తరించియుండగా ఒకవంతు మాత్రమే భూమి అగుపడుచున్నా, ఈ నాల్గవవంతు భూభాగమునందున మూడు భాగములు పర్వత, అరణ్యములు విస్తరించి జనావాసములకు యోగ్యముగాకున్నది. మిగిలిన ఒక భాగము మాత్రమే జనులు నివసించుటకు ఉపయోగకరముగానున్నది. ఈ ఒక భూభాగమునందును వందలకొలదీ దేశములు కలవు. వాటిలో భారతదేశము ఒక చిన్న మూలన విస్తరించియున్నది. ఈ భారతదేశమునందును ఆంధ్రదేశము ఎంతకలదు? అనంతపురం ఎంతకలదు? దానియందును పుట్టపర్తి ఎంతకలదు? దానియందును నీవెంతకలవు? ఈ విశ్వప్రపంచములో ఆవగింజకు సమానమైన ఈ భూమి గ్రహమున నీవెంత? నీ ఆస్తియెంత?" అని ప్రశ్నించగా జనులందరు నిరహంకారులై, జ్ఞానపులకితులై నిశ్చేష్టులైరి.

వారి ప్రవచనములయందు వారిచ్చే ఉదాహరణములు సూటిగా తగిలి మానవుని పరివర్తనకు దారి తీసెడివి.

శ్రీ శుకబ్రహ్మాశ్రమస్థాపనయున్ను గురువైన శ్రీసద్గురు మలయాళస్వాములవారిచే శంకుస్థాపనచేసి ప్రారంభింప చేసుకోవడము వారి గుభక్తికి ప్రతిబింబము. ఆశ్రమము దివ్యక్షేత్రములయందు లేక మహానగరముల యందు నెలకొల్పినచో ఎక్కువకాలము మనుగడ గలిగియుండ గలవని శ్రీ రామకృష్ణానందగిరి స్వాములవారు అనెడువారు. తిరుపతి మహాక్షేత్రము , శ్రీ కాళహస్తీశ్వర మహాక్షేత్రము-దేశమందును, ప్రపంచమందును ప్రసిద్ధిగాంచినవి. వాని సన్నిధానములో ఆశ్రమనిర్మాణము చేసి నిరంతరము భక్తులకు అందుబాటులో ఉండుటకు సంకల్పించడం వారి విజ్ఞతకు తార్కాణము.

శ్రీ శుకబ్రహ్మాశ్రమం 1950 సం॥న స్థాపించినప్పటి నుండి నేటివరకున్ను నిరంతరం సమాజసేవయందు భక్తుల

సేవయందు నిమగ్నమై చరితార్థమైనది. శ్రీవ్యాసునకు శ్రీశుకునకు గల సంబంధమే శ్రీ మహర్షి మలయాళస్వాముల వారికి శ్రీ సద్గురు విద్యాప్రకాశానందగిరిస్వాములకు కలదు. కావుననే ఈ శుకబ్రహ్మాశ్రమం పేరు చరితార్థమైనది.

"గురవో బహవస్సంతి శిష్యవిత్తాపహారకాః ।
గురవో విరలాస్సంతి శిష్యహృత్తాపకారకాః ॥

శిష్యుల విత్తాన్ని అపహరించే గురువులకు కొరవలేదు. కాని శిష్యుల మనో మాలిన్యమును హరించే గురువులు అరుదుగా యుందురుకదా!

"కులం పవిత్రం జననీ కృతార్థా
వసుంధరా పుణ్యవతీ చ యేన"

శ్రీ స్వాములవారి జననంతో వారి మాతాపితరుల కులాలు పవిత్రమైనవి. ఈ భూమి పుణ్యవతి అయినది. వారికి తప్పక శతజయంతులు జరుగవలసిందే. నీరాజనాలు పలకాల్సిందే. జోహార్లు సమర్పించాల్సిందే.

"మంగళం గురుదేవాయ గీతాబోధ ప్రదాయినే ।
విద్యాప్రకాశరూపాయ గురుదేవాయ మంగళమ్"॥

ఓమ్ తత్సత్!

ఓమ్ శ్శాంతి శ్శాంతి శ్శాంతిః

With Best Compliments From :

OM NAMAH SIVAYA
ON THE OCCASION OF CENTENARY CELEBRATIONS OF HIS HOLINESS VIDYA PRAKASANANDA GIRI SWAMIJI, FOUN DER, SRI SUKA BRAHMA ASHRAM, SRI KALA HASTI

WITH PRANAMS
VISWA HINDU PARISHAD
RAILWAY KODUR BRANCH
KADAPA DIST (AP)

REPRESENTED BY :
SRI. M.PRABHAKAR REDDY
SRI.M.BALARAMA RAJU
SRI.A.DASARAMAIAH
SRI.D.VENKATA REDDY
SRI.A.NARASIMHULU SWAMY
SRI.S.MALLIKARJUNA

With Best Compliments From :

OM NAMAH SIVAYA

ON THE OCCASION OF CENTENARY CELEBRATIONS OF HIS HOLINESS VIDYA PRAKASANANDA GIRI SWAMIJI, FOUN DER, SRI SUKA BRAHMA ASHRAM, SRI KALA HASTI

WITH PRANAMS

LATE SRI. DARISA VENKATA NARASA REDDY
SMT. RAMALAKSHMAMMA
SRI.D.VENKATA REDDY (SON)
SMT.D.ESWARAMMA (DAUGHTER IN LAW)

M/S MASTER ROAD LINES
RAILWAY KODUR
KADAPA DIST (AP)
CELL #. 9440975405



గీతామకరంద కృష్ణుడు

శ్రీ ప్రణవానన్ద గిరి స్వాములవారు
శ్రీ వసిష్ఠ హరే రామ జపయజ్ఞ ఆశ్రమము (కారంచేడు)

భారత కృష్ణుడు కొందరికి మాత్రమే తెలుసు. భాగవత కృష్ణుడు మరికొందరికి మాత్రమే తెలుసు. భగవద్గీతా కృష్ణుడు ఇంకా కొందరికిమాత్రమే తెలుసు. అందరికి తెలుసునని చెప్పలేము. "గీతామకరంద కృష్ణుని" గురించి తెలియనివారుండరంటే అతిశయోక్తి కాదు. గీతా మకరందము వెలుగులోకి వచ్చిన తరువాతే అసలు భగవద్గీత చాలా మందికి తెలిసొచ్చింది. భగవద్గీతను విన్న అర్జునుడు తనకు తాను తరించాడు. తాను విన్న గీతను గురించిన రచనా ప్రవచనా పాటవాలు కనిపించవు. గీతా మకరందమును చదివిన, విన్నవారు అనేకులు ప్రవచనాలను సాగిస్తున్నారు. హరికథలు, బుర్రకథలు, పద్యాలు, పాటలు లోకంలో వినిపించు చున్నారు. భగవద్గీత వక్త శ్రీ కృష్ణ భగవానుడు. భగవద్గీతా స్రష్ట శ్రీ వేదవ్యాస మహర్షి. గీతామకరంద స్రష్ట పరమపూజ్య శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు. మహర్షి శ్రీ మలయాళ సద్గురు దేవులు భగవద్గీతను అందరి చేతులతో పట్టించారు. పరమపూజ్య శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారు భగవద్గీతా పాంచజన్య శంఖాన్ని పూరించి, గీతామకరందాన్ని సర్వమానవుల నోటికే పట్టించేశారు. భగవద్గీతను బయటకు తెచ్చింది శ్రీ మలయాళ సద్గురు దేవులు. భగవద్గీతాభావవియద్గంగను లోకములో ప్రవహింపచేసింది మాత్రం గీతామకరంద స్రష్ట శ్రీ స్వామి విద్యాప్రకాశానందుడే. అవునంటారా? కాదంటారా!

శ్రీమలయాళ సద్గురు దేవుని పదసన్నిధిని చేరిన వారు చాలామంది విద్యార్థులుగా చదువు నిమిత్తము వచ్చి గురుదేవుల దర్శన, స్పర్శన, సంభాషణ ప్రభావంతో ఆశ్రమములో నిలిచిపోయినవారు శిష్యభావముతోనే వచ్చినవారని చెప్పలేము. పరమ పూజ్యశ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామివారు ఆనందమోహన్ అనే పేరుతో ఇంటి వద్దనే పట్టభద్రుడై, కాశీపట్నంలో విద్యనభ్యసించి సాక్షాత్ శిష్యుడిగా శ్రీ సద్గురు దేవుని పదసన్నిధి చేరినవారు. కనుక శ్రీ మలయాళ సద్గురు దేవుని సాక్షాచ్ఛిష్యుడు శ్రీవిద్యా ప్రకాశానందగిరి స్వామి వారేనని ఘంటాపథంగా, నగారా మ్రోగించి మరీ మరీ చెప్పవచ్చు. మరొక్కమాట భగవద్గీతా పరంగా శ్రీ సద్గురు దేవుని మహోన్నత ఆశయాన్ని భారతదేశ పలు రాష్ట్రాల్లో ఇంత విస్తారముగా ప్రచార ప్రభంజనంతో జన సమూహాన్ని ఉఱ్ఱూతలూగించి గీతామకరంద మహోదధిలో ముంచెత్తిన మహాప్రజ్ఞాశాలి, శుద్ధ సాధువరేణ్యుడు, సాగర గంభీరుడు, మేరు సమాన ధీరుడు, హిమవత్పర్వత స్థిర స్థితప్రజ్ఞుడు, పరమ వైరాగ్య సమ్రాట్టు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామివారే తప్ప శ్రీ సద్గురు దేవుని శిష్యపరంపరలో మరొక్కరిని చెప్పలేము. చెయ్యెత్తి చూపలేము. ఇది జగమెరిగిన సత్యం.

మరొక్కముఖ్యమైన మాట. అనితర సాధ్య మహత్పూర్ణ సంఘటన ఇది. శ్రీ సద్గురుదేవులు శ్రీవ్యాసుని

అంశతో శ్రీ వ్యాసాశ్రమాన్ని స్థాపించారు. శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు శ్రీ శుకబ్రహ్మ అంశతో శ్రీ శుకబ్రహ్మాశ్రమాన్ని స్థాపించారు. ఇటువంటి గురుశిష్యసాంప్రదాయ సామ్యము మరొక్కరిలో వెతికి వెతికి చూడగలమా? న భూతో న భవిష్యతి. నిజమంటారా? కాదంటారా? నిజము, నిజము, ముమ్మాటికీ నిజము.

చివరిమాట. శ్రీ వ్యాసులవారిని "వ్యాసమహర్షి" అనుట సుప్రసిద్ధం. వ్యాసబ్రహ్మ అనే మాట అప్రసిద్ధం. అలాగే శ్రీ సద్గురు దేవుని మహర్షి శ్రీ మలయాళ సద్గురు స్వామి అని మాత్రమే అన్నారు. శ్రీ వ్యాసుని కుమారుడైన శ్రీ శుకుని శ్రీశుకబ్రహ్మయని ఎంతో ఆదరభావంతో పిలిచారు. శ్రీమలయాళ సద్గురు దేవుని సాక్షాత్ శిష్యుడైన శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు "అపర శుకబ్రహ్మ"గా నిర్లిప్త, నిర్లేప, పరావిరాగ చక్రవర్తిగా మహాజ్ఞాన ప్రకాశంలో విలీనులయ్యారు.

చివరగా ఒక్కమాట. శ్రీ మలయాళ సద్గురు దేవులు ముప్పది రెండువేల శ్లోకాలతో కూడిన శ్రీ యోగవాసిష్ఠమను పరాకాష్ఠ వేదాంత గ్రంథాన్ని ఎందరు కొంటారని, ఎంతమంది చదువుతారని తెనిగించి, ముద్రించి ఉంటారో విజ్ఞులు ఆలోచించండి. ఒక్కొక్క సంపుటము నేను తలమీద మోసేంత బరువు గల నాలుగు పెద్ద గ్రంథాలు. ఎంత శ్రమించి, ఎంత ధనం వెచ్చించి ఉంటారో మన ఊహకు అందదు. అంతటి మహోన్నత వేదాంత గ్రంథరాజమును శ్రీ సద్గురు దేవుని శిష్యులనిపించుకొన్నవారిలో ఆదరభావంతో రచనాప్రవచనా పాటవాల్లో శ్రద్ధచూపారా? చరిత్ర పుటల్లో వెదికితే దొరుకుతారా? శ్రీమలయాళ సద్గురు దేవుని సాక్షాత్తు శిష్యుడైన శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు శ్రీయోగవాసిష్ఠ గ్రంథాన్ని సంగ్రహించి అందరికీ సులభ సాధ్యమగునట్లు శ్రీ వసిష్ఠగీత(వాసిష్ఠ రత్నాకరం) యను బృహద్గ్రంథమును రచించి జిజ్ఞాసువులకు అందించారు మరియు నూట ఎనిమిది గీతాయజ్ఞాల్లో ప్రతిరోజూ ఉదయం 6.30 గంటల నుండి 8.00 గంటల వరకు శ్రీయోగవాసిష్ఠగ్రంథంపైనే ప్రవచనం కొనసాగించారు. ఇది అందరికి ప్రత్యక్ష సాక్ష్యం. పూజ్య శ్రీస్వామివారి చరిత్ర నిర్మాణంలో ఈ అద్భుతమైన ఘట్టం ఒక మధుర భాగం కాదా?

శ్రీ మలయాళ సద్గురు దేవుని ఆధ్యాత్మిక విప్లవ మహోద్యమంలో ఒక మహా యోధుడుగా శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి జీవితం సువర్ణాక్షరాలతో లిఖింపదగిన చారిత్రక భాగం! ఈ విధంగా నా అభిమాన గురుదేవులు పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిని గురించి ఎన్నని చెప్పమంటారు? స్మరించుకుంటూ తరించిపోదాం! నా ఆధ్యాత్మిక జీవితానికి మొట్టమొదటి ఆశ్రయం శ్రీ శుకబ్రహ్మాశ్రమం. నా ప్రథమ సాధుదర్శనము శ్రీ శుకబ్రహ్మాశ్రమ సంస్థాపకులు బ్రహ్మీభూత పరమపూజ్యపాద శ్రీశ్రీశ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారే యని చెప్పుకొనుటకు నేను సంతోషపడుచున్నాను. శ్రీస్వామివారి దర్శనభాగ్యంతో నేనూ సాధువునైనాను. పూజ్యశ్రీ స్వాములవారి ఉపన్యాస శైలి మరొక్కరిలో చూడజాలము. శ్రీమద్రామాయణంలో శ్రీ వాల్మీకి మునీంద్రుడు రామరావణసంగ్రామం ఎలా జరిగిందన్న విషయం లోకానికి చెప్పదలంచి, "గగనం గగనాకారం, సాగరం సాగరోపమః, రామరావణయోర్యుద్ధం, రామరావణ యోరివ" ఆకాశానికి ఆకాశమేసాటి, సముద్రానికి సముద్రమే ఉపమానం. వీటికి మరొక్క ఉపమానం అంటూ చూపలేము.

అలాగే రామరావణులయుద్ధం రామరావణయుద్ధంవలెనే ఉన్నదంటూ చెప్పి మౌనం వహించారు. అదే విధంగా పరమపూజ్య శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారి మహోన్నత వైరాగ్య జీవిత వైభవం, శ్రీ స్వామివారి ఉపన్యాసధోరణి, మరొక్కరిలో చూడలేము. శ్రీ స్వాములవారి పలుగీతా యజ్ఞాలలో నేనూ పాల్గొన్నాను. ఒక్కమాటలో చెప్పాలంటే, ఉపన్యాసము ముగిసేంతవరకు ట్రాఫిక్ బంద్, ఒక్కొక్కప్పుడు "జోక్" కొట్టారంటే సభమొత్తము కడుపులు పట్టుకొని పడిపడి నవ్వాల్సిందే. మచ్చుకు ఒక్కటి చెప్పుకుందాము.

ఆ రోజు ఉపన్యాసమధ్యలో సాధనకు సంబంధించిన విషయం చెబుతున్నారు. అభ్యాసానికి ఉన్న బలం దేనికీలేదంటూ చెబుతూ సాధకుడికి ముఖ్యంగా వైరాగ్యముండాలి, అభ్యాసవైరాగ్యాల వల్ల మనస్సు నిగ్రహించ వచ్చంటూ, యోగ శాస్త్రం నుండి, భగవద్గీతనుండి ప్రమాణాలు ఉదహరిస్తూ చమత్కరించారు. సాధన విషయంలో తొందర పడరాదంటూ... "సతు దీర్ఘకాల నైరంతర్య సత్కారాసేవితో దృఢభూమిః" అన్నటువంటి యోగ సూత్రాన్ని వివరించారు. ఆదరభావంతో క్రమంగా దీర్ఘకాలం సాధన చేయాలని చెబుతూ, అత్రగాడు ఔత్తరేయుని (ఉత్తరదేశస్థుని) సంధ్యావందన సాధన గురించి చెప్పారు. ఉత్తరదేశస్థులు హిందీభాషను మాట్లాడుతారు. ఒకమార్వాడీ శేటు ప్రయాణంలో 15 రోజులు సంధ్యావనందం చేయలేదు. ఒకరోజు ప్రయాణం ఆపేసి సుఖాసనంలో కూర్చొని సంకల్పము ప్రారంభించారు. ----- శుభే శుభాభ్యాం, శోభన ముహూర్తే, అద్య బ్రహ్మణః ద్వితీయపరార్ధే శ్వేత వరాహ కల్పే వైవస్వత మన్వంతరే, కలియుగే ప్రథమ పాదే, జంబూద్వీపే భారత వర్షే భరతఖండే... అని ప్రారంభించి గోత్ర, సూత్ర నామ ప్రవర చెప్పి చివర "పన్ద్రహ్‌దిన్ కా సంధ్యావందన్ ఏక్ ధమ్ కరిష్యే" అంటూ నీళ్ళు వదలిపెట్టాడని చెప్పారు. పదిహేను రోజులు సంధ్యావనందనం ఒక్కదెబ్బలో కొట్టేస్తున్నానని అన్నాడట. సభికుల నుద్దేశించి శ్రీస్వాములవారు ఇలాంటి ఏక్‌ధంలు, గమ్ములు సాధనలో పనికిరావంటూ చమత్కరించారు. సభలో అందరూ కడుపులుబ్బేటట్టు పడిపడి నవ్వారు. "గీతామకరంద కృష్ణుడు" పరమపూజ్యశ్రీ విద్యా ప్రకాశానంద గిరి స్వాములవారి మధుర జీవిత ఘట్టాలు స్మరించుకుంటూ తరించిపోదాం! ఇప్పటికి చాలా మంది స్వాములు పూజ్యశ్రీ స్వామివారి శైలిలో ఉపన్యాసాలు చెప్పటానికి ప్రయత్నించారు. ఇప్పటికీ ప్రయత్నించుచునే ఉన్నారు. వారి ప్రయత్నాలన్నీ గణపతిని చేయ ప్రారంభించి హనుమంతుని తయారు చేసినట్లుగా ఉంది.... అస్తు.

ప్రస్తుతము శ్రీ స్వామివారి స్థానములో ఆశ్రమాధిపతిగా శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి సాక్షాత్ శిష్యుడు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు అధిష్ఠించి శ్రీ గురుదేవుల అడుగుజాడలలో, ఛత్రఛాయల్లో పయనిస్తూ ఆశ్రమ నిర్వహణ బాధ్యత చక్కగా కొనసాగిస్తున్నారు. వైరాగ్యమూర్తి స్థానంలో వైరాగ్యమూర్తే రావడం విశేషం. 2013 ఏప్రిల్ నెలలో శ్రీ గురుదేవుల శతజయంతి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుపదలంచి భక్తులందరినీ సాదరంగా ప్రేమతో ఆహ్వానిస్తున్నారు. వెళ్ళిచూచినవారు మహాభాగ్యులు, చూడలేనివారు మందభాగ్యులు... స్వస్తి.

జై గురుదేవ .... జైజై సద్గురు దేవ...
ఓం శ్శాంతి శ్శాంతి శ్శాంతిః
ఓం తత్సత్ ఓమ్....



శతజయన్తి కుసుమాంజలులు

పూజ్యశ్రీ సర్వేశ్వరానందగిరి స్వాములవారు
(చిత్తూరు)

(రచయిత సర్వేశ్వరానందగిరి స్వాములవారు ఈ వ్యాస రచనానంతరం 10 రోజులలో బ్రహ్మలీనులైనారు. వారి ఆత్మకు శాన్తి కలుగుగాక! సం.)

ప్రియాత్మస్వరూపులారా!

అనేకాశ్రమములు ప్రస్తుతకాలమున పుబ్బలోపుట్టి మఖలోమరుగై కాలగర్భములో విలీనమగుచున్న సమయములో అనేక అనూహ్య అవరోధముల నెన్నింటినో అధిగమించుచు 1963 వ సంవత్సరమున మౌక్తి కోత్సవము జరువుకొని, అటుపై 1975 వ సంవత్సరములో రజతోత్సవమును 2001లో స్వర్ణోత్సవమును కూడ జరిపి ప్రస్తుతము శ్రీ స్వాములవారి శతజయన్తి చేసుకొనుచున్న శ్రీ శుకబ్రహ్మాశ్రమమునకు ఆశ్రమ పీఠాధిపతులకు, కార్యదర్శులకు మరియు కార్యకర్తలకు నా హృత్పూర్వక స్వర్ణకుసుమాంజలులు.

ఈ శతయజన్తి స్వర్ణావకాశమున శ్రీ శుకబ్రహ్మాశ్రమ సంస్థాపకులును, మద్గురువరేణ్యులునైన బ్రహ్మలీన శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకాచార్య పరమదయామయ శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానంద యతివరేణ్యుల పవిత్ర పాదపద్మములకు సాష్టాంగ దండప్రణామము లర్పించి శ్రీవారి సంస్మరణ మొనరించుట మన ముఖ్య కర్తవ్యమనుటలో నెట్టి అతిశయోక్తియు లేదనిపించుచున్నది. ఏలయన, మన అందరి పరమ గురువరేణ్యులును, శ్రీవారి సాక్షాత్తుగురుదేవులునునైన శ్రీశ్రీశ్రీ అసంగానందయతిరాజశేఖరుల "పురోభివృద్ధి గోరువారు పూర్వవృత్తాంతము మరువ రాదు" అనెడి అనుభవైక మహావాక్యోపదేశము ప్రకారమియ్యది సమంజసమే కదా!

పంచభూత లింగములలో వాయులింగముగ ప్రసిద్ధి గాంచిన పరమ పవిత్ర శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధానమున గల సువర్ణముఖీనదీ తీరమున శ్రీవారి స్వర్ణకరకమలములచే స్థాపించబడిన శ్రీ శుకబ్రహ్మాశ్రమము శ్రీ వ్యాసాశ్రమాధి వతులును, శ్రీవారి గురుదేవులునునైన శ్రీశ్రీశ్రీ అసంగానందయతీశ్వరులచే ప్రారంభోత్సవ మొసరింపబడి, గురుశిష్యుల దివ్యసంకల్ప శక్తి, తపః ప్రభావముచే దినదినాభివృద్ధి నొందినది. ఇటులనే పురోగమించి భక్తవరేణ్యులకు సేవాసహాయ సహకారము లొనరించుచు, సహస్ర జయంతులను మున్ముందు జరుపుకొను నటుల పరమేశ్వరుడనుగ్రహించుగాక యని, హృదయపూర్వక ప్రార్థన.

పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు ఉన్నతవిద్యావంతులేగాక, తీవ్ర తపస్సంపన్నులును, పరమ ప్రేమస్వరూపులునునైన త్యాగమయులు. శ్రీ వ్యాసాశ్రమ వాసులుగా, కఠోరబ్రహ్మచర్య అనుష్ఠాన పరులుగా,

పండ్రెండేళ్లు అపక్వాహార దీక్షతో పరమగురుదేవుని సేవా శుశ్రూష లొనరించి గురువరేణ్యుల అనుగ్రహపాత్రులై విలసిల్లిరి. ఆంధ్ర వివేకానందులుగా ప్రసిద్ధి నొందిన పరమ పవిత్ర, ఆధ్యాత్మిక ప్రచారకులుగా, సనాతనవేదాంత మహాసభాధ్యక్షులుగా ఆఖరిక్షణము వరకు కొనసాగిన మహామనీషులు. నీటిలోబడి కొట్టుకొనిపోవుచున్న చిన్న చీమను గాంచిన చేతితో తీసిగట్టున పెట్టి ఆనందించు పరమ కరుణామయులు. పేదసాదల ఆరోగ్యము కొరకెంతయో వేదన నొంది తత్ఫలితముగా కంటి వైద్యశాలను స్థాపించిరి. శ్రీవారు ఆధ్యాత్మిక సాధనలను ఆచరింపచేయు అకుంఠిత దీక్షాపరులు. శతాధిక ఆధ్యాత్మిక గ్రంథములను రచించి ఆంధ్రావని యంతటను దైవీ సంపదను వితరణగావించిరి. పండితులకేగాక పామరజనులకు కూడ సులభముగా ఆధ్యాత్మికత అలవడుటకై "మానసబోధ" "తత్త్వసారము" అనుగేయ కావ్యములను రచించారు. శ్రీమద్భగవద్గీతా ప్రవచనములను కూడా అటులనే సులభముగా అవగాహన మగునటుల తేటతెలుగులో ప్రచార మొనరించి ఆధ్యాత్మిక సాధకులకపరిమిత మేలొనరించిరనుటలో నెట్టి సందియమును లేదు.

ఆంధ్రావనిలోనేగాక తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలలో కూడ పట్టణములలో సులభశైలి ద్వారా శ్రీమద్భగవద్గీతను బహుళ ప్రచార మొనరించిన ప్రవచనా దురంధరులు. శ్రీవారిచే రచింపబడిన "గీతామకరందము" మనపాలిట కల్పతరువనవచ్చును. ఏలయన నీ బృహద్గ్రంథము ఆంధ్రుల గృహములలో లేనియిల్లు లేదనుటలో అతిశయోక్తి కాదనిపించుచున్నది.

శ్రీస్వాములవారు నిరహంకార, నిరాడంబర, నిత్యానంద స్వరూపులు, ఎల్లవేళలా చిరునవ్వుచిందించు ముఖారవిందముతో నెల్లరను ఆదరణ పూర్వకముగ ఆహ్వానించెడి వారు. శ్రీవారి దివ్యాశయము "అభయుడవు గమ్ము" గాన సర్వులకును అభయహస్తం అందించెడివారు. అందుల కనుగుణ్యముగా "వేదాంతభేరి" మాసపత్రికను ప్రచురించి ఆధ్యాత్మిక బీజములెల్లడను వెదజల్లిన వేదాంత విజ్ఞాన అభయప్రదాతలు. శ్రీ స్వాములవారి శతజయన్త్యుత్సవాలని శ్రీవిద్యాస్వరూపానందస్వాములవారు తెలుపగానే విని చాలా ఆనందమైనది. కానీ శ్రీగురుదేవులు ఈ సమయంలో భౌతికంగా లేక పోవడం ఒకవెలితి. అయినా శ్రీవారి స్థూలశరీరము బ్రహ్మలీనమై, సర్వాంతర్యామిగ అంతటను, అందరిలోను వ్యాపకమై సర్వసాక్షిగా పరికించుచున్నారుగాన ఈ పవిత్ర కార్యక్రమములలో పాల్గొను వారు, పాలుపంచుకొనువారు మరియు తిలకించుటకై వేంచేయు వారు యెల్లరును శ్రీసద్గురు పరమాత్మ దివ్యాశీస్సులను బడయుదురనుటలో నెట్టి సందేహమూ లేదు.

శతజయన్తి సమయమున శ్రీవారిని సంస్మరించుట కనువుగా నీ దిగువ ప్రార్థన నీయబడినది.

ఓ సర్వాంతర్యామియైన సద్గురు దేవా!

తమ పవిత్ర పాదపద్మముల కివే మా హృదయ పూర్వక ప్రణామములు. మాకెల్లరకు ఆధ్యాత్మికాధారము నీవే! మా ప్రాణములకు ప్రాణమై, మా బుద్ధిగుహలో వసించి మమ్ముల ననవరతము సన్మార్గమున నడిపించువాడవు నీవే! సత్యశివసుందర స్వరూపుడవగు నిన్ను మేమెల్లరము త్రికరణ శుద్ధిగా నాశ్రయించింతిమి. గాన మాకెల్లరకును ఆధ్యాత్మిక అభయమును ప్రసాదించి మమ్ములనాశీర్వదించి అనుగ్రహించుము! ఇదియే మా హృదయ పూర్వకమైన ప్రార్థన.

ఓం శాన్తిశ్శాన్తి శ్శాన్తిః

ప్రజాకవి-ప్రజాఉపన్యాసకుడు-జనసాహితీవేత్త-ప్రజాసేవకులు పూజ్య శ్రీవిద్యా ప్రకాశానంద స్వామిజీ

శ్రీప్రణవానందస్వాములవారు,
గీతామందరిరం, కణేకల్లు.

అందరికి అర్థమయ్యే రీతిలో వాడుకభాషలో "అనగననగ రాగ మతిశయిల్లుచునుండు.... అల్పుడెపుడు పల్కు నాడంబరముగాను" మొ॥గు సులభ పద్యములతో వేమన శతకమును రచించిన వేమన-ప్రజాకవి అనడంలో అతిశయోక్తి లేదు.

వేదాంత తత్త్వము పండితుల సొత్తు మాత్రమే కాదు సామాన్య ప్రజలు కూడ అధ్యాత్మ విద్యను హృదయగతము చేసి కొని, కక్కయ్యలాంటి గ్రామీణులకు కూడ షట్చక్రములయందు గణపతి మొ॥ దైవదర్శనము చేయించి, వేదాంత తత్వములను "నరజన్మమిక దుర్లభమురా, సాకార సద్గురుని కనరా"యని ప్రజాభాషలో రచించి కాలజ్ఞాన తత్వములను సరళ పద్ధతిలో జనసామాన్యమునకు బోధపడురీతిలో రచించిన మహా అధ్యాత్మ తత్వవేత్త -శ్రీవీరబ్రహ్మేంద్రస్వాములవారు.

సాహిత్యమందరికి అందుబాటులో నుండాలనీ, అందరికి అర్థమయ్యేదే నిజమైన సాహిత్యమనీ, గ్రాంథికభాషను వదలి వ్యవహారభాషా ఉద్యమం నడిపి, వ్యవహారిక భాష ద్వారా సాహిత్యమును జన సామాన్యమునకు అనుకూలము చేసిన మహాసాహితీ వేత్త-గిడుగు రామమూర్తి పంతులు.

వేర్వేరు కాలములలో పైముచ్వురు చేసిన సేవను ఒకేకాలంలో తన ఒక్క చేతి మీదుగా నడపిన ఆధునికయుగ వైతాళికుడు ప్రజాకవి, వాగ్గేయకారుడు, ప్రజా ఉపన్యాసకుడు ఎవరైనా ఉన్నారంటే వారు జగత్ప్రసిద్ధులు, గీతామకరంద వ్యాఖ్యానకర్తలు; తత్త్వసారం, మానసబోధ లాంటి తత్త్వగేయకర్తలు, గీతోపన్యాసములు, మోక్షసాధన రహస్యం, యోగవాసిష్ఠ రత్నాకరము, భారత, భాగవత, రామాయణ రత్నాకరాలు లాంటి ఉద్గ్రంథకర్తలు; శ్రీశుకబ్రహ్మాశ్రమ సంస్థాపకులు, సద్గురు శ్రీ మలయాళస్వామి కరకమల సంజాతులు, అష్టోత్తర శతాధిక గీతాజ్ఞాన యజ్ఞకర్తలు, బ్రహ్మలీన పరమపూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు. ఆధ్యాత్మిక జడ్జిమెంటు వీరి న్యాయ విద్యా పరిజ్ఞానమునకు మచ్చుతునక. మట్టిలో మాణిక్యం, మోక్షద్వారపాలకులు, ధ్యాన పద్ధతి లాంటి గ్రంథాలు ప్రతి ముముక్షువు దాచుకొనదగిన జ్ఞాన రత్నాలు.

'జగమెరింగిన బ్రాహ్మణునకు జంధ్యమేల' అన్నట్లు ఏ బిరుదైనా వీరి మహత్తత్వాన్ని కించపరచేదే. పల్లెలు పట్టణాలు నగరాలలో ఒకసారి వీరి ఉపన్యాసమునకు వచ్చినవారు స్తంభించిపోవలసిందే. అట్టి జనాకర్షక ఉపన్యాసకులు స్వామివారు. ఆంధ్ర, ఆంగ్ల, హిందీ, సంస్కృత భాషలలో అసామాన్య పండితులు. అనర్గళమైన వీరి ఉపన్యాసములు విని శ్రీపాదకృష్ణమూర్తి వంటి ఉద్దండులే అభినందించారు. తిరుపతిలో జరిగిన గీతామహాయజ్ఞమున పాల్గొన్న తి.తి.దే. కార్య నిర్వహణాధికారి పి.వి.ఆర్.కె. ప్రసాద్ ఆ జనసముద్రమును, ఆ ఉపన్యాస సరళిగాంచి అబ్బురపడి పరవశించి భగవద్గీత 18 అధ్యాయముల ఉపన్యాసములను క్యాసెట్లుగా రూపొందించి ఆంధ్రజనానీక మునకు అందించిన అదృష్టవంతులు. స్వామి ఉపన్యాసశైలిని, దృష్టాంతములను, పిట్టకథలను అనుసరింపని ఉపన్యాసకుడు లేడనుట అతిశయోక్తి కాదు.

వీరి రచనా పటిమకు, మృదుమధుర గంభీరత్వ రచనకు క్రింది గేయములు మంచి ఉదాహరణలు.

జీవబ్రహ్మము లేకమేయన్నా
వాని యైక్యము తెలిసి బంధము తొలగద్రోయన్నా
పొట్టు ఉండిన వడ్లగింజ
పొట్టు ఊడిన బియ్యమేను
పాశ బద్ధుడు జీవుడగును
పాశ ముక్తుడు పరమశివుడే - (తత్త్వసారము)
ఏనాటి పుణ్యమో, నరజన్మమిపుడు
ఏతెంచినది నీకు మనసా
ఈదివ్య జీవితము సంపూర్తికానపుడే
దైవాన్ని చేరుకో మనసా - (మానస బోధ)

ఉపమా కాళిదాసస్య అనునుడి వీరిపట్ల సర్వ సమన్వయము.

భక్త కన్నప్ప ఉచిత ఆసుపత్రి ద్వారా కంటి ఆపరేషన్లు చేయించిన మహా ప్రజాసేవకులు. వీరి శతజయంతి ఉత్సవం జరపడం మిక్కిలిముదావహం. శ్రీస్వామి మార్గంలో నడుస్తున్న కార్యనిర్వాహక వర్గం ఎంతయు అభినందింపదగినది.

ఓం తత్సత్





గీతామకరంద మహర్షీ! వందనాలు

కె. ఈశ్వర్

(శ్రీశుకబ్రహ్మాశ్రమ మేనేజర్)

1. గురుదేవులకు గంగానది తీరములో గంగాదేవి ద్వారా భగవద్గీతను అందించారు భగవానుడు, ఆ భగవద్గీత నేటికి భద్రపరచబడినది ఆశ్రమంలో. భగవద్గీతా ప్రచారమునకై భగవంతునిచే దివి నుండి భువికి పంపబడిన మహాప్రవక్త, భగవద్గీతాప్రచార కర్త, ఆధ్యాత్మిక విప్లవ కర్త పూజ్య పాదులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు అని రూఢిఅగుచున్నది.

2. తూనుగుంట్ల రామస్వామి, సుశీలాదేవీ దంపతులకు ఆనంద నామ సంవత్సరమున జన్మించి 'ఆనందమోహన్' అనుపేరుతో ఆనందాన్ని పొంది బందరు, నోబుల్ కాలేజిలో బి.ఏ వరకు చదివి శ్రీ సద్గురు మలయాళస్వాములవారి సన్నిధిలో 12 సంవత్సరములు తపోనిష్ఠగావించి వారి ఆశీస్సులు అందుకొని వారిచే సన్న్యాసమును స్వీకరించి శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామివారుగ లోకప్రసిద్ధి చెందిన మహాత్ములు మీరు.

3. కలము, గళము, తపస్సు ముచ్చటైన మూడు కొందరికే పరిమితం. అట్టి కొందరిలో మీరున్నారు.

భగవద్గీత పేరు వినగనే గుర్తుకు వచ్చేది మీరే స్వామి!

మీ కలమునుండి వెలువడిన రచనలలో "గీతామకరంద"ము అద్భుతమైన గ్రంథము. దానిని తమ తపశ్శక్తినంతయు ధారపోసి రచించినారు కావున మకరంద స్వామి! అంటారు భక్తులు

4. మీ "గళము" నుండి వెలువడిన గంభీర గీతా ప్రవచనములు మృదుమధురమైన కంఠముతో అంతుపట్టని వేదాంత విషయాన్ని సహితము అత్యంత తేలిక భాషతో, చక్కని చతురోక్తులతో శ్రోతలను ఉఱ్ఱూతలూగించేవి.

5. భగవద్గీత కొన్ని వర్ణములవారికి మాత్రమే పరిమితమనియు, తక్కిన వారు తాకరాదనియు, చదవ కూడదనియు, సంకుచిత భావాలతో అట్టుడికి పోతున్న సమయములో తమరేతెంచి జాతి, మత, కుల, లింగ, వయోభేదములు లేకుండా అందరూ అర్హులే. గాలి పీల్చుటకు జాతి, మత, కులభేదములు ఎలా అడ్డుకాదో, జబ్బుగల వానికి మందు పుచ్చుకోనుటకు కులము ఎలా అడ్డురాదో అలా ప్రతి వ్యక్తి, భగవద్గీతను చదువవచ్చు, పారాయణ చేయవచ్చు అని లక్షలాది మందిని ఆకర్షించి వివరించి విశదపరచితిరి.

6. వంటపనులు, ఇంటిపనులు త్వరత్వరగా చక్క పెట్టుకొని శ్రీ స్వామివారి గీతా ప్రవచనములకు పరుగు పరుగున వచ్చిన వారు ఆషామాషిగ వినుట మాత్రమే కాదు. ఇల్లు వళ్ళు మరచి గీతాప్రవచనము వినుటలో లీనమై పోయేవారు.

అశాంతితో, బాధలతో జీవితముపై విరక్తి కలిగినవారు సహితము శ్రీ స్వామివారి బోధలతో వారి బాధలు తీరినట్లు భావించే వారు, మనశ్శాంతిని పొందే వారు.

7) 12-12-1980 నుండి 31-12-1980 వరకు

20రోజులు తిరుమల తిరుపతి దేవస్థానం వారి అధ్వర్యములో తిరుపతిలో జరిగిన 99వ గీతాయజ్ఞములో ఆనాటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు శ్రీ పి.వి.ఆర్.కె ప్రసాద్ I.A.S వారు శ్రీస్వాములవారి గీతా ప్రవచనములకు ఆకర్షితులైరి. ఆనాటి నుండి అనేక పట్టణాలలో శ్రీస్వామివారి గీతాప్రవచనములను తిరుపతి దేవస్థానం వారే నిర్వహించిరి.

8. **శ్రీస్వామివారి క్యాసెట్లకు అంకురార్పణ**

శ్రీ పి.వి.ఆర్.కె ప్రసాద్ గారు తిరుపతిలో జరిగిన శ్రీస్వామివారి గీతాప్రవచనముల గురించి వివరిస్తూ గీతాప్రవచనములకు తిరుపతి చరిత్రలో ఇంతమంది భక్తులకు ఆకర్షించిన వారు లేరనియు, ఆధ్యాత్మిక విప్లవాన్ని సృష్టించారనియు ప్రశంసించిరి. శ్రీస్వామివారిగీతా ప్రవచనములను ఆడియో క్యాసెట్లుగా తయారు చేయించి భక్తులకు అందించిన ఘనత కూడ శ్రీ పి.వి.ఆర్.కె ప్రసాద్ ఇ.ఓ గారికే దక్కింది. శ్రీస్వామివారి గీతా ప్రవచనములు ఎక్కడ జరిగినా సినిమా హాల్సుకు జనం తరిగేవారు, శ్రీస్వామి వారి ప్రవచనములకు జనం పెరిగేవారు. రిక్షావారు సహితము తమ రిక్షాలను ప్రక్కన పెట్టి స్వామివారి గీతాప్రవచనము విని ఆనందించే వారు.

9 స్వాములవారు 1950 లో శ్రీకాళహస్తి నందు శ్రీశుకబ్రహ్మాశ్రమం స్థాపించిరి.

విద్యాలయం, వైద్యాలయం, దేవాలయం అనుమూడు ఆలయములు అవసరమని గ్రహించినవారై శ్రీకాళహస్తిలో కాలేజి మచ్చుకైనా లేని సమయములో

1. **విద్యాలయం :-** ప్రభుత్వము వారికి భూరి విరాళమును అందించి 1966 సంవత్సరములో శ్రీకాళహస్తిలో రెండు కాలేజీలు స్థాపించారు.

1. స్వామి విద్యాప్రకాశానంద గవర్నమెంటు ఆర్ట్సు కాలేజీ
2. స్వామి విద్యాప్రకాశానంద, మహిళా జూనియర్ కాలేజి.

ఈ కాలేజీలలో చదివి. I.A.S. I.P.S అయిన వారున్నారు. ఎన్నో ఉన్నత పదవులు పొందినవారూ ఉన్నారు.

2. **వైద్యాలయం :-** కన్నులేనిదే జగత్తులేదు, కంటిని అశ్రద్ధచేయరాదు, అను సూక్తి ప్రకారం కన్నుచాలా ముఖ్యమని భావించినవారై భక్తకన్నప్ప తన కండ్లను పరమశివునికి అర్పించిన మహాభక్తుని గుర్తుగా 1993 సం॥లో భక్త కన్నప్ప ఉచిత కంటి ఆస్పత్రి అను పేరుతో ఆశ్రమంలో నేత్రాలయమును స్థాపించి వేలాది మందికి కంటిచికిత్సలను, ఆపరేషన్లను ఉచితంగ చేయించుచున్నారు. రాష్ట్రం నలుమూలల నుండి కంటిరోగులు వచ్చి చికిత్సలు పొందుచున్నారు.

3. **దేవాలయం :-** ఆశ్రమంలో శివాలయాన్ని స్థాపించారు. శివానుగ్రహం పొందుటకు భక్తులకు అవకాశం కల్పించారు.

10. ఏప్రిల్ నెల ప్రత్యేకత

1.శ్రీస్వాములవారు అవతరించినది 1914 ఏప్రిల్ 13వ తేది. భగవంతుడు స్వామివారికి ఇచ్చినపనిని, వచ్చిన పనిని పూర్తిచేసుకొని అవతారసమాప్తి చెందినది 1998 ఏప్రిల్ 10వ తేది.

2. శ్రీస్వామి వారి గురుదేవులైన సద్గురు మహర్షి మలయాళ స్వాములవారు అవతరించిన నెల - ఏప్రిల్

3. అవతారమూర్తి శ్రీరామచంద్రుడు అవతరించిన నెల - ఏప్రిల్

4. రమణమహర్షులవారి అవతార సమాప్తి - ఏప్రిల్

5. భగవాన్ సత్యసాయి బాబా వారు తమ అవతారమును చాలించినది - ఏప్రిల్

11. స్వామీ! ఎన్ని జన్మల అనుబంధమో కలిపింది ఋణానుబంధం. శిల్పి బండరాయిని విగ్రహంగ మలచి ఆకారము చేకూర్చినట్లు ఎందుకు పనికి రాని బండరాయిగ వున్న నన్ను 1961 లో చేరదీసి విగ్రహంగ మలచి మీసేవకు అవకాశము కల్పించినారు. మీరు చూపించిన ప్రేమకు, వాత్సల్యానికి హద్దులు లేవు, కొలతలులేవు.

మీప్రేమకు పాత్రుడనైన నన్ను మీరు పిలుచు "ఈశ్వర్" అనే పిలుపులోని మాధుర్యాన్ని ఆ తీపిజ్ఞాపకాలను నేను మరువలేను. ధన్యోస్మి స్వామి

ఏమి మహిమో.....తెలియలేము
ఎంత ఘనతో.....చెప్పలేము
ఇంటి పనులు......చక్కపెట్టి
వంటవార్పులు......చేసి చేసి
పరుగు పరుగున......గీతబోధకు
కదలి వచ్చిరి.....ఎంత వింతో.

జై శ్రీసద్గురు విద్యాప్రకాశానందగిరి స్వాములవారికి జై జై

తింటే.....గారెలు తినాలి

వింటే గీతను......శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామివారితోనే వినాలి.

గీతయే మీరు, మీరే గీత – ఇదియే అందరిమాట.

జయ్ గురుదేవ

With Best Compliments From :

OM NAMAH SIVAYA

ON THE OCCASION OF CENTENARY CELEBRATIONS OF HIS HOLINESS VIDYA PRAKASANANDA GIRI SWAMIJI, FOUN DER, SRI SUKA BRAHMA ASHRAM, SRI KALA HASTI

WITH PRANAMS

SRI.S.SHANMUGAM REDDY, CHAIRMAN
K.RAGHU, PRINCIPAL
T.MUNISWARLU, DIRECTOR(FINANCE)
M.UMA MAHESWAR, DIRECTOR
K.SUDHAKAR REDDY, DIRECTOR

SRINIVASA COLLEGE OF EDUCATION (B.Ed)
SRINIVASA COLLEGE OF ELEMENTARY EDUCATION (D.Ed)

(SPONSORED : MAHARSHI EDUCATIONAL SOCIETY)
(APPROVED BY NCTE & AFFILIATED TO SVU, TIRUPATI)

MARATI GATE, PUTTUR – 517 583, CHITTOOR DIST, AP



దివ్యాంజలి

– బ్రహ్మచారి విజయానంద
(శ్రీశుకబ్రహ్మాశ్రమము)

ఓం శ్రీ గురుభ్యో నమః

ఓం శ్రీసద్గురు విద్యాప్రకాశానందగిరి స్వామినే నమః

జీవుడే దేవుడు,
దేవుడే జీవుడు,
అజ్ఞాన పాశ బద్ధుడు జీవుడు
అజ్ఞాన పాశవిముక్తుడు దేవుడు

అని సర్వశాస్త్రసారాంశమును బోధించిన పూజ్యశ్రీశ్రీశ్రీ సద్గురు విద్యాప్రకాశానందగిరి స్వాములవారి దివ్యచరణారవిందములకు నమస్సుమాంజలి.

పూజ్యశ్రీశ్రీశ్రీ పరమగురు శ్రీమహర్షిమలయాళ స్వాములవారి దివ్య సన్నిధిలో శ్రీవ్యాసాశ్రమములో 12 సంll తపస్సు గావించి, దివ్యాత్మ సాక్షాత్కారము బడసి, 1950లో శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రములో శ్రీశుకబ్రహ్మ ఆశ్రమమును స్థాపించి, సుప్రసిద్ధ గీతామకరందమును విరచించి, గీతోపన్యాసముల ద్వారా వేలాది, లక్షలాది జనులకు గీతామృతమును పంచి, వారికి ఆధ్యాత్మిక మార్గమును సుగమముచేసి, అంతేకాక శ్రీకాళహస్తిలో కళాశాలలు నెలకొల్పి, శ్రీశుకబ్రహ్మ ఆశ్రమములో శ్రీభక్తకన్నప్ప ఉచిత కంటి ఆస్పత్రి ఏర్పాటుచేసి అశేష జనావళిని ఆనందింప జేసిన శ్రీగురుదేవా! వందనసహస్రములు!

2. శ్రీగురుదేవుల శతజయంతి దివ్యోత్సవముల సందర్భమున శ్రీగురుదేవుల చమత్కారపూరిత సద్బోధలు స్మరించి శ్రీ గురుభక్తులతో పంచుకొనుట పరమానంద దాయకముగ ఉన్నది.

1. సాధనలో సోమరితనము పనికిరాదు

ఉదా॥ (అ) సోమరివిద్యార్థి అయిన తన కుమారుని – తండ్రి ఇలా అడిగాడు.

తండ్రి – ఏరా! పరీక్ష వ్రాసి వచ్చావు. ప్రశ్నపత్రము (Question paper) ఎలా యుంది ?!

కొడుకు– నాన్నా! ప్రశ్నపత్రము చతురస్రాకారంలో యుంది. నా మార్కులు వృత్తాకారంలో (0) వస్తాయి.

(అది విని తండ్రి – ఔనౌను సోమరికి అంతకంటే ('0' కంటే) మార్కులు ఎలా వస్తాయి?! అని చీవాట్లు పెట్టినాడు. కష్టపడి చదువుకొమ్మని మందలించాడు).

(ఆ) – ఒక గురువు గారు ఒక సోమరి భక్తునకు కొండచుట్టూ తిరిగిరమ్మని (గిరిప్రదక్షిణ చేసిరమ్మని) ఆదేశించాడు.

అందులకా సోమరిభక్తుడు. స్వామీ! స్కూటర్ లో ప్రదక్షిణ చేసిరావచ్చునా ?!' అని అడిగాడు.

అపుడు గురువుగారు పకపక నవ్వి "నాయనా! సోమరులకు ముక్తి దొరకదు. శ్రద్ధతో గురువాక్యములు పాటిస్తేనే కదా ముక్తి" అని మార్గదర్శనం చేశారు.

(ఇ) మరొక సోమరి భక్తుడు– 'తనను శ్రీరామకోటి వ్రాయుము' అని సలహా నొసంగిన గురువుతో "స్వామీ! 4 కార్బను పేపరులు పెట్టి శ్రీరామకోటి వ్రాయవచ్చునా?!' అని అడిగాడు. అందులకా గురువు 'నాయనా! అదే సోమరితనము అంటే, కోటి అంటే కోటి సార్లే వ్రాయలి" అని భక్తునకు ఆదేశించారు.

2. **దుర్గుణాలు, దుర్వాసనలు పోగొట్టు కొనవలెనుః–**

ఉదా ॥ (అ) ఒక 8 సం॥ల పిల్లవాడు అంగడిలోనికి పోయి బీడీలు కావాలి అని అడిగాడు. అపుడు అంగడివాడు – "ఏమిరా! వ్రేలెడంత లేవు. నిండా ఎనిమిదేళ్ళు లేవు. నీకు బీడీలు కావాలా?!" అని గద్దించాడు.

అంతట ఆ పిల్లవాడు – నాకు కాదండీ, నా తమ్ముడికి అని ఏ మాత్రం తడుము కోకుండా టఫీమని జవాబిచ్చాడు. (దురలవాట్లను ఆరంభమునుండి దూరీకరించాలి)

(ఆ) ఒక జడ్జి దొంగతో "ఏమయ్యా! పోయిన నెలలో దొంగతనము చేసిన వస్త్రాల దుకాణంలోనే మరల దొంగతనం చేశావెందుకు?" అని నిలదీశాడు.

అపుడా దొంగ 'అయ్యా! జడ్జిగారూ! ఆ దుకాణంలో VISIT AGAIN మరల రండి అనే బోర్డు ఉంది. అందుకే అక్కడే మళ్లీ దొంగతనం చేశాను' అన్నాడు.

అపుడా జడ్జి "బాగు బాగు, ఆ బోర్డు పెట్టింది మరల వస్త్రాలు కొనడానికి ఆ దుకాణానికి రండి అని అర్థం కానీ, నీవు మరల దొంగతనం చేయడానికి కాదు. ఇకనైనా దొంగబుద్ధి మానుకో" అని మందలించి తగిన శిక్షను విధించాడు.

(ఇ) ఎప్పుడూ ఇతరులతో నిరంతరం గొడవలు పడే ఒకవ్యక్తి ఒకసారి దంతవైద్యుని (Dentist ను)కలసి దంత సంరక్షణకు తగు సలహాలు ఇవ్వండి–అని కోరాడు.

అపుడా దంతవైద్యుడు ఇలా సలహాలు ఇస్తున్నాడు.

1. రోజూ రెండు పూటలా బ్రష్ చేసుకోవాలి, పళ్లు తోముకోవాలి.

2. ప్రతి 6నెలలకు ఒకసారి దంత వైద్యుని కలసి దంతపరీక్ష చేసుకోవాలి.

3. ఇక చివరిగా నీవు ఎవరితోనూ గొడవపడకూడదు. ఎందు కంటే కోపంలో ఎదుటివాడు నీ పళ్ళను రాలగొట్టవచ్చు.

(ఈ) పొగత్రాగే అలవాటును మానుకోలేని (Chain Smoker) ఒకవ్యక్తి ఒక డాక్టరును కలిసి –

అయ్యా! డాక్టరు గారూ! పొగత్రాగడం వలన, ఎక్కువగా సిగరెట్లు కాల్చడం వలన ఏమైనా లభాలు ఉన్నాయా?! అని వింత ప్రశ్నవేశాడు. అపుడా డాక్టరు 'లేకేమి 3 లాభాలు ఉన్నాయి విను.

1. ఎక్కువగా సిగరెట్లు కాలిస్తే సిగిరెట్ కంపెనీలకు బాగా వ్యాపారం జరుగుతుంది.

2. ఇంట్లో దొంగలు పడరు. ఎందుకంటే ఎక్కువగా పొగత్రాగేవారు రాత్రంతా దగ్గుతూ ఉంటే 'ఓహో! ఇంట్లోవారు మేల్కొనే యున్నారని దొంగలు ఇంట్లోనికి రారు.

3. వార్ధక్యం, ముసలితనం రాదు. ఎందుకంటే ఎక్కువగా పొగత్రాగేవారు అనారోగ్యంతో యవ్వనంలోనే చనిపోతారు కాబట్టి – అని డాక్టరు తెలిపాడు.

(ఉ) లంచాలు తిని తిని జైలుపాలైన ఒక పెద్ద ఉద్యోగిని విలేఖరి ఇంటర్వ్యూ చేస్తూ ఇలా అడిగాడు. ఏమండీ! మీరు ఎక్కువగా లంచాలు తీసుకొన్నారని మిమ్ములను అరెస్ట్ చేశారు గదా! అసలు 'లంచం' అంటే ఏమిటి?!.

అపుడా లంచగొండి ఆఫీసరు "నాకు ఏమీ ఇవ్వకుండా, నా చేయి తడుపకుండా మీకు జవాబు ఎలా చెబుతాను?! అని ఎదురు ప్రశ్నవేశాడు.

(ఊ) ఎక్కువగా పొగత్రాగుట వలన నష్టాల గురించి ఒకాయన ఇలా చెప్పాడు –

ధారాళమైన దగ్గు, గుండెకు జబ్బు, డాక్టరుకు డబ్బు.

(ఎ) ఒక లోభి ఏ రోజుకు కావలసిన తిండి పదార్థాలను ఆ ఒక్కరోజుకు మాత్రమే కొంటూయున్నాడు. అది గమనించిన ఆ అంగడివాడు ఆ లోభితో ఇలా అన్నాడు.

ఏమయ్యా! ఏ పూటకు ఆ పూట బియ్యము మొదలైన ఆహారపదార్థాలు కొనకపోతే, వారానికి కావలసినవి ఒకేసారి కొనరాదా?!

లోభిః– ఎందుకు దండగ! ఒకవేళ రేపే నేను చనిపోతే వారం రోజుల తిండి సామానులు వ్యర్థమై పోతాయి గదా! అందుకే ఏ పూటకు ఆ పూట, ఏ రోజుకు ఆ రోజు కావలసినవి మాత్రమే కొంటున్నా.

అంగడివాడుః– (వాడి లోభత్వానికి విసిగిపోయి) ఒకవేళ నీవు రేపే చనిపోతే ఆ సరుకులు నీ తద్దినానికి పనికివస్తాయిలే.

(కనుక లోభత్వం దుర్గుణాలు పోగొట్టుకొని పరోపకారం, దానధర్మాలు, గావిస్తూ జన్మసార్థకత చేసుకోవాలి).

3. శ్రీగురుదేవులు భక్తులతో హాస్యపూర్వకముగా మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావాలను నింపుతూ యుంటారు.

(అ) ఒక భక్తుడు ప్రక్క భక్తుని ఊరు 'రెండుచింతల పల్లె' అని శ్రీగురుదేవులతో తెలిపినాడు.

అదివిని ఆ భక్తుడు "స్వామీ! మాది 'రెండు చింతల పల్లె' కాదు 'మూడు చింతల పల్లె' ఈయన మా ఊరు పేరు తప్పు చెప్పినాడు.

అది విని గురుదేవులు చమత్కారముగా "పోనీ లెండి ఒక చింత తగ్గిపోయింది మంచిదే కదా! మనిషికి చివరకు అన్ని ప్రాపంచిక 'చింతలు' పోవలసిందే కదా!" అన్నారు.

4. ఒక భక్తుడు శ్రీగురుదేవులతో "స్వామీ! మా ఊరు పేరు "వెంప" దాని అర్థమేమిటో మాకు తెలియటం లేదు"

అపుడు గురుదేవులు –

'వెం – వెంకటేశ్వర్లు, ప – పద్మావతీదేవి"

అని చక్కని చమత్కార ఆధ్యాత్మిక సమాధాన మిచ్చినారు.

5. ఒక భక్తుడు శ్రీ గురుదేవులతో "స్వామీ! నా పేరు 'నానీ' దాని భావమేమిటో సెలవిస్తారా?!' అని ఆ భక్తుడు అడిగాడు. అందులకు శ్రీగురుదేవులు "నా", "నీ" అనే భేద భావం లేకుండా, దైవభావం కలిగియుండేవాడే "నానీ" అని బదులిచ్చారు.

6. ఒకపుడు శ్రీగురుదేవులు ఉపన్యసిస్తూ 'మానవుడు' ఆనంద స్వరూపుడే కానీ అజ్ఞానం చేత బాధలు పడుతున్నాడు.– ఎలానంటే ఒక కామెడీ సినిమాకు భార్యభర్తలు వెళ్ళారు. సినిమాహాలంతా నవ్వులతో నిండిపోయింది. కానీ భర్త మాత్రం దుఃఖ పడుతూ యున్నాడు.

అది గమనించిన భార్య – 'ఏమండీ! కామెడీ సినిమా చూచి అందరూ నవ్వుతూయుంటే మీరెందుకు బాధపడుతూ యున్నారు?! అని అడిగింది.

అపుడా భర్త "ఏమీ లేదు నాకు ఏదో జబ్బు వచ్చింది. నా చేతిని ఎంత గోకుకున్నా దురద పోవటం లేదు" అని ఏడుపుగొంతుతో చెప్పాడు. ఆ మాటలు విని భార్య "మీరు గోకింది నా చేతిని" అన్నది.



(చూచారా! అందరూ నవ్వుతూ, ఆనందంగా యుంటే కథలోని భర్త అజ్ఞానం చేత దుఃఖిస్తూ యున్నాడు. మానవుడు యథార్థానికి ఆనందరూపుడే).

7. మరొకపుడు షాద్‌నగర్, మహబూబ్ నగర్ కార్యకర్తలు వచ్చి శ్రీగురుదేవులను సందర్శించారు.

వారి యొక్క భక్తిని, ఆధ్యాత్మిక ప్రచారమును మెచ్చుకొంటూ శ్రీగురుదేవులు ఇలా అన్నారు.

భక్తిప్రచారము ద్వారా మీరు 'షాద్‌నగర్' ను 'సాధునగర్' గా మరియు 'మహబూబ్ నగర్' ను 'మహాబోధ నగర్' గా మార్చివేశారు" అని వారిని ప్రోత్సహించినారు.

8. **పరమగురువులు మరియు మన గురుదేవులుః-**

పరమగురువులైన శ్రీసద్గురు మహర్షి మలయాళ స్వాములవారు గావించు ముఖ్యబోధలలో ప్రధానమైనవి.

1. తన ఆత్మోన్నతికి ప్రయత్నింపవలెను.
2. ఇతరుల ఆత్మోన్నతికి సహకరింపవలెను.
3. తన ఆత్మోన్నతికి అడ్డు తగిలిన తొలగించు కొనవలెను.

వీటిని తు.చ. తప్పకుండ శ్రీ గురుదేవులు అనుష్ఠించి తాము తరించి లోకాన్ని తరింపజేసినారు.

ఆత్మోన్నతికి దృశ్యాసక్తి, మనస్సే పెద్ద అడ్డు. అట్టి మనస్సును శ్రీగురుదేవులు పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు సద్గురు కృపచేత, దైవకృపచేత, స్వీయసాధన చేత ఆత్మలో, దైవములో లీనము చేసినారు.

మనస్సును జయిస్తే ముల్లోకములను జయించినట్లే. ముల్లోకాలను జయించినా మనస్సును జయించకపోతే; దైవంలో, ఆత్మలో మనస్సును లయం చేయకపోతే ఏమీ జయింపనట్లే.

తాను మోక్షస్వరూపుడై, స్మరణ మాత్రముననే భక్తులకు పరమానందము ప్రసాదింప గలుగుట-ఇంత కంటే శ్రీగురుదేవులు పరమగురువులు ఆశయమును నెరవేర్చుట ఇంక ఏమి కలదు?!

శ్రీగురుదేవులు కృత కృత్యులై, కృతార్థులై, జనులకు ఆనందకారకులై పరిఢవిల్లినారు, విరాజిల్లినారు.

Weeping, weeping you are born, Laughing Laughing you must die అని శ్రీ గురుదేవులు బోధించినట్లుగనే పరమానంద స్వరూపులై, నవ్వుతూ నవ్వుతూనే దివ్యాత్మస్వరూపులై, తమ అవతారమును సుసంపన్నము గావించినారు.

3-7-1988 నాడు ఈ శిష్యపరమాణువుకు మంత్రోపదేశం గావించినపుడు "స్వామీ! సాధన ఎలా చేయాలి?" అని అడుగగా, అందులకు శ్రీ గురుదేవులు "బయట గొడవలు ఏమీ లేకుండా భగవంతుని ధ్యానించటమే సాధన, మరియు 'మోక్షసాధన రహస్యము' అను గ్రంథమును కూడా చదువుతూ యుండు" అని ఉపదేశించినారు. జై శ్రీగురుదేవ!

దర్శనార్థము వచ్చిన భక్తులు తమ సందేహాలను శ్రీగురుదేవులతో విన్నవించుకొని తగు సలహాలు పొందుతూ యుంటారు.

అ) ఒకపుడు ఒక అత్తగారు వచ్చి "స్వామీ! నాకు నా కోడలిపై కోపం ఎక్కువగా వస్తూ యుంటుంది. ఏమి చేయమంటారు?!" అని అడిగింది.

అందులకు శ్రీగురుదేవులు "కోపం వచ్చినట్లు నటించండి. అంతే ఇక ఆ కోపం మీకు అశాంతిని కలిగింపదు" నిజంగా కోపగించకండి. అని బోధించారు.

అందులకా భక్తురాలు మిగుల సంతసించింది.

ఆ) అనేక మంది భక్తులు "స్వామీ! ధ్యానంలో మా మనస్సు నిలవటం లేదే?!" అని అడుగుతూ యుంటారు.

దానికి శ్రీగురుదేవులు "అర్జునుడు అంతటివారికే మనస్సు నిలవలేదు. అభ్యాసము, వైరాగ్యము కలిగియుంటే మనస్సు నిలుస్తుంది. "మానసబోధ" గ్రంథాన్ని చదువుతూ యుండండి అని సెలవిచ్చేవారు.

మనస్సులోని దుర్గుణాలను, అజ్ఞానము అను విషాన్ని తొలగిస్తే, శుద్ధముగా చేస్తే ప్రాణాయామముతో పనిలేకుండగనే ఎంతయో శాంతి, ఆనందం లభిస్తాయి. కనుక ప్రాణాయామము కంటే మనస్సును సద్గుణావలంబనము ద్వారా, భక్తి ద్వారా, దైవ సేవద్వారా శుద్ధం, నిర్మలము చేసుకొంటే అదే మోక్షసిద్ధి, పరమానంద స్థితి".

(ఇ) ఒక భక్తుని ప్రశ్న "స్వామీ! మేము సాధనలో అభివృద్ధి పొందుతున్నాము అను దానికి గుర్తు ఏమిటి?"

గురుదేవులు - శాంతి, ఆనందము పెరగడమే గుర్తు.

(ఈ) భక్తుని ప్రశ్న - స్వామీ! మేము ఆత్మను తెలుసుకొన్నాక ఏమి చేయాలి?

గురుదేవులు - ఏమిచేయాలో మీ ఆత్మయే చెబుతుంది. పరోపకారం, శాంతి ప్రచారం గావించుము -అని చెబుతుంది.

(ఉ) భక్తుని ప్రశ్న - స్వామీ! త్వరలో ప్రళయం వస్తుంది - అని అంటున్నారు గదా! నిజమా!!

గురుదేవులు ఎక్కడైనా ఒకింత మార్పులు రావడం సహజమే గదా! 'న మే భక్తః ప్రణశ్యతి' అన్నట్లు భక్తి, జ్ఞానం గలవారికి ఏ హాని కూడ కలుగదు.

ఒ) 'గీతామకరందములో'' శ్రీగురుదేవులు తెలిపినట్లుగా - జనులు 'జన్మ, మృత్యు, జరా, వ్యాధి, దుఃఖ దోషములను' భక్తి, జ్ఞాన, వైరాగ్యముల ద్వారా నిర్మూలించుకొని, నిర్మలహృదయులై, పరోపకార పరాయణులై, పరమశాంతిని, ఆనందమును పొందవలసి యున్నది.

శ్రీసద్గురు విద్యాప్రకాశానంద గిరి స్వాములవారి శతజయంతి దివ్యోత్సవాల సందర్భముగా శ్రీసద్గురు స్మరణలతో ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు.

ఓమ్ తత్ సత్.

సముద్రమెట్లు అనంతముగ చూపట్టునో అట్లే ఈ సంసారమున్ను జననమరణపరంపరలతోడ అంతములేనిదై దుఃఖాకులమై దుస్తరమై చూపట్టుచున్నది. సముద్రమునం దెట్లు మొసళ్లు, తిమింగిలములు తదితరములగు భయంకర జలజంతువులు కాపురముండు చున్నవో, అట్లే ఈ సంసారమందును కామక్రోధాదులు, దంభదర్పాసూయాదులు మొదలగు బాధాకరవృత్తులు తిష్ఠ వేసికొనియున్నవి. సముద్ర మెట్లు అగాధమైయున్నదో అట్లే ఈ సంసార దుఃఖమున్ను అత్యంత గహనమై వర్తించుచున్నది. అయితే సముద్రమెంత విశాలమైనప్పటికిని ఎంత లోతుగలిగి యున్నప్పటికిని ఒక చిన్ననావచే అది యెట్లు దాటివేయబడగలదో అట్లే భగవద్భక్తి అను తెప్పచే ఈ సంసారరూపమహోదధి యంతయు తృటిలో దాటివేయబడగలదు.

- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి



అమృతహృదయులు మా గురుదేవులు

ఆచార్య జక్కంపూడి మునిరత్నం
ఎం.ఏ., పిహెచ్.డి., తిరుపతి.

"విద్యాప్రకాశ ధీవర్యం
బహుభాషా విశారదమ్ ।
నమామి సద్గురుం నిత్యం
వేదాంతనిలయం మునిమ్ ॥

విద్య ఎవరిలో ప్రకాశిస్తుందో వారిలో ఆనందం కలుగుతుంది. నిర్వికల్పానందం కలిగినప్పుడు నిశ్చల తత్త్వం సిద్ధిస్తుంది. అప్పుడావ్యక్తి వ్యక్తిత్వం పర్వతతుల్యంగా ఉంటుంది. వీటన్నిటికీ సజీవతార్కాణమే మాగురుదేవులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు.

కాశీ నుంచి శ్రీ కాళహస్తిదాకా శ్రీస్వాములవారి విజ్ఞానసామ్రాజ్యం విస్తరిల్లింది. తమ వాణితో బాణితో ఖండాంతరాలనే స్పృశించగలిగిన అఖండ వ్యక్తిత్వం వారిది! వారు ఎన్నో గీతాయజ్ఞాల ద్వారా ఎందరిగీతలనో మార్చగలిగిన నేత, సుజ్ఞాన ప్రదాత. గీతామకరందాన్ని పంచి నూతన చేతన కేతనం రెపరెపలాడేందుకు అవకాశం పెంచిన ఆదర్శ ఆచార్యులు వారు. యోగవాసిష్ఠ వ్యాఖ్యానాన్ని అందించి జిజ్ఞాసువులకు, ముముక్షువులకు మంచి యోగం కలిగించిన మహామనీషి వారు. ఉపన్యాసాలతో ఉఱ్ఱూతలూగించి ఉల్లాలను ఉత్తేజపరచిన ఉత్తమజ్ఞానివారు. 'వేదాంతభేరి' మ్రోగించి స్వాంతాల కర్ణాల తుప్పు వదలించి నిద్రాణమైయున్న నిశ్శేషాంధ్ర జగత్తును నిద్రనుండి మేల్కొల్ప జూచిన మేటి వైతాళికులు వారు!

నాకు ఊహ, స్వాములవారి ఎరుక రెండూ ఒకేసారి వచ్చాయి. నాకు ఊహ తెలియకముందు నుంచి కూడా మా తండ్రిగారు కీ.శే. జక్కంపూడి మునస్వామినాయుడు గారు. నన్ను శ్రీ కాళహస్తిలోని శ్రీశుకబ్రహ్మాశ్రమానికి తీసుకు వెళ్ళేవారు. స్వాములవారి అనుగ్రహదృష్టి నామీద పడేది.

మాతండ్రిగారి వివాహానికి ముందే శ్రీస్వాముల వారితో వారికి పరిచయం ఏర్పడింది. శ్రీస్వాములవారి పూర్వాశ్రమ నామం ఆనందమోహన్ గారు. వారు ఏర్పేడులోని శ్రీవ్యాసాశ్రమంలో మహర్షి సద్గురు మలయాళ స్వాములవారి సన్నిధిలో పన్నెండు సంవత్సరాలపాటు అపక్వాహారులై తపస్సు చేశారు. అప్పుడే మాతండ్రిగారికి వారితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం అంతకంతకూ అభివృద్ధి చెంది ఆత్మీయస్థాయికి చేరుకుంది. పర్యవసానంగా శ్రీ శుకబ్రహ్మాశ్రమ సంస్థాపన సందర్భంలోనూ వారికి సేవచేసే భాగ్యం మా తండ్రిగారికి కలిగింది. అప్పటినుంచి మేము శ్రీ శుకబ్రహ్మాశ్రమానికి తరచూ వెళ్ళేవాళ్ళం. వెళ్ళినప్పుడు శ్రీస్వాములవారు నాకు ప్రసాదమిస్తూ సాదరంగా పలుకరించేవారు. వారి ఉపన్యాసాలను వినేవాణ్ణికాని ఆ వయస్సులో నాకు అవి అర్థమయ్యేవి కావు.

మాతండ్రిగారి కోరికమీద 1953వ సంవత్సరం అంటే నా ఐదవయేట శ్రీ శుకబ్రహ్మాశ్రమంలోనే శ్రీస్వాములవారు నాకు అక్షరాభ్యాసం చేశారు. 'ఓం నమః

శివాయ సిద్ధం నమః' అని వారుచెప్పి నా చేత చెప్పించారు. 'ఓం నమః శివాయ' అని కూడా నాచేత పలికించారు. ఇది కూడా స్పష్టాస్పష్టంగానే నాకు గుర్తు, తక్కిన అప్పటి సంఘటన లేవీ ఇప్పుడు గుర్తులేవు.

శ్రీస్వాములవారు, ప్రస్తుత పీఠాధిపతులు మా ప్రియతమ గురుదేవులు శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వామి, మా తండ్రిగారు శ్రీ జక్కంపూడి మునస్వామి నాయుడుగారు ఈ ముగ్గురూ నన్ను అధ్యాత్మ పథంలో పురోగమింపజేయాలని సంకల్పించారు. ఈ ముగ్గురి ఒకే సంకల్పం వారిమాటలద్వారా నాకు తెలుస్తూనే ఉంది. అయితే నా బాల్యచాపల్యం వారి సంకల్పానికి అడ్డుపడింది. పూర్వ జన్మ కర్మానుగుణంగా నన్ను నడిపించింది. అయినప్పటికీ నేను మాతండ్రిగారితో బాటు ఆశ్రమానికి వెళుతూనే వచ్చాను. స్వాములవారి మాటలు హాస్యరస భరితంగా అలరించేవి, మృదువుగా, మధురంగా వారు మాట్లాడేవారు.

1967 మార్చి 22 వతేది నేను, మాతండ్రిగారు శ్రీ శుకబ్రహ్మాశ్రమం వెళ్ళాం. మాతండ్రిగారు నాఉద్దేశాన్ని తెలుసుకోకుండానే 'వీడికి బోధచేస్తే బావుణ్ణు' అని శ్రీస్వాములవారితో అన్నారు. స్వాములవారు సన్నగా మధురంగా నవ్వారు. అది నాకిప్పటికీ గుర్తే. మాతండ్రిగారి మీద వారికున్న ప్రీతి, నాపట్ల వారికున్న దయ కారణంగా-నేమో మారు మాట్లాడకుండా నాకు మంత్రోపదేశం చేశారు. ఆవిధంగా 23-03-1967లో నాకు మంత్రోపదేశం జరిగింది. శ్రీస్వాములవారు ఓపికగా, దయతో అనుష్ఠాన విధానం బోధించారు.

1988 అక్టోబర్‌లో మాగ్రామంలో వినాయకమందిర నిర్మాణం పూర్తి అయింది. కుంభాభిషేకం తలపెట్టారు. గురుదేవులు శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానదగిరి స్వాములవారు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిని కూడా మాగ్రామానికి ఆహ్వానించారు. వారి ఆధ్వర్యంలోనే ఆలయ కుంభాభిషేక క్రతువు నిర్వహింపజేశారు. శ్రీస్వాములవారు మాగ్రామానికి వచ్చినప్పుడు మా ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించి అప్పుడే వివాహమైన మా నవదంపతులను ఆశీర్వదించి ఆనందపరిచారు. మా తండ్రిగారు కోరిక మీద మా తల్లిగారికి, మా మామగారు గుత్తా నరసింహులునాయుడు గారికి మంత్రోపదేశం చేసి కటాక్షించారు.

గ్రహణశక్తి వచ్చినప్పటినుంచి శ్రీగురుదేవుల ఉపన్యాసాలు నన్ను బాగా ఆకట్టుకొంటూనే ఉన్నాయి. చెవినుంచి మనస్సుకు, మనస్సు నుంచి హృదయానికి సులభంగా చేరుకోగలిగే ఉపన్యాసాలు వారివి. ఆంగ్లసూక్తులు, సంస్కృతశ్లోకాలు, పిట్టకథలు, హాస్యరస భరితమైన వాక్యాలు వారి ఉపన్యాసాల్లో ధారా ప్రవాహంగా దొరలి పోతుంటాయి. ఎంత జటిలమైన విషయాన్నైనా ప్రశ్నోత్తరాల రూపంతో సులభంగా వివరించగల దిట్టవారు. చెప్పడం కన్నా చేయడమే మిన్న అనేది ఆయన సిద్ధాంతం. వివేకానంద, రామతీర్థులు ఉపన్యాసాల సారాంశం వీరి ఉపన్యాసంలోనూ కనిపిస్తుంది.

వారి హృదయమార్దవం మాటల్లోనూ, చేతల్లోనూ ప్రతిబింబిస్తుంది. ఎలాంటివారినైనా చేరదీసి, చేరువకాగల గుణం వారిది. మా గురుదేవులు భౌతికంగా లేకపోయినా మనో మందిరంలో ప్రతిష్ఠితులై ఉంటారు. తమ ప్రభావంతో ప్రగతిపథంలో నడిపిస్తారు.

తరువోజ

శ్రీకాళహస్తిలో శివునితోబాటు శివము భక్తులకెల్ల చేకూర్చుకొరకు
ప్రాకటంబుగ నీవు వసియించినావు భక్తులకేంద్రమై భాసించినావు
వాకధరుని దయావాకంబునందు పావనస్నానంబు వడిజేసినావు
గైకొమ్ము నీపాద కమలాల కేను కైమోడ్పు విద్యాప్రకాశ మౌనీంద్ర!



శ్రీశుకబ్రహ్మాశ్రమంలో ఉచిత యోగశిక్షణ

- యోగాచార్య సి. మార్కొండయ్య, శిరోమణి
(శ్రీశుకబ్రహ్మాశ్రమము)

యోగం అంటే ఏమిటి ? **"యుజ్"** ధాతువు నుండి యోగ శబ్దం పుట్టింది. యోగం అంటే కలుపు, బంధించు, చేర్చు, ఏకాగ్రత, ప్రయోగించు, అన్వయించు, అనుసంధానం అనే అర్థాలు ఉన్నాయి. యోగా ఒక విజ్ఞానశాస్త్రం yoga is a sciene. yoga is a Technology యోగా సాంకేతిక శాస్త్రం, yoga is a phialosapry యోగా వేదాంతం. yoga is an Art. యోగ ఒక కళ. కళాత్మకమైన జీవన విధానమే యోగం. సిద్ధాంతాన్ని ఆచరణలోకి తెచ్చు కళయే యోగం. నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక విలువలు కలిగి క్రమశిక్షణతో కూడిన జీవన విధానమే యోగం, ఏ జీవాత్మ పరమాత్మల అనుసంధానమే యోగం. విషయాల మీదికి పరుగులు తీసే మనస్సును వెనుకకు మరలించి స్వాధీనంలో ఉంచడమే యోగం. **"యోగశ్చిత్తవృత్తి నిరోధః"** - చిత్తవృత్తులను నిరోధించడమే యోగం అని పతంజలి మహర్షి అన్నారు.

సమత్వం యోగ ఉచ్యతే - (గీత 2-48)

శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, జయాపజయాలు మున్నగు ద్వంద్వాలకు చలించక మనో నిగ్రహంతో సమత్వబుద్ధి కలిగియుండుటయే యోగము అంటూంది భగవద్గీత ; మఱియు **"యోగః కర్మసు కౌశలమ్"** - (గీత 2-50) కర్మలలో నేర్పునే యోగమంటారు. దైనందిన జీవిత వ్యవహారాలలో నేర్పరితనం, సామరస్యం, మిత్రత్వం ప్రదర్శించడమే యోగము ; మరియు బాధనుంచి, దుఃఖం నుంచి విముక్తి పొందడమే యోగం - అని భగవద్గీత ఆరవ అధ్యాయంలో శ్రీభగవానువాచ.

భారతీయ తత్త్వజ్ఞానం ప్రతిపాదించిన షడ్దర్శనాలలో యోగ దర్శనం ఒకటి.

యోగం ఎందుకు? మన ప్రాచీనమహర్షులు మన కందించిన వారసత్వసంపదలో యోగము ఒకటి. భారతీయ సంస్కృతికి అద్దం పట్టేది యోగము. యోగము అటు మానసిక ఆరోగ్యాన్నిస్తుంది, ఇటు శారీరక ఆరోగ్యాన్ని కూడా ఇస్తుంది. శరీరానికి మనస్సు ప్రధానమైంది. కాబట్టి యోగము మానసిక ఆరోగ్యానికి ముఖ్య సాధనము. ఎప్పుడు మనస్సు ఆరోగ్యంగా వుంటుందో అప్పుడు ఇంద్రియాలు ఆరోగ్యంగా వుంటాయి.

అచంచల దీక్షతో గూడిన నిత్య యోగ సాధనవలన దేహంలోని ప్రతికణము శుద్ధమై చైతన్యవంత మవుతుంది. దీనివల్ల నిర్జీవమై, నిర్వీర్యమై మరుగుపడిపోయిన శక్తి సామర్థ్యాలు పునరుజ్జీవనం కాగలవు. శరీరంలోని ముఖ్య గ్రంథులు నిర్మలమౌతాయి. శుద్ధమౌతాయి. సమర్థవంతంగా పనిచేస్తూ హార్మోన్లను సమంగా విడుదల చేస్తాయి. అప్పుడే మనస్సు, శరీరం రెండూ ఆరోగ్యంగా వుంటాయి. ఈ విధంగా ఉభయ తారకమైన యోగాభ్యాసం మానవాళికి ఎంతో మేలును కలుగజేస్తుంది.

"ప్రార్థించే పెదవుల కన్నా సాయంచేసే చేతులు

మిన్న" అన్న ఆర్యోక్తిని అనుసరించి అందరికి ఆరోగ్యాన్ని అందించాలన్న సదుద్దేశంతో గురుదేవులు పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి దివ్య ఆశీస్సులతో పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు శ్రీశుకబ్రహ్మాశ్రమంలో 2004వ సం॥లో ఉచిత యోగ శిక్షణాకేంద్రాన్ని స్థాపించారు. ఈ యోగకేంద్రం నేటికీ నిర్విఘ్నంగా విజయవంతంగా అభివృద్ధి జెందుతూవుంది.

2004వ సం॥ నుండి 2007వ సం॥ము జూన్ నెల వరకు శ్రీ యం. రవిగారు యోగాచార్యులుగా సేవలందించారు. ఆ తర్వాత 2007వ సం॥ము జూలై నుండి నేటి వరకు నేను (సి. మార్కండేయులు) యోగాచార్యులుగా వ్యవహరిస్తున్నాను. యోగ శిక్షణ కేంద్రంలో పాల్గొని ముప్పది రోజులు యోగపరిచయ శిక్షణ యందు ఉత్తీర్ణులైన స్త్రీ పురుషులకు ఆశ్రమ వార్షికోత్సవములందు **"యోగశిక్షణ యోగ్యతా"** పత్రములు సభావేదికపై పూజ్యస్వామిజీల కరకమలముల మీదుగా అందజేయబడుచున్నవి.

శ్రీశుకబ్రహ్మాశ్రమమువారిచే శ్రీకాళహస్తి పట్టణములో గూడ మహిళలకు సాయంవేళలందు యోగ శిక్షణా శిబిరములు ఈక్రింది తెల్పిన విధంగా నిర్వహింపబడినవి.

1. 2008 సం॥ము మేనెలలో మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ మ్యాగీక్లారా గారి ఆధ్వర్యంలో "బాబు అగ్రహారం పాఠశాల"లో 15 రోజులు జరిగిన యోగ శిక్షణా శిబిరమునకు 20 మంది మహిళలు హాజరైనారు.

2. 2008 సం॥ము జూలైనెలలో రోటరీక్లబ్ శ్రీరాంనగర్ కాలనీలో లాయర్ శ్రీమతి డి. ఉమా గారి ఆధ్వర్యంలో 40 దినములు జరిగిన యోగశిక్షణా శిబిరమునకు 34 మంది మహిళలు హాజరై శిక్షణ పొందినారు.

3. 2010 సం॥ము జూలైమాసంలో శ్రీరాంనగర్‌కాలనీ "ఆదిశంకరా టెక్నో పాఠశాల"యందు 40 రోజులు జరిగిన యోగశిక్షణా శిబిరమునందు 38 మంది మహిళలు పాల్గొన్నారు. ఆరోగ్య సమస్యలనుండి ఉపశమనం పొందినారు.

తేది 1-1-2004 నుండి తేది 30-6-2012 వరకు యోగశిక్షణ పొందిన మొత్తం అభ్యాసకుల సంఖ్య :-

సంవత్సరం	అభ్యాసకుల సంఖ్య
2004 -	75 మంది
2005 -	36 "
2006 -	50 "
2007 -	23 "
2008 -	89 "
2009 -	65 "
2010 -	98 "
2011 -	78 "
2012 - జూన్ వరకు	81 "
మొత్తం -	595 మంది

పాల్గొన్న వారిలో పురుషులు 384 మంది
" స్త్రీలు 211 మంది
మొత్తం 595 "

వీరిలో యోగపరిచయ శిక్షణా కాలం ముప్పైరోజులు హాజరై యోగ్యతాపత్రములు పొందిన వారి సంఖ్య

పురుషులు 267 మంది
స్త్రీలు 134 మంది
మొత్తం 410 మంది.

శిక్షణాకాలంలో నేర్పబడుచున్న ఆసనములు :-

1. **నిలబడి వేసేవి :-** 1. సూర్యనమస్కారములు. మంత్ర పూర్వకంగా పండ్రెండు విన్యాసములు మరియు వైదిక సూర్యనమస్కారములు 9 విన్యాసములు. 2త్రికోణ. పరివృత్తి త్రికోణాసనములు 3. పార్శ్వకోణాసనము. 4. వీరభద్ర, 5 ధ్రువ 6. ఉత్కటాసనం మొదలగునవి.

2. **కూర్చొని వేసేవి :-** 1. పద్మాసన 2. మత్స్య 3. వజ్ర 4. సుప్తవజ్ర 5. ఉష్ట్ర 6. శశాంక 7. జానుశిరాసన 8. పశ్చిమోత్తాన 9. భరద్వాజ 10. వక్ర 11. బద్ధకోణ 12. ఉపవిష్టకోణ 13. అర్ధమత్స్యేంద్రాసన 14. గోముఖ 15. సింహాసనం మొదలగునవి.

3. **వెల్లకిల పండుకొని వేసేవి :-** 1. పవనముక్తాసన 2.ఉత్తాన పాద, 3 నౌక(నావ) 4 అనంతశయన 5.మర్కట 6.జఠర పరివర్తన 7. సర్వాంగ 8. హల 9. విపరీతకరణి ముద్ర 10. సుప్త పాదాంగుష్ఠ, 11.సేతుబంధ 12. చక్ర.

4. **బోర్లపడుకొని వేసేవి :-** 1. మకర 2. శలభ 3. భుజంగ 4. ధనురాసనం మొదలైనవి.

క్రియలు :- కఫ వాత పిత్త దోషనివారణకు జలనేతి, సూత్రనేతి, కపాలభాతి, అగ్నిసారధౌతి, నౌళి,వస్త్రధౌతి, వమన ధౌతి, త్రాటకం, శంఖప్రక్షాళనం మొ॥ హఠయోగ క్రియలు చేయించి వాటివల్ల కల్గు ప్రయోజనములు గూడ వివరించుట జరుగుతూంది.

ఓంకారధ్యానం :- ప్రణవము యొక్క విశిష్టతను తెలియజేస్తూ, 1. వాచిక 2. ఉపాంశు 3.చిత్తం (మౌన) జపములు, ధ్యానములు అభ్యసింపబడుచున్నవి.

ప్రాణాయామము :- శ్వాసను క్రమబద్ధీకరించి తద్వారా ప్రాణశక్తి (జీవశక్తి) ని అదుపులో ఉంచే ఈ ప్రక్రియనే ప్రాణాయామం అంటారు. ప్రాణాయామాన్ని గురించి మనువు ఇలా అన్నారు :- 1.బంగారం మున్నగు లోహాలను వేడి చేసినపుడు అందులోని మలినాలు తొలగిపోయినట్లు ప్రాణాయామం ద్వారా మనసులోని, బుద్ధిలోని లోపాలు వైదొలగుతాయి. 2. "ప్రాణాయామం పరం తపః" అంటే ప్రాణాయామాన్ని మించిన తపస్సు లేదు.

హఠయోగ ప్రదీపికలో - మల విక్షేపాలను శరీరం నుండి విసర్జించటానికి ప్రాణాయామానికి మించినది మరొక్కటి లేదు. ప్రాణాయామం చేయుటవలన శరీరము, మనస్సు, ఇంద్రియాలకు చెందిన మలినాలన్నీ తొలగిపోతాయి అని వుంది.

గీతాధ్యయనం వల్ల, ప్రాణామము వల్ల పూర్వజన్మ పాపాలన్నీ తొలగిపోతాయి. ఒక పద్ధతి ప్రకారం ప్రాణాయామం చేయుటవలన మన శరీరంలోని ప్రధాన భాగాలైన గుండె, ఊపిరితిత్తులు బలోపేతమౌతాయి. ఉబ్బసం, క్షయ, మొదలగు వ్యాధులను కూడా తొలగించుకోవచ్చు.

ప్రాణానికి, మనస్సుకు అవినాభావ సంబంధం వుంది. ప్రాణవాయువులను అదుపులో పెట్టుకోవడం వల్ల మనస్సు యొక్క చపలత్వాన్ని తొలగించుకోవచ్చు. అందువల్ల మానసిక వ్యాధులు ఆందోళనలు, ఆదుర్దా, భీతి, అన్ని తొలగిపోతాయి. సంపూర్ణారోగ్యంతో దీర్ఘకాలం జీవించవచ్చు.

అందుకే మన పూర్వీకులు పూజలు, నోములు, వ్రతాలు మున్నగు శుభకార్యములందు ఈ ప్రాణాయామాన్ని ఒక తప్పనిసరి క్రియగా నిర్ణయించారు. నాడీశుద్ధి, ఉజ్జాయీ, భ్రామరీ, సూర్యభేదన, చంద్రభేదన, శీతలీ, సీత్కారి, భస్త్రిక ప్రాణాయామాలు నేర్పించబడుచున్నవి.

ఈ యోగశిక్షణా శిబిరంలో చేరి ముప్పైరోజులు

శిక్షణాకాలాన్ని పూర్తిచేసుకొని ఆసనాలు, క్రియలు, ప్రాణాయామాలు చక్కగా నేర్చుకొని నిత్యసాధన ద్వారా ఆస్త్మా, తలనొప్పి, గ్యాస్ట్రిక్, మలబద్ధకం, మైగ్రేన్, కాళ్లతిమ్మిర్లు, కీళ్ల నొప్పులు, మధుమేహం, హైబీపి, లోబీపి, సైనసైటిస్, మెంటల్ టెన్షన్, భయం, నిద్రలేమి, నరాల బలహీనత, అజీర్తి, అధికబరువు, ఆయాసం, దగ్గు, జలుబు, మరియు స్త్రీల సమస్యల లాంటి ఎన్నో సమస్యలనుండి చాలామంది ఉపశమనం పొంది మానసికంగానూ, శారీరకంగానూ ఆరోగ్యవంతులై తమ దైనందిన జీవితాలను క్రమశిక్షణతో ఆనందంగా జరుపుకుంటున్నారని తెలియజేయుటకు మేమెంతో ఆనందిస్తున్నాము.

ఈ యోగశిక్షణ కేంద్రంలో శిక్షణపొందిన వారు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి యోగాపోటీలలో పలుమార్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందినారు. గరికపాటి రమేష్ బి.ఏ బి.యల్, ముషారఫ్ ఆలీ అను యీ ఇరువురు డిప్లొమా ఇన్ యోగా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులై రాష్ట్రీయ సంస్కృతవిద్యాపీఠం (డీమ్డ్‌యూనివర్సిటీ) తిరుపతి వారి నుండి యోగ్యతాపత్రమును పొందినారు.

భవిష్యత్తులో ఈ యోగవిద్యాలయాన్ని తిరుపతి సంస్కృత విద్యాపీఠం (డీమ్డ్ విశ్వవిద్యాలయ) యోగాశాఖకు అనుబంధంచేయాలని శ్రీస్వాములవారు తలంచుచున్నారు. శ్రీకాళహస్తీశ్వరుడు ఈ మనోరథాన్ని నెరవేరస్తాడని ఆశిద్దాము.

With Best Compliments From :

OM NAMAH SIVAYA

ON THE OCCASION OF CENTENARY CELEBRATIONS OF HIS HOLINESS VIDYA PRAKASANANDA GIRI SWAMIJI, FOUN DER, SRI SUKA BRAHMA ASHRAM, SRI KALA HASTI

WITH PRANAMS

SRI. D.JAYA PRAKASH

CO-ORDINATOR
DIRECTORATE OF DISTANCE EDUCATION
SRI VENKATESWARA UNIVERSITY STUDY CENTRE

NEAR SUB COURT
PUTTUR – 517 583, CHITTOOR DIST, AP.
PHONE # : 09577 – 222222, CELL : 98483 91201

CONTACT FOR ALL ADMISSIONS IN PG / UG & DIPLOMA COURSES OF SVU



'ఒక్కదాత' ఔదార్యం, వదాన్యత, అనంతగ్రహీతలకు వరప్రసాదమయ్యింది !...

లగడపాటి భాస్కర్
ఎం.ఏ, (శ్రీకాళహస్తి.)

ఒక్కదాత ఔదార్యం, వదాన్యత అనంత గ్రహీతలకు వరప్రసాదమయ్యింది. ఎవరా మహాత్ముడు ? ఆయన్ని 'ఒక్కదాతగా' ఎందుకు పిలవాలి? అందరికన్న ముందు, చొరవతో ముందుకు వచ్చి, ధర్మమార్గంలో ఆర్జించిన ధనాన్ని, సత్ప్రయోజనం కోసం దానం చేయడంవల్ల; ఆ పని ఇతరులు ఆరంభించకముందు ఆరంభించి చేసినందువల్ల; ఆపని ప్రతిఫలం ఆశించకుండ చేసినందు వల్ల ఆ మహానుభావుని 'ఒక్కదాత'గా, 'ఒకే ఒక్క ఆదర్శదాతగా' పేర్కొనాలి ! ఎవరా మహాత్ముడంటే, శ్రీకాళహస్తి ప్రాంతంలో ఉన్నతవిద్యా బీజాలను విత్తి, 'విద్యాప్రకాశానందులు'గా సార్థకనామం కలిగిన యతీంద్రులు!

నాల్గుదశాబ్దాల క్రితం, ఈప్రాంతీయులు ఉన్నత విద్యకోసం, తిరుపతి, నెల్లూరు, మదరాసు లాంటి ప్రదేశాలకు వెళ్ళి కళాశాలల్లో చేరవలసి వచ్చేది. ఈ పట్టణవాసి శ్రీఅద్దూరు బలరామిరెడ్డిగారు విద్యాశాఖామాత్యులుగా ఉండి, చిత్తూరు జిల్లాలో విద్యావ్యాప్తికి తనవంతు కృషిని చక్కగా చేశారు. తత్ఫలితంగా, ఇప్పటి జూనియర్ కళాశాలలకు బదులు, అప్పటి పండ్రెండవ తరగతివరకు విద్యాబోధన చేస్తుండిన 'హైయ్యర్ సెకండరీ పాఠశాల'లను, జిల్లాలోని ముఖ్యపట్టణాల్లో స్థాపింపజేశారు. అందులో తన స్వంత పట్టణం శ్రీకాళహస్తి ఒక్కటి. ఇక్కడ మంచి భవన నిర్మాణంతో పాటు, హయ్యర్‌సెకండరీ పాఠశాల ఏర్పాటయ్యింది.

ఇప్పటిలాగ, ప్రయివేటు పాఠశాలలుకానీ, కళాశాలలు కానీలేవు. ప్రభుత్వం కొత్తగా కాలేజి విద్యాసంస్థలను నెలకొల్పాలంటే, స్థానిక ప్రజల చొరవ, సహాయ సహకారాలు అవసరమయ్యేవి. స్థానికంగా విద్యాకమిటీలు ఏర్పడి, 'కార్పస్ ఫండు' ఏర్పాటు చేసి, ప్రభుత్వాన్ని అర్థిస్తే, ఆ ప్రదేశంలో విద్యను అర్థించేవారి సంఖ్య గణనీయంగా ఉందని ప్రభుత్వం భావిస్తే, అక్కడ ప్రభుత్వం విద్యాసంస్థల్ని ఏర్పాటు చేసేది!

ప్రభుత్వ సంస్థల్లో చదివే విద్యార్థులు చెల్లించే ఫీజులు చాలతక్కువగా ఉంటాయి. ధనవంతులకే కాక, సామాన్య కుటుంబీకుల పిల్లలకూ ప్రభుత్వకళాశాలల్లో, ఉత్తమ విద్యార్హతలు కలిగిన ఉపన్యాసకులు, ఉత్తమ ప్రమాణాలతో విద్యనందిస్తారు. కనుక అందరికీ అందుబాటులో ఉండే ఉన్నత విద్య, శ్రీకాళహస్తిలో లభించాలంటే, పట్టభద్ర కళాశాల ఈ పట్టణంలో ఏర్పాటు కావాలి! అందుకు అవసరమైన 'నిధిని' (కార్పస్ ఫండును) కళాశాల కమిటీ సమకూర్చాలి. అందుకు కమిటీవారు సాధారణంగా ఉదారదానశీలురవద్దకో, పేరుకోసం దానం చేసే సంపన్నుల వద్దకోవెళ్ళి సేకరించిన సొమ్ముతోను, మునుముందు కళాశాలలో చేరే విద్యార్థులనుండి, కళాశాలకు చెల్లించవలసిన ఫీజు కాకుండ, 'కళాశాలఅభివృద్ధినిధికి' అని కొంత ఫీజు కట్టించుకొని, ఆ నిధికి జమ చేసేవారు. ఈ ప్రక్రియ అత్యంతశ్రమతో కూడినది. క్లిష్టమైనదికూడ !

అలాంటి పరిస్థితుల్లో శ్రీశ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారు ముందుకు వచ్చారు. మొదట శ్రీకాళహస్తి బాలుర డిగ్రీకళాశాలకు, ఆపై బాలికల జూనియర్ కళాశాలకు, అలాగే బాలుర జూనియర్ కళాశాలకు కూడ, వలసిన నిధులనిచ్చి, ఉన్నత ప్రమాణాలతో నడుస్తూ, ఎందరో విద్యార్థినీ విద్యార్థులకు, శ్రీకాళహస్తి పట్టణం లోనే, అందుబాటు ఉన్న విద్యాసంస్థల స్థాపనకు కారకులయ్యారు శ్రీవిద్యా ప్రకాశానందగిరి స్వాములవారు. వారి శతజయంతి ఉత్సవాలను జరుపుకుంటున్న తరుణంలో, స్వాములవారు చేసిన విద్యాదానం, వైద్యసదుపాయాదులను గురించి, వారి ఆదర్శజీవితం, ఆధ్యాత్మిక వితరణ, సమాజ సేవలను గురించి పాఠకులు తెలుసుకోవలసి ఉన్నది.

కాశీకి ఏమంత ప్రాధాన్యమంటారా? ఉన్నది, సర్వజ్ఞ నాముడూ, జ్ఞానాధిపతీ పరమశివుడు. ఆయన భూలోక నివాసం, అపరకైలాసం కాశీలోనే. ఆ కాశీవిద్యాపీఠంలోనే శ్రీస్వాములవారు హిందీ విద్యాభ్యాసం చేసి, ఈ 'దక్షిణకాశి' అయిన శ్రీకాళహస్తిలో శుకబ్రహ్మాశ్రమం స్థాపించినారు. ఈనాటి బ్రతుకు తెరువు విద్యకోసం పరుగులు తీస్తున్న, 'విద్యాతురుల'కు, కళాశాలలు నెలకొల్పినారు. ఆధ్యాత్మిక మార్గాన్వేషులకూ గీతామకరందాన్ని, రచించి, ప్రవచించిన అభినవ గీతాచార్యులు శ్రీవిద్యాప్రకాశానంద స్వాములవారు. గీతామకరందమే కాక, శతాధిక ఆధ్యాత్మిక గ్రంథాలు రచించి, ప్రచురించి, ప్రపంచ వ్యాప్తంగా పంపిణీ చేయించి, ఆధ్యాత్మిక 'విద్యాదానం' చేసిన పుణ్యాత్ములు వారు! వారి శతజయంతి ఉత్సవాలను నిర్వహింపజేస్తున్న ప్రస్తుత శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు, శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాములవారు ధన్యాత్ములు.

దానమహిమ ఎఱిగిన స్వాములవారు

దాన మహిమ తెలిసిన బలిచక్రవర్తి, గురుని మాటను మీరి కూడ మూడడుగుల నేల వామన మూర్తికి దానం చేశారు ! హాని కలుగుతుందని హెచ్చరించినా, నశ్వరమైన శరీరనాశనం కంటే, అనశ్వరమైన కీర్తిశరీరం తనకు దక్కుతుందన్నాడు. అలాగే కొత్త పెండ్లి కొడుకైన జీమూత వాహనుడనే గంధర్వుడు - పాములజాతి వినాశనాన్ని, నివారించడానికి - తన శరీరాన్ని బలిపీఠంపై పెట్టి, గరుత్మంతునితో తనను తిన మని అభ్యర్థించాడు. ఒక పావురాన్ని రక్షించడం కోసం, శిబిచక్రవర్తి తన శరీరాన్నే సమర్పింప సిద్ధపడ్డాడు.

వ్యాసమహర్షులవారు కాశీవాసులై, శివసేవకులై వేయిమంది శిష్యులకు గురువై ఉండి, వేదాల్ని విభజించి, పురాణాలను ప్రవచించి, ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని విశ్వ వ్యాప్తం చేసినవిషయం జగద్విదితం. మన విద్యాప్రకాశానందులు, కాశీవిద్యా పీఠంలోనే హిందీ విద్యాభ్యాసం చేసి, సంస్కృతాంధ్ర, ఆంగ్ల భాషల్లో నిష్ణాతులై, వ్యాసతుల్యులైన బ్రహ్మశ్రీ మలయాళ యతీంద్రులకు, శుకబ్రహ్మతుల్యులై, దత్తపుత్రులై, పవిత్ర వాయులింగ క్షేత్రంలో, భరద్వాజ మహర్షిలాగే శుకమహర్షులవారు చరించిన చోట, శ్రీ శుకబ్రహ్మాశ్రమవ్యవస్థాపకులైనారు. ఇప్పుడు 'ఈ యాశ్రమం'- పౌరాణిక, చారిత్రక యుగాల్లో అగస్త్యుని లాంటిమహర్షులూ, అర్జునుని లాంటి భక్తులూ విశ్రమించిన భరద్వాజాశ్రమంలా, అంతకన్న వర్తమాన భక్తశ్రేణికి నిత్యజ్ఞానదాయిగా, నిత్య అన్నదాన అన్నపూర్ణపీఠంగా, నేత్రవైద్యశాలగా, క్షేత్ర సందర్శకులకు దర్శనీయ ఆరామంగా, విరాజిల్లుతున్నది !

పురాణయుగంలో, అగ్నివేశుడూ, కణ్వుడూ, పరశురాముడూ, సాందీపని లాంటి మహర్షిపుంగవులు విద్య, విలువిద్యాగురువులై, అర్హతగల శిష్యులకు విద్యాదానం చేశారు. సాందీపని వద్దనే, అవతార పురుషులైన శ్రీకృష్ణబలరాములు, 64 దినాల్లో, అరువది నాల్గువిద్యలు అభ్యసించారని పురాణాలు చెపుతున్నాయి. సాందీపని శ్రీకృష్ణసోదరులకు విద్యగరపిన సమయాన తన ఆశ్రమాన్ని కాశీ లోనే నిర్వహిస్తూండినట్టు పూర్వగ్రంథాలు తెలుపుతున్నాయి!

దానమహిమ ఎరిగినవారు ధన్యాత్ములు !

శ్లో॥ గౌరవం ప్రాప్యతే దానా న్నతు విత్తస్య సంచయాత్ ।
స్థితిరుచ్చైః పయోదానాం, పయోధీనామధః స్థితిః ॥

దానంచేసేవారి చేయి ఎప్పుడూ పైననే ఉంటుంది. గ్రహీత చేయి క్రిందనే కదా? ఇదే విషయాన్ని శుక్రాచార్యునికి బలి తెలిపాడు. పైశ్లోకం కూడ అదే చెబుతున్నది. గౌరవమనేది, ధనంకూడబెట్టటం వల్లరాదు. దాన్ని పాత్రులకు దానంచేస్తేనే లభిస్తుంది. మేఘం వర్షరూపంలో నీటిని దానం చేస్తున్నది కనుక ఆ మేఘం ఆకాశంలోనే ఉంటుంది. నీటిని స్వీకరించిన సముద్రపు స్థితి, ఎప్పుడూ క్రిందనే కదా!

శ్లో॥ న తద్దానం ప్రశంసన్తి యేన వృత్తిర్విపద్యతే ।
దానం యజ్ఞస్తపః కర్మ లోకే వృత్తిమతోయతః ॥

దానం చేస్తే గౌరవం, పుణ్యం లభిస్తుందని, సంపాదించిందంతా దానం చేసివేయడమూ సరికాదు. దానం చేసే వ్యక్తి నిత్యావసరాలకు సరిపడా నిలువ ఉంచుకొనే చేయాలి. ఎలాగంటే

శ్లో॥ న్యాయోపార్జిత విత్తస్య దశమాంశేన ధీమతః ।
కర్తవ్యో వినియోగశ్చ ఈశ్వరప్రీత్యర్థమేవ చ ॥

దానం చేసే సొమ్ము న్యాయంగా సంపాదించినదై ఉండాలి. అలాకాకపోతే దానఫలం దక్కదు. బుద్ధిమంతులైన వారు తమ సంపాదనలో పదవవంతు తప్పక దానం చేయాలి. సంపాదనలో పదోవంతును మినహాయించి, తొమ్మిది వంతులే తన విత్తంగా భావించాలి. అతిగా దానంచేసి, స్వీయహాని పొందరాదు. పరిశుద్ధమైన ధనాన్ని పాత్రులకే ఇవ్వాలి. అపాత్ర దానంవల్ల పాపం వస్తుంది. దానంచేసే సొమ్మును 5 అంశాలకు కేటాయించాలి.

శ్లో॥ ధర్మాయ యశసేఽర్థాయ కామాయ స్వజనాయ చ ।
పంచధా విభజన్ విత్తమిహాముత్ర చ మోదతే ॥

దానం చేసే సొమ్మును 1. ధర్మకార్యాలకోసం 2.యశస్సు, (ఇది చిరకాలం ఉండేది కనుక) అంటే కీర్తిప్రదమైన అంశానికీ, 3. అర్థ (వ్యాపారాది) ఆజీవిక కోసం 4. కామ (జీవనోపయోగి) భోగం కోసం 5. స్వజనం (తన పరివారం) కోసం. ఒక్కొక్క దానికి మొత్తం సంపాదనలో ఐదవవంతు వ్యయంచేయాలనేది ధర్మ శాస్త్ర నిర్ణయం.

దానం చేయకపోతే ఏమౌతుంది?

శ్లో॥ అదత్తదానాచ్చ భవేద్దరిద్రో,
దరిద్రభావాచ్చ కరోతి పాపమ్ ।
పాపప్రభావాన్నరకే ప్రయాతి,
పునర్దరిద్రః పునరేవ పాపీ ॥

నీటిచలంలో నీటిని తోడుతుంటేనే కదా ఊరేది? ఆర్జించిన సొమ్ము దాచుకుంటే దరిద్రమొస్తుంది. ఆ దరిద్ర

దశలో పాపంచేసారు. పాపప్రభావం వల్ల నరకం ప్రాప్తిస్తుంది. ఆపై జన్మలో మరలా దరిద్రులుగానే జన్మిస్తారు.

శ్లో॥ స్నానం దానం జపో, హోమో, స్వాధ్యాయో దేవతార్చనమ్ ।
యస్మిన్ దినే న సేవ్యన్తే స వృథా దివసో నృణామ్ ॥

మానవ జన్మ పుర్వార్జితపుణ్యంవల్ల కదా లభించింది! ఆ జన్మ సార్థకం కావాలంటే నిత్య స్నాన, జప, హోమ, స్వాధ్యాయ, దేవతార్చనాదులు నిర్వహించాలి. ఏ దినం అవి చేయమో, ఆ దినం ఆనరుని జీవితంలో వ్యర్థమైన దినమే!

దానాల్లో అభౌతిక దానం గొప్పది !

భౌతిక దానాన్నే మనం మెచ్చుకుంటాం, గొప్పగా చెప్పుకుంటాం. నిత్యమూ వార్తా పత్రికల్లో వార్తలుగా దానవరుల ఛాయాచిత్రాలతో కూడిన వార్తలు చదువుతూంటాం. అన్నదానం చేసినవారు, వస్త్రదానం చేసినవారు, గుడి గోపురాలకూ, దేవతా మూర్తులకూ, సువర్ణరజత, వజ్ర, వైడూర్యాదులను దానం చేస్తున్నవారి వార్తలు చదువు తుంటాము. మంచిదే! ఒకరి స్ఫూర్తితో మరొకరు వస్తుండటం శుభ పరిణామమే! కాని, దానపు సొమ్ము పరిశుద్ధమైనదై ఉండాలి. అంటే, న్యాయార్జితంగా ఉండాలని శాస్త్రం. దొంగవాడు చేసినదానం, చేసిన వానికీ, స్వీకరించిన వానికీ, పాపాన్నే అంటగట్టుతుంది.

'అభౌతికదానం' అంటే వస్తురూపమైంది కాదు. ఒక గ్రీకు కథకుడు చెబుతాడు. ఒకవ్యక్తికి దానం చేయాలనే ఉదారగుణం ఉంది. అయితే తన వద్ద సొమ్ములేదు. ఒకనాడు తానువెళ్లేదారిలో ఆకలితో, చలితో, అపాయస్థితిలో ఉన్న దీనుడ్ని ఆవ్యక్తి చూచాడు. అతనికి చలిలేకుండ మంచి దుప్పటి కప్పాలి. ఆకలికి మంచి ఆహారం పెట్టాలి. వైద్యుని వద్దకు తీసుకుపోయి ఆతనికి మంచి వైద్యం చేయించాలి! ఇవన్నీ అతని ఆశలు. అయితే తనవద్ద ఏమీలేదు. ఆ దీనుని దగ్గరికెళ్లాడు. పైకిలేపి, గట్టిగా కౌగిలించుకున్నాడు "ప్రొద్దెక్కుతున్నది. చలిపోతుంది అధైర్యపడవద్దు" అని చెప్పివెళ్లాడు. ఆ వ్యక్తిలో అసంతృప్తి ఉన్నది, కానీ, దీనస్థితిలో ఉన్న వ్యక్తి ధైర్యంతో కోలుకున్నాడు, బాటసారి ఇచ్చిన ధైర్యం మహాగొప్పదానం అంటాడు రచయిత!

'విద్యాదానం', 'వైద్యదానం' అభౌతిక దానానికి ఉదాహరణలు. దొంగకు దొరకనిదీ, విదేశాల్లోనూ ఆదుకొనేదీ, గౌరవాన్నిచ్చేది - రాజ పూజితమైందీ, ఆత్మానందాన్ని కలిగించేదీ, విద్యాదానమే! ఆపన్నులను ఆదుకొని, జీవితంపై ఆశ పెంచేది, జీవితకాలాన్నే పెంచగలిగేది 'వైద్యం'! పైరెండు సౌకర్యాలనూ కలిగించగలిగేవారు, ఉత్తమోత్తమ 'దానవీరులు' కాగలరు !

శ్రీవిద్యాప్రకాశానంద స్వాములవారి సామాజిక సేవాకార్యక్రమాలు అసాధారణమైనవి. సామాన్యులకు అర్థమయ్యే భాషలో, చమత్కారాలూ, పిట్ట కథలూ, ఉపమానాలతో, లోతైన ఆధ్యాత్మికాంశాలను, సామాన్యులకు, తమ ఉపన్యాసాలతో అందించడం స్వాములవారి ప్రత్యేకత! తిరుపతి తిరుమల దేవస్థానం వారు, స్వాముల వారిచేత చేయించిన అనేక గీతాజ్ఞానయజ్ఞాలు, మరువరానివి! అభినవ గీతాచార్యులై తమవాణిని - క్యాసెట్లు, ప్రచురణలూ, టీ.వీ. చానెళ్ల ప్రసారాల రూపంలో స్వాములవారు ప్రపంచానికి అందించారు.

వారి వదాన్యత మూలంగానే, నేడు శ్రీకాళహస్తి పట్టణంలో ఎస్.వి.ఏ ప్రభుత్వడిగ్రీ కళాశాల, బాలుర, మహిళల జూనియర్ కళాశాలలు - ఉన్నతప్రమాణాలతో నడుస్తున్నాయి. పి.జి. కోర్సులూ, కంప్యూటర్ తరగతులూ, జాతీయ సేవాకార్యక్రమాలూ, జె.కె.సి ఉపాధి ఉపయుక్త

బోధనా కార్యక్రమాలూ, పై డిగ్రీ కళాశాలల్లో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ కళాశాలల్లో ఉత్తమ, సర్వోత్తమ ప్రమాణాలూ, విద్యార్హతలూ కలిగిన ఎందరో సమర్థులైన ఉపన్యాసకులు ప్రస్తుతం పనిచేస్తున్నారు.

అలాగే ఎస్.వి.ఏ. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాలలు కూడ స్వాములవారి పేర, వారి ఆర్థిక సాయంతో ప్రారంభమై, ప్రబలమై పరిఢవిల్లుతున్నవే! ఇప్పుడైతే, ఏ సౌకర్యాలు లేకున్నా, ఏ ప్రమాణాలు లేకున్నా, పరిసరాలూ, భవనాలూ, ఆటస్థలాలూ లేకున్నా, పెద్ద పెద్ద ప్రచార ఆర్భాటాలతో, కార్పొరేటు కళాశాలు ప్రారంభమై, విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. తల్లిదండ్రులు, అప్పులు చేసైనా, ఆర్భాటాలున్న కళాశాలల్లోనే చదివించాలనే ఆదుర్దా ప్రదర్శిస్తున్నారు. ఆనాడు, దూరదృష్టితో, స్వాములవారు ఆర్థిక సాయంచేసిన కళాశాలల్లో చదివిన వేలాది విద్యార్థినీ విద్యార్థులు, దేశ, విదేశాల్లో, ఉన్నతచదువులార్జించో, ఉద్యోగాలు సంపాదించో, జన్మభూమికి ఎంతో పేరు తెస్తున్నారు.

ఐ.టి.ఐల్లో, ఆర్.ఇ.సి ల్లో ఇంజనీరింగ్ సీట్లు పొంది, విదేశాల్లో వ్యాపారాలు ప్రారంభించినవారు ఎందరో ఉన్నారు. వారికి ఈ కళాశాలలే ప్రాతిపదిక లైనాయి! స్వాములవారి విద్యాదానాన్ని స్వీకరిస్తున్న 'గ్రహీతలు' స్వాములవారు నాటిన జ్ఞాన వృక్షాలను మరువరాదు, అవసరమైన మేర, ఆ సంస్థల విస్తృతికి, ఉడుతా భక్తిగా తోడ్పడాలి.

శ్రీస్వాములవారు ఆశ్రమ పరిసరాల్లో తోటలూ, పంటపొలాలు, పెంపొందించారు. ఆదాయాన్ని తమ దాన ప్రక్రియకే వినియోగించారు. ప్రస్తుతం 'కన్నప్ప' కంటి ఆస్పత్రిలో వందలాది మందికి కంటి శస్త్రచికిత్సలూ, సులోచనాలూ, ఉచితంగా అందజేస్తూ, దృష్టిదానం కూడ నిర్వహిస్తున్నారు.

శ్రీకాళహస్తి క్షేత్రానికి వచ్చే భక్తులు ఎందరో, శ్రీవిద్యాప్రకాశానందస్వాములు స్థాపించి, శ్రీవిద్యాస్వరూపానంద స్వాములు ప్రస్తుత పీఠాధిపతులై నిర్వహిస్తున్న ధార్మికోపన్యాస కార్యక్రమాలకూ, పీఠాధిపతులు హాజరయ్యే సదస్సులకూ - ఆసక్తిగా హాజరై ఆశ్రమ నిర్వాహకులను శ్లాఘిస్తున్నారు! సందర్శకులను ఆప్యాయంగా పలకరించి, అన్నపూర్ణ భోజన శాలలో అన్నప్రసాదాన్ని స్వీకరించి వెళ్లమని చెబుతున్నారు. కాశీఖండంలో శ్రీనాథకవి వర్ణించిన, కాశీనగర చతుశ్శాలలో, అన్నపూర్ణాదేవి, నానా రూపాల్లో ముత్తైదువగా వచ్చి, అన్నార్థులకు అన్నం వడ్డించేదని చెప్పిన దృశ్యం, పలుకులూ - భోజన సమయానికి ఆశ్రమానికి వెళ్లిన భక్తులకు అనుభవానికి వస్తుంది !

వాస్తవ పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీవిద్యాప్రకాశానంద స్వాములవారి శతజయంతి, శతసహస్ర విద్యాకుసుమాలను వికసింపజేసిన, ఏకలవ్య శిష్యపరంపర, కృతజ్ఞతాభివందనాలతో, ఋణవిముక్తం కావాలని ఆశిద్దాం!

విద్యాదాతకు వందనాలు. ఆధ్యాత్మిక గురువుకు అభివందనాలు !!

బీదవానికి ఒక వెయ్యి రూపాయలు దొరికిన తాను గొప్పవాడనైతినని తలంచి గర్వితుడైయుండును. గొప్ప శ్రీమంతుడైన సహస్ర రూప్యములు స్వల్పముగా తలంచును, గర్వముండదు. ఆలాగున స్వల్ప గుణము గలవానికి కొంత యోగ , ధ్యాన, జ్ఞాన, విరక్తి విద్యలు గల్గిన తాను సర్వజ్ఞుడనైతినని తలంచును. మరల ఆత్మవిద్యకు సంబంధించిన దేమియు గ్రహింపజూడదు.

- శ్రీ సద్గురు మలయాళ స్వాములవారు

గీతామకరందం అక్షయపాత్ర

- దోమ వేంకటేశ్వర రావు, న్యూజిలాండ్

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి వారి చరణారవిందములకు సాష్టాంగ ప్రణామములు చేయుచూ విన్నవించుకొనునది ఏమనగా.

స్వామీ! నేను గతములో సుమారు 2 మాసముల క్రిందట తమ సన్నిధికి ఒక లేఖ వ్రాసియుంటివి. బహుశా అది ముట్టియుండవచ్చును - అని భావించుచున్నాను.

భగవత్ కృప వలన తమచే విరచితమైన "గీతా మకరందం' నాకు మార్చి నెలలో ఒకరి నుండి లభ్యమైనది. అప్పటి నుండి క్రమముగా ప్రతిరోజు మకరందమును గ్రోలుచూ ఉన్నాను. అది శనివారం (15-09-01) తో ఒకసారి సంపూర్ణముగా పఠించుట జరిగినది.

ఆ మకరందం అక్షయపాత్ర వలె నున్నది. అందుకే తిరిగి రేపటినుండి అనగా 18-09-01 నుండి తిరిగి పునః పఠనము క్రమముగా గావించ నిశ్చయించుకొన్నాను.

గతంలో నేను 4 లేక 5 వ్యాఖ్యానములతో కూడిన భగవద్గీతలను పఠించుట జరిగినది. కాని మకరందమును పొందుట ఇపుడే జరిగినది. మళ్ళీ, మళ్ళీ, విడువక ఆ మకరందం గ్రోలవలెనని మనస్సు ఉవ్విళ్ళూరుచున్నది. అంత చక్కటి వ్యాఖ్యానాన్ని ప్రసాదించిన జ్ఞానశ్రేష్ఠుల పాదములకు నా సాష్టాంగ ప్రణామములు. ఒక్కసారి మీ పాదములపై నా శిరస్సును ఉంచు వరకు, నాకు తృప్తి తీరదు. అంతవరకు నా త్రికరణముల శుద్ధిగా అర్పించు ప్రణామములు స్వీకరించ ప్రార్థన. కేవలం పఠనమే కాక, ఆచరణను కూడా క్రమముగా పాటించుట మొదలిడినాను. నాలో ఎన్నో ఆనందకరమైన, స్పష్టమైన, దృగ్గోచరమైన మార్పులు కనిపించుచున్నవి.

ప్రభూ! నా ఈ పఠనము, ఆచరణవల్ల అనిర్వచనీయమైన ఆనందమును పొందుచున్నాను. నా దేహంలో ప్రాణమున్నంతవరకు ఆ కృష్ణ పరమాత్మకు హృదయాంజలి అనుక్షణం సమర్పించగల శక్తి యుక్తులను ప్రసాదించ వలసినదిగా కోరుకుంటున్నాను. అందుకు మీ ఆశీస్సులు అందచేయవలసినరుగా ప్రార్థించుచున్నాను.

సత్ ప్రవర్తన - నిత్య దైవార్చన అసంభవమేమో అనుకున్న నాకు, తమరి గ్రంథ పఠనానంతరం ఆరెండు ఆచరణ సాధనములైన దివ్య మార్గములని స్పష్టముగా, అనుభవ పూర్వకముగా తెలిసినవి.

ప్రభూ! ఇంకనూ నా శ్రద్ధాసక్తులను వృద్ధి అగునట్లు మీ అనుగ్రహ భాషణమును ఇవ్వవలసినదిగా ప్రార్థించుచూ సెలవు కోరుతున్నాను. (ఇది 17-9-2001 తేది న్యూజిలాండు నుండి వచ్చిన లేఖ)

భగవంతుని ఆశ్రయించి భగవత్సేవానిరతులై సదా భగవత్స్మరణ యొనర్చుచుండువారు లోకమున యమునిగూర్చి కాని లేక మరెవరిని గూర్చికాని భీతి నొందవలసిన పని లేదు.

- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి



శ్రీస్వాములవారి విరాళంతో స్థాపించిన డిగ్రీకళాశాల పేదవిద్యార్థులకు వరమైంది

- పుణ్యం మురుగేశన్, బి.కాం, ఎఫ్.సి.ఎ.
(హైద్రాబాద్)

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా 2013వ సంవత్సరంలో శ్రీస్వామివారు స్థాపించిన శ్రీశుకబ్రహ్మాశ్రమమునందు జరుగబోవు ఉత్సవకార్యక్రమాలలో భాగంగా విశేషసంచికను విడుదల చేయుచున్నారని తెలిసి చాలా సంతోషించాను.

శ్రీస్వాములవారి విరాళంతో శ్రీకాళహస్తిలో స్థాపించిన డిగ్రీకళాశాల చుట్టుప్రక్కల గ్రామాలలోని విద్యార్థినీ విద్యార్థులకు గొప్పవరమైంది. శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి దివ్య పాదపద్మములకు అనేక దాసోహములు. శ్రీ స్వామివారు శ్రీకాళహస్తిలో శ్రీ శుకబ్రహ్మాశ్రమమును స్థాపించినది మొదలు వారు అనేక ఆధ్యాత్మిక, ప్రజాశ్రేయస్సు కార్యక్రమములు చేపట్టినారు.

శ్రీ స్వామి వారు “గీతామకరందం”, “వాశిష్ఠ రామాయణం” లాంటి మహాగ్రంథాలు - పండితులకు పామరులకు మనస్సుకు హత్తుకునే రీతిలో రచించారు. భగవద్గీతను సామాన్యులకు సహితం అర్థమై ఆచరణ యోగ్యముగా సులభశైలిలో ఉపదేశించినారు. శ్రీ స్వామివారి శతాధిక గీతాజ్ఞాన యజ్ఞములలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తరించారు. ఇందులో 100వ గీతా జ్ఞాన యజ్ఞము శ్రీకాళహస్తిలో వెలసియున్న శ్రీప్రసన్న వరదరాజస్వామివారి దేవాలయంలో 7 రోజులు జరిగినది.

ఈ గీతాజ్ఞానయజ్ఞమునకు భక్తులు అనేక మంది విచ్చేసి శ్రీస్వామివారి భాష్యమును ఆలకించి తరించినారు. ఈ గీతాజ్ఞానయజ్ఞము పరిసమాప్తి చేసిన అనతి కాలంలోనే శ్రీప్రసన్న వరదరాజస్వామివారి దేవాలయం పూర్వ వైభవమును సంతరించుకున్నది. ఇందుకు దృష్టాంతమే శ్రీ వరదరాజస్వామి వారికి ఎప్పుడో ఆగిపోయిన బ్రహ్మోత్సవములు పునః ప్రారంభమైనవి. ఆ సంవత్సరం నుండి ఆరంభం చేసిన ఉత్సవములు ప్రతియేడు ‘మే’ మాసంలో జరుగుతూవున్నవి. ఇది అంతయు శ్రీస్వామివారి ద్వారా వెలువడిన గీతాజ్ఞాన యజ్ఞప్రభావమే అని చెప్పుకోవటం చాలా విశేషం.

ఈ గీతాజ్ఞానయజ్ఞములలో శ్రీస్వామివారి ప్రవచనాశైలి, పిట్ట కథలతో సోదాహరణములతో వివరించే తీరుతెన్నులు, చిన్న పిల్లలు సైతం శ్రద్ధాసక్తులతో వినడం వల్ల, భక్తజనుల హృదయములలో ముద్రించేవారు.

శ్రీ స్వామివారి ప్రవచనములను తిరుమల తిరుపతి దేవస్థానంవారు సహితం 20సంత్సరములకు మునుపే వీడియో క్యాసెట్స్ తయారు చేసి భక్తజనులకు అందుబాటులో వుంచారు. శ్రీ స్వామివారి గీతామకరందాన్ని గ్రోలిన వారిలో నేను కూడ ఒకడ్ని అని చెప్పుకోవడానికి చాలా సంతోషిస్తున్నాను.

మా పసితనంలో శ్రీశుకబ్రహ్మాశ్రమమునకు స్నేహితులతో కలిసి తరచుగా వెళ్ళి మహనీయులైన శ్రీస్వామివారి దర్శనం చేసుకొని అచ్చటి ఆశ్రమ వాతావరణంలో కొంతసేపు ఆటలాడుకొని రావడం మాకు చిన్ననాటి సరదాల్లో భాగంగా వుండేది. అప్పట్లో మాకు శ్రీస్వామివారి దర్శనం అయాచితంగా లభించేది. పెద్దగా ఆధ్యాత్మిక జ్ఞానంలేని వయస్సు కనుక ఆటల్లో భాగంగానే ఆశ్రమానికి వెళ్లే వాళ్లం. ప్రతి సంవత్సరం జరిగే వార్షికోత్సవములకు కూడ వెళ్లే వాళ్లం. సుదూర ప్రాంతముల నుండి కూడ అనేక మంది పీఠాధిపతులు, సాధుపుంగవులు జ్ఞానులు వచ్చి ప్రసంగించేవారు. భక్తులుకూడ అత్యధిక సంఖ్యలో వివిధ ప్రాంతములనుండి విచ్చేసే వారు. ఎక్కువగా, స్వాములు చేసే ప్రసంగములలో జ్ఞాన బోధను పిట్టకథలతో మేళవించి చెప్పేవారు. అప్పట్లో అది మాకు చాలా ఆసక్తికరంగా వుండేది. ఆ విధంగా మాలాంటి వారు తెలియకుండానే సత్సంగంలో పాలుపంచుకొని ఎంతోమంది సాధువులను దర్శనంచేసుకొనేవారము. తెలిసి చేసినా తెలియక చేసినా సాధు దర్శనం, సత్ సాంగత్యం వలన కలిగే గొప్ప ఫలితాలు మాకు మా జీవితాలపై ప్రభావం చూపినవి.

జ్ఞానం తెలిసే వయస్సు వచ్చేసరికి వారి గ్రంథ పఠనం చేయడం. క్యాసెట్స్ వినడం ద్వారా సన్మార్గములో వుండి జ్ఞానసముపార్జనకు దారితీసినది. ఈ గతస్మృతులు ప్రస్తుత జీవిత గమనంలో పెనుమార్పులు వచ్చి, ఎంతో మంది పీఠాధిపతులు, జ్ఞానులు సాధువులను సందర్శించుకొని వారి ప్రవచనములు వినడం, వారి ఆశీస్సులు అందుకోవడం మా కుటుంబానికి దైనందిక చర్యగా మారింది. ప్రస్తుతము మేము వుంటున్న హైదరాబాదు పట్టణములో వెలసివున్న శ్రీ అష్టలక్ష్మీదేవాలయం (మా నివాసమునకు అతి సమీపంలో) హైదరాబాదు నగరానికే తలమానికంగా అలరారుచున్నది. అటువంటి దేవాలయములో నాకు 5 సంవత్సరములు ‘దేవాలయ కోశాధికారిగా’ సేవ చేసుకొనే భాగ్యం కలిగినది. ఈ దేవాలయ “సంరక్షక కమిటీ సభ్యునిగా” కూడ శ్రీశ్రీశ్రీ జగద్గురువులు కంచికామకోటి పీఠాధిపతులు శ్రీ జయేంద్ర సరస్వతి స్వాములవారు అనుగ్రహించి, శ్రీ అష్టలక్ష్మీ దేవాలయ సేవాభాగ్యం కలిగించినారు. ఈ ఆధ్యాత్మిక సంబంధం నాకు చిన్నతనంలో నుండే శ్రీస్వామి వారి ఆశీస్సులతో అబ్బినందున, ఇప్పుడు కూడ అదే మార్గంలో వెళ్ళుటకు మార్గం సుగమం అయిందని నేను భావిస్తున్నాను.

శ్రీ శుకబ్రహ్మాశ్రమం స్వామివారు అనేక మహోన్నతమైన కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా ముఖ్యంగా శ్రీకాళహస్తిలో ఉన్నతపాఠశాలవిద్య తరువాత ఉన్నత విద్యను అభ్యసించుటకు తిరుపతి, మద్రాసు వంటి పొరుగు పూర్లకు వెళ్లవలసి వుండేది. అటువంటి సందర్భంలో శ్రీస్వామి వారు, శ్రీకాళహస్తి పట్టణ వాస్తవ్యులకు విద్యాదానం చేయుటకు, శ్రీకాళహస్తిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపించుటకు శ్రీస్వామి వారి కృషి సర్వత్రా ప్రశంసనీయం.

శ్రీస్వామివారు నిర్హేతుక దయతో 1968 ప్రభుత్వంవారు డిగ్రీ కళాశాల - చిత్తూరు, శ్రీకాళహస్తి, నగరి, పుత్తూరు మొదలగు ప్రాంతాలలో-ఏపట్టణం వారు ఒకలక్ష రూపాయలు ధనరూపేణ విరాళం ఇవ్వగలరో ఆ పట్టణంలో కళాశాలను స్థాపించుటకు అనుమతి మంజూరు చేస్తామన్న వార్త వెలువడిన సందర్భంలో శ్రీస్వామి వారు ఎంతో విశాల హృదయంతో, దూరదృష్టితో, ఎన్నో వేల నిరుపేద విద్యార్థులకు డిగ్రీ చదువులు చదివే అవకాశం కల్పించాలన్న

విశాల దృక్పథంతో ముందుకు వచ్చినారు. ఆరోజుల్లో, ఒక లక్షరూపాయలు అంటే ఎంతో గొప్పమొత్తం అయినా ఎంతో శ్రమపడి ఆశ్రమవనరులు అప్పట్లో తక్కువైనా ఆ లక్షరూపాయలు సమకూర్చి ప్రభుత్వానికి జమ చేశారు. శ్రీస్వామి వారి ఆనాటి ఆగొప్ప సహాయంతో శ్రీకాళహస్తి పట్టణంలో శ్రీస్వామి పేరుతో "శ్రీవిద్యాప్రకాశానంద ప్రభుత్వ ఆర్ట్సు అండ్ సైన్స్‌కళాశాల 1968 సంవత్సరంలో స్థాపించారు. ఇది శ్రీకాళహస్తి పట్టణ, మరియు చుట్టు ప్రక్కల గ్రామాలలోని విద్యార్థి, విద్యార్థినులకు గొప్పవరమైనది. అప్పట్లో విద్య నభ్యసించుటకు హెచ్. యస్. సి, పి. యు.సి చదివిన విద్యార్థులకు అందుబాటులో వున్న దగ్గర కళాశాల తిరుపతిలోనే వుండేది. తిరుపతి కళాశాలకు ప్రతిరోజు వెళ్ళి చదివే అవకాశం, స్థోమత చాలామందికి వుండేది కాదు. లేక తిరుపతిలోనే వుంది డిగ్రీ చదవాలన్నా అతి పెద్ద ధనవంతులకు మాత్రమే సాధ్యమయ్యేది. నాలాంటి ఎంతో మంది పేద విద్యార్థులకు డిగ్రీ చదువులు కలగానే మిగిలిపోయేది. ఇక బాలికలకైతే అసలు బయటకు వెళ్ళి చదివేందుకు ఆ రోజుల్లో, తల్లిదండ్రులే అంగీకరించక పోయేవారు. శ్రీస్వామివారి ఆశీస్సులతో స్థాపించిన డిగ్రీ కళాశాల ఆనాటి ఎంతో మంది పేదవిద్యార్థులకు మేము చదువుకొన్న ఉన్నత పాఠశాల ప్రాంగణంలోనే పెరట్లో తోటలాగా అందుబాటులోకి వచ్చింది. ఎంతో శ్రమ, ఖర్చుతో కూడుకున్న డిగ్రీ చదువులు ఎంతో మంది విద్యార్థి, విద్యార్థినులకు తమ తమ కలల సాఫల్యం చేసుకోవటానికి దోహద పడింది, సులభ సాధ్యమైనది.

సత్యం చెప్పాలంటే నా వరకు నాకు అప్పటి మా కుటుంబ ఆర్థిక స్థోమత డిగ్రీ చదువులకు పొరుగు వూర్లకు వెళ్ళి చదువేందుకు సహకరించని పరిస్థితి. శ్రీకాళహస్తిలో డిగ్రీ కళాశాల లేనియెడల చాలామంది అప్పటి పరిస్థితులలో ఉన్నత పాఠశాల (హైస్కూల్ విద్యను) విద్యను ముగించి జీవితంలో ఏ చిన్న చితకా ఉద్యోగాలలో స్థిరపడి, జీవనం సాగించే వారమేమో. హైస్కూల్‌లో ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణులైనప్పటికీ, పెద్ద ప్రయోజనం లేకపోయేది. కాని **శ్రీస్వామివారు సకాలంలో మాకు అందించిన డిగ్రీ కళాశాల చదువులు, మా జీవిత గమ్యాన్నే మార్చి వేసింది.** ఉన్నత పాఠశాల విద్యలో ఉత్తీర్ణులైన వెంటనే నాకు తెలిసినంత వరకు అందరూ మూకుమ్మడిగా వారి వారి అభీష్టం మేరకు డిగ్రీల చదువులలో చేరినాము. బి.యస్.సి., బి.కామ్., బి.ఏ., అంటూ అందరం డిగ్రీలు పూర్తి చేసాం. నావరకు నేను బి.కామ్. లో చేరి **1970-73** విద్యాసంవత్సరంలో అత్యుత్తమ గురువుల (అధ్యాపకుల) ద్వారా విద్యనభ్యసించి **కళాశాలలోనే ప్రథమశ్రేణిలో** ఉత్తీర్ణత సాధించాను. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో, మొదటి పదిమంది ఉత్తమ విద్యార్థులకు ఎమ్.కామ్ చదివేందుకు లభించే పారితోషికానికి కూడ ఎంపిక కాబడ్డాను. కానీ అప్పటికే శ్రీస్వామి వారి అమృతహస్తాలతో అందించిన సహాయంతో బి.కామ్ డిగ్రీలో ఉత్తమ ఫలితాలు సాధించిన నాకు, నాజీవిత ధ్యేయమైన ఛార్టర్డ్ అకౌంటెంట్ (సి.ఎ) చదువును అభ్యసించుటకు సాహసించగలిగినాను.

అప్పట్లో సామాన్యులకు అందుబాటులో లేనిది, చాలా గొప్ప సంపన్నులు మాత్రమే చేయగలిగిన సి.ఎ. చదువు చదువుటకు, నాలాంటి పేద కుటుంబంలో జన్మించిన వానికి కూడ అవకాశం కలిగిందంటే దానికి కారణం శ్రీస్వామివారు అందించిన విద్యాదానమే మూలకారణం. నాలాంటి వారు ఎందరో ఈ కళాశాలో చదివి మహోన్నత పదవులు పొంది వున్నారు. అలాంటి దైవసమానులైన

పూజ్యులు శ్రీస్వామీజీ శ్రీకాళహస్తిలో డిగ్రీ కళాశాలకు సహాయం అందించుట మూలాననే డిగ్రీ చదువులకు బయటి ఊర్లకు వెళ్ళే అవసరం లేకుండా స్వస్థలంలోనే చదువుకొనే మహాభాగ్యం కలిగించి నాలాంటి వారికి ఆరాధ్యులు అయినారు. ఎంతో మంది పట్టభద్రులగుటకు దోహదపడ్డారు. శ్రీ స్వామివారి దివ్యాశీస్సులతో నేను 1978వ సంవత్సరంలో సి.ఎ. పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాదులో సి.ఎ. ప్రాక్టీసు చేస్తున్నాను. నేను, మాకుటుంబం జీవితంలో స్థిర పడ్డాము. అంతే కాకుండా చాలా మంది శ్రీకాళహస్తి స్నేహితులకు కూడ, వారు హైదరాబాదులో స్థిపపడుటకు నా వలన అయిన సహాయం చేయగలిగినాను. దానికి కారణం శ్రీస్వామి వారి దివ్యాశీస్సులతో వేసిన చదువుల రాజమార్గం అనడంలో అతిశయోక్తి లేదు.

ఇటువంటి అవకాశం - శ్రీస్వామి వారి కళాశాలలో విద్యను అభ్యసించడం, తద్వారా జీవితంలో ఉన్నత సోపానాలు అధిరోహించటం అన్నది - నాకు మాత్రమే జరిగిన మేలు కాదు, నాలాంటి అనేక మంది శ్రీకాళహస్తి పట్టణ వాస్తవ్యులు అయిన విద్యార్థినీ, విద్యార్థులకు ఈ మేలు తప్పకుండా జరిగిందని ఘంటాపథంగా చెప్పవచ్చు. నాకు తెలిసినంత వరకు చాలా మంది నాలాంటి వారు అంటే పొరుగు పూర్లలో డిగ్రీలు చదివే ఆర్థిక స్థోమత లేనివారు మన కళాశాలలో విద్యనభ్యసించి, ఐ.ఎ.యస్. అధికారులుగా, కళాశాల ప్రధానాధ్యాపకులుగా, బ్యాంకు మేనేజర్లుగా, చలన చిత్రరంగంలో ప్రొడ్యూసర్లుగా అయిన మిత్రులు వున్నారు.

ఇంతటి మహోత్కృష్టమైన విద్యాదానంచేసి కొన్నివేల మంది జీవితాలలో కుసుమాలు చల్లి, విద్యాశీస్సుల అందించిన శ్రీస్వామివార్లకు మరోమారు కృతజ్ఞతాభి వందనములు, శతకోటి దాసోహములు సమర్పించు కుంటున్నాను. శ్రీకాళహస్తి పట్టణంలో డిగ్రీకళాశాల పెట్టి, ఎంతోమంది జీవితాలు ఉన్నతస్థాయి పొందాలన్న శ్రీస్వామివారి అభీష్టం మేరకు, ఇప్పటికి ఎంతో మంది లబ్ధిపొందినారు. ఇంకను పొందుతున్నారు. ఈ విద్యాదానకర్త, సార్థక నామధేయులైన శ్రీవిద్యాప్రకాశానంద స్వాముల వారి దివ్యాశీస్సులతో అందరి జీవితాలు కళకళలాడుతూ మూడు పువ్వులు ఆరుకాయలుగా అభివృద్ధి చెందాలని ఆశిస్తున్నాము.

నా అభిప్రాయములను మీతో పంచుకోవడానికి నాకు అవకాశం యిచ్చిన శ్రీ శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాములవారికి, ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారికి దాసోహములు తెలుపుకుంటూ, శతజయంతి సంచిక సంపాదక వర్గ సభ్యులందరికి నా నమః సుమాంజలులు సమర్పించు కొంటున్నాను.

మోక్షమనగా విడుదల. బంధమునుండి విడుదల. దుఃఖభూయిష్ఠమగు సంసారబంధమునుండి విముక్తినొందుటయే మోక్షము. పుట్టుక చావులనుండి తప్పించుకొనుటయే మోక్షము. అవిచ్ఛిన్న ఆత్మానందానుభూతిని బడయుటయే మోక్షము. స్వస్వరూపమగు దైవమునందు నిలుకడ గలిగియుండుటయే మోక్షము. దేహభారమును, మనోభారమును వదలించుకొనుటయే మోక్షము. భారరహితమగు ఆత్మయందు నిలుకడ కలిగియుండుటయే మోక్షము.

- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి

నా ఆధ్యాత్మిక స్మృతులు

నరసింహరామదాసు (సంగారెడ్డి)

"పుట్టిన రోజు పండుగే అందరికి పుట్టింది ఎందుకో తెలిసేది కొందరికి" అని ఒక కవి అన్నట్టు ఈ ప్రపంచములో ఎందరో పుట్టుచున్నారు గిట్టుచున్నారు. కాని ఏ కొందరో ఈ జన్మ ఎందులకొచ్చింది. ఈ జీవిత లక్ష్యమేంటి? అని తెలుసుకొని తాము తరించి ఇతరులను తరింపజేస్తూ అఖండకీర్తిని పొందినారు. "స్వయం తీర్ణః పరాం స్తారయతి" అని ఆర్యోక్తి. ఆ కోవకు చెందినవారు శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వాములవారు. వారి శతజయంతి ఉత్సవమును వారి శిష్యులు, అభిమానులు విజయనామ సంవత్సరం చైత్రబహుళ తదియ తేది 28.04.2013 నుండి పెద్ద ఎత్తున జరుపుకొనుచున్నారు.

సంత్ కబీర్‌దాసుగారు అంటారు "జబ్ హం పైదా హుయే - హమ్ రోయే జగ్ హసే, ఐసి కర్మకర్‌చలో హమ్ హసే - జగ్‌రోయే" అనగా మనము జన్మించినప్పుడు ఏడ్చుకుంటూ పుట్టాము. తల్లిదండ్రులు, బంధువులు మాత్రము ఆనందపడ్డారు. కాని జన్మించిన తదుపరి ఇటువంటి పనులు చేయుము. మనము సంతోషముతో ప్రపంచము నుండి నిష్క్రమిస్తూ జగత్తును దుఃఖించేట్లు చేయాలి' అంటాడు సంత్ కబీర్‌దాస్‌గారు. (అంటే ఇంతమంచివారు పోయారే అని జగత్తు దుఃఖిస్తుంది.) అలా ఆచరించి చూపిన వారే పూజ్యులు శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వాములవారు.

శ్రీస్వామిగారు, వ్యాసాశ్రమంలో శ్రీశ్రీశ్రీ మలయాళస్వామి సద్గురు నేతృత్వములో పండ్రెండు సంవత్సరాలు అపక్వ ఆహారము సేవిస్తూ అఖండ సాధన చేసి-వారు పొందిన అనుభూతులు, జ్ఞానరత్నాలు జిజ్ఞాసువులకు ఉచితంగా పంచుతూ అఖండ శాశ్వత కీర్తిని పొందారు.

శ్రీస్వామిగారి జీవితములో ప్రకాశింపబడే ఘట్టాలలో ముఖ్యమైన ఘట్ట మొకటి శ్రీస్వామిగారు హృషీకేశ్‌లో గంగానదిలో పడవపై విహరించే సందర్భమున అనాయాసంగా దైవ ప్రేరణతో లభ్యమైన శ్రీమద్భగవద్గీత గ్రంథరాజము. ఇది నా జీవిత లక్ష్యానికి మార్గ దర్శకమని భావించి తమ సద్గురు ఆశీస్సులతో వారి ప్రేరణతో భగవద్గీతను ఆసాంతము ఆకళింపచేసుకొని, శ్రీగీతాచార్యులు పదునెనిమిదవ అధ్యాయము చివరిలో బోధించిన

"య ఇమం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి
భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః"

ప్రకారము ఈ గీతా బోధను సులభశైలిలో, పామరులకు కూడా అర్థమయ్యే లాగున అహోరాత్రులు శ్రమపడి తమ దృష్టిశ్రమ కూడా లక్ష్యపెట్టక చక్కని "గీతామకరంద"మనే గ్రంథరాజము అందించారు. ఈ గ్రంథ ప్రాశస్త్యము గ్రహించి భక్తులు ఇతర భాషలలో కూడా

అనువదించి జిజ్ఞాసువులకు అందించారు. మన రాష్ట్రములోనే కాక ఇతర రాష్ట్రాల్లో కూడా ఇంటింటా ఈ గీతామకరందము వెలిసిందనుటలో అతిశయోక్తికాదు.

మహాత్ముల నినాదము "సర్వేజనా స్సుఖినో భవంతు. సమస్తలోకాః సుఖినో భవంతు" కాబట్టి చదువురానివారు ఈ గీతామకరందమును చదువవలెను. అటువంటి వారికి ఉపన్యాసముల ద్వారా బోధ చేయాలన్న ఉద్దేశ్యముతో శ్రీస్వామివారు ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ గ్రామాల్లో 108 గీతాజ్ఞాన యజ్ఞములు నిర్వహించారు. శ్రీస్వామిగారు తమ ఉపన్యాసము సరళభాషలో-పామరులకు కూడా అర్థమయ్యేటట్టు వివిధ ఉపమానాల ద్వారా నవ్వించుకుంటూ ఉపనిషత్తులు, రామాయణ, మహాభారత, భాగవత, యోగవాశిష్ఠ ఇతర గ్రంథాలలోని బోధనలు తెలుపుతూ ఆకర్షణీయంగా అందించేవారు. శ్రీస్వామిగారి ఉపన్యాసము ఉందంటే జనము తండోప తండాలుగా వచ్చేవారు ఎందరోభక్తులు. శ్రీస్వామిగారి ఉపన్యాసాలతో మాలో చాలా మార్పు వచ్చిందని, దురభ్యాసాలు వదులుకొన్నామని, సంసారము ఆనందంగా గడుపు చున్నామని చెప్పగా ఎన్నోసార్లు వినడము జరిగినది. గులాబి పుష్పము వికసించి తనను ఆశ్రయించినవారికే కాక తన ప్రక్కన వారికి కూడా తన సువాసన అందిస్తోంది. మహాత్ములు కూడా తరతమ భేదము లేకుండా తాము పొందిన జ్ఞానాన్ని పంచుతారు. కవి అంటాడు. "They only alive who live for others rest are more dead than alive" అనగా ఇతరుల కొరకు జీవించిన వాడే నిజంగా జీవించినట్టు అని. "పరోపకార మిదం శరీరం" అన్న ఆర్యోక్తి. దీనికి చక్కని ప్రత్యక్ష నిదర్శనము శ్రీస్వామిగారని చెప్పక తప్పదు.

చివరి దశలో శ్రీస్వామి పొందిన దృష్టిలోపము, దాని విలువను గ్రహించి ఎందరో బీదవారు తగిన వైద్య సహాయము అందక బాధపడుచున్నారని కలత చెంది శ్రీస్వామివారు భక్త కన్నప్ప కంటిఆస్పత్రిని స్థాపించి ఉచితంగా వైద్యసేవలు అందించే ఏర్పాటు చేశారు. శ్రీస్వామిగారు మూడు ఆలయాలు ఏర్పాటు చేశారు. ఒకటి వైద్యాలయము, రెండవది గ్రంథాలయము, మూడవది దేవాలయము. వీటి ద్వారా శరీరము ఆరోగ్యముంచుకొని వివిధగ్రంథాల ద్వారా జ్ఞానోపార్జన పొంది భగవంతుని కృపకు పాత్రులు కాగలరని శ్రీస్వామిగారి ప్రయత్నము.

శ్రీస్వామిగారికి వివేకానందులవారి బోధనలంటే చాలా చాలా అభిమానము. తమ ఉపన్యాసములలో, గ్రంథరచనలలో శ్రీవివేకానందుల వారి సూక్తులు పేర్కొంటుంటారు. నేటి బాలురే భావి భారత పౌరులు, వారికి చక్కగా విద్యాభ్యాసము అందించి దేశాభివృద్ధికి తోడ్పడునట్టు తీర్చి దిద్దాలన్న ఉద్దేశముతో శ్రీస్వామిగారు ఆశ్రమ ఆర్థిక సహాయముతో బాలురకు కాలేజి, బాలికలకు ప్రత్యేకముగా మరొకటి కాలేజి ప్రభుత్వము ద్వారా ఏర్పాటుచేశారు. ఈ విధంగా శ్రీస్వామిగారు తమ జీవితమును ఆదర్శ మహాత్మునిగా నిరాడంబరంగా కడపి "యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః" అన్న గీతావాక్యాన్ని సార్థకము చేశారని చెప్పక తప్పదు.

మరోముఖ్య విషయమేమనగా నేటి ర్యాకెట్ యుగములో జనులకు తీరిక లేకుండా పోయింది. భక్తులు ఆశ్రమమునకు వచ్చువారు త్వరగా శ్రీస్వామిగారి దర్శనము చేసుకొని వెళ్ళిపోవాలని తొందరలో వుంటారు. అటువంటి వారికి కూడా ఏదో ఆశ్రమమునకు వచ్చినందులకు లాభము చేకూర్చాలని శ్రీస్వామిగారు ప్రతిగోడపై దివ్యసూక్తులు వ్రాయించారు. ఎందుకనగా వచ్చే భక్తుల దృష్టి సాధారణంగా గోడలపై పడుతుంది. కావున వాటిని చదివి తమ జీవితము

శుభప్రదము చేసుకోగలరని వందల కొద్ది దివ్య సూక్తులు వ్రాయించారు. ఉదాహరణగా "నీకు ఆనందము కావాలంటే ఇతరులను ఆనందింప జేయుము." పిపీలికాది బ్రహ్మ పర్యంతము ఆనందము కొరకే శ్రమిస్తున్నారు. కాని శాశ్వతానందము ఏ కొందరో పొందుచున్నారన్నది జగత్ విదితము. కారణమేమన వారికి ఆనంద రహస్యము తెలియదు. ఏ కఠిన సాధన లేకుండా, డబ్బు ఖర్చు లేకుండా సులభంగా అందించే ఆనందమును పొందే రహస్యము గీతాచార్యుడు బోధించినట్లు "అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ" ద్వారా తాను ఆనందము పొందవచ్చు అన్నది శ్రీస్వామిగారి బోధ.

శ్రీ శుకబ్రహ్మాశ్రమములో శ్రీస్వామిగారు చేపట్టిన కార్యక్రమములు చక్కగా నిర్వహిస్తూ ఆశ్రమ అభివృద్ధికి పాటు పడే ఉత్తరాధికారిని నియమించాలని శ్రీస్వామిగారికి ఆలోచన వచ్చింది. చాలా రోజులు అన్వేషించారు. చివరికి శ్రీబ్రహ్మచారి గోపాల్‌గారు ఈ ఆశ్రమములో, వ్యాసాశ్రమములో మేనేజరుగా చక్కని సేవలు అందించినవారు, నిస్స్వార్థులు, నిరాడంబర జీవితము గడుపుచున్నవారు, మంచి అనుభవము గడించినవారు, చివరిగా శ్రీస్వామివారి వద్దే తురీయాశ్రమము స్వీకరించిన వారు - తగినవారని నిశ్చయించుకొని వెంటనే వారికి శ్రీవిద్యాస్వరూపానందగిరి నామధేయము ప్రసాదించి ఆశ్రమ ఉత్తరాధికారిగా పట్టము కట్టారు. ప్రస్తుతము వీరే పీఠాధిపతిగా ఆశ్రమపరిపాలన నిర్వహిస్తున్నారు. శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామిగారు ఆశించినట్లు, శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వామిగారు చక్కగా ఆశ్రమ విధులు నిర్వహిస్తూ ఆశ్రమములో చాలా చాలా అభివృద్ధి కార్యములు చేపట్టుతూ, నిరాడంబరముగా, ఆశ్రమ ప్రతి వస్తువుపైన, ప్రతి కార్యముపైన, వచ్చే భక్తులపైన ప్రత్యేక దృష్టి పెట్టుచు ఆశ్రమ అభివృద్ధే తన ధ్యేయమని శ్రమిస్తున్నారు.

శ్రీ శుకబ్రహ్మాశ్రమములో ఈ దాసుడు పొందిన అనుభవాలు, శిక్షణలు, బోధలు అమోఘము. జీవిత లక్ష్యమేమో, ఎలా నడుచుకోవాలో, ఎలా గమ్యము సాధించాలో అనుభవ పూర్వకంగా క్షుణ్ణంగా తెలుసుకోవడము జరిగింది. దీనికి ఆశ్రమములో చక్కని అవకాశము కల్పించిన శ్రీస్వాములవారికి శిరసా, మనసా, సాష్టాంగ నమస్కారములు అర్పించుచున్నాను. ఆశ్రమములో ఈ దాసుడు పొందిన శిక్షణ వల్ల జీవితమే మారిపోయిందని చెప్పకతప్పదు. ఈ ఋణము ఎలా తీరుతుందో ఆ పరమేశ్వరుడు అనుగ్రహించాలి.

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారి శతజయంతి ఉత్సవ సందర్భమున ఈ దాసుడు కృతజ్ఞతా పూర్వకంగా శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములకు శ్రీశ్రీశ్రీ సంపూర్ణానందగిరిస్వామిగారికి సాష్టాంగ నమస్కారములు సమర్పిస్తూ శెలవు.

"సర్వేజనా స్సుఖినో భవంతు"

భగవానుడు కరుణించి మానవదేహమను చక్కని ఉపకరణమును మన కొసంగినపుడు అది శిథిలముకాక పూర్వమే దానివలన ఎంత పారమార్థిక లాభమును పొందగలుగుదుమో అంత పొందియే తీరవలెను. ఇట్టి మహదవకాశములు మరి ఏ యితర లోకమునను, ఏ యితర జన్మయందును గూడ లభింపవు.

- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి

జ్ఞానయోగి - శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి

- జి.ఎన్.కల్యాణసుందరం, (బెంగుళూరు)

ధర్మప్రబోధకులు, వేదపండితులు, ఆధ్యాత్మిక నిపుణులు, సుప్రసిద్ధ ప్రవచన కారులైన శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి ప్రతిభాశక్తి ఆంధ్రదేశమంతటా విస్తరించి యున్నది. అది తెలుగుజాతికి గర్వకారణం 'విద్వాన్ సర్వత్ర పూజ్యతే" అన్నట్లుగ విద్వాంసుడు ఎల్లప్పుడు పూజనీయుడుగ గుర్తించబడుతాడు. "ఎందరో మహానుభావులు, అందరికి వందనములు" అనెడి త్యాగరాజ కృతి ననుసరించి నాదృష్టిలో పరమ పూజ్యులైన శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు ఎందరో మహానుభావులలో ఒక్కరిగా పేర్కొనడం సమంజసంగ వున్నదనడంలో సందేహంలేదు. పూజ్యస్వాముల పాండిత్యము క్లుప్తముగ వర్ణించుట తగనిపని. వేదశాస్త్రపురాణేతిహాస ములను అధ్యయనంచేసి అందున్న సత్యాంశమును గుర్తించిన మహాపండితుడీయన. సనాతన ధర్మపు సూక్తులను అతిసరళముగ వర్ణించు సమర్థులు. వీరి ధర్మ సూక్ష్మములు మానవ జీవితమును సర్వాంగ సుందరముగ తీర్చిదిద్దగలదు. మానవుని ఆధిక్యతను నిరూపించుట యందును, మానవ జీవితపు పయనమునకు తోడ్పడు మార్గములను ఉపమానములతో సహా తెలియపఱచుటయందు శ్రీవారు అగ్రగణ్యులు. నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక సిద్ధాంతములను అనువైన రీతిగ ఉపన్యసించడంలో అద్వితీయులు. దేశభాషలందు తెలుగు లెస్స యనెడి ఆర్యోక్తిని రూపుమాపక స్వామివారి వ్యాఖ్యానము అర్థగర్భితంగ, భావపూరితంగ, ముచ్చటగ, తేటతెలుగు పదములతో నవరసాలను నింపి, ప్రజల నాకర్షించు చుండెడిది. ఆయన సభికుల నుద్దేశించి ప్రసంగించునపుడు వారి హావభావములు, సమయోచిత ఉదాహరణములు, నిరాయాసముగ మాట్లాడు తీరు, తెలుగు వాక్యముల జోరు శ్రోతవర్గముల హృదయాలను ద్రవింప చేస్తుంది. అనుష్ఠానయోగ్యములైన వీరి హితోపదేశములు మానవుని మనస్సును రంజింప జేస్తున్నాయి. వీరు రచించిన ఒక్కొక్క గ్రంథము నందుండు విషయములు మందదృష్టిలో చదువ దగినవికావు, వ్యక్తి దృష్టిలో చదువదగినవి. ధర్మప్రబోధకమైన ఇట్టి రచనలు చదువరులకు విజ్ఞాన మందించి దైవీశక్తిని పెంపొందింప జేస్తున్నాయి. "పెద్దల మాటలు చద్దన్నపు మూటలు" అన్నట్లు పూజ్యులైన స్వాములవారి ఒక్కొక్క పలుకులు మానవ జాతిని పులకరింపజేస్తాయి.

పూజ్యస్వాములవారు రచించిన గీతామకరందము సద్బోధకమైనది, సుశ్రావ్యమైనది, సుమధురమైనది. జనాకర్షకమైనది. "అనగఅనగ రాగమతిశయిల్లుచు నుండు తినగతినగ వేము తీయనుండు" అన్న వేమనపద్యంలా పూజ్యులగీతామకరందము పండితపామరులకెల్ల ఒక జ్ఞానభాండారమై ఒప్పియున్నది. శ్రీకృష్ణ పరమాత్ముడు పార్థునికి ఎవ్విధముగ గీతోపదేశ మొనర్చి, ఆతని బలహీనతను తొలగించగల్గెనో, అట్లు శ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారు సృష్టించిన గీతామకరందము పాఠకులకు కనువిప్పు కల్గించుననుటలో సంశయములేదు. ఆ మహాగ్రంథము నాకొక నిఘంటువుగ సహకరించి, నేనప్పుడప్పుడు జరుపుతున్న గీతోపన్యాసములకు తోడునీడగ అనుకూలించుచున్నదని సగర్వముగ తెలియజేస్తున్నాను. ఈ ఘనత పరమపూజ్యులైన నా అజ్ఞాత గురుప్రముఖులైన స్వాములవారి ప్రభావమేనని నిస్సందేహముగ విన్నవించుకుంటున్నాను. ఈ సందర్భముగ ఒక చక్కటి వేమన పద్యము గుర్తుకొస్తుంది.

"గురువు లేక విద్యగురుతుగా దొరకదు,
నృపతిలేక భూమి తృప్తి గొనదు
గురువు విద్యలేక గురుతర ద్విజుడౌనె ।
విశ్వదాభిరామ వినురవేమ ॥

గురువులేని విద్య వానాకాలం చదువులా పరిణమిస్తుంది. ఏకలవ్యుడు ద్రోణాచార్యుల విగ్రహాన్నొకటి ప్రతిష్ఠించి, ఏకైక గురువుగా పూజించి, విలువిద్యయందు అపార నేర్పునుబడిసినట్లు-పూజ్య శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములను పరోక్షంగ నా గురువుగా నెన్నుకొని నేను అజ్ఞాతశిష్యుడై మసలుతూ పూజ్యుల గీతామకరంద గ్రంథపు ఆధారంగా, మరియు వారి దూరదర్శననపు ప్రసంగాలద్వారా, వారు వినిపించిన ఆడియో, వీడియోల ద్వారా గీతయందున్న పదునెనిమిది అధ్యాయములను సంపూర్ణంగ పొందగలిగాను. వీటినుండి నాకు ప్రజల నుండి దక్కిన అభినందనలు స్వామివారి కటాక్షంగా భావిస్తున్నాను. "తింటే గారెలే తినాలి, వింటే భారతమే వినాలి" అన్నట్లుగా వారు అనేక ప్రాంతాలలో నిర్వహించిన గీతాజ్ఞానయజ్ఞాలు, గీతాసదస్సులు, సప్తాహాలు, ప్రవచనములు ప్రజాసమూహాన్ని స్తంభింప జేసి గీతకొక ప్రత్యేక స్థానాన్ని కల్పించింది. ప్రత్యక్షంగా పూజ్యస్వాములవారి దర్శనభాగ్యం కలుగకుండు వారికి పరోక్షంగ కొంతకాలం ఆయన భగవద్గీత ఉపన్యాసములు దూరదర్శన్ ద్వారా ప్రసారంకావడం అనేక ప్రేక్షకులను సంతృప్తి పఱచింది. వారు జరిపిన గీతాప్రవచనములు ఉత్తమస్థాయిలో జనసమూహాన్ని ఆకట్టుకొన్నాయి. దీని మూలంగా సమాజంలో ఆధ్యాత్మిక భావాలు చక్కబడ్డాయి. ఈయన దేశవ్యాప్తంగా పలుచోట్ల గీతాయజ్ఞాలను జరిపించడమే గాక మొత్తానికి 108గీతా యజ్ఞాలను సునాయాసంగ పూర్తి గావించిన ఘనత దక్కించుకొన్న వారైరి. పూజ్యులవారు కొనసాగించిన ఆధ్యాత్మికసేవ మరియు వారు సలిపిన పారమార్థిక సందేశములనేకములు పండిత పామరులను మెప్పించి, బుద్ధి బలము హెచ్చించి, ఆధ్యాత్మిక శక్తిని సృష్టించి ఆదర్శ మానవులుగ చేశాయి. శ్రీస్వామి వారిలో ఇమిడియున్న ఆధ్యాత్మికనైపుణ్యం భక్తి వైరాగ్యములతో కూడి, సత్య ధర్మముల నాటి, సద్భావముల పెంచి, సచ్చింతనల నెంచి, సత్కార్యములు చేసి సమాజానికి హితుడై, పేదలకు ప్రియుడై, శిష్యులకు గురుడై, కర్తవ్య బద్ధుడై, స్వార్థరహితుడై, ఆధ్యాత్మిక నిపుణుడై వర్తించునట్లు చేసినది.

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు దేవభాషయైన సంస్కృతంలోను, పాశ్చాత్యుల ఆంగ్లభాషలోను, హిందీభాష మాట్లాడటంలోను పాండిత్యాన్ని పొందియుండడం వారి ప్రతిభాశక్తిని మరింత విస్తరింజేసింది. పూజ్యస్వాములవారు సామాజికంగాను తన నైపుణ్యాన్ని అద్వితీయంగ నిరూపించుకున్నారు. వారికి పేదలపై సానుభూతి ఎక్కువగ కనబడేది. వారు శ్రీకాళహస్తిలో స్థాపించిన శుకబ్రహ్మాశ్రమము వారి ఆధీనంలో మూడుపువ్వులు ఆరుకాయలుగా ప్రశస్తి గడించింది.

ప్రస్తుతం పూజ్యుల స్మరణార్థమై ఒక దివ్యమైన ధ్యానమందిరం కట్టబడింది. స్థానికంగ రెండు కళాశాలలు, భక్త కన్నప్ప ఉచిత కంటివైద్యశాల నెలకొల్పబడింది. మానవసేవే మాధవసేవ అన్నట్లు అచ్చట ఆశ్రమ నిర్వాహకులు ఆశ్రితుల నాదుకుంటూ సమాజ సేవాభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తున్నారు.

ప్రస్తుతం పరమ పూజ్యులైన, గౌరవనీయులైన, యతిశ్రేష్ఠులైన, శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాముల నాయకత్వంలో ఈ ఆశ్రమము ఒక ప్రశాంతనిలయమై, యతుల తపోవనమై, ఆధ్యాత్మిక శిఖరమై - నిశ్చలత్వమును నిర్మలత్వమును, ఆహ్లాదమును, ప్రశాంతతను కలిగి విరాజిల్లుచున్నది.

శిష్యరత్నం

- జె.యస్. రఘుపతిరావు.
తిరుపతి

ఆంధ్రదేశపు భక్తి మాగాణంలో సర్వజన విస్తృతంగా ఆధ్యాత్మిక బీజాలు చల్లినవారు శ్రీ మలయాళస్వామి అయితే తద్వికాసానికి పుష్కళంగా గీతాజలం చల్లిన వారు శ్రీవిద్యాప్రకాశానంద స్వామి. మొదటివారు గురువు, రెండోవారు శిష్యులు. ఇలా చేసినవారు ఇంతకు ముందు కొందరు కొంతమేరకు ఉండవచ్చు. కాని ఈ ఇరువురిలో ఒక విశేషముంది. ఒక ఆదర్శముంది. కాబట్టి వీరిని గూర్చి ఘనంగా చెప్పుకోవలసిన అగత్యమేర్పడింది.

శ్రీమలయాళస్వామి నాల్గు ముఖ్యసూత్రాలు ముందు నిడుకొన్నారు. వాటి సాధనకు, ప్రచారానికి శ్రీవ్యాసాశ్రమం స్థాపించారు. అవి యేవన -

1. సంస్కృత విద్యాభ్యాసానికి ఎల్లరూ అర్హులే

2. భగవద్గీతాది శాస్త్రాలను ప్రతివారు పారాయణ చేయవచ్చు, అధ్యయనం చేయవచ్చు, ప్రచారం చేయవచ్చు.

3. స్త్రీ పురుషులందరూ కుల-వర్ణ విభేదం లేకుండా సన్న్యాసాశ్రమం స్వీకరించవచ్చు.

4. స్త్రీలు ఆధ్యాత్మిక సాధనకు, పైసూత్రాలు పాటించుటకు సమార్హులు, సమర్థులు.

ఈ సూత్రాల ననుసరించి శ్రీస్వాములవారు (శ్రీవారని ప్రసిద్ధి) శిష్యవర్గాన్ని తయారు చేశారు. అందులో ప్రధానంగా చెప్పుకోదగ్గవారు శ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారు (ఆనందమోహన్). శ్రీవిద్యాప్రకాశానందుల వారు శ్రీవ్యాసాశ్రమంలో ఏకాంతవాసం గడిపారు, తపోధ్యానాదులు చేశారు, సంస్కృతాభ్యాసం చేశారు. ఇంగ్లీషు విద్యముందుగనే (బి.ఏ) నేర్చి యున్నారు, హిందీలో కూడ పట్టా పొందారు. వ్యవహార జ్ఞానం, సమయస్ఫూర్తి కలవారు. ఏ విషయమైనా చిరునగవుతో స్వీకరించగలరు. నొప్పింపక తానొవ్వక చక్కగ తనపనులు చక్కపెట్టగలరు. ఇక సంభాషణ ఆచిఆచి, తూచితూచి చేయగలరు. సంక్షిప్తంగా మాట్లాడగలరు. సుదీర్ఘంగానూ చేయగలరు. నిండైన విగ్రహం. ఒక్కొక్కప్పుడు ముక్తసరిగా నుండగలరు, మరొకప్పుడు విశేషంగా ఆప్యాయత పంచుకోగలరు. భక్తుల నాకర్షించే స్వభావం ఉంది.

సరే, శ్రీవారి అనుంగు శిష్యుడుగా శ్రీవారి ఆదర్శాలను యథాతథాంగా పుణికిపుచ్చుకొన్నారు. నెరవేర్చినారు. అందులో సందేహంలేదు. అయితే శాస్త్రార్థప్రచారంలో అందెవేసిన చేయిగా ప్రసిద్ధికెక్కారు. ఆ విషయానికి నిదర్శనం వారు రచించి, ప్రచురించిన గీతామకరందం. శ్రీవారు ఆంధ్రదేశంలో సర్వజనులకు, ఆధ్యాత్మిక భిక్షపెట్టడమే గాక, ఇంటింట గీతాపారాయణాభ్యాసం కల్పించారు. కాగా, విద్యాప్రకాశానందస్వామి ఆ గీతాపారాయణకు మకరందం జోడించి మధుర సుమధుర ప్రచారం కావించారు. అందుకే ఆయన గీతామకరంద స్వామి

అయ్యారు, మరింత ముచ్చటగా చెప్పుకోవాలంటే "మకరంద స్వామి" అయ్యారు.

'మకరందస్వామి'' గీతామృతం త్రావిత్రావి, తేన్చితేన్చి బ్రహ్మజ్ఞాన, భుక్తాయాసంతో తత్త్వగీతాలు పల్లవించారు, మానసబోధ చేశారు. ఒక వేమనను, ఒక పోతులూరిని జ్ఞప్తికి తెచ్చారు. మకరందస్వామి పండిత పామర భక్త్యాసక్తులందరికి సుందరమందహాస వదనారవింద బోధానందాంతరంగ బంధువుగా హృదయపూజలందు కొన్నారు.

గురువంతగా ఎదిగిన శిష్యుడు మకరంద మిత్రుడై వార్షిక వేదాంతజ్ఞానసభల్లో సద్గురు చిన్మంటపస్థానంలో అధ్యక్ష పీఠమలంకరించారు అనేక సంవత్సరాలుగా.

తదనంతర కాలంలో కూడ అనగా శ్రీవారు నిర్యాణం చెందిన పిదప కూడ శ్రీవారి ఆశయాలకు అనుగుణ్యముగనే తమ ఆశ్రమ నిర్వహణ గావించారు.

శ్రీశుకబ్రహ్మాశ్రమం స్వతంత్ర ఆధ్యాత్మిక కేంద్రం అయినప్పటికీ సద్గురువు తీర్చిదిద్దిన నియమాలను పాటించడం విశేష స్ఫూర్తి నిచ్చింది. ఆశ్రమాన గీతాపాఠశాల నిర్వహించుటలోను, బ్రహ్మవిద్య ప్రబోధించుటలోను, భక్తచయమును ఆదరించుటలోను, ఆధ్యాత్మిక సభలు జరిపించడంలోను, తత్సమయాలలో భోజనాది సదుపాయాలు సమకూర్చుటలోను శ్రీవారి దృక్పథం చొప్పున భేదరహితంగా వ్యవహరించడం శ్లాఘనీయమైన విషయం.

శ్రీవారి ఆదర్శాలు సమకాలీన శిష్యవర్గంలో సంపూర్తిగా చెల్లుబాటైనాయి. ఆ యాదర్శాలను శిష్యవర్గ పరంపర సఫలీకృత మొనర్చినదనుటలో సందియం లేదు. సాధకుల్లోను, భక్తకోటిలోను ఆశించిన సమభావం ఏర్పడినది గనుక ఇకపై ప్రత్యేక కృషితో పనిలేక పోవచ్చును. కాని ఏదేని స్వార్థచింతన పునః ప్రవేశించడంతో వర్ణభేదంగాని, జాతిభేదంగాని, విభజన దృష్టిగాని తిరిగి జొరబడకుండునట్లు జాగరూకత వహించుట అనుయాయుల కర్తవ్యం.

ఇల్లు బాగున్నను
వళ్లు బాగున్నను
ధనము బాగున్నను మనసా
హరిపాదముల యెడల
భక్తియే లేనిచో
సర్వమూ వ్యర్థమే మనసా

దృశ్యవైభవములు, ప్రాపంచికసంపదలు, బంధుమిత్రపుత్ర కళత్రాదులు, ఆరోగ్యము, బలము అనుకూలముగ ఉన్నప్పటికిని ఇవన్నియును మనుజునకు పరిమితమైన శాంతిని, సుఖమును మాత్రమే ఒసంగగలవు. కాని భగవద్భక్తి, హరిభక్తి, శివభక్తి జీవునకు పూర్ణశాంతిని, పరిపూర్ణానందమును ప్రసాదించగలవు. నరుని ఎల్లవేళల సంరక్షించునది, వెంటవచ్చునది అతని పుణ్యబలమే, జ్ఞానబలమే, దైవబలమే కాని భౌతికబలము కాదు, ధనధాన్యాదులుకావు, బంధ్వాదులు కారు. ప్రాపంచిక పదార్థము లన్నియును శరీరవియోగముతో దూరమైపోవును. బంధువులు శ్మశానమువరకు మాత్రమే వచ్చుదురు. దేహము చితివరకు వచ్చును. అనంతరము జీవుని వెంట అతని కర్మమాత్రమే వచ్చును. పాపకర్మ, అధర్మప్రవర్తన కలిగియున్నచో అతడు దుఃఖములనే పొందును. పుణ్యకర్మ, ధర్మప్రవర్తన, భగవద్భక్తి, పరోపకారము యున్నచో అతడు సుఖమునే బడయును.

కావున ఓ మనస్సా! శ్రద్ధగావిను. నీ వెంట ఎల్లపుడు ఉండుచు నిన్ను శాశ్వతముగ రక్షించువస్తువేదియో బాగుగ తెలుసుకో. అద్దాని కొరకై తీవ్రయత్నము సలిపి పుణ్యధనమును, జ్ఞానధనమును సంపాదించు. దేహాది దృశ్యవస్తువులపై అభిమానముగాని, మమకారముగాని, విశ్వాసము గాని పెంచుకొనకు. దృశ్యము ఏనాటికైనను నశించిపోగలదని గ్రహించి, దృశ్యరూపములగు గృహారామక్షేత్రవిత్తాదులందు వైరాగ్యభావన కలిగియుండును. నిత్యసత్యమగు భగవంతుని యెడల అకుంఠిత ప్రేమ, భక్తి లేనిచో సర్వము వ్యర్థము అని చక్కగ అవగతమొనర్చుకో. శాశ్వతుడగు దేవుని యెడల అనన్యభక్తివిశ్వాసములు పెంపొందించుకో. ధ్యానాభ్యాసప్రాబల్యమును, జ్ఞానధనమును సముపార్జించి పరమానందదాయకమగు స్వాత్మపదమును పొంది తరించు. జన్మను సార్థకమొనర్చుకో.

-- స్వామి విద్యాప్రకాశానంద

శ్రీ స్వామివారి రచనలు చదివిన వారికి జన్మరాహిత్యమే

- జానకీబాయి లంకా (విశాఖపట్నం)

"శ్రీ శ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి" వారు అనగానే ముందుగా నాకు గుర్తుకు వచ్చేది "గీతామకరందం" పేరు మీద చెప్పబడిన శ్రీ స్వామీజీ యొక్క గీతోపన్యాసములే. ఈ గీతామకరందం నిజంగా మకరందమే . కేసెట్ల రూపంలో ఉన్న ఈ ఉపన్యాసములను మా నాన్నగారు తరచుగా వినేవారు. నేను అప్పుడప్పుడు వినేదానిని. ఆతరువాత 18 అధ్యాయాల 18కేసెట్లను పూర్తిగా వినడం జరిగినది. అలా వినడం కొన్నాళ్లు అలవాటుగా మారింది. అవి ఎన్నిమార్లు విన్నా ఏదో క్రొత్తదనం మనసుకి ఆహ్లాదం, ఆనందం కలుగుతుంది. వింటున్నంత సేపూ స్వామీజీ ధర్మప్రబోధం మనసును ఏదో అలౌకికస్థితికి తీసుకెళ్ళడమే కాక ఏదో ఆత్మానుభూతి కలుగుతుంది.

"శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" "శ్రద్ధకలవాడే జ్ఞానమును పొందును" గీతలోని ఈ వాక్యం నాకు ఏ పని చేస్తున్నా గుర్తుకు వస్తుంది. పరిస్థితులను బట్టి, వయస్సుని బట్టి అనగా బాల్యదశలో అక్షరవిద్యా జ్ఞానం; కౌమార దశలో చదువు, వృత్తి, ఉద్యోగ ధర్మాలజ్ఞానం; యవ్వనదశలో సాంసారిక, లౌకిక జ్ఞానం బ్రతుకు తెరువు కోసం; వార్ధక్యంలో పారలౌకిక జ్ఞానం అదే బ్రహ్మజ్ఞానం, మోక్షజ్ఞానం మనిషికి తప్పక అవసరం.

నిజంగా జ్ఞానియైనవారు వయసుతో సంబంధం లేకుండా బ్రహ్మజ్ఞానమును సంపాదించుకొని తద్వారా మోక్షప్రాప్తిని పొందడమెట్లో శ్రీస్వామివారి గీతోపదేశ ప్రవచనముల ద్వారా తెలుసుకొన గలుగుతాము. గీతామకరంద శ్రవణం, మననం, నిదిధ్యాసనం ద్వారా మనసును ఆపి అలౌకిక స్థితికి చేరడం అనేది అందరికీ అనుభమౌతుంది ప్రయత్నంచేయగలిగితే.

నాకు స్వామీజీతో ప్రత్యక్ష పరిచయానుభవం లేకున్నా-గీతా మకరందం ఉపన్యాసాలను వింటున్నా, గీతామకరందం గ్రంథాన్ని చదువుతున్నా ప్రత్యక్షానుభవం కలుగుతుంది. స్వామి నా ఎదురుగా ఉండి నాతోనే మాట్లాడుతున్నట్లుగా ఉంటుంది. కొండంత దూదిని ఒక్క నిప్పురవ్వతో బూడిద చేయగలిగినట్లుగా మన సంచితకర్మల నన్నింటిని ధ్వంసం చేయగలశక్తి ఒక్క గీతా పారాయణమునకే కలదని శ్రీస్వామి వారు చెప్పినట్లుగా వేరెవరూ తెలియజెప్ప లేరనేది పరమసత్యము. సంచిత కర్మలను ధ్వంసం చేసుకోవడ మెలాగో, ఆగామి కర్మలు అంటకుండా చేసుకోవడ మెలాగో అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లుగా చెప్పడం స్వామీజీకే చెల్లినది. ఇక ప్రారబ్ధకర్మలు అవశ్యభోజ్యం కనుక అవి శరీరానికే, మనసుకే కాని ఆత్మకు కాదనుకొనే తత్త్వం ఈ గీతా మకరందం ద్వారా అలవడుతుంది. కనుక అంతా పరమాత్మ కృపగా భావించి ఆనందంగా స్వీకరించడానికి ప్రయత్నిస్తాము. ఇది గీతామకరందం ద్వారా నేను అనుభవిస్తున్న విషయం.

నాకు ఏదైనా దుఃఖం కలిగినపుడు శ్రీస్వామివారి ప్రవచనం ఏది విన్నప్పటికి మనః క్లేశం తగ్గి, నేను ఆత్మనను భావనను కలుగజేస్తుంది. ఓమ్

ఆనంద చరణులకు – ఆచార్య మాలిక

(సీస పద్యమాలిక)

– అద్దంకిశ్రీనివాసాచార్యులు
భాషారత్న, భాగవతనిధి, (బందుగాం, ఒరిస్సా)

1. విద్యాప్రకాశ! నీ విమల యశః కాంతి
నిబిడీకృతం బయ్యె నింగి వరకు
పరమాత్మ నీయందు పరవశించియుఁ జేరి
ఆవేశ మవతార మందె నేమొ!
మారువేషమ్ములో మర్యాద పురుషుడే
విద్యా ప్రకాశుడై వెలసె నేమొ!
దేవతా బృందమ్ము దీవించి పంపెనో!
దేవకీ తనయుడేతెంచె నేమొ!

2. గీతను బోధించ ప్రీతితో కృష్ణుండె
ఆచార్యుడై వచ్చి యలరె నేమొ!
సప్త ఋషులు నిన్ను సాధనల్ నేర్పించు
మనుచు భూలోకాన నునిచి రేమొ!
యోగి పుంగవు లెల్ల యోగమ్ము నేర్పింప
మనుచుండి నినుదింపి మరలి రేమొ!
నీ జీవన స్ఫూర్తి నిగిడె నీ లోకాన
తానొక శాస్త్రమై తళుకుమనుచు ॥

3. సామాన్య వ్యక్తికిన్ సాధ్యమే యిలయందు
సత్కర్మ లవియన్ని సలుప బూన ?
మానవ మాత్రుడై మనగలడే ? దివ్య –
సాధు జీవన వృత్తి సాధ్యమగునె ?
అల్పమౌ ప్రాణికి నలవడునే గొప్ప –
త్యాగ తపోనిష్ఠ దలచ నిలను ?
పుడమి తల్లి మనసు పులకరించెడి యట్లు
చేసినావయ్య సత్ చేష్టలెన్నొ ॥

4. ఆనంద వర్షమ్ము యందమై పులకించ
ఆనంద మోహనా! అవతరించి
విజయవాడ పురాన విద్యన గడియించి
మచిలీ పట్నాన మసలినావు।
ఐన వారల కెల్ల నానందమును పంచి
పట్ట భద్రుడు వౌచు బరగి నావు।
వారణాసికి జేరి పారీణుడౌ నట్లు
పాఠాలు జదివియు ప్రబలి నావు ॥

5. గంగలో స్నానమ్ము గఱపుచు నుండంగ
నిను జేరె గీతమ్మ నిన్ను వెదికి।
దొరకిన గ్రంథమ్మె దొడ్డయై బోధించె
జీవిత లక్ష్యమ్ము జేర బిలచి।
గురుతర సాధనల్ గురుదేవు సన్నిధిన్
చేయమనుచు నిన్ను చెప్పె నదియె।
మలయాళ ఋషిచెంత మలచుకొంటివి నీవు
మానవీయ విలువ మసలు కొనుచు ॥

6. గురుకుల వాసమ్ము గుంభనమ్ముగ జేసి
మౌనమ్ము బాటించి మసలి నావు।
హా ! అపక్వము దిని హాయిగా యుండంటు
పండ్రెండు వర్షాలు బరగినావు।
క్రూర సర్పాలపై వైరమ్ము జూపక
దూర దేశాలకున్ ద్రోలినావు।
"ఏర్పేడు" కున్ కీర్తి ఏర్పడు నట్లుగా
గురుతర మర్యాద గొలిచి నావు ॥

7. నడిమి జీవనమున నడిచి వైరాగ్యాన
సన్న్యసించితి వయ్య సాధుచంద్ర !
విద్య ప్రకాశింప విద్యాప్రకాశవై
ఆనందగిరి యౌచు నరగి నావు।
చిత్తూరు జిల్లాను చిత్తాన నిల్పుచున్
చేరి యుండితి వయ్య స్థిరముగాను।
వ్యాసాశ్రమము వీడి యత్యాశ్రమము జేరి
దీపించి నావయ్య దీర్ఘదర్శి !

8. కామారి యొక వంక, కాముని జనకుండు–
– నొక వంక నిలుచుండి వొయలు దీఱ
కాళహస్తిని జేరి కామితార్థుని గొల్చి
జ్ఞానప్రసూనాంబ గరిమ దల్చి
ఆ శుకబ్రహ్మవై ఆశ్రమమ్మును గట్టి
ఆ స్వర్ణముఖి గాలు లాదరించి
సాధు జీవనమును సాధింప నిలిపితి
శిష్య ప్రశిష్యులన్ జేర దీసి

9. గీతయే జీవమై గీతయే ప్రాణమై
గీతయే ధ్యేయమై గీతపేర।
జ్ఞాన యజ్ఞమ్ములన్ ప్రాణాధికము జేసి
మించియు శతము పూరించి నావు।
"మకరంద" మనుపేర మంచి వ్యాఖ్యను గూర్చి
భువిని నిలిపినావు పుణ్యమూర్తి।
భూరి విరాళాలు పుష్కలమ్ముగ నిచ్చి
విద్యాలయమ్ములు పెట్టినావు ॥

10. "కన్నప్ప" పేరుతో ఖ్యాతి నొందెడి యట్లు
వైద్యాలయము కనబరిచి నావు।
వెనుదన్ను నీవౌచు "వేదాన్త భేరి"ని
మ్రోయించి నావయ్య ముదముతోడ।
మా మనః శాన్తికిన్ మహదవ కాశమ్ము
కల్పించి నావయ్య క్రాంతదర్శి।
లెక్కకు మిక్కిలి లేఖిని కదిలించి
రమ్యమౌ రచనలు వ్రాసినావు।

11. రత్నాకరుని వోలె రాజిల్లి రత్నమై
రత్నాకరమ్ములు వ్రాసినావు।
వైరాగ్యసాధనల్ పలుమార్లు బోధించి
ధ్యాన పద్ధతి నెల్ల దయను జెప్పి।
తత్త్వసారము దెల్పి తామసమ్మును దుల్పి
అమృత బిందువు లిచ్చి హాయినొంది।
పరమార్థ కథలెన్నొ పలుకుచున్ మా యొక్క
పామరత్వమ్మును బాపి నావు ॥

12. యమలోక వార్తలన్ ఆసక్తితో దెల్పి
మోక్షద్వార భటుల పొదివికొనుచు
ఆధ్యాత్మ జడ్జిమెంటద్భుతమ్ముగ జెప్పి
మానస బోధను మాకు దెల్పి ॥
ముద్దు భజన జేసి మోక్షసాధన దెల్పి
ఆత్మానుసంధాన మందినావు।
బ్రహ్మచర్యవిజయ పరమార్థమును జెప్పి
బ్రహ్మానంద ఘన వైభవము దెల్పి।

13. ప్రణవ పూజను జేసి పరమయోగివి యౌచు
ఆధ్యాత్మ తత్త్వమ్ము నరయ జెప్పి ।
నిత్యాన్న దాతవై నిఖిలాగమ జనుల
ఆకలి దీర్చియు నలరి నావు ।
సింహనాదము జేసి సిద్ధ వివేకివై
పరమ మర్యాద కాపాడి నావు ।
పలుసాధు బృందాల బలుకరించి గరిమ
సమవర్తివై నీవు సాగినావు ॥

తేటగీతి ॥

14. నీదు పీఠమ్ము నిత్యమ్ము పాదుకొనగ
నిలిపి విద్యాస్వరూపుని నీకు బదులు
చేరి ఉత్తర పీఠాధికారి జేసి
శాశ్వతానంద లోకాలు సాగినావు ॥

15. అమల ఆనందమోహనా ! అంజలు లివె
మహిత మలయాళ సచ్ఛిష్య మన్ననలివె ।
విమల విద్యాప్రకాశుడా వినతు లివియె
సాధు సచ్ఛీల మూర్తి ! సాష్టాంగ మిదియె ॥

16. "బందుగా"మందు నినుగూర్చి బహుళముగ
చెప్పుచుండెడి వాడ నన్ జేరదీసి
శ్రీమదద్దంకి వంశాబ్ధి శ్రీనివాసు
నాదరింపుమా సతతమ్ము నమల చరిత !

స్వామివారి పాదాలకు షోడశ పద్యోపచారాలు సమర్పిస్తున్న దాసుడు.

With Best Compliments From :

OM NAMAH SIVAYA
ON THE OCCASION OF CENTENARY CELEBRATIONS OF HIS HOLINESS VIDYA PRAKASANANDA
GIRI SWAMIJI, FOUN DER, SRI SUKA BRAHMA ASHRAM, SRI KALA HASTI

WITH PRANAMS
SRI.M.UMAMAHESHWAR, CHAIRMAN & CORRESPONDENT
DR.K.RAMESH, M.Sc.,Ph.D, DIRECTOR
SRI.S.MANICKAM, PRINCIPAL & DIRECTOR

SRI VIDYA DEGREE COLLEGE
SRI VIDYA INSTITUTE OF PG STUDIES(MBA)
SRI VIDYA INSTITUTE OF TEACHER EDUCATION(D.Ed)
SK UNIVERSITY STUDY CENTRE

GOVINDA PALEM
PUTTUR-517 584, CHITTOOR DIST (AP)
CELL # 9700075499, 9441046428

శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి -జీవితం, సందేశం

కె.వి.ప్రసాదవర్మ (సికింద్రాబాద్)

భగవద్గీతా జ్ఞానము రూపుకట్టి మనవాకృతి దాలిస్తే, గురుస్సాక్షాత్ పరబ్రహ్మ-అన్న ఆర్షవాక్కు సాకారమైతే- అది శ్రీ శ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి అవుతుంది. ఆర్ష సాంప్రదాయంలో గురువునకున్న ప్రాముఖ్యం అత్యున్నతం. తల్లి, తండ్రి, మంత్రదీక్ష నొసంగిన ఆచార్యుడు-ఈ ముగ్గురిని శ్రేష్ఠ గురువులుగా సంభావించటం మన సంప్రదాయం. మాతృభక్తి వలన ఇహలోక సుఖం, పితృభక్తి వల్ల పరలోక శాంతి, గురుభక్తి వలన బ్రహ్మలోక ప్రాప్తి లభిస్తుందని శాస్త్ర వచనం.

"ధన్యా మాతా పితా ధన్యో గోత్రం ధన్యం కులోద్భవః
ధన్యా చ వసుధా దేవీ యత్ర స్యాద్గురుభక్తతా" -

ఎవని యందు గురుభక్తి ఉండునో అతని తల్లిదండ్రులు, వారి గోత్రము ధన్యము. అట్టివారి వంశంలో జన్మించుటయు ధన్యమే. అతని జన్మభూమి ధన్యత చెందుతుంది". అన్న ఆర్యోక్తికి నిదర్శనంగా నిలచిన వారు శ్రీవిద్యాప్రకాశానందులు. ఆ విధంగా వారి వంశము, ఆంధ్రులు, ఆంధ్రదేశము ధన్యత నొందినవి.

భారతీయ సంస్కృతిని, సనాతన ధర్మాన్ని ప్రజ్వలింప చేసి, ప్రచారంచేసి ప్రజలకు వాటి యందు శ్రద్ధాసక్తులు కలిగించటానికి కారణజన్ములు గురురూపంలో అపుడపుడు అవతరిస్తూ ఉంటారు. అరుదైన అట్టి మహాపురుషులలో స్వామివారొకరు. వారికి సమకాలికులిగా జన్మించి వారి సాంగత్యభాగ్యాన్ని, సేవాభాగ్యాన్ని పొంద గలగటం జన్మాంతర సుకృతమే అనాలి. కేవలం మహాపురుషులు, కారణజన్ములు మాత్రమే చేయగల అనేక మహత్కార్యాలు తన జీవిత కాలంలో సాధించిన సంకల్పసిద్ధులు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు.

వ్యాసాశ్రమంలో ఒక మూలగా నిర్జనప్రదేశంలో 'గుహాశ్రమం' పేరుతో ఒక చిన్న కుటీరం ఉంది. అందులో 12 సంవత్సరాలు తపోనిష్ఠలో గడిపిన ఋషితుల్యులు. 1947లో సద్గురు మళయాళస్వామి వద్ద సంన్యాసాశ్రమ స్వీకారం చేశారు. గురువుల అనుమతితో ఆశీస్సులతో 1950లో కాళహస్తిలో శ్రీ శుకబ్రహ్మాశ్రమం స్థాపించారు. వీరి ఉపన్యాసం చెయ్యని ప్రదేశం ఆంధ్రదేశంలో లేదన్నంతగా రాష్ట్రంలోను, మద్రాసు, బొంబాయి, షోలాపూర్ వంటి రాష్ట్రేతర ప్రాంతాలలోను శతాధిక ఆధ్యాత్మిక ప్రవచనాలు, గీతాజ్ఞాన యజ్ఞాలు నిర్వహించారు. ఇవి ఎందరెందరో జిజ్ఞాసువులకు జాగృతి కలిగించాయి. వీరి 'జీవిత కృషి' అనదగ్గ గీతావ్యాఖ్యాన గంథం "గీతామకరందం" అత్యంత ప్రాచుర్యం పొందింది. గురుదేవులు మలయాళ స్వాములు ప్రారంభించిన సనాతన ధర్మ ప్రచారం వీరి గీతాజ్ఞాన యజ్ఞాలతో మరింత పరిపుష్టమైనదని చెప్పాలి. భగవద్దత్తమైన అద్భుత ఉపన్యాస చాతుర్యంతో వీరు చేసిన ప్రసంగాలు సర్వయోగ, సర్వమత సమానతను చాటిచెప్పాయి. వీరు ఎల్లపుడు సామాన్యుని సజీవభాషలోనే ప్రసంగించేవారు. భాషాడంబరానికి, పాండిత్యప్రకర్షకు దూరంగా ఉండేవారు.

బాల్యం -బ్రహ్మచర్యం -బ్రహ్మవిద్య

వీరు తూనుగుంట్ల రామస్వామి, సుశీల దంపతులకు 1914 ఏప్రిల్ 13న బందరు(మచిలీపట్నం)లో మాతామహుల యింట మూడవ సంతానంగా జన్మించారు. తండ్రి తెనాలిలో న్యాయవాద వృత్తిలో ఉండినారు. కాని ప్రవృత్తి అంతా వేదాంత చర్చలు, ఉపనిషద్, బ్రహ్మసూత్ర, భగవద్గీతాది గ్రంథ అధ్యయనంలో గడిచేది. గాంధీగారి స్వాతంత్ర్య సమరంపై ఆసక్తి ఉన్న సమాజసేవకుడు కూడా ఆయన. పిల్లవాడు పుట్టినది ఆనంద నామ సంవత్సరంలో కనుక పేరులో ఆనందం ఉండాలనుకున్నారు. ఆనాటి ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు ఆనందమోహన్ బోస్ అంటే తండ్రికి గల గౌరవం తోడై- ఆ బాలునికి 'ఆనంద మోహన్' అని పేరుపెట్టు కున్నారు. 5రు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు ఉన్న పెద్ద కుటుంబం వారిది. తండ్రి బాపట్లకు మకాం మార్చటం చేత ఆయన ప్రాథమిక విద్య 5 వ తరగతి వరకు బాపట్లలో జరిగింది. ఉపాధ్యాయులు చెప్పినది శ్రద్ధాసక్తులతో గ్రహించి మంచి మార్కులతో ఆదర్శ విద్యార్థిగా పేరుపొందేడు. ఆనాడే ఇతనికి పూర్వజన్మ సంస్కారం ప్రస్ఫుటంగా ఉందని అనుకునే వారట.

తండ్రికి న్యాయవాద వృత్తి మీద విముఖత యేర్పడింది. ఆధ్యాత్మికభావ ప్రపత్తి ప్రబలమై కుటుంబ పోషణ లాంటి విషయాలు కూడా పట్టించుకోకుండా, ఆదాయాన్నిచ్చే న్యాయవాద వృత్తినీ, రెండంతస్థుల భవనాన్ని విడచిపెట్టి చిన్న పాకలోకి మారిపోయాడు. అక్కడ నిరంతర జప, ధ్యాన, పారాయణ, వేదాంత గోష్ఠులతో కాలం గడిపేవాడు. తరువాత స్నేహితుల ప్రోద్బలం మీద కృష్ణాతీరం, కనకదుర్గ సన్నిధి అయిన విజయవాడకు మకాం మార్చారు. ఓంకార నిలయం అని పేరు పెట్టుకున్న ఆ యిల్లు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆలవాలమైంది. ఆనందమోహన్ హైస్కూల్ విద్య విజయవాడలో కొనసాగింది. అక్కడా అందరిమెప్పు పొందేడు. క్రీడలలో కూడా విజేతగా నిలచి ఎన్నో బహుమతులు పొందేడు. వీటన్నిటికన్న మిన్నగా తండ్రి అడుగుజాడల్లో ఆధ్యాత్మికవిద్యనీ గ్రహిస్తూ చిన్నవయస్సులోనే ఇతడు తండ్రి బోధించే, పంచదశి, జీవన్ముక్తి ప్రకాశిక వంటిగ్రంథ శ్రవణంలో పఠనంలోను అమితాసక్తి కనపరచే వాడు. గ్రహణధారణ పటుర్భాలః-అన్న నిర్వచనానికి నిలువెత్తు నిదర్శనంలా భర్తృహరి సుభాషితాలు, ఆత్మబోధ, గాయత్రి రామాయణంలోని అనేక శ్లోకాలు కంఠస్థ మయ్యాయి. ఆధ్యాత్మిక ప్రవచనాలు చెయ్యటంలో అసాధారణ ప్రజ్ఞావంతుడైన తండ్రిని ఎందరో వ్యక్తులు ఎన్నో సంస్థలు ఆహ్వానించేవారు. ఆనందుడు తండ్రితో వెళ్ళేవాడు. తనయుడు శ్లోక పఠనం చెయ్యటం, తండ్రి వ్యాఖ్యానం చెయ్యటం జరుగుతూ ఉండేది.

10వ యేట ఉపనయన సంస్కారం జరిగింది. వేటపాలెంలోని ప్రముఖ సంస్థ సారస్వతనికేతన్‌వారు ఒక విద్వత్సభ జరిపారు. దానికి ప్రఖ్యాత పండితులు కాశీకృష్ణమాచార్యుల వారధ్యక్షత వహించారు. బంధు దర్శనానికి వచ్చిన ఆనందుడు ఆ సమయానికి వేటపాలెంలో ఉన్నాడు. ఈతని ప్రతిభ, ఆసక్తి తెలిసిన పెద్దలు ఆ సభలో ప్రసంగించ వలసినదిగా ప్రోత్సహించారు. రుద్రాక్ష కృష్ణాజిన ధారి అయిన ఈ బ్రహ్మచారి ఆంధ్ర ఆంగ్ల సంస్కృత భాషల్లో బ్రహ్మచర్యం గురించి ప్రసంగించి అందరినీ ఆనందాశ్చర్యాలలో ముంచాడు. "ఇతడు సామాన్యుడు కాడు. భవిష్యత్‌లో ఇతని పేరు ప్రఖ్యాతులు నలుదిశలా విస్తరిస్తాయి. ఇతడొక గొప్ప జ్ఞాని కాగలడు" అని కాశీ కృష్ణమాచార్యుల వారు చెప్పి ఆశీర్వదించారట.

గురుత్రయం :

శ్రీ శంకర, వివేకానంద, మలయాళస్వామి అనే గురుత్రయం వీరిని మిక్కిలి ప్రభావితం చేశారు. మలయాళస్వామి శిష్యులలో ప్రముఖుడైన అన్నపూర్ణస్వామి బందరు దగ్గరి 'ఉల్లంగిపాలెం' లో ఒక మఠం స్థాపించేరు. ఆనందుడు అచటికి వెళ్ళి ధ్యానం చేసుకొంటూ ఉండేవాడు. ఆనందుడు బి.ఎ. చదువుతుండగా ఒకసారి మలయాళస్వామి బందరు వచ్చారు. అపుడు శ్రీస్వాములవారిని తండ్రితో వీరూ దర్శనం చేసుకున్నాడు. ఆ సందర్భంలో స్వామి వారు ఆనందునికి పంచాక్షరి మంత్రదీక్ష ఇచ్చారు. తదాది వీరిద్దరి మధ్య గురుశిష్య సంబంధం నెలకొన్న దనవచ్చు.

1936 మే 17న ఆనందుడు వ్యాసాశ్రమం చేరుకున్నాడు. అక్కడ గుహాశ్రమం అనే ఒక చిన్న కుటీరం వీరినివాసానికి కేటాయించేరు. 'నంది' పర్వత పాదాలవద్ద రూపుదిద్దుకున్న ఆశ్రమ వాతావరణం ప్రకృతి రమణీయతతో ఆహ్లాద కరంగా, వచ్చేపోయే భక్తుల సందడితో ఆనందంగా అనిపించింది. 11 సంవత్సరాలు గురుసేవలో, ఆత్మవిద్యా విచారంలో గడిచి పోయాయి. కొద్ది కాలంగా సన్న్యాస దీక్ష పొందాలన్న కోరిక బలీయం కాజొచ్చింది. ఒకరోజు గురువర్యులకు తన కోరిక విన్నవించాడు. ఇంతటి యోగ్యుడైన శిష్యునికి సన్న్యాసదీక్ష ఇవ్వటానికి సద్యః స్ఫూర్తితో అంగీకరించారు గురుదేవులు, 29-6-47 నుండి 3-7-47 వరకు 5 రోజులు దీక్షా ప్రదాన కార్యక్రమానికి నిర్ణయించారు. సన్న్యాస స్వీకారానికి తల్లి అనుమతి అవసరం కనుక ఉత్తరం వ్రాసి పిలిపించారు. "నా జన్మ ధన్య మయ్యింది. నీ కోరిక ప్రకారమే కానియ్యి నాయనా" అంటూ అనుమతిచ్చింది తల్లి. సన్న్యాసాశ్రమంలో పూర్వ బంధాలన్నీ విడనాడినట్లే పేరుకూడా త్యజించాలి. "వేదవిద్యావ్యాప్తి, ఆధ్యాత్మికవిద్యా ప్రచారము సంఘంలో కావలెనన్న నా ఆకాంక్ష ఎల్లపుడు నీకు జ్ఞాపకముండు లాగున నీకు "విద్యాప్రకాశానందగిరి" అన్న నామాన్ని అనుగ్రహిస్తున్నాను"- అన్నారు గురువర్యులు. తదాది ఆనంద మోహనుడు విద్యాప్రకాశానందగిరి అయినాడు.

ఆశ్రమ స్థాపన - పత్రికా ప్రచురణ.

ఒక ఆశ్రమం ప్రారంభించాలన్న వారి సంకల్పం రూపుదాల్చి 1950 జనవరి 20న గురుదేవులు మలయాళస్వామి వారి కరకమలముల మీదుగా శుకబ్రహ్మాశ్రమం ప్రారంభమయ్యింది. తరువాత ప్రతి సంవత్సరం ఆశ్రమ వార్షికోత్సవాలు భారీఎత్తున జరిగేవి. ఎందరో పండితులను, ఆధ్యాత్మికవేత్తలను ఆహ్వానించి ప్రసంగాలు యేర్పాటు చేసేవారు.

తరువాత ఘట్టం గీతాజ్ఞానయజ్ఞ పరంపర ప్రారంభం. మొదటి యజ్ఞం 1957 డిసెంబర్‌లో నర్సరావుపేటలో. వీరి ప్రవచనాలు చిన్నచిన్న కథలతో హాస్యం జోడిస్తూ జనరంజకంగా సాగేవి. బౌద్ధ క్రిస్టియన్ మతాలలోని అంశాలు ఉటంకించి గీతాసందేశంతో తులనాత్మక పరిశీలన చేసి వివరించేవారు. అందుకే క్రిస్టియన్, ముస్లిమ్ వంటి ఇతర మతాలవారు కూడా వచ్చి గీతాప్రవచనాలు వినేవారు.

శుకబ్రహ్మాశ్రమం దినదినాభివృద్ధి చెందుతూయుంది. శివలింగ ప్రతిష్ఠ, భోజనశాల, అతిథిగృహం, గోశాల వంటి సదుపాయాలు యేర్పాటయ్యేయి. ఆశ్రమ పరిసరాల్లో అనేక యానాది కుటుంబాలు అతి దీన స్థితిలో కనిపించాయి. వారి ఆరోగ్య పరిరక్షణకై "ఆనంద హాస్పిటల్" ప్రారంభించారు. తనకు విద్యాప్రకాశానందగిరి అన్న యోగపట్టా (నామం)

గురుదేవులు ఏ ధ్యేయంతో అనుగ్రహించారో పదే పదే స్ఫురణకు వచ్చి ప్రేరణగా నిలచి తదాశయ సిద్ధి కోసం నిరన్తరం గీతాప్రవచనాలు చేస్తూ "వేదాంతభేరి" మాసపత్రిక 1913లో ప్రారంభించారు. 1966లో కాళహస్తిలో మొట్టమొదటి కాలేజ్ కోసం రూ.50,000/-, 1982 లో స్త్రీల కళాశాల కోసం రూ.50,000/- ఆశ్రమం తరపున ధనసహాయం చేశారు. అవి స్వామి విద్యాప్రకాశానంద గవర్నమెంట్ ఆర్ట్స్ సైన్స్ కాలేజ్, స్వామి విద్యాప్రకాశానంద గవర్నమెంట్ బాలికల జూనియర్ కాలేజ్ గా పిలువబడుతున్నాయి. అలాగే తిరుపతిలో సంస్కృత పాఠశాలకు 35,000/- విరాళమిచ్చి ప్రోత్సహించారు.

99వ గీతా జ్ఞానయజ్ఞం మొదలు 108వ యజ్ఞం వరకు తిరుపతి దేవస్థానం వారు ధర్మప్రచార పరిషత్ పక్షాన నిర్వహించారు. **గ్రంథ రచన :** బృహద్గ్రంథమైన యోగవాశిష్ఠాన్ని సంక్షిప్త పరచి 'వశిష్ఠగీత'గా ప్రచురించారు. వీరి గీతోపన్యాసాలను బ్రహ్మచారి గోపాల్ ఆశ్రమ వాసుల కోసం నోట్స్ రాసి అక్షరబద్ధంచేస్తూ ఉండేవాడు. అవి గీతోపన్యాసాలుగా ప్రకటించబడి పలువురు పాఠకులు, పత్రికల పండితుల ప్రశంసలు అందుకున్నవి. స్వామి వారి ప్రముఖరచన "గీతామకరందం" 1963 మార్చి 6 న చిరంతనానందస్వామివారు శ్రీశుకబ్రహ్మాశ్రమం 12 సం. పూర్తి చేసుకున్న సందర్భంలో జరిగిన సభలలో ఆవిష్కరించారు. స్వామి షష్ట్యబ్దిపూర్తి సందర్భంలో మౌక్తికోత్సవంలో తత్త్వసారం, ఆధ్యాత్మిక హితోక్తులు ప్రకటించారు. గీతామకరందం ఆ రోజుల్లోనే రెండున్నర లక్షల కాపీలకు పైగా విక్రయింపబడింది. అది ఎంతగా భక్తుల లోకి చొచ్చుకు పోయిందంటే స్వామి వారిని 'గీతా మకరందస్వామి' గా సంభావించిన సందర్భాలెన్నో ఉన్నాయి అని చెబుతారు. గీతామకరందం తర్వాత అంత గొప్ప గ్రంథంగా పరిగణించబడిన 700 పుటల 'ఉద్గ్రంథం' 'మోక్షసాధనా రహస్యం'.

తత్త్వసారం గానానుగుణమైన గీతమాలిక, ప్రముఖ గాయని శ్రీమతి శోభారాజ్ గానంచెయ్యగా 1988లో కేసెట్ విడుదలయ్యింది. మానసబోధ కూడా ఇట్టి గీతాల సంకలనమే. దీనిని శ్రీమతి వాణీజయరామ్ గానంచెయ్యగా కేసెట్ రూపంలో అందుబాటులోకి వచ్చింది. పరమార్థ కథలు 800 పేజీల పుస్తకం. ఇవి స్వాతి వారపత్రికలో ధారావాహికంగా వచ్చేయి. అమృతబిందువులు, వైరాగ్యసాధన, మోక్షద్వారపాలకులు, మట్టిలోమాణిక్యం, ఆత్మతత్త్వవిచారణ, ధ్యానపద్ధతి వంటి చిన్నగ్రంథా లెన్నో 1985 వరకు ప్రకటించబడి పాఠకులకు అందేయి. ఇవి గాక స్వగురు మలయాళస్వామితో జరిగిన స్వానుభవాలను జోడించి రాసిన వారి జీవిత చరిత్ర "శ్రీ మలయాళ మహర్షి".

రత్నాకర పంచకం : యోగవాశిష్ఠ రత్నాకరం, రామాయణ రత్నాకరం, భాగవత రత్నాకరం, భారత రత్నాకరం, ఉపనిషత్ రత్నాకరం, పేరున 5 బృహత్ గ్రంథాలు రాశారు. వారు రాసిన ప్రతి వాక్యము, చెప్పిన ప్రతి మాట- అనుభవించి, ఆత్మానుభూతి చెంది రాసినవే. అందువల్ల వీరి రచనలలో ఎక్కడా వైరుధ్యం గాని, అసహజత గాని, అస్పష్టత గాని గోచరించదు.

ఈ విధంగా రాసి లోను, వాసి లోనుమిన్న అయిన గ్రంథ సముచ్చయంతో తెలుగులో ఆధ్యాత్మిక సాహిత్య పరిపుష్టికి శ్రీవారు ఎనలేని సేవ చేశారు. క్రమశిక్షణ, సమయపాలన, మౌనం, ఆత్మనిగ్రహం, సత్యసంధత వంటి గుణాలు అలవరచుకుని నిజజీవితంలో ఆచరించి చూపిన

ఆచరణాత్మక వేదాంతి స్వామి. రాజమండ్రిలో **"అపరసిద్ధార్థ"** అని, హిందూపూర్ సభలో **"జగద్గురు"** అని బిరుద ప్రదానం జరిగింది. కాని ఫలభోగాసక్తి రహితుడు, భౌతిక ఆడంబరాలకు ఆమడ దూరంలో ఉండే స్వామి ఈ బిరుదులను ఎన్నడూ ఉపయోగించుకున్నట్లు లేదు.

సన్న్యాస స్వీకార సందర్భంలో -"నీ గురుదేవుని పై సంపూర్ణ విశ్వాసం తో ఆయన పాదాల వద్ద సాధన చెయ్యి. వివేకానందుని వలె సమాజ ఉద్ధరణకు పాటుపడు" అన్న మాతృమూర్తి వాక్కును సాకారం చేసిన ధన్యజీవి శ్రీవిద్యాప్రకాశానందులు.

గీతా పాఠశాల -గీతా మహోత్సవాలు :

గీత అధ్యయన ప్రచారాలు తన తదనంతరం కొనసాగాలన్న ఆశయంతో కాబోలు 1985 విజయదశమి నాడు 16 మంది విద్యార్థులతో, ముగ్గురు శిక్షకులతో గీతాపాఠశాలను ప్రారంభించారు. దీనికి తిరుపతి దేవస్థానం ఆర్థిక సహకారం చేసింది.

108 గీతా యజ్ఞాల తర్వాత మరలా 1983లో ఈ ప్రవచనాలు "గీతా మహోత్సవాలు" పేరిట పునః ప్రారంభ మయ్యాయి. వీటికి యథాపూర్వము తిరుపతి దేవస్థానం వారు సహకారం అందించారు. 77 యేళ్ళ పైబడిన వయసు లో కూడా సంవత్సరానికి పది గీతామహూత్సవాలు నిర్వహించారు. ఆహార విహార నిద్రా నిగ్రహాలలో పాటించిన క్రమశిక్షణ వల్ల ఎన్నడూ తలనొప్పయినా ఎరుగని ఆరోగ్య వంతుడాయన.

వారి ప్రవచనాలు వినే భాగ్యం సమకాలికులైన కొందరికే కలిగింది. కాని వారందించిన ఆధ్యాత్మిక సాహిత్యం తరతరాలకు కరదీపికలు. గీతాసందేశ ప్రచారం కోసమే జన్మించిన ఆచార్యుడు, ఆధ్యాత్మిక సాహిత్య శిఖరం, అద్భుత వక్త, ఆదర్శ గురువు మన స్వామి. ఒక మహా పురుషునకు, ఒక మహా యోగికి ఉండవలసిన సర్వలక్షణములు వీరిలో మూర్తీభవించినవి. "శుచిర్జితేంద్రియో వేద వేదాంగాది విచక్షణః" అని, "అధిగత తత్త్వః శిష్యహితాయోద్యతః సతతమ్". అని గురువునకుండవలసిన యోగ్యతలను శంకర భగవత్పాదులవారు నిర్వచించి యున్నారు. ఆ నిర్వచనమునకు నిలువుటద్దమై భాసించిన వారు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు.

మహాసమాధి :-

1994 నుంచి స్వామి ఆరోగ్యం క్షీణించ నారంభించింది. మద్రాస్ అపోలో ఆసుపత్రిలో 2 నెలలు చికిత్స జరిగింది. తర్వాత మూత్రపిండాలు వ్యాధిగ్రస్థ మయ్యాయి. స్విమ్స్ తిరుపతిలో చికిత్సకు తగ్గలేదు. మరలా మద్రాస్ అపోలోకి తరలించారు మార్చ్ 98 లో. పాంచభౌతిక శరీరం ఇక అట్టే కాలం మనజాలదని ఎరిగిన స్వామి - ఆశ్రమానికి తీసుకు వెళ్ళ వలసినదిగా కోరేరు. 10ఏప్రిల్ 1998 ఉదయం 5.30 కి ఆశ్రమం చేరుకున్నారు. 7.30 కి విదేహ ముక్తులయ్యారు.

భౌతికంగా స్వామి లేరు, కాని గీతా మకరంద రూపాన స్వామి శాశ్వతులు. వారి ఆశయ సాధనకు కావలసిన శ్రద్ధాసక్తులు ప్రోత్సాహ ప్రేరణలు కలుగునట్లు ఆశీస్సులు అందించుమని ఆ స్వామినే ప్రార్థిద్దాం.

ఆస్తే దేశిక చరణం, నిరవధి రాస్తే తదీక్షణే కరుణా ।
ఆస్తే కిమపి తదుక్తం కిమతః పరమస్తి జన్మసాఫల్యమ్ ॥

\- - -

శ్రీమలయాళస్వామి ఆశయసాధనలో శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి

- ఆర్. బ్రహ్మానందరెడ్డి (హైద్రాబాద్)

శ్రీమలయాళస్వామి ఆశయాలలో వేదాంత ప్రచారము అతి ముఖ్యమైనది. శ్రీస్వామివారి శిష్యులైన శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి ఆంధ్రరాష్ట్రంలో విస్తృతంగా భగవద్గీత ఉపన్యాసాలు యివ్వడమే గాకుండా, అనేక ఆధ్యాత్మిక గ్రంథాల రచన ద్వారా విశేషమైన వేదాంత ప్రచారము గావించారు.

శిష్యుడు ఉద్ధరింపబడడమే - ఏ గురువుకైనా ఇవ్వగలిగిన నిజమైన గురుదక్షిణ. శ్రీస్వామివారు తాను తరించడమే గాకుండా అనేకమందిని తరింపజేసే విధంగా ఉపన్యాసాలు, రచనలు గావించడం నిజంగా గురుస్వామివారి ఆశయాలను సఫలీకృతము చేసినట్లైనది.

శ్రీస్వామివారి ఉపన్యాసాలు ఎంతో ఉత్తేజభరితమైనవి. శ్రీ వివేకానందస్వామి వలె గంభీరంగా, అవిశ్రాంతంగా వేదాంత బోధలు గావించారనడంలో అతిశయోక్తి ఏమీ లేదు. శ్రీ స్వామివారి కార్యము బోధలతోనే పూర్తికాలేదు. వారి రచనలు చిరకాలము ముముక్షువులకు ప్రేరణగానూ, జ్ఞాన దీపికలుగాను వెలుగొందుతాయి.

అంతేగాక స్వామివారి బోధల ద్వారా, రచనల ద్వారా ప్రేరణపొంది వారి కార్యాన్ని నిరాటంకంగా కొనసాగించే వ్యవస్థ శ్రీ శుకబ్రహ్మాశ్రమ స్థాపన వలన జరిగినది. భవిష్యత్తులోనూ అనేకమంది ఉత్తేజితులై ఆధ్యాత్మిక సేవలో పాలు పంచుకోగలరనడంలో సందేహము లేదు. కావున శ్రీ స్వామివారు మలయాళస్వామి ఆశయసాధనలో అనూహ్యంగా విజయం సాధించారని చెప్పవచ్చును.

గీతామకరంద ప్రాశస్త్యము :

'గీతామకరందము' అద్భుతమైన గ్రంథము. ఇందులో స్వామివారి రచనాశైలి అమోఘము. శ్రీకృష్ణ భగవానుని కృప, శ్రీమలయాళ యతీంద్రుల కృప, శ్రీస్వామివారి తపోసంపన్నత వెరసి ఇది అద్భుతమైన గ్రంథముగా రూపుదిద్దుకున్నది. శ్రీమద్భగవద్గీత మీద అనేక వ్యాఖ్యానాలు వెలువడినాయి. అయితే ఆంధ్రరాష్ట్రంలో 'గీతామకరందము'నకున్నంత ఆదరణ, ప్రాచుర్యం మరే గ్రంథానికి లేదనడంలో సందేహమేమీ లేదు.

ప్రారంభసాధకులకు కూడా చక్కగా అర్థమగు రీతిలో, సరళంగా, చక్కటి వ్యాఖ్యానంతో గీతామకరందము రూపుదిద్దుకున్నది. శ్రీ ఆదిశంకరాచార్యస్వామివారి వ్యాఖ్యానమువలె ప్రామాణికత గలిగిన గ్రంథమిది. ముముక్షువులను తరింపజేసే గ్రంథము. ఈ గ్రంథము చదివిన వారు సంశయాలు పోగొట్టుకున్నవారగుటే గాక, ఆధ్యాత్మిక సాధనవైపు విశేషంగా ప్రేరేపింపబడెదరు. అట్లు ప్రేరేపించబడిన వారిలో ఈ వ్యాసరచయిత కూడా ఒకరు. గీతామకరందము చదువక ముందు ఈ రచయిత గృహస్థులైన సాధకులు తరించడం కష్టము అన్న భావనలో వుండేవాడు. ఆ గ్రంథము చదివిన తర్వాత విశేషంగా ప్రేరణపొంది తరించగలనన్న ఆత్మవిశ్వాసంతో పాటు మరికొందరిని కూడా తరింపజేయుటకు 'గీతామృతం' అనే గ్రంథరచనకు కూడా శ్రీకారం చుట్టడమైనది. శ్రీమద్ భగవద్గీత గొప్పతనము వర్ణించుటకు సాధ్యం కానిది. అయితే అది పాఠకులకు

చక్కగా అర్థము కానప్పుడు గ్రంథము యొక్క ప్రయోజనము పూర్తిగా పొందలేరు. ఆ లోటును 'గీతామకరందము' పూర్తిగా పూరిస్తుంది. సామాన్యులను కూడా అసామాన్యులుగా, ముముక్షువులను మహాత్ములుగా తీర్చిదిద్దే గ్రంథం 'గీతామకరందం'. గీతామకరందం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయినా శతజయంతిస్మారిక వెలువడుతున్న సందర్భంగా ఈ అక్షర కుసుమాలను భక్తితో వారికి సమర్పించాలన్న ఉద్దేశ్యమే ఈ వ్యాసముగా రూపుదిద్దుకున్నది.

శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామివారి రచనల ప్రాశస్త్యము :

ఆధ్యాత్మిక మార్గంలో పురోభివృద్ధి సాధించాలనుకునే వారికి కేవలం శ్రీస్వామివారి రచనలు ఉన్నతిని కలుగజేయడమే గాకుండా, ఆధ్యాత్మికలక్ష్యాన్ని చేరుస్తాయనడంలో ఏ మాత్రం సందేహము లేదు.

శ్రీస్వామివారి గ్రంథాలలో ఏ గ్రంథమూ తక్కువ స్థానాన్ని ఆక్రమించదు. మానవుని మాధవుడిగా తీర్చిదిద్దేగ్రంథాలు అవి. మూలగ్రంథాలకున్న ప్రాశస్త్యము అందరికి తెలిసినదే. అయితే స్వామివారి రచనాశైలిలో అవి ముముక్షువులకు ఉపయోగపడే విధముగా రూపు దిద్దుకోవడము బహుధా ప్రశంసనీయము. శ్రీస్వామివారి ఉపన్యాసాలు ఎన్నిసార్లు విన్నప్పటికి విసుగు అనిపించదు. ఎప్పటి కప్పుడు క్రొత్తగానే వుంటుంది. అట్లే వారి గ్రంథాలు కూడాను. ముఖ్యంగా నేటి యుగంలో యాంత్రిక జీవనము గడిపేవారికి కూడా సులభంగా వుండేలా పెద్ద పెద్ద గ్రంథాలను సంగ్రహము చేయడం వారి విశేషకృషి, అనుగ్రహము.

ఎవరైనా స్వామివారి గ్రంథాలు చదవకపోతే మొత్తం రచనలు తీసుకుని చదివి, అందులో కొన్ని గ్రంథాలనైనా నిత్యమూ అనుసంధానము చేస్తే మహోన్నతంగా తయారు కాగలరని ఈ రచయిత ప్రగాఢ విశ్వాసము. వారి గ్రంథాలు ఆకళింపు చేసుకున్నవారికి మోక్షము అరచేతిలో ఉసిరిక కాయ అవుతుంది.

కేవలం స్వామివారిని ప్రశంసించడం ఈ వ్యాసములో ఉద్దేశ్యము కాదు. ఈ రచయిత స్వయంగా స్వామివారి గ్రంథాలద్వారా ప్రయోజనం పొంది స్వీయ అనుభవంతో వ్రాస్తున్న వ్యాసము యిది.

చెడ్డభావాలు విషసర్పాలవంటివి

"చెడ్డభావాలను మేము ఎట్లా దూరం చేసేది?" అని మీరనుకోవచ్చు. "అది చెడ్డది" అని మీ అంతరాత్మ చెబుతుంటే దానిని మీలోనికి ఎట్లా ప్రవేశపెట్టగలరు? "ఆ పాములో విషమున్నది", అని మీకు తెలిసినప్పుడు దానిని మీరు పట్టుకుంటారా? పట్టుకోనే పట్టుకోరు. ఒకవేళ దానిని పట్టుకున్నప్పటికీ "స్వామీ! దీనినెట్లా వదిలేది?" అని అనడంలో అర్థం లేదు. అందులో విషమున్నదని తెలిసిన తత్క్షణమే దానిని వదలిపెడతారు. కాని, అందులో విషమున్నదని మీకు తెలియకపోవడం చేత దానిని మీరు వదలిపెట్టలేకపోతున్నారు. కనుక, మీరు మొట్టమొదట చెడ్డభావాలు విషసర్పముల వంటివనే సత్యాన్ని గుర్తించాలి. అప్పుడే మీరు వాటిని దూరంగా ఉంచగల్గుతారు, మీలో సత్సంకల్పాలు అభివృద్ధి అవుతాయి. దీని నిమిత్తమై మీరు నిరంతరం దైవనామాన్ని స్మరిస్తూ ఉండాలి. దైవనామమే నావగా మారి మిమ్మల్ని సంసారసాగరాన్ని దాటిస్తుంది.

- సత్య సాయిబాబా

ఓం ఓం ఓం

శ్రీకృష్ణపరబ్రహ్మణేనమః

నా ఆధ్యాత్మిక గురుదేవులు విద్యాప్రకాశానందులు

- గెంబిలి భాగ్యలక్ష్మి శ్రీరామమూర్తి(బందుగాం)

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాముల వారి
శతజయంతి మహోత్సవాలకు
జయము జయము.

ఓం గురుదేవాయ విద్మహే విద్యాప్రకాశాయ ధీమహి
తన్నో గురుః ప్రచోదయాత్ ।

గీతా చ మాతృకా దేవీ పితా దేవో యదూత్తమః ।
బాంధవాః కృష్ణభక్తాశ్చ "మకరందం" మహత్ స్థలమ్ ॥

1. పూజ్యగురుదేవుల కరుణాప్రభావము

శ్రీవాణీ కటాక్ష వీక్షణమున శ్రీగురుదేవులు భారతమాతకు నోముల పంటగ, చదువుల తల్లికి ముద్దు బిడ్డగా ఆనందనామ సంవత్సరము చైత్రబహుళ తదియనాడు 13-4-1914 అవతరించారు. "ఆనందమోహన్" అనేనామధేయం తో దినదిన ప్రవర్ధమానంగా కళలను సంతరించుకుని, చిన్ననాటి నుండి ఆటలపాటలతో తానే మొదటి వానిగా గుర్తింపబడి, నిండు చందమామలా "ప్రకాశిస్తూ", మహర్షి మలయాళ స్వామివారికి ప్రియ శిష్యునిగా "విజ్ఞాననిధి"గా విద్యను ప్రకాశింపచేయుచు, విద్యాప్రకాశానందస్వామిగా "సాధకులకు" సపుణ్యపుంజమై మనలను ఉద్ధరించుటకు వేదవేదాంతముల భావములను సరళమైన భాషలో "ముముక్షు" లోకమునకు అందించి, స్వదేశోద్ధరణకు అటు విదేశీయుల ఆదరాభిమానములు సంపాదించి ఆనవరతదీక్షతో పండ్రెండు సంత్సరములు తపోదీక్ష వహించి, తపోబలమును తన మేధాశక్తిని జోడించి, నిజశిష్యుల హృదయములలో నిండుగా బాలభాస్కరునిలా వెలుగుతూ, ఒకింత చదివితే పదింతలు అర్థం అయేటట్టి చక్కని భాషతో శాస్త్రభావములను విస్తారముగా అందిస్తూ, భక్తకోటికోసం లెక్కలేని గ్రంథముల రచన చేసారు. దేశ విదేశీయులూ భారతమాతకు, ఆర్షసంప్రదాయమునకు, ధర్మనిరతికి, నివాళులర్పించి జయ జయ ధ్వానాలు పలికారు. ఆ పలికించిన మహనీయులు మనగురుదేవులు. 'వాటిని సావధానంగా' చదివిన మనం అందరము ఆ అధ్యయన ప్రభావం వలనశాస్త్రములకు, సద్గురువునకూ నిత్యనీరాజనములు సమర్పించవలసినదే.

గురుదేవుని అవ్యాజకరుణవలన నేను గీతామకరందం చదివిన సమయములో గురుదేవులు నాముందు కూర్చుని నాకోసమే చెబుతున్నట్లు అనిపించేది. బ్రహ్మముహూర్తంలో ధ్యానం చేసేటపుడు గీతాచార్యుని, గురుదేవుని మానసికంగా ఆవాహనచేసి ఒకే వేదికపై కూర్చుండపెట్టి ఆరాధించటం "నాకిష్టమైన కృష్ణవ్రతం". అందులో నాకు చాలా ఆనందం లభిస్తుంది. మాటలతో దానిని చెప్పలేను.

ఇది అంతా గురుదేవుని ప్రభావమని నేను మనసారా నమ్ముతున్నాను.

2. గీతామకరంద ప్రాశస్త్యము

శ్రీ గురుదేవుని అద్భుతమైన అమృతమయ రచన "గీతామకరందం" అనే మహాగ్రంథము. ఈగ్రంథమును 1980లో మా అమ్మగారు చీర సారెతో పాటు ఇచ్చారు. అప్పుడు నాకు ఏమీ తెలియదు. మా అమ్మగారికి ఇష్టంకదా అని మొదలు పెట్టాను. ఆనాటినుండి ఈ నాటి వరకు శ్రీగీతాదేవి ఆశీర్వాదంవలన స్వాధ్యయనం ఆగలేదు. "సర్వశాస్త్రములు" అయిన "శ్రీమద్భగవద్గీతను గీతామకరందంగా తీర్చిదిద్ది అందిచ్చిన గురుదేవుని ఋణం ఏనాటికీ తీరనిది. గీత (701) శ్లోకములు టీకాతాత్పర్యము, విపులమైన వ్యాఖ్య ఎంత తెలియని వారికైనా అర్థమయ్యేలా ఉంది. కాబట్టి ఇది పాఠకజన మనోరంజకమై; కర్మ, భక్తి, జ్ఞాన, యోగ మార్గముల వారికి సంగమమై; ఆచరణశీలురకు వేదాంతపు రుచులను అందించుచూ; జ్ఞాన విజ్ఞానములనే పారమార్థిక సత్యములను తెలియజేసన్తాయుంది. "అశోచ్యానన్వ శోచస్త్వం .... శోకము నీకు తగదు. అర్జునా!, "తరతిశోక మాత్మవిత్" - ఆత్మవిదుడు శోకమును దాటును- అని చెప్పి అనుష్ఠానపరుల చేయి పట్టుకొని పరమాత్మవద్దకు తీసుకొని వెళ్లే సాటిలేనిమేటి గ్రంథం గీతా మకరందం. ఇది "తెలుగు -హిందీ -ఇంగ్లీషు, కన్నడ, తమిళం భాషలలో లభిస్తాంది. ముముక్షువులకు ముక్తిని ప్రసాదించేది "గీతామకరందం".